


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 287

మంగళవారం 7-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్మృతి సారథ్యంలో...
ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ బరిలోకి భారత మహిళల జట్టు -14లో



వెండికీ హాల్ మార్కింగ్
పరిశీలించాలంటూ బీఐఎస్‌కు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూచన -15లో



భారత్‌పై ప్రభావం ఉండదు
బ్రహ్మపుత్ర నదిపై నిర్మించే డ్యామ్ కారణంగా భారత్, బంగ్లాదేశ్‌లకు అందే జలాలపై ప్రతికూల ప్రభావం ఉండదని చైనా చెప్పింది. వివరాలు 6లో ▸



కన్నీరు పెట్టిన ఆతిశీ
ఢిల్లీ సీఎం ఆతిశీ కన్నీరు పెట్టుకున్నారు. తన తండ్రిపై బీజేపీ నేత రమేశ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయన్నారు. వివరాలు 6లో ▸



విత్తనాలకు రెక్కలొచ్చాయ్..!
అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన మాడ్యూల్‌లో ఇస్రో చేపట్టిన ప్రయోగం మలి దశలోనూ విజయవంతమైంది. వివరాలు 6లో ▸



టైగర్‌కి ఈ టెంపర్‌మెంట్ ఏంటి?
మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో బంధించిన ఓ పులి అసాధారణ ప్రవర్తనపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 2లో ▸

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా వర్చువల్ విధానంలో పాల్గొన్నారు




ఒక ట్రిలియన్ మేమిస్తాం

భారత్‌ను ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు సహకరిస్తాం

ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి

- రాష్ట్రంలో రైల్వేల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలి
- ఏపీలోని బందరు పోర్టును డెడికేటెడ్ హైవే, రైల్వే లైన్‌తో అనుసంధానించాలి
- చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా విజ్ఞప్తి
- రాష్ట్ర పారిశ్రామిక పురోగతికి ఇవి తోడ్పడతాయన్న సీఎం
- టెర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధానమంత్రి

సాక్షి, హైదరాబాద్: భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చటంలో తెలంగాణ సహకారం గణనీయంగా ఉండనుందని, రాష్ట్రం నుంచే ఒక ట్రిలియన్ మేర తోడ్పాటు ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని నరేంద్ర మోదీకి చెప్పారు. ఇది సాధించాలంటే తెలంగాణలో రైల్వేల విస్తరణ చాలా అవసరమని అన్నారు. ఇందుకు కేంద్రం సహకరించి ప్రధాని మోదీ కలలుగంటున్న ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థకు బాటలు వేయాలని కోరారు. హైదరాబాద్ నగర శివారు చర్లపల్లిలో కొత్తగా నిర్మించిన రైల్వే టెర్మినల్‌ను సోమవారం మధ్యాహ్నం ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి కూడా వర్చువల్‌గా హాజరై రాష్ట్రంలో రైల్వే, మెట్రో రైల్‌కు సంబంధించిన డిమాండ్లను ప్రధానమంత్రి ముందుంచారు.

బందరు పోర్టుతో అనుసంధానంతో..
'తెలంగాణకు సముద్ర తీరం లేనందున హైదరాబాద్‌కు చేరువలోనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని బందరు పోర్టుతో అనుసంధానం మిగతా 2వ పేజీలో ▶

చర్లపల్లి టెర్మినల్‌తో గణనీయ అభివృద్ధి

- సుస్థిరమైన మౌలిక సదుపాయాలను సృష్టించడంలో ఇదో ముందడుగు
- తెలంగాణ, జమ్మూకశ్మీర్, ఒడిశాల్లో రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ

6లో

భారత్‌లో హెచ్ఎంపీవీ కలకలం

5 తమిళనాడు, కర్ణాటక, గుజరాత్‌లో నమోదైన కేసులు

- బాధితుల్లో ముగ్గురు నెలల చిన్నారులు
- పాత వైరస్సే, ప్రాణాంతకం కాదు: కేంద్ర ప్రభుత్వం
- నిరంతరం పర్యవేక్షిస్తున్నాం: నడ్డా

6లో



మహమ్మారి కాదు.. మామూలు వైరస్సే..

- అతిగా భయాందోళన అవసరం లేదంటున్న వైద్య నిపుణులు
- కరోనా తరహాలో జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒంటినొప్పులు
- ఇది మహమ్మారిగా మారే ప్రమాదం లేదంటున్న వైద్యులు

- వివరాలు 12లో▶

సోమవారం హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయం వద్ద కేటీఆర్



హాజరవకుండానే వెనక్కి..

న్యాయవాదులతో కలిసి ఏసీబీ కార్యాలయానికి వచ్చిన కేటీఆర్

- లోపలికి ఒక్కరే వెళ్లాలంటూ అడ్డుకున్న పోలీసులు
- తన వెంట న్యాయవాదులు ఉంటే ఇబ్బందేమిటని నిలదీసిన కేటీఆర్
- తాను విచారణకు సహకరిస్తున్నా పోలీసులు అడ్డుకుంటున్నారని మండిపాటు
- అయినా ససేమిరా అన్న పోలీసులు.. దాదాపు 40 నిమిషాలపాటు హైడ్రామా
- చివరికి ఏసీబీ ఏఎస్పీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చి వెనుదిరిగిన కేటీఆర్
- ఈనెల 9న విచారణకు రావాలంటూ కేటీఆర్‌కు మరోమారు ఏసీబీ నోటీసులు

> ఈ ప్రభుత్వం, పోలీసుల తీరుపై నాకు నమ్మకం లేకనే న్యాయవాదులతో వచ్చా
>
> గతంలో మా పార్టీ నేత నరేందర్ రెడ్డిని విచారణకని పిలిచి ఆయన చెప్పని విషయాలను స్టేట్‌మెంట్‌లో నమోదు చేశారు
>
> ఇప్పుడు నా విషయంలోనూ అలా చేసే అవకాశముంది
>
> నా ఇంట్లో సోదాల పేరిట తప్పుడు పత్రాలు పెట్టి, దొరికాయని చెప్పే కుట్ర జరుగుతోంది
>
> గతంలో దీపావళి పండుగ చేసుకుంటుంటే.. డ్రగ్స్ పట్టుబడ్డాయని అబద్ధాలు ప్రచారం చేశారు
>
> ఇవన్నీ హామీల అమలుపై నిలదీయకుండా దృష్టి మళ్లించే ప్రయత్నాలు
>
> ..: కేటీఆర్ :..

3లో

ఫార్ములా–ఈ రేసు సంస్థకూ **త్వరలో ఈడీ నోటీసులు!**

- వివరాలు 3లో

కెనడా ప్రధాని ట్రూడో

రాజీనామా



కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో అనూహ్యంగా రాజీనామా చేశారు. ఆర్థిక మంత్రి అర్ధాంతరంగా తప్పుకోవడం, సొంత లిబరల్ పార్టీలోనే కొంతకాలంగా పెరుగుతున్న అసమ్మతి నేపథ్యంలో ఆయన వైదొలిగినట్లుగా భావిస్తున్నారు. కెనడా, భారత్ మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న సమయంలో ట్రూడో రాజీనామా చేయడం గమనార్హం.

- వివరాలు 6లో





సోమవారం హైదరాబాద్‌లోని ఆరాంఘర్–జూపార్క్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు

అభివృద్ధి కోసం ఎవరితోనైనా కలుస్తాం.. పోరాడుతాం

ఆరాంఘర్–జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

- వంతెనకు డా.మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌గా నామకరణం.. రీజినల్ రింగ్‌రోడ్డుతో తెలంగాణ అభివృద్ధి వేగవంతం
- పాతబస్తీ అభివృద్ధికి అసద్‌తో కలిసి పనిచేస్తాం..

7లో



చాట్ జీపీటీకి గ్రోక్ స్ట్రోక్!

టెక్ రంగంలో సంచలనం సృష్టించిన 'చాట్‌జీపీటీ'కి పోటీగా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' అధినేత ఎలన్ మస్క్‌కు చెందిన 'గ్రోక్' తెరపైకి దూసుకొస్తోంది.

- వివరాలు 16లో▶

మావోయిస్టుల ఘాతుకం

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన **70** కిలోల మందుపాతర	**8** మంది జవాన్లు, ఒక డ్రైవర్ మృత్యువాత

- కూంబింగ్ ముగించుకుని వస్తుండగా ఘటన
- తీవ్రంగా ఖండించిన రాష్ట్రపతి ముర్ము, అమిత్ షా

ఏడాదిన్నర కాలంగా మావోయిస్టుల ఏరివేతలో ఎదురన్నదే లేకుండా దూసుకెళ్తున్న భద్రతా బలగాలకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కుట్రు సమీపంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలిన ఘటనలో 8 మంది జవాన్లు, ఒక డ్రైవర్ మృత్యువాత పడ్డారు. ఘటనాస్థలిలో సిమెంట్ రోడ్డు పెచ్చులుగా లేచి 10 అడుగుల లోతైన గొయ్యి ఏర్పడింది. జవాన్ల వాహనం భాగాలు పక్కనున్న ఎత్తయిన చెట్ల కొమ్మల చివర వరకు ఎగిరి పడ్డాయి. జవాన్ల శరీరాలు తల, మొండెం, కాళ్లు, చేతులు ఛిద్రమై రోడ్డు పక్కన పొలాల్లో పడ్డాయి. నేలకొరిగిన జవాన్లంతా స్థానిక గిరిజనులు, లొంగిపోయిన మావోయిస్టులేనని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ చెప్పారు.

- వివరాలు 6లో



మందుపాతర పేలుడు ధాటికి ఏర్పడిన గొయ్యి



ముకేశ్



నిందితుడు సురేశ్

చిత్రవధ చేసి చంపారు

- జర్నలిస్ట్ ముకేశ్ చంద్రకర్ హత్యలో విస్తుగొలిపే విషయాలు
- పోస్ట్‌మార్టమ్ నివేదికతో బట్టబయలు
- హైదరాబాద్‌లో ప్రధాన నిందితుడి అరెస్ట్

6లో



గవర్నర్ వద్దకు భూభారతి బిల్లు

- త్వరలో ఆమోదం లభిస్తుందనే అంచనాలో రెవెన్యూ శాఖ
- చట్టం మార్గదర్శకాల రూపకల్పనలో బిజీ.. మార్చిలోపే అమల్లోకి..!

2లో


ఇదంజుగత్



3,35,27,925

ఇదీ రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య / పురుషులతో పోల్చితే మహిళలే ఎక్కువ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,35,27,925కి పెరిగింది. వీరిలో 1,68,67,735 మంది మహిళలు, 1,66,41,489 మంది పురుషులు, 2,829 మంది ట్రాన్స్‌జెండర్లు, మరో 15,872 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉండటం గమనార్హం. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025లో భాగంగా తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. కొత్తగా 2,19,610 ఓటర్లను జాబితాలో చేర్చగా, మరో 1,17,932 ఓటర్లను తొలగించారు. 2024 ఫిబ్రవరి 8న ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం అప్పట్లో రాష్ట్రంలో మిగతా 12వ పేజీలో ▶



మహిళలు **1,68,67,735**

పురుషులు **1,66,41,489**

ట్రాన్స్‌జెండర్లు **2,829** సర్వీసు ఓటర్లు **15,872**

కోటి ఎకరాలకు 'భరోసా'!

యాసంగి సీజన్‌కు విధివిధానాలు సిద్ధం చేస్తున్న వ్యవసాయ శాఖ

సగటున రూ. 5,500 కోట్ల నుంచి రూ. 6 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ!	**1.52** కోట్ల ఎకరాలకు రైతుబంధు పథకాన్ని అమలు చేసిన గత బీఆర్ఎస్ సర్కార్

గుట్టలు, రోడ్లు, నాలా మార్పిడి, మైనింగ్ వంటి సాగు యోగ్యం కాని భూములకు ఈసారి మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయనున్న రైతుభరోసా పథకం మార్గదర్శకాలపై ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రస్తుత యాసంగి సీజన్‌కు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున సాగు 'యోగ్యమైన' భూములకు రైతుభరోసా ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించి అందుకు అనుగుణంగా ఆర్థిక లెక్కలు వేసుకుంటోంది. సాగు 'యోగ్యత' ప్రకారం సగటున రాష్ట్రంలో కోటి ఎకరాలకు రైతుభరోసా పరిమితం అయ్యే అవకాశం ఉంది. రైతుల వద్ద ఉన్న సాగు యోగ్యమైన పట్టా భూములనే పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. గణతంత్ర దినోత్సవం నాటికి పూర్తిస్థాయి లెక్కలుకట్టి ఎకరాకు రూ. 6 వేల చొప్పున యాసంగికి రూ. 5,500 కోట్ల నుంచి రూ. 6,000 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉంది.

1.52 కోట్ల ఎకరాలకు రైతుబంధు అమలు..
రాష్ట్రంలో సాగుచేసే భూములు 1.48 కోట్ల ఎకరాల వరకు ఉన్నట్లు వ్యవసాయ, ఉద్యానవన శాఖల నివేదికలను బట్టి తెలుస్తోంది. ఇందులో వానాకాలం సీజన్‌ను ప్రామాణికంగా తీసుకుంటే రాష్ట్రంలో అత్యధికంగా 1.36 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో వరి, పత్తి, మొక్క జొన్నతోపాటు వివిధ రకాల పంటలు సాగు చేసినట్లు రికార్డు ఉంది. ఇంతకు మించి ఏ సీజన్‌లోనూ పంటల విస్తీర్ణం పెరగలేదు. మరో 12 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటలు మొదలు అన్ని రకాల ఉద్యాన పంటలు సాగవుతుంటాయి. మొత్తం 1.48 కోట్ల ఎకరాల్లోనే 'పార్ట్–బీ'కేటగిరీ కింద 18 లక్షల ఎకరాల మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

తెలంగాణను ముంచిన కేటీఆర్

బీజేపీ ఎంపీ అర్వింద్



సాక్షి, న్యూఢిల్లీ: ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో కేటీఆర్ చేసింది దగుల్బాజీతనమని.. దొంగతనమని.. తెలంగాణను ముంచారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఆయన సోమవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. విచారణకు రమ్మంటే న్యాయవాదులను వెంట తీసుకొస్తానని కేటీఆర్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోవాలని.. లేకపోతే లాఠీకి పనిచెప్పాలని కోరారు. ఇంకా తన తండ్రి కేసీఆరే తెలంగాణ ముఖ్యమంత్రి అని కేటీఆర్ అనుకుంటున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను మొత్తం దోచుకుతినడమే కాకుండా.. రూ.లక్షల కోట్ల అప్పు చేసి దశాబ్దాల పాటు రాష్ట్రం అప్పుల ఊబిలో నుంచి బయటికి రాకుండా చేసిందని ధ్వజమెత్తారు.

నాలుగేళ్లలో హామీలు నెరవేరుస్తాం

కాంగ్రెస్ ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నాలుగేళ్లలో నెరవేరుస్తామని ఆ పార్టీ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అబద్ధపు ప్రచారాలను రాష్ట్ర ప్రజలు గమనించాలని కోరారు. ఆయన సోమవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో రూ.85 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రూ.53 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. బీజేపీ నేతలకు రైతులపై ప్రేమ ఉంటే.. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై ప్రధాని మోదీని ఒప్పించి దేశమంతా అమలయ్యేలా చూడాలని సవాల్ చేశారు. ఈడీ విచారణకు పిలిస్తే కేటీఆర్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అంతకుముందు.. పార్లమెంటులో గృహ, పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశానికి చామల హాజరయ్యారు.

లింగ సమానత్వంపై పైలెట్ ప్రాజెక్టు

విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్న తెలంగాణ మహిళా భద్రత విభాగం

సాక్షి, హైదరాబాద్: లింగ వివక్ష, మహిళలపై పెరుగుతున్న నేరాల నేపథ్యంలో తెలంగాణ మహిళా భద్రత విభాగం మరో కీలక అడుగు వేసింది. లింగ అసమానత, మహిళలపై పెరుగుతున్న నేరాల నివారణ ప్రాధాన్యాన్ని విద్యార్థి దశ నుంచే తెలియజెప్పేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పైలెట్ ప్రాజెక్టు పోస్టర్‌ను మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయెల్, ఇతర అధికారులతో కలిసి తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. జెడ్పీహెచ్‌ఎస్ ఉప్పల్, జెడ్పీహెచ్‌ఎస్ నాగోల్, జెడ్పీహెచ్‌ఎస్ రామంతపూర్‌లోని 8వ, 9వ తరగతులకు చెందిన 1,036 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరివర్తన్ సంస్థకు చెందిన స్మితా హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

టీజీఆర్‌ఎస్‌ఏ సీసీఎల్‌ఏ యూనిట్ అధ్యక్షుడిగా రాంబాబు

నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్‌ఎస్‌ఏ)కు అనుబంధంగా భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) యూనిట్ అధ్యక్షుడిగా ఆర్.రాంబాబు ఎన్నికయ్యారు. సోమవారం టీజీఆర్‌ఎస్‌ఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, మహిళా అధ్యక్షురాలు సుజాతా చౌహాన్ సమక్షంలో సీసీఎల్‌ఏ యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనిట్ ప్రధాన కార్యదర్శిగా డీవీఎస్‌ఎస్ కృష్ణచైతన్య, అసోసియేట్ అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, కె.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేశ్వర్లు, గులాం ఫారూఖ్ అలీ, ఎం.వెంకటేశం, ఎం.స్వాతి, కోశాధికారిగా ఎం.పల్లవితో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర కమిటీలో సీసీఎల్‌ఏ ప్రతినిధులుగా శ్రీకాంత్‌రెడ్డి, మంజుల, సంతోష్‌లాల్, సాయికృష్ణ, సురేశ్‌కుమార్, మీర్‌ముర్తుజా అలీలను ఎంపిక చేసినట్టు టీజీఆర్‌ఎస్‌ఏ వెల్లడించింది.

ఈ నెలలో ప్రమోషన్లు పూర్తి

ఉద్యోగ సంఘాలతో ఎక్సైజ్ డైరెక్టర్

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ శాఖలో అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి పదోన్నతులు ఇస్తున్నామని ఆ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరికిషన్ చెప్పారు. ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను ఈ నెలలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ గెట్ టుగెదర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ హరికిషన్‌తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ముజీబ్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టైగర్‌కి ఈ టెంపర్‌మెంట్ ఏంటి?

ఆశ్చర్యపరుస్తున్న ఓ పులి అసాధారణ ప్రవర్తన

- అడవులను వదిలి రోడ్లు, వ్యవసాయ భూములు, జనావాసాల వద్ద సంచారం
- మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో రెండ్రోజుల క్రితం బంధించిన అధికారులు
- ఈ ప్రవర్తనకు కారణాలు తెలుసుకోవడానికి సీసీఎంబీకి నమూనాలు



సాక్షి, హైదరాబాద్: సాధారణంగా పెద్ద పులులు జనసంచారానికి ఆమడదూరంలో ఉంటూ అడవుల్లోనే సంచరిస్తుంటాయి. కానీ మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా విరూర్ అటవీ రేంజ్ పరిధిలోని రాజూరా తాలూకాలో రెండు రోజుల కిందట అధికారులు బంధించిన ఓ పులి మాత్రం భిన్నంగా కొన్ని రోజులపాటు అసాధారణ రీతిలో ప్రవర్తించింది. తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోడ్ల వెంబడి, జనావాసాలు, వ్యవసాయ భూముల వద్ద తచ్చాడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో ఆ పులిని బంధించిన అధికారులు దాని ప్రవర్తనకు గల కారణాలు ఏమిటో కనిపెట్టే పనిలో పడ్డారు. పులి నుంచి పలు నమూనాలు సేకరించి వాటిని హైదరాబాద్‌లోని సీసీఎంబీతోపాటు బెంగళూరులోని మరో ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపారు. అలాగే మరిన్ని పరీక్షలు చేపట్టేందుకు వీలుగా దాన్ని చంద్రాపూర్‌లోని ట్రాన్సిట్ ట్రీట్‌మెంట్ సెంటర్ (టీటీసీ)కు తరలించారు. ఈ అంశంపై స్పష్టత వచ్చాక తెలంగాణ అటవీ అధికారులతో వివరాలు పంచుకుంటామని చెబుతున్నారు.

మనుషులపై దాడి ఆ పులి పనేనా?

మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దులో ఇటీవల ఓ పులి పలువురిని హతమార్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకరిని చంపడంతోపాటు మరొకరిపై దాడి చేసింది. అలాగే మహారాష్ట్ర సరిహద్దు వెంబడి ఉన్న గ్రామాల్లోనూ పలువురిని చంపింది. పత్తి ఏరివేత సీజన్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలు ఇరు రాష్ట్రాల్లోని అటవీ ప్రాంత గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఈ నేపథ్యంలో తాజాగా పట్టుబడిన పులి అదేనా అని నిర్ధారించుకొనేందుకు అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. పులి నేపథ్యం ఏమిటో, అది ఎక్కడిదో తెలుసుకొనే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఆ పులి ప్రవర్తన తెలుసుకోవడం కష్టమే..

పులుల సహజ స్వభావాన్ని బట్టి చూస్తే వాటికి మనుషుల పొడ గిట్టదు. అకస్మాత్తుగా పులి ఎదురైతే మనిషి ఎలా భయాందోళనకు గురవుతాడో అంతకంటే ఎక్కువగా పులి భయానికి గురవుతుంది. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తున్న పులులను గమనిస్తే అవి అక్కడ కూడా మనుషులు, పశువులపై దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పులులు ఇక్కడకు వచ్చాక కూడా ఆ అలవాటును మానుకోలేక పోతున్నట్లు అంచనా వేస్తున్నాం. పులుల కదలికలు ఎలా ఉంటాయో కచ్చితంగా చెప్పలేం. చంద్రాపూర్‌లో బంధించిన పులి నుంచి సేకరించిన నమూనాలతో వాటి అసాధారణ ప్రవర్తన గురించి తెలుసుకోవడం కొంచెం కష్టమే.

– ఎ.శంకరన్, వైల్డ్‌లైఫ్ ఓఎస్‌డీ, తెలంగాణ అటవీశాఖ



చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా జనం కోలాహలం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్

ఒక ట్రిలియన్ మేమిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

కావాల్సి ఉంది. కాబట్టి రాష్ట్రం నుంచి ఆ పోర్టుకు వేగంగా, నేరుగా చేరుకునేలా డెడికేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, డెడికేటెడ్ రైల్వే లైన్ ఏర్పాటు చేయాలి. అవి ఏర్పడితే మేము డ్రైపోర్టులు ఏర్పాటు చేసుకుంటాం. తద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతికి అవకాశం ఏర్పడుతుంది. దేశ బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 35 శాతం వాటాతో తెలంగాణ ముందంజలో ఉంది. ఆ ఉత్పత్తుల ఎగుమతికి, అవి వేగంగా పోర్టుకు చేరడానికి డెడికేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, డెడికేటెడ్ రైల్వే లైన్ దోహదపడతాయి. ఆటోమొబైల్ పరిశ్రమ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమ స్థానికంగా ఎదిగేందుకు కూడా ఇవి తోడ్పడతాయి.

రీజినల్ రింగ్ రైలు పనులు చేపట్టండి

ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి గాను తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు దక్షిణ కొరియా సిద్ధంగా ఉంది. రీజినల్ రింగు రోడ్డులో 170 కి.మీ భాగానికి ఇటీవలే కేంద్రం టెండర్లు పిలిచింది. మిగతా భాగాన్ని కూడా చేపట్టడంతో పాటు, రింగు రోడ్డు వెంట రీజినల్ రింగ్ రైల్ పనులు కూడా చేపట్టాలి. కేంద్రం వద్ద పెండింగులో ఉన్న హైదరాబాద్ మెట్రో రెండో దశకు వెంటనే అనుమతినిచ్చి పనులు జరిగేలా సహకరించాలి. తెలంగాణను కర్ణాటకతో అనుసంధానించే వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్ పనులకు కూడా అనుమతి మంజూరు చేస్తే, అది ఆ ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడుతుంది. కాజీపేట ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ మంజూరైన నేపథ్యంలో దాన్ని వేగంగా పూర్తి చేసి ప్రారంభించాలి..' అని సీఎం రేవంత్ కోరారు.

అప్రోచ్ రోడ్డుకు గ్రాంటు ఇవ్వండి: శ్రీధర్‌బాబు

చర్లపల్లి రైల్వేస్టేషన్ భవిష్యత్తులో రద్దీగా, హైదరాబాద్‌కు ముఖ్య స్టేషన్‌గా మారనున్నందున విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు తరహా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వం తన వంతుగా గ్రాంటు మంజూరు చేసి సహకరించాలని కోరారు.

ఆ బాధ్యత రాష్ట్రానిదే: కేంద్రమంత్రి

కేంద్రం చర్లపల్లిలో అంతర్జాతీయ స్థాయి రైల్వే టెర్మినల్‌ను నిర్మించి రాష్ట్రానికి కానుకగా ఇచ్చిందని, దానికి అప్రోచ్ రోడ్డు నిర్మించే బాధ్యత మాత్రం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న స్పష్టం చేశారు. దీనికి సీఎం ఆమోదం తెలిపేలా నచ్చజెప్పాలని సూచించారు. కర్ణాటకలో కూడా అప్రోచ్ రోడ్డు నిర్మాణ బాధ్యత రాష్ట్రానిదేనని సీఎం సిద్ధరామయ్యకు చెప్పామని సోమన్న వివరించారు. కాగా సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లను రూ.2 వేల కోట్లతో విమానాశ్రయాల తరహాలో కేంద్రం అభివృద్ధి చేస్తున్నట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు.

చర్లపల్లి–తిరుపతి ప్రత్యేక రైలు ప్రారంభం



చర్లపల్లి–తిరుపతి రైలును ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ (హైదరాబాద్): చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా దక్షిణమధ్య రైల్వే అధికారులు సోమవారం చర్లపల్లి–తిరుపతి ప్రత్యేక రైలును నడిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక రైలును ప్రారంభించారు. ఈ రైలు మంగళవారం తెల్లవారుజామున 4.40 గంటలకు తిరుపతి చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వేకు భారీగా నిధులు: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పదేళ్ల క్రితం 2014లో దక్షిణ మధ్య రైల్వేకు కేంద్ర బడ్జెట్‌లో రూ.251 కోట్లు మాత్రమే దక్కాయని, అదే గతేడాది రూ.5,333 కోట్లు కేటాయించారని, రైల్వేల పురోగతిలో వస్తున్న గణనీయ మార్పునకు ఇది నిదర్శనమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే నెట్‌వర్క్ ఉన్న దేశాల్లో ఒకటైన భారతీయ రైల్వే ఇప్పుడు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.

తెలంగాణకు అన్ని విధాలా సహకారం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణకు అన్ని విధాలా సహకరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి దాదాపు రూ.1.20 లక్షల కోట్లను కేంద్రం ఖర్చు చేసిందని, మరో రూ.80 వేల కోట్లతో పనులు చేపట్టనుందని వెల్లడించారు. పదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 346 కి.మీ మేర రైల్వే లైన్లను అందుబాటులోకి తెచ్చిందని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకున్నా, సొంత నిధులతో రైల్వే శాఖనే ఎంఎంటీఎస్ విస్తరణ పనులు చేపట్టిందని గుర్తుచేశారు. రీజినల్ రింగు రోడ్డు కోసం రూ.26 వేల కోట్లు వెచ్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు.

రైల్వేకు ఆధునిక రూపు: కేంద్రమంత్రి బండి సంజయ్

మెరుగైన వాయు, రైలు, రోడ్డు మార్గాల ద్వారానే పురోగతి సాధ్యమని అమెరికా నిరూపించిందని, ఇప్పుడు ఆ మూడు రంగాలను ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం రూ.32 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించి ఆధునిక రూపు తెచ్చిందని, ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.5 వేల కోట్లకు పైగా వెచ్చించిందని తెలిపారు.

కొత్త ఏడాదిలోనూ భారీగా నియామకాలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఏడాదిలో 56 వేల కొలువులు భర్తీ చేసినట్లు వెల్లడి
- జెన్‌కో ఏఈ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ



జెన్‌కో ఏఈ అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, కేకే, షబ్బీర్‌అలీ

సాక్షి, హైదరాబాద్: 'ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే టీజీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసింది. యూపీఎస్సీ తరహాలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి జాబ్ కేలండర్ ప్రకటించింది. పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి ఏడాదిలో 56 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసింది. ప్రతి నెలా ఏదో ఒక నియామక పత్రాలు అందజేస్తున్నాం. నూతన సంవత్సరంలో కూడా పెద్ద ఎత్తున నియామకాలుంటాయి. వాటికి సంబంధించిన నోటిఫికేషన్లు వస్తాయి..' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో ఏఈ పోస్టులకు ఎంపికైన 315 మంది అభ్యర్థులకు సోమవారం ఆయన నియామక పత్రాలు అందజేశారు. సచివాలయం ఎదుట ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొలువుల కోసం కొట్లాడిన నిరుద్యోగుల ఆశలను గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలకులు అడియాసలు చేశారని విమర్శించారు. కొలువులు లేక నిరాశ నిస్పృహలకు గురైన నిరుద్యోగ యువత ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ఉద్యోగాలు వస్తాయని భావించి ప్రజా ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని అన్నారు. వారి ఆశలు వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి కల్పించేందుకు సీఎం, మంత్రివర్గం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

9న రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ ప్రకటన

దేశ, విదేశీ పెట్టుబడులు ఆకర్షించే విధంగా ఈ నెల 9న తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ పాలసీ–2025ని ప్రకటించనున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారు చేశామన్నారు. ఇందుకోసం అదనంగా 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. 2030 నాటికి రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ 22,448 మెగావాట్లకు చేరుకుంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ (సీఈఏ) అంచనా వేసిందని, ఆ మేరకు విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.

'చెమట చుక్కలకు తర్ఫీదు'లోగో ఆవిష్కరణ

సింగరేణి సంస్థ రూపొందించిన 'చెమట చుక్కలకు తర్ఫీదు'లోగోను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. దేశ, విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై కోల్ బెల్ట్ యువతకు అవగాహన కల్పించేందుకు సింగరేణి సంస్థ చేస్తున్న ప్రయత్నాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం నాయక్ పాల్గొన్నారు.

గవర్నర్ వద్దకు భూభారతి బిల్లు

- త్వరలో ఆమోదం లభిస్తుందనే అంచనాలో రెవెన్యూ శాఖ
- చట్టం మార్గదర్శకాల రూపకల్పనలో బిజీ..మార్చిలోపే అమల్లోకి..!

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ స్థానంలో ఇటీవల అసెంబ్లీ ఆమోదం పొందిన భూభారతి చట్టం–2024 బిల్లును రాష్ట్ర ప్రభుత్వం.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం కోసం పంపింది. గత నెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్లియరెన్స్ తీసుకున్న అనంతరం ఈ బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపినట్టు రెవెన్యూ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ బిల్లుకు త్వరలోనే గవర్నర్ ఆమోద ముద్ర పడే అవకాశం ఉందని రెవెన్యూ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించే పనిలో పడింది. గవర్నర్ అనుమతి రాగానే గెజిట్ ప్రచురిస్తారని, చట్టం ఎప్పటినుంచి అమల్లోకి వస్తుందో అందులో పేర్కొంటారని రెవెన్యూ వర్గాలంటున్నాయి. అయితే అసెంబ్లీ ఆమోదం పొందిన రెండు నెలల్లోపు గవర్నర్ ఆమోదంతో సహా అన్ని లాంఛనాలు పూర్తవుతాయని, మార్చిలోపే భూభారతి చట్టం అమల్లోకి వస్తుందనే చర్చ ఆ శాఖ వర్గాల్లో జరుగుతుండటం గమనార్హం.

చిప్‌ల పరిశ్రమకు హైదరాబాద్ అనుకూలం

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



పీటీడబ్ల్యూ గ్రూప్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: సెమీ కండక్టర్ల (చిప్‌ల తయారీ)తో పాటు అనుబంధ పరిశ్రమలకు హైదరాబాద్‌లో అనుకూల వాతావరణం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన పీటీడబ్ల్యూ గ్రూప్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. సెమీ కండక్టర్ల పరిశ్రమకు అవసరమైన విడిభాగాలు, పునర్నిర్మాణం, ఆటోమేషన్, ఇతర పరికరాలను సరఫరా చేసే తమ సంస్థకు సింగపూర్‌లో ప్రాంతీయ కార్యాలయం ఉన్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేసే పక్షంలో ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న మానవ వనరులకు కొదవ లేదని తెలిపారు. సరైన ప్రతిపాదనలతో వస్తే తమ ఆహ్వానం ఎప్పటికీ ఉంటుందని అన్నారు. కాగా, రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ఉత్పాదక కేంద్రం మొదటి దశ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నట్టు పీటీడబ్ల్యూ ఏషియా విభాగం ఎండీ టార్‌స్టెన్ సెయ్‌ఫ్రెడ్ వివరించారు. ఈ సమావేశంలో సంస్థ స్థానిక భాగస్వామి బార్‌ట్రానిక్స్ ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, సింగపూర్‌కు చెందిన కన్సల్టెంట్ సంస్థ 'టాప్2 పీటీఈ'సీఈవో రావు పనిదపు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌వీకేఎం పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లోని ఎస్‌వీకేఎం పాఠశాలలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. 2023–24 ఇన్‌స్పైర్ అవార్డులు, రాష్ట్రస్థాయి బాల్ వైజ్ఞానిక ప్రదర్శన 2024–25 రెండింటినీ సంయుక్తంగా ఒకే వేదికపై నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 2,200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, గైడ్‌లు హాజరుకానున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే బాలబాలికలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన మూడు రోజులపాటు కొనసాగనుంది. తొలి రోజు కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రెండో రోజు మిల్లెట్స్‌పై, రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. మూడో రోజు ఫలితాల ప్రకటన, విజేతలకు బహుమతుల ప్రదానం జరగనుంది. వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీలో భాగంగా మరో ఏడు అంశాలకు సంబంధించి విద్యార్థులు ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. ఇందులో ఉత్తమంగా ఉన్న 99 ప్రయోగాలను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు.

మోహన్‌బాబు పిటిషన్‌పై సుప్రీంలో విచారణ 9కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో మోహన్‌బాబు పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు గతేడాది డిసెంబర్ 23న కొట్టేయడంతో ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే ఆ సమయానికి ఆయన తరపున వాదించాల్సిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వేరే కోర్టులో వాదనలు వినిపిస్తుండటంతో పాస్ ఓవర్ ఇవ్వాలని మోహన్‌బాబు తరపు మిగిలిన న్యాయవాదులు కోరారు. అందుకు ధర్మాసనం నిరాకరించగా కనీసం మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ విజ్ఞప్తిని సైతం తోసిపుచ్చిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 9న చేపడతామని చెప్పింది. అయితే ధర్మాసనం లంచ్ బ్రేక్‌కు వెళ్లే సమయంలో హాజరైన ముకుల్ రోహత్గి... మోహన్‌బాబు వయసురీత్యా మధ్యంతర బెయిల్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. ఈ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. మధ్యంతర బెయిల్‌పై వాదనలను గురువారం వింటామని స్పష్టం చేసింది.

తొర్రూరు సీఐపై ఏసీబీ కేసు

- రేషన్ బియ్యం కేసు నిందితుల నుంచి రూ.4 లక్షలు డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన ఓ నిందితుడు



జగదీశ్

తొర్రూరు: రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుల నుంచి లంచం డిమాండ్ చేసిన తొర్రూరు సీఐని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..గతేడాది అక్టోబర్ 2న లారీలో అక్రమంగా రేషన్‌బియ్యం రవాణా చేస్తుండగా దంతాలపల్లి పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఖమ్మం జిల్లాకు చెందిన ఐదుగురు, ఆసిఫాబాద్‌కు చెందిన ఒకరు భాగస్వాములు కాగా, వారిపై కేసు నమోదు చేశారు. అయితే నిందితులను తప్పించేందుకు, కేసు తీవ్రతను తగ్గించేందుకు నిందితుల నుంచి సీఐ జగదీశ్ రూ.4లక్షలు డిమాండ్ చేశాడు. సదరు మొత్తం ఇచ్చేందుకు నిందితులు అంగీకారం తెలిపి, మొదటి విడతగా రూ.2లక్షలు అక్టోబర్ 3న సీఐకి ఇచ్చారు. మిగతా రూ.2 లక్షలు కొద్ది రోజుల వ్యవధిలో చెల్లించేందుకు అంగీకరించారు. కాగా మిగిలిన డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐ వేధింపులకు గురిచేశాడు. దీంతో విసుగు చెందిన రేషన్ బియ్యం రవాణాలో భాగస్వామిగా ఉన్న ఆసిఫాబాద్‌కు చెందిన వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. ముందస్తు ఏసీబీ ప్లాన్ ప్రకారం అధికారులు అందించిన డబ్బులు సీఐకి ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. డబ్బులు ఎక్కడ ఇవ్వాలి? ఎప్పుడు ఇవ్వాలి అంటూ సీఐని ఆ వ్యక్తి ఫోన్‌లో అడగ్గా, అనుమానం వచ్చిన సీఐ ఆ మొత్తాన్ని డైరెక్ట్‌గా తీసుకునేందుకు నిరాకరించాడు. ఈ వ్యవహారంలో సీఐ ఫోన్ రికార్డులు, వీడియో రికార్డులు ఏసీబీకి అందాయి. పూర్తి సమాచారంతో ఏసీబీ అధికారులు సోమవారం ఉదయం తొర్రూరు సీఐని సుదీర్ఘంగా విచారించారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నారు. సీఐ సొంత గ్రామమైన కొత్తగూడెంలోని ఇంట్లో, సీఐ క్వార్టర్స్‌లోనూ సోదాలు జరిపామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో సీఎస్‌బీ సీఐగా పనిచేసిన జగదీశ్ గతేడాది ఆగస్టు 9 నుంచి తొర్రూరు సీఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

క్లుప్తంగా...

రేవంత్ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు: వేముల



సాక్షి, హైదరాబాద్: రేవంత్ ప్రభుత్వాన్ని, హామీల అమలులో వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా పేరిట రూ.15 వేలు ప్రకటించి చివరికి రూ.12 వేలు ఇస్తామని రేవంత్ ప్రకటించడాన్ని విమర్శించారు. కాంగ్రెస్ అధిష్టానానికి మూటలు మోసేందుకు ఢిల్లీకి రేవంత్ 30 సార్లు వెళ్లొచ్చాడని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందునే కేటీఆర్‌ను రేవంత్ నిత్యం వెంటాడుతున్నారన్నారు. కేటీఆర్‌పై కుట్రలు చేసి అక్రమ కేసులు బనాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వేముల ఆరోపించారు.

రేవంత్‌వి చిల్లర చేష్టలు

మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిల్లర చేష్టలకు పాల్పడుతూ, ఇచ్చిన హామీలు అమలు చేయలేక కొత్త చిక్కులు తెచ్చుకుంటున్నాడని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుభరోసాలో రైతుల ఆగ్రహం నుంచి దృష్టి మరల్చేందుకు కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. ఏసీబీ కేసు విషయంలో వ్యూహం బెడిసికొట్టడంతో ఎలక్టోరల్ బాండ్ల అంశాన్ని తెరమీదకు తెచ్చారన్నారు. గ్రీన్ కో కంపెనీ కాంగ్రెస్ పార్టీకి కూడా రూ.27 కోట్లు విరాళంగా ఇచ్చిందని జగదీశ్‌రెడ్డి చెప్పారు. కేటీఆర్‌పై ఏసీబీ నోటీసుల అంశంలో రేవంత్ తన పరువు పోతుందన్న ఉద్దేశంతోనే డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏసీబీ హైకోర్టుకు సమర్పించిన 200 పేజీల రిపోర్టులో గ్రీన్ కో ప్రస్తావన ఎందుకు లేదని జగదీశ్‌రెడ్డి నిలదీశారు.

బీఆర్‌ఎస్‌కు రైతులపై ప్రేమ లేదు

దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దోపిడీని కప్పిపుచ్చుకునేందుకు రైతు భరోసాపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బీఆర్‌ఎస్‌కు రైతులపై ప్రేమ లేదని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఫార్ములా ఈ–రేస్ విచారణను తప్పుదోవ పట్టించేందుకే రైతుల పేరుతో ధర్నాలంటున్నారని మండిపడ్డారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న రేవంత్‌రెడ్డి అన్నదాత అయితే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కేసీఆర్ అప్పుదాత అని ఎద్దేవా చేశారు. కాగా, ఫార్ములా ఈ–రేస్ విషయంలో తనపై పెట్టింది లొట్టపీసు కేసు అని ప్రగల్భాలు పలికిన కేటీఆర్ తన వెంట విచారణకు లాయర్లను ఎందుకు తీసుకెళ్లాడని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు.

యూనివర్సిటీలపై యూజీసీ కొరడా!



విద్యార్థులకు రూ.25 కోట్లు ఫీజు వాపస్ చేసిన వర్సిటీలు

- వర్సిటీల్లో అదనపు ఫీజులపై యూజీసీకి విద్యార్థుల నుంచి భారీగా ఫిర్యాదులు
- ప్రైవేట్ యూనివర్సిటీలపైనే అత్యధికం..
- గత ఐదు విద్యా సంవత్సరాల్లో 4,257 ఫిర్యాదులు పరిష్కారం
- రూ.26.30 కోట్ల విలువైన ఫిర్యాదుల్లో రూ.25.51 కోట్ల సొమ్ము విద్యార్థులకు వాపస్

సాక్షి, అమరావతి: దేశంలో ప్రైవేట్ యూనివర్సిటీలు, విద్యా సంస్థలు తమ ఇష్టానుసారంగా అదనపు ఫీజులు వసూలు చేస్తుండటంతో.. ఎంతో మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. ఫీజు రిడ్రెసల్ ద్వారా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తోంది. అంతటితో వదిలేయకుండా వేగంగా ఆ ఫిర్యాదులను పరిష్కరిస్తూ యూనివర్సిటీల నుంచి విద్యార్థులకు అదనపు ఫీజులను రీఫండ్ చేయిస్తోంది. గత ఐదు విద్యా సంవత్సరాల్లో 4,257 ఫిర్యాదులు నమోదవ్వగా.. యూజీసీ ఆయా వర్సిటీల నుంచి రూ.25.51 కోట్ల సొమ్మును విద్యార్థులకు వాపస్ చేయించింది.

అత్యధిక ఫిర్యాదులు వచ్చిన రాష్ట్రాలు

రాష్ట్రాలు	ఫిర్యాదులు	ఫీజు రీఫండ్ (రూ.కోట్లలో)
ఉత్తరప్రదేశ్	827	4.96
ఢిల్లీ	591	2.21
రాజస్థాన్	418	1.65
తమిళనాడు	381	1.99
పశ్చిమ బెంగాల్	377	0.92

దేశవ్యాప్తంగా ఫిర్యాదుల పరిష్కారం వివరాలు

వర్సిటీలు	ఫిర్యాదులు వచ్చిన వర్సిటీలు	పరిష్కరించిన ఫిర్యాదులు	ఫీజు రీఫండ్ (రూ.కోట్లలో)
ప్రైవేట్	211	1,475	10.12
రాష్ట్ర	177	1,211	4.32
సెంట్రల్	37	799	1.34
డీమ్డ్	77	770	9.68
జాతీయ విద్యా సంస్థ	-	2	రూ.4.41లక్షలు

యూజీసీ ఫీజు రిడ్రెసల్ సెల్.. ఈ–సమాధాన్ ప్లాట్‌ఫాం కింద పనిచేస్తుంది. ఇది విద్యార్థులకు ఆర్థిక భారం నుంచి విముక్తి కల్పించడంతో పాటు విద్యా వ్యవస్థపై విశ్వాసం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తోంది. 2021-22లో 915, 2022-23లో 927, 2023-24లో 2,251 ఫిర్యాదులు వచ్చాయని యూజీసీ వర్గాలు తెలిపాయి. ఉత్తరప్రదేశ్‌లోని ప్రైవేట్ యూనివర్సిటీలపైనే విద్యార్థుల నుంచి అత్యధిక ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ, రాజస్థాన్ నిలిచాయని పేర్కొన్నాయి. తమకు వచ్చిన ఫిర్యాదుల్లో 97 శాతానికి పైగా పరిష్కరించినట్లు యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ చెప్పారు. మొత్తం రూ.26.30 కోట్ల విలువైన ఫిర్యాదులకు గానూ రూ.25.51 కోట్లను విద్యార్థులకు వాపస్ చేయించినట్లు వెల్లడించారు. ఇందులో 1,386 మంది విద్యార్థినులకు రూ.8.71 కోట్ల ఫీజు రీఫండ్ చేసినట్లు తెలిపారు.

97% సక్సెస్ రేట్..

ఏసీబీ విచారణకు హాజరుకాకుండానే వెనక్కి..

న్యాయవాదులతో కలిసి ఏసీబీ కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్.. లోపలికి ఒక్కరే వెళ్లాలంటూ అడ్డుకున్న పోలీసులు

చివరికి ఏసీబీ ఏఎస్పీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చి, వెనుదిరిగిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్

ఫార్ములా–ఈ కార్ల రేసు కేసులో సోమవారం ఏసీబీ కేంద్ర కార్యాలయం వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ శాఖ మాజీ మంత్రి కేటీ రామారావు... ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నా రు. తన న్యాయవాదులను కూడా వెంటతీసుకుని వచ్చారు. కానీ ఏసీబీ కార్యాలయానికి సమీపంలోనే పోలీసులు అడ్డుకున్నారు. ఏసీబీ నోటీసుల ప్రకారం.. న్యాయవాదులకు అనుమతి లేదని, ఒక్కరే విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. న్యాయవాదులు వెంట ఉంటే ఇబ్బంది ఏమిటని, వారిని అనుమతించాలని కేటీఆర్ పట్టుబట్టారు. దాదాపు 40 నిమిషాల పాటు ఏసీబీ కార్యాలయం సమీపంలో తన వాహనంలోనే వేచి ఉన్నారు. చివరికి ఏసీబీ అధికారులకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చి అక్కడి నుంచి వెనుదిరిగారు.

న్యాయవాదులు ఉంటే ఇబ్బంది ఏమిటి?

➤ ఫార్ములా–ఈ కారు రేసు కేసులో ఏసీబీ నోటీసుల ప్రకారం విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్ సోమవారం ఉదయం 10 గంటలకు నందినగర్‌లోని తన నివాసం నుంచి బయలుదేరారు. పోలీసులు ఏసీబీ కార్యాలయం సమీపంలో బారికేడ్లు పెట్టి కేటీఆర్ వాహనాన్ని అడ్డుకున్నారు. కేవలం కేటీఆర్ ఒక్కరే ఏసీబీ కార్యాలయంలోకి వెళ్లాలని పేర్కొన్నారు. దీంతో న్యాయవాదులతో కలిసి విచారణకు హాజరైతే తప్పేమిటని.. న్యాయవాదులను తీసుకురావొద్దని ఏసీబీ అధికారులు కాకుండా పోలీసులు ఎందుకు చెబుతున్నారని కేటీఆర్ నిలదీశారు. అయినా పోలీసులు అనుమతించలేదు. కాసేపు ఏసీబీ ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. ఆ తర్వాత కూడా న్యాయవాదులను అనుమతించేందుకు ససేమిరా అన్నారు. మరోవైపు కేటీఆర్ కూడా పట్టుబట్టి తన వాహనంలోనే కూర్చుని వేచిచూశారు. పలుమార్లు పోలీసులు, కేటీఆర్ మధ్య చర్చలు జరిగినా ఎవరూ వెనక్కి తగ్గలేదు. ఇలా 40 నిమిషాల పాటు హైడ్రామా చోటు చేసుకుంది. చివరికి న్యాయవాదులు లేకుండా విచారణకు హాజరుకాబోనని, లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చి తిరిగి వెళ్లిపోతానని కేటీఆర్ తేల్చి చెప్పారు. దీనితో ఏసీబీ కేంద్ర కార్యాలయం నుంచి బయటికి వచ్చిన అడిషనల్ ఎస్పీ ఖాన్.. కేటీఆర్ నుంచి లిఖిత పూర్వక సమాధానం తీసుకున్నారు.



ఏసీబీ కార్యాలయం బయట వేచి ఉన్న సమయంలో కేటీఆర్ తన వాహనంలోనే ఉండి మీడియాతో మాట్లాడారు. ''చట్టాన్ని గౌరవించే సాధారణ పౌరుడిగా ఏసీబీ కార్యాలయానికి వచ్చాను. కానీ ఈ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నాకు ఉన్న హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోంది. తెలంగాణలో భారత రాజ్యాంగం నడుస్తోందా.. లేక రేవంత్ రాజ్యాంగం నడుస్తోందా? గతంలో మా పార్టీ నాయకుడు నరేందర్‌రెడ్డిని కూడా విచారణ పేరుతో పిలిచి ఆయన చెప్పని విషయాలను స్టేట్‌మెంట్‌లో నమోదు చేశారు. ఆయన నా పేరు చెప్పినట్టుగా అసత్యాలతో కూడిన ఒక స్టేట్‌మెంట్‌ను మీడియాకు వదిలారు. ఇప్పుడు నా విషయంలో కూడా అదే విధంగా చేసే అవకాశం ఉంది. పోలీసులపై నాకు విశ్వాసం లేదు. అందుకే న్యాయవాదులతో వచ్చాను. అయినా నా వెంట న్యాయవాదులు కూడా ఏసీబీ కార్యాలయంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వానికి సమస్య ఏమిటో చెప్పాలి. ఒక పౌరుడిగా నాకు న్యాయవాదుల సహకారం తీసుకునే హక్కు లేదా? అయితే ఆ విషయాన్ని రాతపూర్వకంగా రాసి ఇవ్వాలి..'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు

వారిపై నమ్మకం లేదు.. అందుకే లాయర్లతో వచ్చా..: కేటీఆర్

సోదాల పేరిట కుట్రకు పాల్పడే ప్రయత్నం

''నేను ఏసీబీ విచారణకు హాజరయ్యే సమయంలోనే నా ఇంటిపై ఏసీబీ దాడులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్టుగా నాకు సమాచారం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ దాడుల్లో ఏవైనా చట్టవ్యతిరేకమైన వస్తువులు, పత్రాలు నా ఇంట్లో వాళ్లే పెట్టి.. అవి సోదాల్లో దొరికాయని చెప్పే కుట్ర కూడా జరుగుతోంది. మా ఇంట్లో ఈ రోజు (సోమ వారం) మా మామగారి రెండో సంవత్సరీకం కార్యక్రమం ఉంది. అది జరుగుతుండగా సోదాలు చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం ఉంది. గతంలోనూ దీపావళి పండుగ చేసుకుంటే కూడా పోలీసులతో సోదాలు చేయించారు. డ్రగ్స్ పట్టుబడ్డా యని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా అబద్ధాలు చెప్పారు. నేను ఈ రోజు విచారణకు హాజరుకావాల్సిన అవసరం లేదు. అయినా నేను ఏ తప్పూ చేయలేదు కాబట్టే ధైర్యంగా ఏసీబీ విచారణకు వచ్చాను..''అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించే కుట్ర..

రేవంత్‌రెడ్డి రైతు భరోసాలో కోత విధించి రైతులకు చేసిన ద్రోహం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ కుట్రకు పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ''నేను సీఎంకు చెప్పేది ఒక్కటే.. ఎన్ని దాడులు చేసినా, ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేసేదాకా వదిలిపెట్టేది లేదు. ఏసీబీ అధికారులు విచారణ పేరిట నన్ను అడుగుతున్న సమాచారం మొత్తం ప్రభుత్వం వద్దే ఉంది. గతంలో మంత్రిగా నిర్ణయం తీసుకున్నాను. అలాంటప్పుడు ఇంకా నా దగ్గర ఏం సమాచారం ఉంటుంది?..''అని ప్రశ్నించారు. ఏసీబీ అధికారులు అనుమతిస్తే కార్యాలయం లోపలికి వచ్చి ఇద్దామనుకున్న పత్రాన్ని ఇక్కడే ఇచ్చి వెళతానని.. మళ్లీ ఏసీబీ అధికారులు రమ్మంటే వస్తానని చెప్పారు. లాయర్లు లేకుండానే విచారణకు రావాలని పోలీసులు చెబుతున్నారని.. దర్శకుడు రాజమౌళిని మించిన టాలీవుడ్ కథలు అల్లుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఏసీబీ అధికారులకు ఇచ్చిన సమాధానంలో ఏముంది?

➤ ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ డీఎస్పీ మాజిద్‌ఖాన్‌కు కేటీఆర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తనపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను హైకోర్టులో సవాల్ చేశానని, డిసెంబర్ 31న ఈ అంశంలో తుది వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసిందని గుర్తు చేశారు. హైకోర్టులో ఏసీబీ ప్రతివాదిగా ఉందని, తన పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలు కూడా విని పించిందని వివరించారు. హైకోర్టు ఏ క్షణమైనా తీర్పు ప్రకటించే అవకాశం ఉన్న ఈ సందర్భంలో ఏసీబీ తనకు నోటీసు ఇచ్చిందని పేర్కొన్నారు. ''సమాచారంతోపాటు డాక్యుమెంట్లు అందివ్వాలని ఏసీబీ నోటీసులలో ప్రస్తావించారు. ఏ అంశాలపై సమాచారం కావాలన్న విషయాన్ని నోటీసులలో స్పష్టంగా ప్రస్తావించలేదు. మీకు ఏ డాక్యుమెంట్లు కావాలో తెలియజేయడంతోపాటు తగిన సమయం ఇవ్వండి. నేను చట్టాన్ని గౌరవించే పౌరుడిని. నాకు న్యాయబద్ధంగా ఉన్న హక్కులు కాపాడబడితేనే ఈ విషయంలో నేను మీకు పూర్తిగా సహకరిస్తాను. హైకోర్టు తుది తీర్పు తర్వాత ముందుకు వెళ్లాలని కోరుతున్నాను''అని కేటీఆర్ లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

ఎలక్టోరల్ బాండ్లపై చర్చకు సిద్ధం

''పార్లమెంట్ ఆమోదించిన ఎలక్టోరల్ బాండ్లు ఇవ్వడం అవినీతి అని ఎలా అంటారు? దేశవ్యాప్తంగా అన్ని పార్టీలకు వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై మేం చర్చకు సిద్ధం. 2022లో గ్రీన్‌కో కంపెనీ ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చింది. 2023లో ఫార్ములా–ఈ రేసు జరిగింది. కాంగ్రెస్, బీజేపీలకు కూడా గ్రీన్‌కో ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చింది. ఫార్ములా–ఈ రేస్ కారణంగా నష్టపోవడంతో గ్రీన్‌కో ఒప్పందం నుంచి తప్పుకుంది. కాంగ్రెస్‌కు 340 కంపెనీలు రూ.1,351 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చాయి. తెలంగాణలో తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ వాళ్లు తమకు అందిన ఎలక్టోరల్ బాండ్లపై ఏమంటారు?''అని కేటీఆర్ ప్రశ్నించారు.




కనికరించండి.. లేదా కారుణ్య మరణానికి అనుమతించండి

ప్రజావాణిలో ఓ మహిళ మొర

జగిత్యాల టౌన్: తన కుటుంబాన్ని కనికరించి ఉపాధి అయినా చూపాలని.. లేదా కారుణ్య మరణానికైనా అనుమతించాలని ఓ అభాగ్యురాలు మానసిక వికలాంగులైన తన ముగ్గురు పిల్లలతో కలిసి ప్రజావాణిలో మొరపెట్టుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన నక్క సునీత తండ్రిది జగిత్యాల. తండ్రి ఉద్యోగ రీత్యా కానిస్టేబుల్ కావడంతో సునీత కరీంనగర్‌లో హైస్కూల్ వరకు చదువుకుంది. అనంతరం వివిధ ప్రాంతాల్లో ఉన్నత విద్యతోపాటు పీజీ స్పెషల్ బీఈడీ పూర్తి చేసింది. ఆమెకు అల్లీపూర్‌కు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు. అందరూ మానసిక వికలాంగులు. సునీత రెండేళ్ల క్రితం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యాబోధన చేసే ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైంది. అయితే జగిత్యాల డీఈవో కార్యాలయానికి రిపోర్ట్ చేసేందుకు వెళ్లగా.. అక్కడి అధికారులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి నాన్ లోకల్‌గా నిర్ధారించి ఉద్యోగం ఇచ్చేందుకు నిరాకరించారు. అప్పటినుంచి ఆమె ఉద్యోగం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉంది. తన భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడని, మానసిక వికలాంగులైన ముగ్గురు పిల్లల పోషణ భారంగా మారిందని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి గోడు వెల్లబోసుకుంది. జగిత్యాల జిల్లా గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అంతర్భాగం అయినా.. తనను నాన్ లోకల్ అంటూ రిజెక్ట్ చేశారని కన్నీటి పర్యంతమైంది. విషయాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వివరించగా.. ఆయన ఇటీవల మండలి సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, అయినప్పటికీ అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. తాను ఎంపికైన పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉందని, ఆ ఉద్యోగాన్ని తనకు ఇప్పించి ఆదుకోవాలని, లేకుంటే తనతోపాటు తన పిల్లలకు చావుతప్ప మరో గత్యంతరం లేదని పేర్కొంది. ఉద్యోగమైనా ఇప్పించండి.. లేదా మానసిక వికలాంగులైన తన ముగ్గురు పిల్లలతో సహా కారుణ్య మరణానికైనా అనుమతించాలని కలెక్టర్‌కు సమర్పించిన అర్జీలో కోరారు. ఈ విషయంపై డీఈవోను వివరణ కోరగా జీవో నంబర్ 25 ప్రకారం ఏ జిల్లా పరిధిలో చదువుకుంటే వారిని అదే జిల్లాలో స్థానికులుగా గుర్తించామని, అందుకే ఆమెను జగిత్యాల జిల్లాలో నాన్ లోకల్‌గా పరిగణించామని తెలిపారు.

కిమ్స్ ఆస్పత్రికి వస్తే ఎలాంటి అభ్యంతరం లేదు



ముందస్తు సమాచారం ఇవ్వండి..

అల్లు అర్జున్‌కు మరోసారి పోలీసుల నోటీసులు

సాక్షి, హైదరాబాద్/రాంగోపాల్‌పేట్: సినీ నటుడు అల్లు అర్జున్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ ను పరామర్శించేందుకు వస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ముందస్తు సమాచారం ఇవ్వాలని రాంగోపాల్‌పేట్ పోలీసులు ఆయనకు మరో సారి నోటీసులు అందించారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడిన శ్రీతేజ సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విష యం విదితమే. ఈనెల 5న కిమ్స్‌కు వెళ్లాలని అల్లు అర్జున్ భావించగా పోలీసులు మొదటిసారి నోటీసులు ఇచ్చారు. ఆయన రాకతో ఆస్పత్రిలో ఉండే రోగులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అలాగే పెద్దఎత్తున అభిమానులు వచ్చే అవకాశాలున్నాయని అందువల్ల ముందస్తు సమాచారం ఇస్తే తగిన బందోబస్తు ఏర్పాటు చేసు కుంటామని తెలిపారు. అలాగే పెద్దఎత్తున అభిమానులు గుమికూడకుండా గోప్యంగా పరామర్శకు వస్తే ఎలాంటి గందరగోళం జరిగే అవకాశాలు ఉండవని కూడా నోటీసు లో సూచించారు. అల్లు అర్జున్ ఇంట్లో లేకపోవడంతో రాంగోపాల్ పేట్ ఎస్సై నర్సింగ్‌రావు ఆయన మేనేజర్‌కు నోటీసులు అందించి వచ్చారు. కాగా, సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హీరో అల్లు అర్జున్ మేనేజర్, పర్సనల్ సెక్యూరిటీ గార్డులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ కేసులో అల్లు అర్జున్ మేనేజర్ ఎ.శరత్‌చంద్ర నాయుడు, పర్సనల్ సెక్యూరిటీ గార్డులు సి.కృష్ణ, శ్రీరాములురాజు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన సోమవారం విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పును గురువారానికి (9కి) వాయిదా వేశారు.

కోటి ఎకరాలకు 'భరోసా'!

▶ మొదటి పేజీ తరువాయి

సాగు భూమి ఉంది. రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయానికి పార్ట్–బీని మినహాయించారు. అయినా 1.52 కోట్ల ఎకరాలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. అంటే 1.30 కోట్ల ఎకరాల సాగుభూమితోపాటు మరో 22 లక్షల ఎకరాల సాగులో లేని భూమికి కూడా రైతుబంధు లభించింది.

రెండు సీజన్‌లలో రైతుబంధు దక్కిన సాగులో లేని భూమి 97.51 లక్షల ఎకరాలు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఇటీవల రైతుబంధు పథకం లెక్కలను మీడియాకు వివరించారు. రాష్ట్రంలో 2023–24 సంవత్సరంలో ప్రభుత్వం రెండు సీజన్‌లకు కలిపి 97.51 లక్షల ఎకరాల్లోని సాగులో లేని భూమికి రూ. 4,875.62 కోట్లు చెల్లించిందని తెలిపారు. అంటే సగటున ఒక సీజన్‌కు 48.70 లక్షల ఎకరాలకుగాను రూ. 2,438 కోట్లు చెల్లించినట్లు చెప్పడం గమనార్హం. ఇందులో యాసంగి సీజన్‌లో సాగు చేయని భూముల లెక్కలు కూడా ఉన్నాయి. కొత్త పథకంలో వానాకాలంలో సాగై యాసంగిలో సాగు చేయని భూములకు కూడా రైతుభరోసా ఇవ్వనున్నారు. అయితే రెవెన్యూ రికార్డులను పరిగణనలోకి తీసుకొని 'పార్ట్–బీ'కేటగిరీ భూములతోపాటు రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు, రోడ్లు, నాలా మార్పిడి తదితర వివాదాస్పద భూములన్నింటినీ తొలగించి రైతుకు సంబంధించిన సాగు చేసే పట్టా భూములనే లెక్కతేల్చి పథకం అమలు చేయనున్నట్లు సమాచారం. ప్రాథమిక అంచనా ప్రకారం కోటి ఎకరాల లోపు భూములనే సాగుయోగ్యమైన పట్టా భూములుగా వ్యవసాయ శాఖ తేల్చినట్లు తెలిసింది. రెవెన్యూ శాఖ నుంచి వచ్చే సమాచారాన్ని క్రోడీకరించి తుది జాబితాను ప్రభుత్వం రూపొందించనుంది.

విచారణకు రాలేను.. మరికొంత సమయం ఇవ్వండి!

ఈడీ అధికారులకు మాజీ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అధికారుల ఎదుట మంగళవారం విచారణకు హాజరుకాలేనని, మరికొంత సమయం ఇవ్వాలని ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)కి మాజీ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. ఈ మేరకు ఈడీ కార్యాలయానికి సోమవారం సాయంత్రం సమాచారం పంపినట్టు తెలిసింది. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ హైకోర్టులో వేసిన పిటిషన్‌లో తీర్పు రిజర్వు అయిందని... హైకోర్టుపై గౌరవంతో ఆ తీర్పు వెలువరించేంత వరకు తనకు సమయం ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. అయితే ఈ కేసులో నిందితులుగా ఉన్న హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డి, సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ఈ నెల 2, 3 తేదీల్లో విచారణకు హాజరుకావాల్సి ఉన్నా.. వారి అభ్యర్థన మేరకు 8, 9వ తేదీల్లో హాజరయ్యేందుకు అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈడీ కేటీఆర్‌కు కూడా మరికొంత సమయమిచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఫార్ములా–ఈ రేసు సంస్థకూ త్వరలో నోటీసులు!

ఫెమా చట్టం కింద మరో కేసు నమోదుకు సిద్ధమవుతున్న ఈడీ

కేటీఆర్, అధికారుల విచారణ తర్వాత ఈ అంశంపై ముందుకు వెళ్లేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ల రేసు అంశంలో మరో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై ఏసీబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాయి. తాజాగా కార్ల రేసు నిర్వహణ సంస్థ 'ఫార్ములా–ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈఓ)'ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు ఫోకస్ చేసినట్టు తెలిసింది. దీనికి సంబంధించి 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా)'కింద మరో కేసు నమోదుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. రేసు నిర్వహణకు సంబంధించి హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి 2023లో బ్రిటన్‌లోని ఎఫ్‌ఈఓ సంస్థకు రూ. 45.71 కోట్లు నగదు బదిలీ అయింది. ఈ సొమ్ము రిజర్వుబ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా దేశం దాటి వెళ్లిందని గుర్తించిన ఈడీ.. విదేశీ కంపెనీకి చేరిన సొమ్ము తర్వాత ఎక్కడికి వెళ్లిందన్న వివరాలను ఆరా తీస్తున్నట్టు తెలిసింది. దర్యాప్తులో భాగంగా మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డిలను విచారించిన తర్వాత.. వారి నుంచి సేకరించే సమాచారం ఆధారంగా ఎఫ్‌ఈఓ సంస్థకు నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం.

9న విచారణకు రండి

కేటీఆర్‌కు మరోమారు ఏసీబీ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ల రేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 9న ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. సోమ వారం రాత్రి రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్‌లో కేటీఆర్ నివాసానికి వచ్చిన ఇద్దరు ఏసీబీ అధి కారులు ఈ నోటీసులు అందజేసి వెళ్లారు. అయితే విచారణకు న్యాయవాదులను అనుమతించేది లేదని ఏసీబీ ఈ నోటీసులలో పేర్కొన్నట్టు సమాచారం.

సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు వస్తారా?

బీఆర్‌ఎస్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్

సాక్షి,ఆదిలాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకి.. ఏడాది కాంగ్రెస్ పాలనకి నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు వస్తారా..అంటూ బీఆర్‌ఎస్‌కు సవాల్ విసిరారు. 'ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సఫలమయ్యాం. వచ్చే నాలుగేళ్లలో అకుంఠిత దీక్షతో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తాం. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వంద శాతం సీట్లు గెలుచుకునేందుకు కృషి చేస్తాం. ఇప్పటి నుంచే ఈ ఎన్నికలకు సిద్ధం అవుతున్నాం 'అని చెప్పారు.



మహేశ్‌కుమార్ గౌడ్, దీపాదాస్ మున్షీలను గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఒక్క కుర్చీ.. ముగ్గురు కొట్లాట

బీఆర్‌ఎస్‌లో ఒక్క కుర్చీ కోసం ముగ్గురు కొట్లాడుతున్నారని మహేశ్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఇటు కేటీఆర్..అటు కవిత ప్రయత్నిస్తుంటే మధ్యలో హరీశ్‌రావు గోవిందా అంటూ వ్యాఖ్యానించారు. ఆయన వేరే పార్టీ చూసుకోవడం ఖాయమన్నారు. ఫార్ములా – ఈ రేసు కేసులో కేటీఆర్ అడ్డంగా దొరికిపోయారని, మొదట పనికిరాని కేసు అన్న కేటీఆర్ ఇప్పుడు కోర్టును ఎందుకు ఆశ్రయించారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ముఖచిత్రం ఉండదన్నారు. ఏ ముఖం పెట్టుకొని ఎమ్మెల్సీ కవిత ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చారని ఎద్దేవా చేశారు.

సంక్రాంతి తర్వాత తీపి కబురు..

సంక్రాంతి తర్వాత పార్టీ నేతలకు తీపి కబురు ఉంటుందని మహేశ్‌కుమార్ అన్నారు. అన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రి సీతక్క, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, మాజీ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తిగానే ఉన్నారు.. ప్రతిపక్షాలే లేవు: గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలు సంతృప్తిగానే ఉన్నారని..ప్రతిపక్ష పార్టీలే సంతృప్తిగా లేవని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'అధికారాన్ని నిలబెట్టుకునేందుకు పాలక పార్టీలు, అధికారంలోకి వచ్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తుంటాయి. అందులో తప్పు లేదు. అయితే, ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం ఏ పార్టీతో సాధ్యం కాదు. కొన్ని సాధ్యమయ్యేవి ఉంటాయి. మరికొన్ని సాధ్యం కానివి ఉంటాయి. రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిన కేసీఆర్.. చిప్ప చేతికి ఇచ్చి వెళ్లారని కాంగ్రెస్ పార్టీ అంటోంది. ఆర్థిక పరిస్థితులు బాగా లేని కారణంగా కొన్ని పథకాలను ఇవ్వలేమని ప్రభుత్వం చెపితే ప్రజలు అర్థం చేసుకుంటారు'అని అన్నారు. సోమవారం శాసనమండలిలోని తన కార్యాలయంలో విలేకరులతో సుఖేందర్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా రారా అన్నది ఆయన ఇష్టమని, బలవంతంగా ఎవరినీ రప్పించలేమని చెప్పారు. భవిష్యత్‌లో తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయబోనని, తన కుమారుడు అమిత్‌రెడ్డికి అవకాశం వస్తే పోటీ చేయవచ్చని గుత్తా వెల్లడించారు.



ప్రతీ ఎడబాటు మృత్యువు తాలూకు ముందస్తు రుచిని చూపుతుంది.
ప్రతీ కలయిక పునర్జీవనపు సూచన ఇస్తుంది.
– ఆర్థర్ షోపెన్‌హవర్

సాక్షి
మంగళవారం, 7 జనవరి 2025

సురక్షిత డిజిటల్ ప్రపంచం కోసం!

కాలం మారుతున్నకొద్దీ, సాంకేతికతలు విస్తరిస్తున్నకొద్దీ కొత్త భయాలు పుట్టుకొస్తాయి. తమ పిల్లలు సోషల్ మీడియా వ్యామోహంవల్ల చెడిపోతున్నారని కొన్నాళ్లుగా తల్లిదండ్రుల్లో బెంగ పట్టుకుంది. అక్కడ తారసపడే విశృంఖల పోకడలు, తప్పుడు భావాలు పిల్లల మెదళ్లపై దుష్ప్రభావం కలగజేస్తున్నాయి. వారి బాల్య, కౌమార దశలను కొల్లగొడుతున్నాయి. పిల్లలకు మాదకద్రవ్యాలు అలవాటు చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కాదనలేనిది. నిజానికి సోషల్ మీడియా దుర్వ్యసనంగా మారిన వైనమూ, దాని పర్యవసానాలూ చెదురుమదురుగా కనిపిస్తూనే ఉన్నాయి. కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వచ్చినప్పుడు కొత్త తలనొప్పులు సహజమే. ఈ నేపథ్యంలో 18 ఏళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవటానికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేస్తూ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం ముసాయిదా నిబంధనలను కేంద్రం రూపొందించింది. అభ్యంతరాలు, సూచనలు వచ్చే నెల 18లోగా తెలియజేయాలని కోరింది.

డేటా పరిరక్షణ కోసం, వ్యక్తిగత గోప్యత భద్రత కోసం ఒక చట్టం అవసరమన్న సంగతిని మన పాలకులు గ్రహించటంలో అలవిమాలిన జాప్యం చోటుచేసుకుంది. పౌరుల వేలిముద్రలు, బ్యాంకు ఖాతాలతో సహా సమస్త వివరాలనూ సేకరించే ఆధార్ వ్యవస్థ తీసుకొచ్చిన ఏడెనిమిదేళ్ల వరకూ ఆ డేటా పరిరక్షణకు ఎలాంటి కట్టుదిట్టాలు అవసరమన్నది ఎవరికీ తట్టలేదు. 2017లో జస్టిస్ పుట్టస్వామి పిటిషన్‌పై ఇచ్చిన తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు వ్యక్తిగత గోప్యతను తొలిసారి ప్రాథమిక హక్కుగా గుర్తించింది. మరో ఆరేళ్ల తర్వాత 2023 ఆగస్టులో డీపీడీపీ చట్టం వచ్చింది. దాని అమలుకు సంబంధించిన నిబంధనల రూపకల్పనకు మళ్లీ ఇన్ని నెలలు పట్టింది. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్న వర్తమానంలో ఈ అంశంపై ఇప్పటికైనా ముసాయిదా నిబంధనలు రావటం హర్షించదగ్గది.

ప్రస్తుతం ఎటునుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని వాతావరణంలో ప్రపంచం మనుగడ సాగిస్తోంది. గోడలకు చెవులుంటాయన్నది పాత సామెత. స్మార్ట్ ఫోన్లకు చెవులే కాదు... కళ్లు కూడా ఉంటున్నాయి. మనం పక్కవారితో సాగించే పిచ్చాపాటీని సైతం వినే సదుపాయం ఆ ఫోన్లలో ఉంటున్నదని, మన ఇష్టాయిష్టాలు తెలుసుకోవటం, వాటి ఆధారంగా డేటా రూపొంది క్షణాల్లో ఎవరెవరికో చేరిపోవటం రివాజైందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఫోన్‌లు వినియోగించనప్పుడు సైతం వాటి కెమెరాలు కళ్లు తెరిచే సాంకేతికత ఉన్నదంటున్నారు. ఇలాంటి ఫోన్‌లు తెలిసీతెలియని వయసులో ఉన్న పిల్లలకు ఎంత చేటు తీసుకురాగలవో ఊహించటానికి కూడా భయం వేస్తుంది. అందువల్లే ఎప్పుడెప్పుడు తగిన నిబంధనలు వస్తాయా అని తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. తమ డేటా, బ్యాంకు ఖాతాల సమాచారం బయటకెలా పోతున్నదో తెలియక పెద్దలు కంగారు పడుతుంటే సామాజిక మాధ్యమాల్లో దుండగుల బారినపడి పిల్లలు తల్లడిల్లుతున్నారు. వినియోగదారుల డేటా సేకరణలో పారదర్శకతనూ, ఎందుకోసం సేకరిస్తున్నారో వెల్లడించటాన్నీ నిబంధనలు తప్పనిసరి చేస్తున్నాయి. ఒకవేళ సంస్థల అజాగ్రత్త వల్ల లేదా ఉద్దేశపూర్వక చర్యవల్ల డేటా లీకైతే ఫిర్యాదు చేయటానికి కూడా ఏర్పాట్లున్నాయి. అలాగే సంస్థల్లో డేటా సేకరణకు అనుసరిస్తున్న విధానాలను సవాలు చేయటానికి, వివరణ కోరటానికి అవకాశం ఉంది. నిబంధనల అమలును పర్యవేక్షించటానికి ప్రభుత్వం డేటా పరిరక్షణ బోర్డు (డీపీబీ) ఏర్పాటు చేస్తుంది. ఇదిగాక ప్రతి సంస్థా తమ ఖాతాదార్ల గోప్యత దెబ్బతినకుండా చూసేందుకు, వినియోగదారుల నుంచి అవసరమైన అనుమతులు పొందేందుకు డేటా పరిరక్షణ ప్రత్యేక అధికారిని నియమించుకోవటం, నిఘా పెట్టడం తప్పనిసరవుతుంది. డేటా లీక్‌ను అరికట్టడంలో విఫలమయ్యే సంస్థకు రూ. 250 కోట్ల వరకూ జరిమానా విధిస్తారు.

మొత్తంగా మనం పౌరుల డేటా పరిరక్షణలో వెనకబడినట్టే, సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాల నుంచి పిల్లల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్న విషయంలోనూ వెనకబడ్డాం. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో 137 దేశాలు చాన్నాళ్ల క్రితమే డేటా పరిరక్షణ చట్టాలు తెచ్చాయి. అమెరికాలో పదమూడేళ్లలోపు పిల్లలు ఆన్‌లైన్ వీక్షణపై కఠిన నిబంధనలున్నాయి. యూరప్‌లో పదహారేళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రుల అనుమతి అవసరం. ఆస్ట్రేలియా సామాజిక మాధ్యమాల్లో పదహారేళ్లలోపు పిల్లల ప్రవేశంపై ఇటీవలే పూర్తి నిషేధం విధించింది. మన దేశంలో లేదుగానీ... టిక్‌టాక్ వల్ల విదేశాల్లో ఎన్నో సమస్యలొస్తున్నాయి. టీనేజ్ పిల్లల్లో 58 శాతంమంది దాన్ని చూస్తున్నారని ఒక సర్వే చెబుతోంది. పసిహృదయాలకు ఉండాల్సిన అమాయకత్వం మాయమై అవాంఛనీయ పోకడలు ప్రవేశించి వారిలో విషబీజాలు నాటుతున్నాయి. తప్పుడు భావాలూ, అభిప్రాయాలూ వ్యాపిస్తున్నాయి. పిల్లల సంగతలావుంచి... పెద్దలే వాటి మాయలో పడి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆర్థికంగా కలిగే నష్టం నేరుగా కనబడుతుంది. కానీ మానసికంగా అది కలగజేసే ప్రభావం లెక్కకు అందనిది. ఇప్పుడు ఏఐ సైతం వచ్చి ప్రమాద తీవ్రతను పెంచింది. పిల్లల ముచ్చట కాదనకూడదని కార్లు, టూ వీలర్లు అందించి కొందరు తల్లిదండ్రులు పరోక్షంగా వారి చావుకు కారణమవుతున్నారు. ప్రజలకు ముప్పు కలిగిస్తున్నారు. అందువల్ల సామాజిక మాధ్యమాల్లో పొంచి వుండే ప్రమాదాలపై ముందు తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలి. పిల్లల సంరక్షణకు ఇది తప్పనిసరి.

ఇంగ్లిష్ మీడియంపై అక్కసు ఎందుకు?

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ఇంగ్లిష్ భాషా మాధ్యమం ఒక ఉపాధి విప్లవం. ఇంగ్లిష్ విద్య ఇప్పటి కచ్చిత అవసరం. అందుకే గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టిన విధానం ఎంతోమంది దళిత బడుగు వర్గాల విద్యార్థుల్లో విద్యాసక్తిని పెంచింది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే ఎంతో ఆనందానికి గురయ్యారు. కానీ దళిత బహుజనులు ఆంగ్లం నేర్చుకుంటుంటే, తెలుగు భాషోద్ధరణ పేరుతో వారికి ఆ అవకాశం లేకుండా చేయడం న్యాయం కాదు. తెలుగును అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రధాన మాధ్యమంగా ప్రవేశపెట్టాలన్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల తీర్మానం సామాజిక న్యాయానికి విరుద్ధమైనది, నిజాయితీ లోపించినది.

తెలుగు నేలలో ఈ నాలుగు దశాబ్దాల్లో అనేక సామాజిక, సాంస్కృతిక, విద్యా, భాషా పరిణామాలు చోటు చేసుకొన్నాయి. కొన్ని సామాజిక వర్గాలు హరిత విప్లవం తరువాత సంపన్న వర్గాలుగా మారాయి. ఒకనాడు జమీందారీ విధానం మీద పోరాడిన ఈ వర్గాలు ఆ తరువాత అవకాశవాదంగా బ్రాహ్మణవాద కులాధిపత్యాన్ని స్వీకరించాయి. భూమి పంపకాన్ని నిరాకరిస్తూ భూస్వామ్య గుత్తాధిపత్యంతో రాజ్యాధికారాన్ని చేపట్టాయి. అంతకుముందు వీళ్లు తెలుగు భాషకు పట్టం గట్టారు. కానీ తెలుగు విద్య వల్ల తమ పిల్లలకు ఉద్యోగ వసతి రాదనీ, అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలకు వెళ్ళి ఉద్యోగాలు సంపాదించాలంటే ఇంగ్లిష్ విద్య అవసరమనీ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పారు. ప్రభుత్వ విద్యను దెబ్బతీశారు.

ఎవరైతే తమ పిల్లలకు, మనవళ్ళకు బుద్ధిపూర్వకంగా తెలుగు రాకుండా చేసి వారి దేశీయత మీద గొడ్డలివేటు వేశారో, వారే మొన్నటి ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో తెలుగును అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రధాన మాధ్యమంగా ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. కానీ దీన్ని తెలుగు మీద ప్రేమ అనలేము. 'భూస్వామ్య ఆధిపత్యానికి కూలీలు ఎవరు దొరుకుతా'రనే భావనతోనే బడుగులకు తెలివిగా ఆంగ్ల మాధ్యమ నిరాకరణ జరుగుతోంది.

నిజానికి మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, అంబేడ్కర్ లాంటివాళ్లు భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక వహించడానికి వారి ఇంగ్లిష్ విద్యే కారణం. అంబేడ్కర్. భారత రాజ్యాంగంతో పాటు, వేలాది పేజీలు వివిధ అంశాలపై రాయడం ఆయన ఆంగ్ల భాషా అధ్యయనం వల్లే జరిగింది. ఆంగ్ల భాషాధ్యయనం వల్లే రాజా రామ్‌మోహన్ రాయ్ సతీసహగమన దురాచారానికి ఎదురు తిరగగలిగారు. రవీంద్రనాథ్ టాగూర్ శాంతినికేతనం స్థాపించి, నోబెల్ బహుమతి గ్రహీత కాగలిగారు. దీని వెనుక ఇంగ్లిష్ పునరుజ్జీవన ఉద్యమ అధ్యయనం ఉంది. ఇంగ్లిష్ విద్య ఇప్పటి కచ్చిత అవసరమనే విషయం అందరూ తెలుసుకోవాలి. దాన్ని అందిపుచ్చుకుంటూ దళిత బహుజనులు కూడా ఆంగ్లం నేర్చుకుంటుంటే, తెలుగు భాషోద్ధరణ పేరుతో వారికి ఆ అవకాశం లేకుండా చేస్తున్నారు.

నిజానికి పోయిన ఐదేళ్ళలో ఆంధ్ర రాష్ట్రంలోని స్కూళ్ళల్లో ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టిన విధానం ఎంతోమంది దళిత బడుగువర్గాల విద్యార్థుల్లో విద్యాసక్తిని పెంచింది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే, చదువుతుంటే ఎంతో ఆనందానికి గురయ్యారు. ఒక సబ్జెక్టుగా తెలుగు అన్ని పాఠశాలల్లో ఉంది. తెలుగును ఆ సబ్జెక్టు నుండి అభివృద్ధి చేయవచ్చును. ప్రతి విద్యార్థికి నూరు పద్యాలు కంఠతా వస్తేనే



ఆ విద్యార్థికి పదో తరగతి సర్టిఫికెట్ ఇవ్వండి అని 'దళిత మహాసభ' సలహా ఇవ్వడం జరిగింది. అయితే ఇప్పుడు భాషోద్ధరణకు సభలు పెట్టినవాళ్ళే ప్రైవేట్ స్కూళ్ళను, కార్పొరేట్ స్కూళ్ళను నెలకొల్పారు. అందులో రెండవ భాషగా సంస్కృతాన్ని పెట్టి అసలు పిల్లలకు తెలుగే రాకుండా చేశారు. తెలుగు పరిశోధన మీద గొడ్డలి వేటు వేసిన ఈ పాలకులే తెలుగు భాషోద్ధరణకు పూనుకుంటున్నామనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దళిత బహుజన వర్గాలు ఆంగ్ల విద్య నేర్చుకుని వారు కూడా ప్రపంచ దేశాలకు వెళ్ళే అర్హతను సంపాదిస్తారేమో అనే భయం వీరిని వెంటాడుతున్నట్టుంది.

ఒకనాటి చంద్రబాబు ప్రభుత్వంలోనే 56 సంస్కృత కళాశాలలను రద్దుచేసి ఆ కళాశాలల్లోని తెలుగు పండితుల పొట్ట కొట్టారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో తెలుగు శాఖలను నిర్వీర్యం చేసి తెలుగు భాషా సాహితీ కవితా పరిశోధనల వెన్ను విరిచారు. ఆధిపత్య కులాలు ఏ సబ్జెక్టును చదవడం లేదో గుర్తించి వాటన్నింటినీ నిర్వీర్యం చేశారు. ఒక్క తెలుగునే కాకుండా వృక్షశాస్త్రాన్ని, జంతుశాస్త్రాన్ని, భౌగోళిక శాస్త్రాన్ని, భౌతికశాస్త్రాన్ని, రసాయన శాస్త్రాలను దెబ్బ తీసి ఐటీ సెక్టారుకు ఉపయోగపడే బీటెక్, ఎంటెక్‌లకే ప్రాధాన్యం ఇచ్చారు.

మానవ వ్యక్తిత్వంలోని జీవశక్తిని దెబ్బతీశారు. కుటుంబ సంబంధాలన్నీ నాశనం అయినాయి. తమ సామాజిక వ్యవస్థలను గుర్తించకుండా దేశం అంతా నాశనం అయిపోయిందని గగ్గోలు పెడుతున్నారు. నిజానికి ఇది స్వీయ వ్యక్తిత్వ దహనం నుండి వస్తున్న ఆక్రోశం. దళిత బహుజనుల వికాసంపైన ద్వేషానలం. ఈ హిపోక్రసీని అర్థం చేసుకోలేనంత అవిద్యలో దళిత బహుజనులు లేరు.

ఏ పోరాటానికైనా నిజాయితీ ఉండాలి. అన్ని వర్గాల అభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని కాంక్షించాలి. రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉండాలి. తమ కులాలే పైకి రావాలి అనేవారు సామాజిక సంస్కర్తలు కాలేరు. ఎంత అత్యున్నతమైన స్థాయికి వెళ్ళినా ఆలోచనల్లో విస్తృతి, సామాజిక విప్లవ భావన లేకపోతే వేదికలు మాత్రమే పెద్దవిగా ఉంటాయి; ఆలోచనలు సంకుచితంగానే కనబడతాయి. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి అందరూ సంతాపం తెలపడమే కాక ఆయన తీసుకొచ్చిన 'సరళీకరణ' దేశాభివృద్ధిని పొగిడారు. ఈ సరళీకరణలో దేశ ప్రజలు భాగస్వాములు కావాలంటే 'ఇంగ్లిష్ విద్య అందరికీ రావాలి' అనే భావన అందులో దాగివున్న విషయం మరచిపోయారా? కొన్ని సామాజిక వర్గాల్లో సంస్కర్తలు, సామాజిక విప్లవకారులు తగ్గుతున్నారు. కారణం అట్టడుగు వర్గాల జీవన వ్యవస్థల అభివృద్ధే దేశాభివృద్ధి అని తెలుసుకోలేక పోతున్నారు.

మానవ పరిణామశాస్త్రం అన్ని జీవుల్లో మానవజాతే గొప్పదని నిగ్గుతేల్చింది. మౌఖిక జీవన వ్యవస్థలన్నీ లిఖిత జీవన వ్యవస్థలుగా పరిణామం చెందుతున్న దశ ఇది. ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారిపోతోంది. విద్య అనేది జ్ఞానం, సంస్కృతి, నాగరికత, చరిత్ర, ఉత్పత్తి, ఉత్పత్తి పరికరాలను సృష్టించుకుంటూ వెళ్తుంది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు విస్తరించి ఉన్నారు. ఆ యా వృత్తుల్లో ఆ యా జీవన వ్యవస్థల్లో, ఆ యా దేశ పాలనల్లో వీరు భాగస్వాములౌతున్నారు. దానికి ఆంగ్ల విద్య ఎంతో తోడ్పడిందనేది చారిత్రక సత్యం. అందుకే దేశంలో మెజారిటీగా ఉన్న దళిత, బడుగు వర్గాలకు ఆంగ్ల విద్యను నేర్పడం అవసరం. దీనివల్ల వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుంది. అంతిమంగా దేశానికే మేలు కలుగుతుంది. జీడీపీ పెరుగుతుంది. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. దేశీయ ఎగుమతులు పెరుగుతాయి.

ఏ ప్రభుత్వానికైనా పోయిన ప్రభుత్వాల విధానాలనన్నింటినీ రద్దు చేయాలనే భావన మంచిది కాదు. పాలకులు మారుతూ ఉంటారు. కానీ మంచి విధానాలను ముందుకు తీసుకువెళ్లాలి. ప్రజల్లో ఎంతో చైతన్యం ఉన్న కాలం ఇది. ఇంగ్లిష్ మీడియంపై ప్రభుత్వం చర్య తీసుకొనే పక్షంలో, అన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళను ఒకే విధానంలోకి తేగలరా? ఒకసారి సామాజిక న్యాయ కోణంలో, దళిత, బహుజనుల మేలును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు ఆలోచించాల్సిన బాధ్యత ఉంది. ఇంగ్లిష్ భాషా మాధ్యమం ఒక ఉపాధి విప్లవం. తెలుగు భాషాభివృద్ధి ఒక జీవన సంస్కృతి. ఈ రెండింటిని కలిపి తీసుకెళ్ళడమే దళిత బహుజన సామాజిక తాత్విక ఆలోచన క్రమం. ఇది పూలే, అంబేడ్కర్ బాట. ఆ బాటలో నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ మీడియా

తీవ్రమైనది కాదు!



హెచ్‌ఎంపీవీ అనేది కొత్త వైరస్ ఏమీ కాదు. అలాగే చలికాలంలో వచ్చే ఫ్లూ కంటే ఎక్కువ తీవ్రమైనది అనడానికి ఆధారాలూ లేవు. ఇండియాలో మొదటి కేసు నమోదయ్యిందని వార్తొలొచ్చినప్పటికీ, ఆందోళన చెందాల్సిన పనేమీ లేదు.

– విజయానంద్, డేటా అనలిస్ట్

బాధ్యత లేని దేశం



పేదదేశం కాబట్టీ, నిరక్షరాస్యులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోరు కాబట్టీ ఇండియా మురికిగా ఉంటుందనుకోవడం తప్పుడు భావన. పదిహేనేళ్లుగా నేను ముంబయిలో కొన్ని మారథాన్స్‌లో పాల్గొన్నాను. ఇందులో పాల్గొనే వాళ్లంతా ఉన్నత మధ్యతరగతి, ధనిక వర్గాలే. కార్పొరేట్ కంపెనీల్లో లక్షల జీతాలు ఆర్జించేవాళ్లే. అయినా మారథాన్ ముగిసిన తర్వాత వాటర్ బాటిల్స్, ఫుడ్ ప్యాకెట్లు, ఖాళీ ఎనర్జీ డ్రింకుల క్యాన్లు ఎక్కడంటే అక్కడ రోడ్డు మీద కనబడతాయి. ప్రాథమికంగా మనకు బాధ్యతగా ఉండటం తెలీదు.

– హార్దిక్ రాజ్‌గోర్, సినీ రచయిత

వాళ్లతోనే సమస్య



భారతీయులు తమ పని తాము చేసుకుంటారు. దేశ (అమెరికా) ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో తోడ్పడుతారు. వాళ్ల వల్ల ఏ సమస్యా లేదు. కానీ వీధుల్లో పెరుగుతున్న అతివాదం పట్ల, విద్యా వ్యవస్థ మీద పట్టుబిగిస్తున్న వారి పట్ల ఏ పట్టింపూ చూపనివారితోనే సమస్యంతా!

– ఎలికా లే బాన్, యాక్టివిస్ట్

అసలు మహమ్మారులు



ప్రేమ లేకుండా చేసే వంట, ప్రేమ లేని పెళ్లిలో ఉండటం, ప్రేమ లేకుండా పనిచేయడం అనేవి ఆధునిక జీవితంలో నిశ్శబ్ద మహమ్మారులు.

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

అసలైన అర్థం



మీరు మతం కోసం మాత్రమే అన్వేషిస్తే కేవలం దేవుడి భావన దొరుకుతుంది. అదే జీవితపు అర్థం ఏమిటని అన్వేషిస్తే దేవుడు దొరుకుతాడు.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

ఇన్ బాక్స్

జాగ్రత్త సుమా!

చైనాలో తాజాగా వైరస్ వ్యాప్తితో ఊపిరి తిత్తుల సంబంధిత వ్యాధి రోగులు తామరతంపరగా పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎప్పటిలాగే ఆ దేశం వాటిపై నిఖార్సయిన సమాచారం ఇతర దేశాలతో పంచు కోకపోవడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్ఎంపీవీ) కారకంగా తెలియవస్తోంది. అదే వైరస్ కేసులు ఇతర ప్రపంచ దేశాల్లో కూడా రిపోర్ట్ అవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియ జేసింది. భారత్‌లో బెంగళూర్‌లో 2 కేసులు బయట పడ్డాయి. అయితే వాటికీ, చైనాలో కేసులకూ సంబంధం లేదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్మార్) ప్రకటించింది. అది ఊరట.



హ్యూమన్ మెటాన్యూమోవైరస్

ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండడం అవసరం. కోవిడ్ వ్యాప్తిలో జరిగిన అనుభవాల ఆధారంగా కొంత జాగ్రత్త పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వైరస్ వ్యాప్తి పట్ల సమాచారం వెంటవెంటనే అందజేసేటట్లు చూడాలి. చైనా, ఇతర దేశాల్లో పరిస్థితుల్ని దగ్గరగా గమనించాలి. ప్రజా ఆరోగ్య విభాగాల్ని, సంబంధిత యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలి. ఆక్సిజన్ నిల్వలు, సిబ్బంది, సపోర్ట్ సిస్టమ్‌లను రెడీ చెయ్యాలి. వీటన్నింటి కన్నా ముఖ్యంగా వ్యాప్తి నివారణఅంశాలపై దృష్టి పెట్టాలి. మాస్కుల వినియోగం, చేతుల శుభ్రత, గుంపుల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కలిగించాలి. కరోనా సమయంలో పాటించిన జాగ్రత్తలను ప్రజా సమూహాలు మళ్లీ అలవర్చుకోవాలి.

ముఖ్యమైన విషయమేమిటంటే ఈ హెచ్ఎమ్‌పీ వైరస్ కొత్తది కాదు... ప్రమాదకరమైనది కాదు. 2001 నుండి తెలిసిందే. పిల్లల్లో శ్వాస సంబంధిత వ్యాధుల్లో 12 శాతం దీని వల్లే వస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్ళలో ప్రమాదకరంగా మారవచ్చు అన్న ఉద్దేశ్యంతో జాగ్రత్త పడాలి. శీతకాలంలో సహజంగానే వైరస్ వ్యాప్తి ఎక్కువ. కాబట్టి కేసులు ఎక్కువ కనబడ తాయి. నివారణ జాగ్రత్తలతో వ్యాప్తిని వీలైనంత తగ్గిస్తే వ్యాధి భారం సమాజంలో తగ్గుతుంది. ఆ కోణంలోనే ఆలోచించి, తదనుగుణంగా ఆచరిస్తే సరిపోతుంది. భయం అక్కర లేదు. బాధ్యత ఉంటే చాలు.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ । 94408 36931

యూరప్‌లో శాంతి తక్షణావసరం

అభిప్రాయం



బుడ్డిగ జమిందార్

ఒకప్పుడు ఉక్రెయిన్ తుది విజయం వరకూ మద్దతునిద్దామనే పశ్చిమ దేశాల ప్రజల అభిప్రాయం ఇప్పుడు క్రమేపీ తగ్గుతోంది. యూగోవ్ సర్వే సంస్థ తాజాగా జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, స్వీడన్, డెన్మార్క్, యూకేలలో ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. ఈ ఏడు దేశాల ప్రజలు సంవత్సరం క్రితం ఇచ్చిన మద్దతుకు కట్టుబడి లేరు. ఉక్రెయిన్‌కు మద్దతునిచ్చే వారి సంఖ్య స్వీడన్‌లో 57 శాతం నుంచి 50 శాతానికి, యూకేలో 50 శాతం నుంచి 36 శాతానికి, డెన్మార్క్‌లో 51 శాతం నుంచి 40 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో శాంతి చర్చల ద్వారా ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం వెతకాలనే వారి సంఖ్య ఇటలీలో 45 శాతం నుంచి 55 శాతానికి, స్పెయిన్‌లో 38 నుంచి 46 శాతానికి, ఫ్రాన్స్‌లో 35 నుంచి 43 శాతానికి, జర్మనీలో 38 నుంచి 45 శాతానికి పెరిగింది.

జనవరి 20 నాడు అమెరికా అధ్యక్ష అధికార పగ్గాలు చేపట్టనున్న ట్రంప్ ఉక్రెయిన్‌కు మద్దతు ఉపసంహరించుకొనే అవకాశాలు ఉన్నాయని 62 శాతం జర్మనీ ప్రజలు, 60 శాతం స్పెయిన్ వాసులు, 56 శాతం బ్రిటన్ ప్రజలు, 52 శాతం ఫ్రెంచ్ జనాలు అభిప్రాయపడ్డున్నారని యూగోవ్ వెల్లడించింది.

ఉక్రెయిన్ – రష్యాల మధ్య యుద్ధం ప్రారంభమై మూడేళ్లు నిండనున్నాయి. ఆర్థిక ఆంక్షలతో రష్యాను అదుపులోకి తెచ్చుకోవచ్చునని రష్యాపై ఆంక్షలు విధించిన పశ్చిమ దేశాల అంచనాలకు విరుద్ధంగా రష్యా చమురు వాణిజ్యంతో ఆర్థిక వ్యవస్థను సుస్థిరంగానే ఉంచుకొంది. రష్యాపై ఆంక్షలు విధించిన పశ్చిమ దేశాలే ఆర్థికంగా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఆ యా దేశాల్లో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో ఫ్రాన్స్, జర్మనీ, యూకే, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ప్రభుత్వాలు పతనమైపోతున్నాయి. డిసెంబర్ ప్రారంభంలో ఫ్రెంచ్ ప్రధాని మైకెల్ బార్నియర్ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానంలో నెగ్గలేక కూలిపోయింది. జర్మన్ ఛాన్సలర్ షోల్జ్ తన ఆర్థిక మంత్రిని బర్తరఫ్ చేయటంతో 3 సంవత్సరాల సోషల్ డెమాక్రాట్స్–గ్రీన్స్–ఫ్రీ డెమాక్రటిక్ పార్టీల కూటమి ప్రభుత్వం పడిపోయింది. ఓక్స్ వాగెన్, ఆడీ వంటి అనేక కార్ల కంపెనీలు మూత పడుతున్నాయి. దీనికి తోడు పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు జర్మనీ మద్దతు కూడా జర్మనీ ప్రజలు స్వాగతించటం లేదు.

బ్రిటన్‌లో 22 నెలలు ఏలిన కన్సర్వేటివ్ ప్రధాని రిషి సునాక్ రాజీనామా చేసి ఎన్నికలకు పిలుపునివ్వగా లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. దక్షిణ కొరియాలో అధ్యక్షుడు యూన్ సుక్ అవినీతి ఊబిలో కూరుకుపోయి, నేషనల్ అసెంబ్లీ తీర్మానాలను తన వీటో ద్వారా నిరోధించటంతో జనాగ్రహానికి గురై రాజీనామా చేయక తప్పలేదు. పశ్చిమాసియాలో గాజాపై



యుద్ధం చేయిస్తూ 50 వేల వరకూ సామాన్య ప్రజల్ని చంపిన ఇజ్రాయెల్‌కు మద్దతు పలికిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ట్రంప్ చేతిలో ఓటమి చెందారు.

2023లో ఉక్రెయిన్ విషయంలో బైడెన్ తప్పుడు నిర్ణయం తీసుకొన్నారని అధ్యక్షునిగా ఎన్నికైన ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. సుదీర్ఘ కాలం పాటు యుద్ధం జరిగేలా చేసి... రష్యా, ఉక్రెయిన్ ప్రజలు ఒకరినొకరు చంపుకునేలా చూడటమే పశ్చిమ దేశాల లక్ష్యంగా ఉంది. అమెరికా ప్రత్యర్థి రష్యాను బలహీన పర్చటమే తమ ధ్యేయమని, అన్ని రంగాలలో నిర్వీర్యం చేస్తామని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇప్పటికే అనేకసార్లు ప్రకటించారు. రష్యాతో నాటో దేశాలు దౌత్య సంబంధాల్ని తెగతెంపులు చేసుకొన్నాయి. రష్యా సంపదను కొల్లగొట్టి దేశాన్ని ముక్కలు ముక్కలు చేయటమే అమెరికా ధ్యేయం.

యుద్ధం ప్రారంభంలో శాంతి ఒప్పందాలకు ఉక్రెయిన్–రష్యాలు అంగీకరించాయని టర్కీ, ఇజ్రాయిల్ తెలిపాయి. రష్యా యుద్ధం విరమిస్తే, ఉక్రెయిన్ తటస్థ దేశంగా నాటో సభ్యత్వాన్ని కోరదనేది సారాంశం. అయితే అప్పటి యూకే ప్రధాని జాన్సన్ ఆఘమేఘాలపై కీవ్ వెళ్లి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఒప్పందానికి దూరంగా ఉంచగలిగాడు. 9 ఏళ్ల క్రితం జరిగిన మిన్‌స్కు ఒప్పందాన్ని పశ్చిమ దేశాలు ఎప్పుడూ గౌరవించలేదు. ఉక్రెయిన్ మిలిటరీ పరంగా బలం పుంజుకోటానికే మిన్‌స్కు ఒప్పందాన్ని ఎర వేశామని సాక్షాత్తు ఒకప్పటి జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్ ప్రకటించారు కూడా. ఫ్రాన్స్ కూడా ఈ ఒప్పందానికి కట్టుబడి లేమని ఒప్పుకొంది. నాటో దేశాలు యుద్ధానికే మొగ్గు చూపాయని టర్కీ విదేశాంగ మంత్రి, ఇజ్రాయెల్ మాజీ ప్రధాని కూడ తెలియజేశారు. లిండేగ్రాహం వంటి అమెరికా కాంగ్రెస్ సభ్యుడు 'చివరి ఉక్రేనియన్' వరకూ రష్యాతో పోరాటానికి బహిరంగ మద్దతు ఉంటుందని, 'అమెరికా ప్రాణాలను పణంగా పెట్టకుండా ఉక్రెయిన్‌కు ఆయుధ సహాయం చేయటం అమెరికా 'తెలివైన పెట్టుబడి' అని అన్నారు.

ఉక్రెయిన్‌లో ఏ ప్రాంత ప్రజలు కూడా నిరంతర యుద్ధానికి మద్దతు పలకటం లేదు. ఒకప్పుడు ఉక్రెయిన్ నాయకుల విజయంపై ఉన్న ఆశలను నేడు క్రమేపీ వదులుకొంటున్నారు. తాజా సర్వేల్లో ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీపై భ్రమల్ని ప్రజలు వదులుకుంటున్నారు. ఉక్రెయిన్ ఫ్రంట్‌లైన్‌లు కుప్పకూలిపోతున్నాయి. నాటో భౌగోళిక విస్తరణకు ఉక్రెయిన్ భారీ మూల్యం చెల్లిస్తున్నది. సంఘర్షణ ఎంత ఎక్కువ కాలం కొనసాగితే ఉక్రెయిన్ ప్రజలు మరిన్ని ప్రాణ నష్టాలతో, ఆర్థిక నష్టాలతో అంత ఎక్కువ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది. ఈ స్పష్టతతో పశ్చిమ దేశాల వ్యూహం భవిష్యత్తులో విఫలమవుతుంది. రష్యాపై ఉక్రెయిన్ శత్రు వైఖరిని విడిచిపెట్టినప్పుడు మాత్రమే యుద్ధం ముగుస్తుంది. రష్యా కూడా శాంతి మార్గాలు వెతకాలి.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, కేఎల్ యూనివర్సిటీ । 98494 91969

వారిద్దరూ వేరుకాదు!

భారతీయ భక్తి ఉద్యమంలో కబీరు దాసు స్థానం చెరగనిది. రామ్–రహీమ్‌లకు అభేదం చెప్పిన యోగి పుంగవుడు. ఒక పరమ శక్తికి గల రెండు నామాలే రాముడు, రహీమ్ అన్నాడాయన. చిన్నప్పటి నుంచీ తాత్విక ధోరణితో ప్రపంచాన్ని చూసేవాడు. ఓసారి కబీరు ఓ స్త్రీ తిరగలిలో జొన్నలు వేసి తిప్పుతున్న దృశ్యాన్ని చూసి కలవరానికి గురయ్యాడు. శిశువులా ఏడ్చాడు. అదే సమయానికి ఓ సాధువు అటువైపుగా వచ్చి ఏడవడానికి గల కారణం ఏమిటని అడిగాడు. అప్పుడు కబీరు తాను చూసిన దృశ్యాన్ని చెప్పి... 'జొన్నలు పిండిగా మారుతున్నట్లే జీవులన్నీ మృత్యువాత పడుతున్నాయి. ఈ మృత్యు తిరగలి నుండి బయటపడే మార్గం చెప్తారా' అని అడిగాడు. కబీరు వైరాగ్యాన్ని గ్రహించిన సాధువు 'దిగులు పడకు నాయనా! ఆశించే మనసుండాలి గాని అనుభవించడం తథ్యం. నువ్వు చూసిన దృశ్యాన్ని మరొక్కసారి తదేకంగా చూడు నాయనా... తిరగలిలో పడిన జొన్నలన్నీ పిండి కావడం లేదు. కొన్ని తిరగలి మధ్య ఉన్న కొయ్య మేకు చుట్టూ చేరుకున్నాయి. అవి తిరగలిలో పడి పిండి గాకుండా నిలిచిపోతున్నాయి. అలాగే సంసారమనే తిరగలిలో పడ్డా... ఎవరైతే భగవానుడనే మేకును ఆశ్రయిస్తారో వారు మృత్యువాత పడరు' అన్నాడు.



జ్యోతిర్మయం

ఆ మహాత్ముని దివ్యబోధతో కబీరు ప్రభావితుడై భగవన్నామామృత పానమే తన దినచర్యగా మార్చుకుంటాడు. ఇతరులను మోసగించడం కన్నా ఇతరులతో మోసగింపబడటమే శ్రేయోదాయకం అనేది కబీరు అభిప్రాయం. మోసగించడంలో అశాంతి మిగులుతుందని చెప్పిన కబీరు మోసగించబడటంలో శాంతి కలుగుతుందని అన్నాడు. బంగారం గిట్టనివాడూ, కాంతను ముట్టనివాడూ నిజమైన సాధువనీ, తాను అతని పాదధూళి వంటి వాడననీ కబీరు చెప్తుండేవాడు. కబీర్‌దాస్ రాసిన దోహాలు సామాన్య మానవునికి కూడా అర్థమయ్యే విధంగా ఉండేవి.

ధనహీనులకు రామనామమే ధనమని చెప్పిన కబీరు... తాను జీవించడమే కాకుండా తోటి వారిని కూడా సన్మార్గంలో నడిపించాడు. భగవన్నామంలో కబీరు విశ్వాసం మేరుపర్వతం వంటిది. సంపూర్ణ శరణాగత మార్గంలో జీవితం గడిపిన కబీరు భగవన్నామ ప్రభావం తెలుసుకున్న భక్తులకు ప్రాణం ఇవ్వడానికైనా తాను సిద్ధమని చెప్పుకునేవాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.అష్టమి సా.4.34 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** రేవతి సా.6.24 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.7.13 నుండి 8.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.32 వరకు, తదుపరి రా.10.47 నుండి 11.41 వరకు, **అమృత ఘడియలు:** సా.4.10 నుండి 5.36 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.36.

ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

- ప్రజలకు మంచి చేస్తే కూడా విమర్శిస్తున్నారు: పొంగులేటి
- కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఆంబోతులను పంపుతున్నారు



ఎలక్ట్రిక్ బస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

హనుమకొండ అర్బన్/ నయీంనగర్ : ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారికి పార్టీతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలకు మంచి చేస్తే కూడా ఓర్వలేక ప్రతిపక్షాల నేతలు విమర్శిస్తున్నారని ఆయన తెలిపారు. సోమవారం హనుమకొండ కుడా మైదానంలో వరంగల్ రీజియన్‌కు కేటాయించిన టీజీఆర్టీసీ 50 ఎలక్ట్రిక్ బస్సులను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి పొంగులేటి ప్రారంభించారు. అదేవిధంగా హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం కుట్రపూరితంగా ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయాలని చూసిందని, కానీ ఇందిరమ్మ రాజ్యంలో పరిపుష్టం చేసి, కార్మికులకు భద్రత కల్పించామన్నారు. ధరణిని ప్రక్షాళన చేసి కొత్త చట్టం తీసుకువచ్చామని, దీనిద్వారా తెలంగాణలో ఉన్న 2 కోట్ల 77లక్షల ఎకరాల ఆసాములకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కనీసం లక్ష ఇళ్లు కూడా నిర్మించలేదని, తమ ప్రభుత్వంలో మొదటి విడతగా 4.50 లక్షల ఇళ్లు ఇస్తున్నామన్నారు. మిగతా నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను కూడా పూర్తి చేసి పంపిణీ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులు ఉంటే మండల కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఆంబోతులను పంపుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు గతంలో తొంటి ఇరుగుడు నిజమా అబద్ధమా తెలియదు.. కానీ ఇప్పుడు అసెంబ్లీకి రావడానికి ఏమైందని ఆయన ప్రశ్నించారు. సాగు చేసే ప్రతీ భూమికి రైతు భరోసా ఇస్తామన్నారు.

అందాలు 'ఏరు'కొందామా..



భద్రాచలంలోని గోదావరి తీరాన ఏర్పాటుచేసిన క్యాంప్ సైట్



ఐటీడీఏలోని గిరిజన మ్యూజియం ప్రాంగణంలో సిద్ధమవుతున్న గిరిజన పల్లె

ఎకో–టెంపుల్ టూరిజంలో భాగంగా భద్రాచలంలో 'ఏరు' పేరుతో రివర్ ఫెస్టివల్

- 9, 10, 11 తేదీల్లో నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు
- ముక్కోటి ఏకాదశిన దైవదర్శనానికి వచ్చే భక్తులను ఆకర్షించేలా ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎకో టూరిజం .. ఈ పేరు వినగానే తెలుగు రాష్ట్రాల్లో పాపికొండలు, అరకు వంటి ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రాంతాలే మనకు గుర్తొస్తాయి. అందుకే ఆయా ప్రాంతాలకే ఎక్కువ మంది టూరిస్టులు క్యూ కడుతుంటారు. కానీ పర్యాటకులకు ప్రకృతి పర్యాటకానికి అసలైన నిర్వచనం ఇచ్చేందుకు.. అచ్చమైన తెలంగాణ గిరిజన సంస్కృతిని పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త థీమ్‌తో ముందుకొచ్చింది. ఎకో–టెంపుల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా భద్రాచలం, పరిసర ప్రాంతాలను కలుపుతూ ఏరు–2025 ది రివర్ ఫెస్టివల్ పేరిట వేడుకలు నిర్వహించనుంది. ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి రామయ్య దర్శనానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారిని ఆకర్షించేలా ఈ నెల 9, 10, 11 తేదీల్లో రివర్ ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టింది. భద్రాచలంతోపాటు పర్ణశాల, బొజ్జిగుప్ప, కిన్నెరసాని, కనకగిరి (చండ్రుగొండ) గుట్టలకు పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాల కోసం ఏర్పాట్లు చేస్తోంది.

ఏమిటీ రివర్ ఫెస్టివల్ ప్రత్యేకత..

గోదావరి గలగలల చెంతన (కరకట్ట **వెంబడి**) ప్రత్యేక గుడారాలతో కూడిన క్యాంపింగ్ సైట్.. భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన పల్లె సంస్కృతిని ప్రతిబింబించేలా పూర్తిగా వెదు**రు, గడ్డితో** గుడిసెలు, **మంచెల** ఏర్పాటు.. **బోటింగ్ సదు**పాయం.. సాయంత్రం 5 నుంచి 7 గంటల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలు పర్యాటకులను అలరించనున్నాయి. అలాగే కొండలు, గుట్టల వద్ద సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. మరింతగా పల్లె వాతావరణం కోరుకొనే వారి కోసం భద్రాచలానికి 17 కి.మీ. దూరాన ఉన్న బొజ్జిగుప్ప అనే గిరిజన గ్రామంలో మరో వేదిక సిద్ధం చేస్తున్నారు. అక్కడకు చేరుకొనే అతిథులకు గిరిజన సం**ప్రదాయ రీతిలో** స్వాగతం పలి**కేలా గ్రామ**స్తులకు శిక్షణ **సైతం ఇ**చ్చారు. అలాగే **తాటి** మొద్దులతో **సిద్ధం** చేసిన డయాస్‌పై కొమ్ము, కోయ నృత్యాలతో పర్యాటకులను వారు అలరించనున్నారు. ఈ **వేదిక**కు సమీపాన **తామర** పూలతో నిం**డిన చెరువు**లో బోటింగ్, **ఫిషింగ్‌కు ఏర్పా**ట్లు చేశారు.

ఆకులు, దుంపలతో వంటకాలు..

ఆకులు, దుంపలు, చిరుధాన్యాలతో వంటకాలు.. గిరిజన తెగలకు చెందిన ఆచార వ్యవహారాలు, పనిముట్లు, అలంకరణ గురించి పర్యాటకులకు అవగాహన కల్పించేలా ఐటీడీఏ క్యాంపస్‌లోని గిరిజన మ్యూజియాన్ని తీర్చిదిద్దుతున్నారు. స్థానిక గిరిజనులు సేకరించిన తేనె, కరక్కాయ, ఇప్పపూలు తదితర అటవీ ఉత్పత్తులు అమ్మనున్నారు. అడవుల్లో దొరికే, పోషక విలువలు సమృద్ధిగా ఉండే ఆకులు, దుంపలు, చిరుధాన్యాలతో గిరిజనులు చేసిన వంటలను ప్రత్యేకంగా పర్యాటకులకు వడ్డించనున్నారు.

రామయ్య నిజరూప దర్శనం



భద్రాచలం: వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారు.. సోమవారం నిజరూపమైన రామావతారంలో దర్శనమిచ్చారు. సీతా లక్ష్మణ సమేతుడైన రామయ్యకు భక్త రామదాసు చేయించిన ఆభరణాలను అలంకరించి భక్తుల దర్శనార్థం మిథిలా స్టేడియంలోని వేదికపై కొలువుదీర్చారు. కాగా, మంగళవారం స్వామివారిని బలరామావతారంలో అలంకరించనున్నారు.

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
విదేశీ మారక విభాగం
6-1-56, సెక్రటేరియట్ రోడ్, సైఫాబాద్, హైదరాబాద్-500 004

పూర్తి స్థాయి మనీ ఛేంజర్ (ఎఫ్.ఎఫ్.ఎం.సి) లైసెన్స్ రద్దు

ఫారిన్ ఎక్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్, 1999 యొక్క సెక్షన్ 10(3) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ దిగువ పేర్కొనబడిన కంపెనీల పూర్తి స్థాయి మనీ ఛేంజర్ (ఎఫ్.ఎఫ్.ఎం.సి) లైసెన్సులను, వారి లైసెన్స్ పునరుద్ధరణకు దరఖాస్తు చేయనందువలన మరియు స్వచ్ఛంద సమర్పణ కారణంగా రద్దు చేసినది.

క్ర. సం.	పేరు మరియు రిజిస్టర్ ఆఫీస్ యొక్క చిరునామా	లైసెన్స్ నంబర్	జారీ చేయబడిన తేదీ	రద్దు ఆర్డర్ తేదీ
1	వెస్టర్న్ ట్రావెల్ అండ్ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వే నం. 43, అల్కాపూర్ టౌన్‌షిప్, ఖాజాగూడ రోడ్, మణికొండ, రంగారెడ్డి - 500 089	HYD-FFMC-0354-2023	26.12.2023	12.12.2024
2	హనుమకొండ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇ. నం. 5-9-116, సి - 37 ఎల్. బి. రోడ్, హనుమకొండ, వరంగల్ - 506 013	FE.HY.FFMC/171/2019-2020	01.04.2022	12.12.2024

ఎఫ్.ఎఫ్.ఎం.సి లైసెన్సు రద్దు చేయబడిన కారణంగా పైన పేర్కొనబడిన కంపెనీలు, 1 జనవరి 2016 తేదీ నాటి మాస్టర్ డైరెక్షన్ - ద్రవ్య మార్పిడి కార్యకలాపాలు (ఎప్పటికప్పుడు మార్పు చేయబడినవి మరియు ఆర్‌బిఐ వెబ్‌సైట్ https://www.rbi.org.in నందు లభించును) లో నిర్దేశించిన ద్రవ్య మార్పిడి కార్యకలాపాలను చేపట్టరాదు.

ప్రదేశం: హైదరాబాద్
తేది: జనవరి 07, 2025

సం/-
(ప్రియాంక్ బహుగుణ)
డిప్యూటీ జనరల్ మేనేజర్

भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
विदेशी मुद्रा विभाग
6-1-56, सचिवालय मार्ग, सैफाबाद, हैदराबाद–500 004

संपूर्ण मुद्रा परिवर्तक के लाइसेंस को रद्द किया जाना

विदेशी मुद्रा प्रबंधन अधिनियम- 1999 की धारा 10(3) के अंतर्गत प्रदान किए गए अधिकारों का प्रयोग करते हुए भारतीय रिज़र्व बैंक ने निम्नलिखित कंपनियों के संपूर्ण मुद्रा परिवर्तक (एफएफएमसी) लाइसेंस को क्रमश: इसकी वैधता अवधि समाप्त होने से पहले लाइसेंस नवीनीकरण के लिए आवेदन नहीं करने एवं, लाइसेंस के स्वैच्छिक समर्पण के कारण निरस्त कर दिया है-

क्र. सं.	नाम और पंजीकृत कार्यालय का पता	लाइसेंस संख्या	जारी करने की तारीख	निरस्तीकरण की तारीख
1	वेस्टर्न ट्रैवल एंड फॉरेक्स प्राइवेट लिमिटेड एसवाई नंबर 43, अल्कापुर टाउनशिप खाजागुडा रोड, मणिकोंडा, रंगारेड्डी-500 089	HYD-FFMC-0354-2023	26.12.2023	12.12.2024
2	हनमकोंडा फॉरेक्स प्राइवेट लिमिटेड घ.सं .5-9-116, सी-37, एल. बी. रोड, हनमकोंडा, वारंगल-506 013	FE.HY.FFMC/171/2019-2020	01.04.2022	12.12.2024

निरस्ती के परिणामस्वरूप, उपरोक्त कंपनियां मुद्रा परिवर्तन गतिविधियों पर 01 जनवरी 2016 के मास्टर निदेश, जिसे समय-समय पर अद्यतन किया जाता है और जो भारतीय रिज़र्व बैंक की वेबसाइट (https://www.rbi.org.in) पर उपलब्ध है, के निदेशानुसार मुद्रा परिवर्तन गतिविधियां या लेनदेन का कार्य नहीं करेंगी।

स्थान: हैदराबाद
दिनांक : जनवरी 07, 2025

हस्ता/-
(प्रियांक बहुगुणा)
उप महाप्रबंधक

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
"విద్యుత్ ఆదా చేస్తే విద్యుత్ ఉత్పత్తి చేసినట్లే"
టెండరు ప్రకటన నం. 11/24-25

(A) Spec.T-48(G): 33/11 KV ఫలక్‌నుమా SSలో 11KV బస్ బే పొడిగింపు. (B) Spec.T-50(G): 132 KV పటాన్‌చెరు- 33 KV ఎయిర్‌పోర్ట్ లైను 33 KV బల్కంపేట్-పటాన్‌చెరు లైను రామచంద్ర పేట్ అర్బన్ వద్ద ఇంటర్‌లింకింగ్. (C) Spec.T-63(G): 33/11 KV మచ్చబొల్లారం SS వద్ద అదనపు 8 MVA PTR స్థాపన. (D) Spec.T-64(G): 33/11 KV మైత్రివనం SS వద్ద PTR-II పెంపుదల. (E) Spec.T-97: దుర్గానగర్ SS వద్ద షెడ్ & సంబంధిత పనుల ఏర్పాటు. (F) Spec.T-98: వికారాబాద్ ADE లైన్స్ ఆఫీస్ వద్ద ప్రస్తుతమున్న బాయిలర్ మరమ్మత్తు, ఎలక్ట్రికల్ వైరింగ్ & సంబంధిత పనులు. (G) Spec. T-99: కొత్తగా మంజూరైన ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ERT) వాహనాలకు GPS ట్రాకింగ్ డివైజ్ ఇన్‌స్టాల్ చేయుట కొరకు నమోదిత అర్హతగల కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాల కోసం వెబ్‌సైట్ https://tgsouthernpower.org ను దర్శించండి. ఫోన్ 040-23431333/1112/1125.

DIPR RO No.8701-PP/CL/Advt/1/2024-25, Dt: 06-01-2025 సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్/SCADA

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, PR సర్కిల్, సూర్యాపేట్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

e-Proc. NIT No.PR/SRPT/60 to 112/2024-25 తేది:06-01-2025

పనుల సంఖ్య (53), సూర్యాపేట్ జిల్లాలో రూ.8277.10 లక్షల మొత్తం అంచనా వ్యయంతో FDR- చివ్వెంల-ముకుందాపురం PWD రోడ్ @ 5/7 కి.మీ. నుండి ఆత్మకూర్ (S) (M)లో బోట్యా తండ వరకు మరియు ఇతర పనులు. టెండరు డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేది: 08-01-2025 నుండి 07-02-2025 వరకు, ప్రతి NIT/ BID ప్రచురించబడిన తేది నుండి (7) స్పష్టమైన పనిరోజులు అందుబాటులో ఉంటుంది. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.telangana.gov.in పై లభించును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, (FAC), PR సర్కిల్, సూర్యాపేట్

DIPR RO No.8682-PP/CL/Advt/1/2024-25, Dt.06.01.2025

అమీన్‌పూర్ మున్సిపల్ కౌన్సిల్ :: సంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన - సంక్షిప్త టెండరు ప్రకటన

టెండర్ ప్రకటన నం.Engg-MCA/E1/NIT/30/2024-25, తేది:06-01-2025

పనుల సంఖ్య: 86 నం.లు, **అంచనా కాంట్రాక్టు విలువ: రూ.430.00 లక్షలు. ఈవెంట్స్, తేదీలు మరియు సమయం వరుసగా:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ మరియు సమయం: 07-01-2025న సా.5.00 గం., బిడ్ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 10-01-2025న సా.5.00 గం., ధర బిడ్ తెరుచు తేదీ: 10-01-2025న సా.5.30 గం. సంబంధిత అధికారి చిరునామా: కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ. తదుపరి వివరములను www.tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- మున్సిపల్ కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

DIPR Ro No.8677-PP/CL/Advt/1/2024-25, Dt:06.01.2025

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
సంక్షిప్త టెండరు ప్రకటన

Rc.No.572/R2/2024 తేది:06-01-2025

ఆమోదిత ఐతివృత్తం ప్రకారం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన-2025 కొరకు తెలంగాణ అటవీ శాఖ యొక్క స్టాల్‌ను రూపొందించుట కొరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. పని వ్యయం మరియు స్పెసిఫికేషన్ల వివరాలు టెండరు ఫారంలో లభిస్తాయి. టెండరు నియమ నిబంధనలతో టెండరు ఫారంను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్/CF, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్, 3వ అంతస్తు, అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్ వారి కార్యాలయం నుండి 06-01-2025 నుండి పొందవచ్చు. 1) టెండరు షెడ్యూళ్ళ అమ్మకం 07-01-2025 నుండి 09-01-2025న మ.12.00 గం. వరకు. 2) కాంట్రాక్టర్లచే టెండరు షెడ్యూళ్ళ దాఖలు 09-01-2025న మ.1.00 గం. వరకు. 3) టెండరు షెడ్యూళ్ళు ఫారెస్ట్ యుటిలైజేషన్ ఆఫీసర్ ఛాంబర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్, రూమ్ నం.347, 3వ అంతస్తు, అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్ కార్యాలయంలో 09-01-2025న మ.3.00 గం.కు తెరువబడును. అవి దిగువ సంతకందారుచే ఫైనలైజ్ చేయబడతాయి. మొబైల్ నం.9866025935, ఇమెయిల్ ఐడి: fuohyd2023@gmail.com

సం/- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్/CF, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్

DIPR Ro No.8723-PP/CL/Advt/1/2024-25, Dt:06.01.2025

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం
ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT. No.: HMDA/DEV/CE/18/2024-25 తేది: 04.01.2025

దిగువ తెలిపిన పనుల కొరకు చెల్లుబాటు గల నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్లు కోరబడుచున్నవి (క్ర.నం.1 నుండి 5 పనుల కొరకు సింగిల్ బిడ్డరు - సింగిల్ వర్క్ పాలసీ అనుసరించబడినది). **క్ర.నం. & పనిపేరు: 1.** ప్యారడైజ్ జంక్షన్ నుండి (NH-44) పై డెయిరీ ఫామ్ రోడ్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం - రక్షణ సరిహద్దు గోడ/ ప్రహరీ గోడ/ ఫెన్సింగ్ నిర్మాణం. **2.** ప్యారడైజ్ జంక్షన్ నుండి రాజీవ్ రహదారి (SH-01) పై ORR జంక్షన్ వద్ద శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం - రక్షణ ప్రహరీ గోడ నిర్మాణం - రీచ్ I. **3.** ప్యారడైజ్ జంక్షన్ నుండి రాజీవ్ రహదారి (SH-01) పై ORR జంక్షన్ వద్ద శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం - రక్షణ ప్రహరీ గోడ నిర్మాణం - రీచ్ II. **4.** ప్యారడైజ్ జంక్షన్ నుండి రాజీవ్ రహదారి (SH-01) పై ORR జంక్షన్ వద్ద శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ యొక్క ఫెన్సింగ్ నిర్మాణం - రక్షణ ప్రహరీ గోడ నిర్మాణం - రీచ్ III. **5.** ప్యారడైజ్ జంక్షన్ నుండి రాజీవ్ రహదారి (SH-01) పై ORR జంక్షన్ వద్ద శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం - రక్షణ ప్రహరీ గోడ నిర్మాణం - రీచ్ IV. **6.** బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్, హైదరాబాద్ పరిధిలోని వివిధ ప్రాజెక్ట్‌ల కొరకు ట్రాన్సాక్షన్ అడ్వైజర్ ఎంపిక కోసం ప్రతిపాదన కొరకు అభ్యర్థన. **7.** రాజీవ్ గాంధీ పార్క్, బి.ఎన్.రెడ్డి నగర్ వద్ద ఎంట్రన్స్ స్టెప్స్ వద్ద SS రెయిలింగ్ ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ & టాయిలెట్స్ మరమ్మతులు, బై-లింగువల్ సైన్ బోర్డ్స్, డస్ట్‌బిన్స్ మరియు ఇతర సకల విధ ఐటమ్స్ ఏర్పాటు. **8.** కొడంగల్ మరియు కోస్గి మున్సిపాలిటీల్లో జంక్షన్ & మీడియన్ అభివృద్ధి కొరకు సివిల్ పనులు. **టెండరు కోరుతున్న అధికారి:** చీఫ్ ఇంజనీర్, HMDA. **బిడ్లు దాఖలుకు చివరి తేది:** క్ర.నం.1 నుండి 5 & 6 కొరకు - 20.01.2025న మ.3.00 గం.వరకు. క్ర.నం.7 & 8 కొరకు - 22.01.2025న మ.3.00 గం.వరకు. తదుపరి వివరాల కొరకు దర్శించండి: **https://tender.telangana.gov.in.**

సం/- చీఫ్ ఇంజనీర్, HMDA

DIPR RO No.8694-PP/CL/Advt/1/2024-25, Dt: 06.01.2025

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 61 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SMT NIRMALA KEARLE	SRI KALA KIRAN SIDELLA S/O SRI JAYA PRAKASH	P.NO.21/ 521/A/D-4/TF, SHANTHIDEEP COLONY,	SALE DEED DOC NO 1290/2011 DATED 28.10.2011
2	SMT MALLIREDDY MADHAVI	SMT M SRILEKHA W/O SRI NEELAM VIJAY	F.N. 406/4TH FLOOR, VICEROY RESIDENCY APARTMENTS, BAPUJI NAGAR, BOWENPALLY	SALE DEED DOC NO 1518/2023 DATED 19.06.2023
3	M/S PADMA SHREE CONSTRUCTIONS	SRI R SRIDHAR S/O R SATYANARAYANA RAJU	P.NO.14/F.NO.6/SF, SRI CHS TRANSPORT ROAD	SALE DEED DOC NO 2240/2004 DATED 29.11.2004
4	SRI S RAJENDRA KUMAR DEORA	1.SRI SHAILENDER MANGILAL JAIN S/O MANGILAL MADANLAL 2.SMT SEEMA SURYA PRAKASH W/O SRI SHAILENDER MANGILAL JAIN	P.NO. 12/GF, MURTHY CHS, WEST MAREDPALLY	SALE DEED DOC NO.2147/2024 DATED 12.12.2024
5	SRI S RAJENDRA KUMAR DEORA	1.SRI SHAILENDER MANGILAL JAIN S/O MANGILAL MADANLAL 2.SMT SEEMA SURYA PRAKASH W/O SRI SHAILENDER MANGILAL JAIN	P.NO. 12/FF, MURTHY CHS, WEST MAREDPALLY	SALE DEED DOC NO.2147/2024 DATED 12.12.2024
6	SRI S RAMANUJA RAO	SMT MUNIGONDA SHOBHA W/O SRI MUNIGONDA SRINIVASULU	P.NO. 27/F.NO. 201/FF, SHANTIDEEP COLONY, KAKAGUDA	SALE DEED DOC.NO. 449/2019 DATED 28.02.2019
7	M/S EID PARRY LIMITED R P ROAD, SECUNDERABAD	SRI VINAY KUMAR GUPTA S/O SRI SATISH KUMAR GUPTA	P.NO. D-13/C/GF VENTURE - D, VIKRAMPURI CHS, KARKHANA	SALE DEED DOC NO. 1223/2005 DATED 06.09.2005
8	SRI S SHYAM SUNDER	1.SRI GUPTA GANESH PERSHAD S/O SRI DHANIRAM NANDULAL 2.SMT K BAL GEETHA W/O SRI NANDULAL DHANIRAM	P.NO. 25/504/4F, SAI SUNDER APARTMENTS, BOOSAREDDYGUDA	SALE DEED DOC NO.1060/2021 DATED 01.10.2021
9	SRI P V R SUBRAMANYAM & SMT P VIJAYA SRI	SRI PIYUSH KOTAM RAJU S/O SRI SUDHAKAR KOTAM RAJU	F.NO. T-2/TF, SY.NO. 34 & 35/A, SRI CHANDRA KALA APARTMENTS, BOWENPALLY	SALE DEED 544/2021 DATED 26.02.2021
10	SRI S JALAPATHI REDDY	SMT SINGIREDDY NEERAJA D/O LATE SINGIREDDY JALAPATHI REDDY & W/O SRI SREEDHAR REDDY	P.NO 6/GF, HYDERABAD AIRPORT EMP CHS, BAPUJI NAGAR BNOWENPALLY.	DEATH CERTIFICATE OF S JALAPATHI REDDY/LEGAL HEIR CERTIFICATE & RELEASE DEED DOC NO 2160/2024 DATED 16.12.2024
11	CH SHOWRI RAJU S/O C RAJANNA	1.SHRI ANJAIAH SHEELA S/O LATESRI SHEELA RAJAIAH 2.SMT KRISHNAVENI SHEELA W/O ANJAIAH SHEELA	P.NO.21 & 22/PART/GF/FF/SF/PH, PRIYA CHS, KAKAGUDA	SALE DEED 1893/2024 DATED 29.10.2024
12	SHRI HARI KISHORE SINGH	MD NAJIBUR RAHAMAN S/O SRI ABDUL HAI	P.NO. 5/A/GF/FF/SF, P & T COLONY, BALAMRAI	SALE DEED 07/2022 DATED 03.01.2022
13	DR K SANDHYA PRASAD	SRI RAMESH MAHESHWARI S/O SRI K L JHAWAR & SMT TARA MAHESHWARI W/O SRI RAMESH MAHESHWARI	P.NO. 31/GF, P & T COLONY, KARKHANA	SALE DEED 63/2000 DATED 19.01.2000
14	SRI A LAXMI NARAYANA	SRI GATTA BHAVANI W/O SRI G V RATAN PRASAD	FNO F-8 IN H.NO. 1-9-19 TO 28, AHALYA APARTMENTS, BAPUJI NAGAR BOWENPALLY	SALE DEED DOC NO 2119/2024 DATED 07.12.2024
15	SMT T G REVATHI & JAYA LAXMI TUMBALAM GOOTY	JAYALAXMI TUMBALAM GOOTY W/O ELLINDRA SATHYANARAYANA	P.NO. 107, VASAVI COLONY (VENT -A) KAKAGUDA	DEATH CERTIFICATE OF T G REVATHI AND LEGAL HEIR CERTIFICATE FROM JUNIOR CIVIL JUDGE, CIVIL COURT, SECUNDERABAD IN OS NO 945 OF 2023
16	SMT C SAROJA	SMT RACHANA GUPTA W/O VINAY KUMAR GUPTASRI VINAY KUMAR GUPTA S/O SATISH KUMAR GUPTA	P.NO D-13/D/GF, VENTURE - D, VIKRAMPURI CHS, KARKHANA	SALE DEED DOC NO.1263/2010 DATED 01.07.2010
17	SHRI VELCHALA UPENDER RAO & SMT RAMGIRI RAJINI	1.SHRI MANOJ BALIRAM SHROFF S/O BALIRAM SHROFF & 2. MRS ROMA M SHROFF W/O MANOJ SHROFF	P.NO.E-23/PART(EAST SIDE), VIKRAMPURI COLONY (E-VENTURE, KARKHANA	SALE DEED DOC NO 802/2023 DATED 05.04.2023
18	SHRI VELCHALA UPENDER RAO & SMT RAMGIRI RAJINI	1. SRI GHOUSE MOHIUDDIN S/O A Q JEELANI & 2. MRS MUSKAAN MOHAMMED W/O GHOUSE MOHIUDDIN	P.NO.E-23/PART(WEST SIDE), VIKRAMPURI COLONY (E-VENTURE), KARKHANA	SALE DEED DOC NO 801/2023 DATED 05.04.2023
19	SRI PARKER	SRI LOGISHETTY SHRAVAN KUMAR S/O SRI LOGISHETTY JANARDHAN RAO	P.NO D-15/GF/FF, VENTURE - D, VIKRAMPURI CHS, KARKHANA	SALE DEED DOC NO.1294/2005 DATED 10.09.2005
20	SRI D M CHOHAN	SMT JAYALAKSHMI DAHYALAL RATHOD W/O DAHYALAL RATHOD	P.NO. 26 SANTOSHIMA COLONY (PICKET)	DEATH CERTIFICATES OF FAMILY MEMBERS/ FAMILY MEMBER/ SUCCESSION CERTIFICATE FROM TALATI -CUM MANTRI VIDIMEGHPAR BORICHI GRAM PANCHAYAT, TA:ANAJAR, KACHCHH GUJARAT DISTRICT

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

No. SCB/Tax branch/46, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003. Date : 06-01-2025.

Sd/-
D. Madhukar Naik
Chief Executive Officer, Secunderabad Cantonment Board.

తమ్ముడూ.. అమ్మ జాగ్రత్త!

- అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



శేఖర్

భూపాలపల్లి రూరల్: 'తమ్ముడూ.. అమ్మ జాగ్రత్త.. అమ్మను బాగా చూసుకో.. అమ్మకు, నీకు తోడుగా, అండగా ఉండాల్సిన సమయంలో మీకు అన్యాయం చేసి తిరిగిరాని లోకానికి వెళ్తున్నా.. నన్ను క్షమించండి'.. అంటూ ఓ యువరైతు సెల్ఫీ వీడియో తీసి, లేఖ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నందిగామ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు, మృతుని బంధువుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన నీలాల శేఖర్ (29)తండ్రి రాజయ్య 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. తల్లి వెంకటమ్మ, తమ్ముడు సిద్ధూతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి సరిగ్గా లేక, పెట్టుబడి కూడా రాలేదు. రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన శేఖర్.. నాలుగు రోజుల క్రితం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శేఖర్ ఆదివారం చనిపోయాడు. కాగా, తాను కచ్చితంగా చనిపోతానని భావించిన శేఖర్.. ముందే తీసిన సెల్ఫీ వీడియోలో అప్పుల బాధతోనే పురుగు మందు తాగినట్లు స్పష్టం చేశాడు. అంతకుముందే ఆయన రాసి పెట్టుకున్న లేఖ కూడా బయటికి వచ్చింది. లేఖ, సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

సాఫ్ట్‌వేర్ దంపతుల ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఘటన



సందీప్, కీర్తి

పటాన్‌చెరు టౌన్: కుటుంబ కలహాలతో సాఫ్ట్‌వేర్ దంపతులు బలవన్మరణానికి పాల్పడిన ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా మియాపూర్‌కు చెందిన సందీప్ (36)కు ఆరేళ్ల కిందట మంచిర్యాలకు చెందిన కీర్తి (34)తో వివాహం జరిగింది. భార్యాభర్తలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ మియాపూర్‌లో ఉండేవారు. 9 నెలల కిందట అమీన్‌పూర్ పరిధిలోని బంధంకొమ్ము శ్రీదామ్ హిల్స్‌లో సొంతిల్లు కొనుగోలు చేసి కూతురు గగనహిత(3), కుమారుడు సాకేత్‌రామ్ (ఏడాదిన్నర)తో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. సోమవారం పాప గగనహిత పుట్టినరోజు ఉంది. వేడుక జరిపే విషయంలో 5వ తేదీ (ఆదివారం) ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో సందీప్ ఇద్దరు పిల్లల్ని తీసుకొని తల్లిగారింటికి మియాపూర్ వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కీర్తి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఒక్కడే ఇంటికొచ్చిన సందీప్‌కు కీర్తి ఉరేసుకొని కనిపించింది. వెంటనే అతడి తండ్రికి ఫోన్‌లో కీర్తి ఉరేసుకుందని విషయం చెప్పాడు. సందీప్ తల్లిదండ్రులు అక్కడికి వచ్చేలోపు అతడు కూడా తాడుతో ఉరేసుకున్నాడు. కీర్తి తండ్రి ప్రభాకర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమీన్‌పూర్ సీఐ నాగరాజుతోపాటు ఎస్‌ఐ సోమేశ్వరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉన్నత విద్యలో సమూల మార్పులు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉన్నత విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నామని, ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను డిగ్రీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. మండలి రూపొందించిన డైరీ, కేలండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా ఈ స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. సబ్జెక్టుకు చెందిన ముఖ్యాంశాలు గ్రహించేలా, పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ఈ స్టడీ మెటీరియల్ తోడ్పడుతుందని తెలిపారు. లోతైన అధ్యయనం చేసేవారి కోసం రెఫరెన్స్ పుస్తకాల వివరాలను సైతం ఈ స్టడీ మెటీరియల్‌లో పొందుపరుస్తామన్నారు. పోటీపరీక్షల అభ్యర్థులు రూపొందించుకునే స్టడీ మెటీరియల్‌లా ఇది ఉంటుందన్నారు. డిగ్రీ కోర్సుల సిలబస్‌ను 30 శాతం చొప్పున మార్చాలని ఇప్పటికే మండలి నిర్ణయించిందని పేర్కొన్నారు. కాగా, పరిశోధనను ప్రోత్సహించేలా ఈ సిలబస్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

పలిమెల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలయ్యాయి. వీధి కుక్కకు పిచ్చి లేవడంతో గ్రామంలో ఒక్కసారిగా అలజడి సృష్టించింది. కనిపించినవారినల్లా కరిచింది. మూడు గేదెలపై కూడా కుక్క దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇంతమందిపై ఒకేసారి కుక్క దాడి చేసిన ఘటనలు ఇటీవల కాలంలో లేవని వారు చెప్పారు. గాయపడిన వారు స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. పంచాయతీ అధికారులు తమను వీధికుక్కల బారి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల పరిధిలోని ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి దొడ్లో ఉన్న గొర్రెలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 20 గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెల కాపరి నన్నేబోయిన తిరుపతి తెలిపారు.



అంతరిక్షంలో క్రాప్స్ పేలోడ్‌లోని అలసంద విత్తనాలకు ఆకులు వచ్చిన దృశ్యం

విత్తనాలకు రెక్కలొచ్చాయ్!

ఇస్రో పేలోడ్‌లో మొలకెత్తి ఆకులు తొడిగిన అలసందలు

సూళ్లూరుపేట: అంతరిక్షంలో వ్యోమనౌకల అనుసంధానం కోసం ఉద్దేశించిన ప్రయోగంతోపాటు అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన మాడ్యూల్‌లో ఇస్రో చేపట్టిన ప్రయోగం మలి దశలోనూ విజయవంతమైంది. సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణంలో విత్తనాలు మొలకెత్తగలవా? మొలకెత్తితే పూర్తి స్థాయిలో ఆకుల స్థాయిని సంతరించుకోగలవా? అని తెల్సుకోవడంతోపాటు ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ స్థాయిలను కొలిచేందుకు ఈ ప్రయోగం చేపట్టిన విషయంతెల్సిందే. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్(స్పేడెక్స్) కోసం నింగిలోకి పంపిన జంట ఉపగ్రహాలతోపాటు కంపాక్ట్ రీసెర్చ్ మాడ్యూల్ ఫర్ ఆర్బిటల్ ప్లాంట్ స్టడీస్ (క్రాప్స్)పేరిట ఇస్రో ఓ పేలోడ్‌ను అంతరిక్షంలోకి పంపిన విషయం తెల్సిందే. ఇందులో ఎనిమిది అలసంద విత్తనాలను ఉంచగా అవి ఇటీవల మొలకెత్తాయి. మొలకెత్తిన విత్తనాలు తాజాగా ఆకులను సంతరించుకోవడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆకులు వచ్చిన సమయంలో మాడ్యూల్‌లో ఆర్ద్రత, ఉష్ణోగ్రత, మట్టిలో తేమ తదితరాలను అందులో అమర్చిన కెమెరా, ఇతర ఉపకరణాలతో కొలిచామని ఇస్రో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అంతరిక్షంలో మొక్కల పెంపకానికి సంబంధించిన పరిశోధనలకు ఈ ప్రయోగం ఎంతో దోహదపడిందని వెల్లడించింది. భవిష్యత్తులో అంతరిక్షంలో గడిపే వ్యోమగాముల ఆహార అవసరాలు తీర్చే చెట్ల పెంపకం, ఆ చెట్లు సూక్ష్మ గురుత్వాకర్షణ స్థితిలోనూ ఏ మేరకు ఆకులు, ఫలాలను అందివ్వగలవు, ఎంత మేరకు నీరు అవసరం తదతర అంశాలపై శోధనకూ తాజా ప్రయోగం సాయపడిందని ఇస్రో పేర్కొంది.

కెనడా ప్రధాని ట్రూడో రాజీనామా

పార్లమెంట్ సమావేశాలు మార్చి 24కు వాయిదా



టొరంటో: కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో(53) ప్రధాని పదవికి, అధికార లిబరల్ పార్టీ అధ్యక్షుడి పదవికి రాజీనామా చేసినట్లు సోమవారం ప్రకటించారు. కొత్త నేతను ఎన్నుకునేదాకా పదవిలో కొనసాగుతానన్నారు. ఇటీవల ఆర్థిక మంత్రి రాజీనామా, తొమ్మిదేళ్ల పాలన అనంతరం నాయకత్వ మార్పిడి కోరుతూ అధికార పార్టీలో ఒత్తిడి పెరిగిన నేపథ్యంలోనే ఆయన ఈ ప్రకటన చేసినట్లుగా భావిస్తున్నారు. 'పార్టీ నేత, ప్రధాని పదవులకు రాజీనామా చేయాలనుకుంటున్నాను. దేశవ్యాప్త ఎంపిక ప్రక్రియలో తదుపరి నేత ఎన్నికయ్యే వరకు ప్రధానిగా కొనసాగుతాను' అని ట్రూడో మీడియా సమావేశంలో ప్రకటించారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలున్నాయని బహిరంగంగానే అంగీకరించారు. ''రానున్న ఎన్నికల్లో ప్రజలు నిజమైన నేతను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అయితే అంతర్గతంగా పోరాడాల్సిన పరిస్థితులుండగా వచ్చే ఎన్నికల్లో ప్రజలకు నేను ఉత్తమ ఎంపిక కాలేననే విషయం స్పష్టమైంది. అందుకే బరి నుంచి తప్పు కోవాలనుకుంటున్నా'' అని చెప్పారు. ''నేను పోరాటయోధుడిని. కెనడా కోసం పోరాడేందుకు నా శరీరంలో అణువణువూ సిద్ధమే. కానీ ఎంతగా కృషి చేస్తున్నా కొంతకాలంగా పార్లమెంట్ సజావుగా సాగడం లేదు. అందుకే పార్లమెంట్ సమావేశాలను కొత్తగా ఏర్పాటు చేయాల్సిన అవసరముందని గవర్నర్ జనరల్‌కు తెలిపా. అందుకామె అంగీకరిస్తూ సమావేశాలను జనవరి 27 నుంచి మార్చి 24కు వాయిదా వేశారు'' అని వివరించారు. ఆలోగా కొత్త నేతను ఎంపిక చేసుకునేందుకు అధికార పార్టీకి వీలు చిక్కుతుందని భావిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో ఎన్నికలు జరగాల్సి ఉండగా, ప్రజాదరణలో అధికార లిబరల్ పార్టీ కంటే కన్జర్వేటివ్ పార్టీ ఎంతో మెరుగ్గా ఉంది. ఈ దశలో ట్రూడో రాజీనామా ప్రకటనతో అధికార పార్టీకి సరైన దిశానిర్దేశం చేసే నేత కరువయ్యే పరిస్థితి ఏర్పడింది. జనవరి 27వ తేదీన పార్లమెంట్ సమావేశాలు మొదలైతే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని మూడు ప్రతిపక్ష పార్టీలు ప్రకటించడం గమనార్హం. దీనిని తప్పించుకునేందుకే ట్రూడో పార్లమెంట్ సమావేశాలను వాయిదా వేయించినట్లు చెబుతున్నారు. పదేళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనకు ముగింపు పలుకుతూ లిబరల్ పార్టీ నేతగా ఉన్న ట్రూడో 2015లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన తండ్రి పియెర్రె గతంలో రెండు పర్యాయాలు ప్రధానిగా పనిచేసి, మంచి పేరు సంపాదించుకున్నారు. ట్రూడో పాలన మొదట్లో బాగుందనిపించినా రాన్రానూ ఆయన ప్రభుత్వం ఆదరణ కోల్పోతూ వచ్చింది. ఆహారం, ధరలు ఆకాశాన్నంటడం, వలసలు ఒక్కసారిగా పెరిగిపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా మారాయి. అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇటీవల ఆర్థిక మంత్రి రాజీనామా చేశారు. అంతకుముందు హౌసింగ్ మంత్రి వైదొలిగారు. ట్రూడో రాజీనామా చేయాలంటూ బాహాటంగానే కొందరు నేతలు డిమాండ్లు వినిపిస్తున్నారు. ఇవి కూడా ట్రూడో తాజా నిర్ణయానికి బలమైన కారణాలుగా ఉన్నాయి.

భారత్‌లో హెచ్‌ఎంపీవీ కలకలం

తొలి కేసులు నమోదు

- తమిళనాడు, కర్నాటక, గుజరాత్‌ల్లో ఐదు కేసులు
- బాధితుల్లో ముగ్గురు నెలల వయసు చిన్నారులు
- పాత వైరసేనన్న కేంద్రం
- ప్రాణాంతకం కాదని వెల్లడి

న్యూఢిల్లీ/చెన్నై/సాక్షి బెంగళూరు: చైనాను వణికిస్తున్న హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) భారత్‌లోనూ అడుగు పెట్టింది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా ఐదు కేసులు వెలుగు చూశాయి. గుజరాత్‌లో ఒకరు, కర్నాటకలో ఇద్దరు నెలల చిన్నారులకు హెచ్‌ఎంపీవీ సోకినట్టు నిర్ధారణ అయింది. తమిళనాడులో కూడా రెండు కేసులు నమోదయ్యాయి. శ్వాస సంబంధిత సమస్యలకు దారి తీసే ఈ వైరస్ చైనాలో భారీగా మరణాలకు కారణమవుతున్నట్టు వస్తున్న వార్తలు, కరోనా తాలూకు అనుభవాల నేపథ్యంలో భారత్‌లోనూ తొలిసారి హెచ్‌ఎంపీవీ కేసులు నమోదవడం కలకలం రేపింది. అయితే ఆందోళన అవసరం లేదని కేంద్రం పేర్కొంది. హెచ్‌ఎంపీవీ ప్రాణాంతకమేమీ కాదని తెలిపింది. ''శ్వాస ద్వారా గాలిలో వ్యాపించే హెచ్‌ఎంపీవీ అన్ని వయసుల వారినీ ప్రభావితం చేయగలదు. అలాగని భయపడాల్సిన అవసరమేమీ లేదు. ఇది కేవలం మామూలు శ్వాస సంబంధిత సమస్యేనని ఆరోగ్య నిపుణులు ఇప్పటికే నిర్ధారించారు. పైగా హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కూడా కాదు. దీన్ని 2001లోనే తొలిసారి గుర్తించారు. అప్పటినుంచీ భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తరచూ కనిపిస్తూనే ఉంది'' అని వివరించింది. ముందుజాగ్రత్తగా దేశవ్యాప్తంగా పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. ''చైనాలో పరిస్థితుల నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. ఇప్పటికైతే దేశంలో ఎక్కడా అదనపు హెచ్‌ఎంపీవీ కేసులు వెలుగు చూడలేదు. శ్వాస సంబంధిత కేసుల్లో అసాధారణ పెరుగుదల కూడా నమోదవలేదు'' అని స్పష్టం చేశారు. అసాధారణ పరిస్థితులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కోవడానికి కేంద్రం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్టు మంత్రి ప్రకటించారు. ''హెచ్‌ఎంపీవీకి సంబంధించి అంతర్జాతీయంగా ప్రస్తుత పరిస్థితి తదితరాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి నివేదిక కోరాం. తన వద్ద అందుబాటులో ఉన్న వివరాలను త్వరలో మనతో పంచుకోనుంది'' అని ఒక ప్రకటనలో వివరించారు. ఆందోళన చెందాల్సిన పనేమీ లేదని తమిళనాడు, కర్నాటక, గుజరాత్ ప్రభుత్వాలు కూడా ప్రకటించాయి. హెచ్‌ఎంపీవీ కేసుల నేపథ్యంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ అప్రమత్తమయ్యాయి. తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలను గురించి ప్రజలను హెచ్చరిస్తున్నాయి. కర్నాటక ఇప్పటికే బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. కర్నాటకలో ఎనిమిది నెలల బాబు, మూడు నెలల పాప హెచ్‌ఎంపీవీ బారిన పడ్డారు. శ్వాసకోశ సమస్యలతో వారిద్దరినీ ఇటీవల బెంగళూరులోని బాప్టిస్టు ఆస్పత్రిలో చేర్చారు. ఐసీఎంఆర్‌లో శాంపిల్స్‌ను పరీక్షించిన మీదట వారికి హెచ్‌ఎంపీవీ సోకినట్టు నిర్ధారణ అయింది. పాప ఇప్పటికే చికిత్స పొంది డిశ్చార్జి కాగా బాబు కోలుకుంటున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. వారి కుటుంబీకుల్లో ఎవరూ ఇటీవలి కాలంలో విదేశీ ప్రయాణాలు చేయలేదని వివరించింది. ఈ నేపథ్యంలో మాస్కుధారణతో పాటు కరోనా నాటి ప్రొటోకాల్స్‌ను తిరిగి తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. కర్నాటక ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు హుటాహుటిన సంబంధిత ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. గుజరాత్‌లో కూడా శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో అహ్మదాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన రెండు నెలల బాబుకు హెచ్‌ఎంపీవీ సోకినట్టు నిర్ధారణ అయింది. రాజస్తాన్‌లోని దుంగార్పూర్‌కు చెందిన ఆ బాబు డిసెంబర్ 24 నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమస్య తీవ్రత దృష్ట్యా బాలున్ని వెంటిలేటర్‌పై ఉంచామని, ఇప్పుడు కోలుకుంటున్నాడని వైద్యాధికారులు తెలిపారు. తమిళనాట కూడా సోమవారమే చెన్నైలో ఒకటి, సేలంలో మరొకటి హెచ్‌ఎంపీవీ కేసులు వెలుగు చూశాయి. బాధితుల పరిస్థితి మెరుగ్గానే ఉందని, వారిని నిరంతర పర్యవేక్షణలో ఉంచామని ఆరోగ్య శాఖ తెలిపింది.

ప్రమాదకారి కాదు

హెచ్‌ఎంపీవీ. ప్రస్తుతం దేశమంతటినీ ఆందోళనకు గురిచేస్తున్న వైరస్. కానీ కరోనా మాదిరిగా ఇది ప్రమాదకారి కాదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. హెచ్‌ఎంపీవీ ఇతర సాదాసీదా శ్వాసకోశ వైరస్‌ల వంటిది మాత్రమేనని కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ (డీజీహెచ్‌ఎస్) డాక్టర్ అతుల్ గోయల్ తెలిపారు. చైనాలో వెలుగు చూసిన హెచ్‌ఎంపీవీలో జన్యు పరివర్తనాలు జరిగాయని డబ్ల్యూహెచ్‌ఓ చెప్పడమే తప్ప నిర్ధారణ కాలేదని ఐసీఎంఆర్ స్పష్టం చేసింది. కరోనాలా ఇది మహమ్మారిగా మారే ప్రమాదమేమీ లేదని వివరించింది. హెచ్‌ఎంపీవీని తొలిగా 2001లో నెదర్లాండ్స్‌లో 28 మంది చిన్నారుల్లో గుర్తించారు. దీనిపై వైద్య నిపుణులు ఏమంటున్నారంటే...

- దగ్గు, తుమ్ము వంటివాటి ద్వారా హెచ్‌ఎంపీవీ వ్యాపిస్తుంది. శ్వాసనాళంలో ఎగువ, దిగువ భాగాలను ప్రభావితం చేస్తుంది.
- జలుబు, ముక్కు కారడం, దగ్గుతో పాటు కొన్నిసార్లు ముఖంపైనా, ఒళ్లంతా ఎర్రని దద్దుర్లు, కొద్దిపాటి జ్వరం రావచ్చు. ఇది శ్వాస ఇబ్బందులకు, నిమోనియా, బ్రాంకైటిస్‌కు దారి తీయడం అరుదే.
- హెచ్‌ఎంపీవీని ఆర్టీపీసీఆర్ ద్వారా నిర్ధారించవచ్చు. ఇది వారంలోపే తగ్గిపోతుంది. చిన్నారులు, వృద్ధులపై ప్రభావం ఎక్కువ.
- మాస్క్ ధరించడం, చేతులను సబ్బుతో బాగా కడుక్కోవడం వంటివి పాటించాలి.
- హెచ్‌ఎంపీవీకి ఇప్పటికైతే వ్యాక్సీన్, కచ్చితమైన చికిత్స లేవు.

మాజీ సీజేఐపై ఆరోపణలు.. పిటిషన్‌ను కొట్టేసిన లోక్‌పాల్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్‌పై అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసును లోక్‌పాల్ కొట్టివేసింది. తన న్యాయ పరిధికి మించిన అంశమని ఒక ఉత్తర్వులో పేర్కొంది. ఓ రాజకీయ పార్టీని, ఓ రాజకీయ నేతను కాపాడేందుకు తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ గతేడాది అక్టోబర్ 18వ తేదీన అప్పటి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌పై ఫిర్యాదు అందింది. గతేడాది నవంబర్ 10వ తేదీన పదవి నుంచి ఆయన రిటైరయ్యారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టంలోని సెక్షన్–14 ప్రకారం సిట్టింగ్ సీజేఐ, సుప్రీంకోర్టు జడ్జీలు తమ న్యాయపరిధిలోకి రారని, ఈ అంశాన్ని పరిశీలించరాదని నిర్ణయించుకున్నామని లోకా యుక్త ఈ నెల 3న జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. చట్ట ప్రకారం ఇతర మార్గాలను అనుసరించే స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉందని తెలిపింది.



కన్నీరు పెట్టిన ఆతిశీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ కన్నీరు పెట్టుకున్నారు. తన తండ్రి పేరును ప్రస్తావిస్తూ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేశ్ బిధూరి చేసిన వ్యాఖ్యలు తనకు తీవ్ర మనస్తాపం కలిగించాయన్నారు. తన తండ్రిని దుర్భాషలాడుతూ బీజేపీ నేతలు ఓట్లడుగుతున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం ఆప్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బిధూరి వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. 'మా నాన్న టీచర్. ఢిల్లీలోని వేలాది మంది పేద, మధ్య తరగతి పిల్లలకు పాఠాలు బోధించారు. ఇప్పుడు ఆయనకు 80 ఏళ్లు. చాలా అనారోగ్యంతో ఉన్నారు. కనీసం సొంతంగా నడిచే స్థితిలో కూడా లేరు. ఎన్నికల్లో లబ్ధి కోసం అటువంటి వృద్ధుడి పట్ల ఇంత దారుణంగా మాట్లాడతారా? దేశ రాజకీయాలు ఇంత నీచ స్థాయికి దిగజారిపోతాయని నేనెప్పుడూ అనుకోలేదు. రమేశ్ బిధూరి దక్షిణ ఢిల్లీ నుంచి పదిసార్లు ఎంపీగా ఉన్నారు. ఈ ప్రాంతానికి ఆయన ఏం చేశారో కల్కాజీ ప్రజలకు చెప్పాలి. ఎమ్మెల్యేగా నేను చేసిన ఐదేళ్ల పని కంటే పదేళ్లపాటు ఆయన గొప్పగా చేసిందేమిటో చూపించాలి. అప్పుడే ఆయన ఓట్లు అడగాలి'అని ఆతిశీ స్పష్టం చేశారు.

స్పేస్ డాకింగ్ 9కి వాయిదా

సాక్షి బెంగళూరు/సూళ్లూరుపేట: రోదసీ పరిశోధనల్లో మరో మైలురాయిని అధిగమించేందుకు ఇస్రో సమాయత్తమైంది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట రెండు ఉపగ్రహాలను భూకక్ష్యలో అనుసంధానం చేసే బృహత్తర ప్రయోగం 7న జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఈ నెల 9కి ఇస్రో వాయిదా వేసింది. డాకింగ్ ప్రక్రియకు గ్రౌండ్ సిమ్యులేషన్ ద్వారా మరిన్ని పరీక్షలు అవసరమైనందునే రెండు రోజులు వాయిదా వేస్తున్నట్లు ఇస్రో వెల్లడించింది. అంతరిక్ష రంగంలో దేశం మరింత ఎత్తుకు, మరో మెట్టుకు ఎదిగేందుకు ఇస్రోకు డాకింగ్ ప్రయోగం ఎంతో కీలకం. ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే స్పేస్ డాకింగ్ సాంకేతికతను అభివృద్ధి చేసుకోగలిగాయి. ఇస్రో స్పేస్ డాకింగ్ విజయవంతమైతే భారత్ నాలుగో దేశంగా నిలుస్తుంది.

మావోయిస్టుల ఘాతుకం

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన 70 కిలోల మందుపాతర

- 8 మంది జవాన్లు, డ్రైవర్ దుర్మరణం
- కూంబింగ్ ముగించుకుని వస్తుండగా దారుణం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏడాదిన్నర కాలంగా మావోయిస్టుల ఏరివేతలో ఎదురన్నదే లేకుండా దూసుకెళ్తున్న భద్రతా బలగాలకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కుట్రు సమీపంలో మావోయిస్టులు అమర్చిన శక్తిమంతమైన మందుపాతర పేలిన ఘటనలో 8 మంది జవాన్లు, డ్రైవర్ మృత్యువాత పడ్డారు. బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య శనివారం సాయంత్రం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మావోయిస్టులు చనిపోగా ఓ జవాన్ కూడా నేలకొరిగారు. ఎదురుకాల్పుల సమయంలో తప్పించుకున్న మావోయిస్టుల కోసం దళాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో కూంబింగ్ అనంతరం సోమవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో క్యాంపునకు తిరిగి వస్తున్న డీఆర్‌జీ బలగాల స్కార్పియో వాహనాన్ని బెదిరే –కుట్రు రోడ్డులో నక్సల్స్ ఐఈడీ ద్వారా పేల్చేశారు. పేలుడు తీవ్రతకు ఘటనాస్థలి భయానకంగా మారింది. పోలీసు వాహనం శకలాలుగా మారిపోగా, అందులో ఉన్న 8 మంది జవాన్లు, డ్రైవర్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలిలో సిమెంట్ రోడ్డు పెచ్చులుగా లేచి 10 అడుగుల లోతైన గొయ్యి ఏర్పడింది. జవాన్ల వాహనం భాగాలు పక్కనున్న ఎత్తయిన చెట్ల కొమ్మల చివర వరకు ఎగిరిపడ్డాయి. స్టీరింగ్ రాడ్ మొత్తం వంగిపోయింది. జవాన్ల శరీరాలు తల, మొండెం, కాళ్లు, చేతులు ఛిద్రమై రోడ్డు పక్కన పొలాల్లో పడ్డాయి. అక్కడికి చేరుకున్న బలగాలు సహచరుల శరీర భాగాలను పాలిథిన్ కవర్లలో సేకరించాల్సి వచ్చింది. నేలకొరిగిన జవాన్లంతా స్థానిక గిరిజనులు, లొంగిపోయిన మావోయిస్టులేనని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ చెప్పారు. ఘటన నేపథ్యంలో గాలింపు మరింత ముమ్మరం చేశామన్నారు. ప్రాణాలు కోల్పోయిన జవాన్లను.. కోర్స బుధ్రం, సోమడు వెంటిల్, దుమ్మా మడకం, బోమన్ సోది, హరీష్ కొర్రమ్, పండరు పద్యం, సుదర్శన్ వీటి, శుభర్నాథ్ యాదవ్‌గా గుర్తించారు. డ్రైవర్ వివరాలు తెలియరాలేదు.



మందుపాతర పేలుడు ధాటికి దెబ్బ తిన్న వాహనం

ఫాక్స్‌హోల్ పద్ధతి

యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో మావోయిస్టులు పన్నిన ఉచ్చులో చిక్కకుండా భద్రతా దళాలు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా తాము ప్రయాణించే మార్గంలో ముందుగానే యాంటీ ల్యాండ్‌మైన్ వాహనాలతో తనిఖీలు చేస్తుంటాయి. అయితే వీటికి సైతం చిక్కని రీతిలో ఫాక్స్‌హోల్ పద్ధతిలో మావోయిస్టులు 70 కిలోల పేలుడు పదార్థాలను రోడ్డు మధ్యలో అమర్చినట్టు తెలుస్తోంది. 2023 ఏప్రిల్ 26న దంతెవాడ జిల్లాలో చోటుచేసుకున్న పేలుడులో 10 మంది డీఆర్‌జీ జవాన్లు, డ్రైవర్ మరణించారు. అప్పుడు కూడా ఫాక్స్ హోల్ పద్ధతినే మావోయిస్టులు ఉపయోగించినట్టుగా పోలీసులు గుర్తించారు.

ప్రొటోకాల్ తప్పారా?

సాధారణంగా డీఆర్‌జీ జవాన్లు కాలినడక లేదా బైక్‌లపైనే ఎక్కువగా కూంబింగ్‌కు వెళ్తారు. సోమవారం ఘటనలో వారు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌కు దూరంగా వాహనాన్ని ఉపయోగించారు. అది కూడా ల్యాండ్ మైన్ ప్రూఫ్ కాకుండా సాధారణ వాహనం. దీంతో ప్రమాద తీవ్రత పెరిగింది. గతేడాది భద్రతా దళాల ప్రయాణించే వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోలు పేలుడు పదార్థాలు ఉపయోగించారు. అయితే అది సరుకు రవాణా వాహనం కావడంతో మృతుల సంఖ్య రెండుకు పరిమితమైంది.

భారత్‌కు అందే జలాలపై ప్రతికూల ప్రభావం ఉండదు


బ్రహ్మపుత్రపై అతిపెద్ద డ్యామ్ నిర్మాణంపై చైనా ప్రకటన

బీజింగ్: భారత్‌తో సరిహద్దుల్లోని టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద జలాశయాన్ని నిర్మించే ప్రతిపాదనపై వ్యక్తమవుతున్న భయాందోళనలపై చైనా స్పందించింది. ఈ డ్యామ్ కారణంగా భారత్, బంగ్లాదేశ్‌లకు అందే జలాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. దిగువ దేశాలపై పర్యావరణం, భౌగోళిక స్వరూపాన్ని హాని ఉండదని పేర్కొంది. కచ్చితత్వంతో కూడిన శాస్త్రీయ పరిశీలన తర్వాతే ఈ ప్రాజెక్టును తలపెట్టామని వివరించింది. పైపెచ్చు, ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో దిగువ ప్రాంతాల్లో విపత్తుల తీవ్రతను తగ్గించడంతోపాటు నివారించేందుకు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు తోడ్పాటునిస్తుందని చెప్పుకొచ్చింది. పర్యావరణం దృష్ట్యా అత్యంత సున్నితమైన, భూకంపాలకు ఎక్కువ అవకాశాలున్న హిమాలయ ప్రాంతంలో 137 బిలియన్ డాలర్లతో ఈ భారీ ప్రాజెక్టును నిర్మించాలని చైనా నిర్ణయించడంపై భారత్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం తెలిసిందే. చైనా తీరుపై అమెరికా ప్రభుత్వంతోనూ చర్చిస్తోంది.

చర్లపల్లి టెర్మినల్‌తో గణనీయ అభివృద్ధి

- సుస్థిరమైన మౌలిక సదుపాయాలను సృష్టించడంలో ఇదో ముందడుగు
- దేశం 100 శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణకు చేరువవుతోంది
- తెలంగాణ, జమ్మూకశ్మీర్, ఒడిశాల్లో రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్ స్టేషన్‌ను ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం చేయడం ద్వారా ఈ ప్రాంతంలో గణనీయ అభివృద్ధి సాకారం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. చర్లపల్లి స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, సౌరశక్తితో నడిచే కార్యకలాపాలతో సహా సుస్థిరమైన మౌలిక ఆధునిక సౌకర్యాలను సృష్టించడంలో ఇది ఒక ముందడుగు అని అన్నారు. ఈ కొత్త టెర్మినల్ సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడలలోని ప్రస్తుత స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు ప్రజలకు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా చేస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రాజెక్ట్‌లు ప్రజల జీవన సౌలభ్యాన్ని పెంపొందించడమే కాకుండా, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యాపారాన్ని సులభతరం చేయడాన్ని ప్రోత్సహిస్తాయని మోదీ ఉద్ఘాటించారు. సమష్టిగా ఈ వృద్ధిని మరింతగా వేగవంతం చేసేందుకు తాను నిశ్చయించుకున్నానని ప్రధాని అన్నారు. చర్లపల్లి న్యూ టెర్మినల్ రైల్వే స్టేషన్‌తో పాటు జమ్మూ రైల్వే డివిజన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే రాయగడ రైల్వే డివిజన్ భవనానికి ప్రధాని మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. తర్వాత మోదీ మాట్లాడారు. ''జమ్మూకశ్మీర్, తెలంగాణ, ఒడిశాలో రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభంతో పర్యాటకం మరింత పెరుగుతుంది. ఈ ప్రాంతాల్లో సామాజిక-ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది'' అని అన్నారు.



త్వరలోనే తొలి బుల్లెట్ రైలు

''ఇవాళ ప్రజలు ఎక్కువదూరాలను తక్కువ సమయంలో పూర్తిచేయాలనుకుంటున్నారు. అందుకు తగ్గట్లే మేం పనిచేస్తున్నాం. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడం చూశాక నాకెంతో సంతోషం కలిగింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. భారతదేశంలో మొదటి బుల్లెట్ రైలు పరుగులు తీసే రోజు కూడా ఎంతో దూరంలో లేదు. రాబోయే రోజుల్లో రైల్వేల ప్రయాణం ఓ గుర్తుండిపోయే మధురస్మృతిగా నిలిచిపోయేలా చేస్తాం. దేశంలో 2014లో 74 ఉన్న విమానాశ్రయాల సంఖ్య నేడు 150కి పైగా పెంచాం. 5 నగరాల నుంచి 21 నగరాలకు మెట్రో సేవలు విస్తరించాం. దేశం కలిసికట్టుగా, అంచెలంచెలుగా ముందుకు సాగుతోందనడానికి ఇలాంటి కార్యక్రమం ఒక నిదర్శనం'' అని అన్నారు.

చిత్రవధ చేసి చంపారు

- జర్నలిస్ట్ ముకేశ్ చంద్రకర్ హత్యలో విస్తుగొలిపే విషయాలు
- పోస్టుమార్టమ్ నివేదికతో బట్టబయలు
- హైదరాబాద్‌లో ప్రధాన నిందితుడి అరెస్ట్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టులో భారీ అవినీతి జరిగిన విషయాన్ని వెలుగులోకి తెచ్చినందుకు కక్షగట్టి ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ముకేశ్ చంద్రకర్‌ను చంపేసిన ఉదంతంలో విస్తుగొల్పే విషయాలు బయటపడ్డాయి. పోస్ట్‌మార్టమ్ నివేదికలో విస్మయకర వివరాలు వెలుగులోకి వచ్చాయి. ముకేశ్‌ను చిత్రవధ చేసి అంతంచేశారని, చంపేశాక మృతదేహంపైనా తమ పట్టరాని ఆవేశాన్ని చూపించారని పోస్ట్‌మార్టమ్ నివేదిక పేర్కొంది. ముకేశ్ మృతదేహాన్ని బీజాపూర్ జిల్లా కేంద్రంలోని చతాన్‌పారా బస్తీ ప్రాంతంలోని ప్రధాన నిందితుడికి చెందిన ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లో కనుగొన్నారు. పోస్ట్‌మార్టమ్ నివేదిక ప్రకారం హంతకులు మృతదేహం నుంచి గుండెను వేరేచేసి, కాలేయాన్ని నాలుగు ముక్కలుచేశారు. తలలో 15 చోట్ల విరిగిన గుర్తులున్నాయి. మెడ విరిగిపోయింది. ఐదు పక్కటెముకలు, మెడ ఎముకలు విరిగిపోయాయి. చేయి విరిచేశారు. తల, ఛాతి, వీపు, పొట్టపై తీవ్రమైన గాయాలున్నాయి. ఇనుప రాడ్డు వంటి బలమైన ఆయుధంతో కొట్టిన గుర్తులున్నాయి. చేతిపై ఉన్న ఒకే ఒక్క పచ్చబొట్టు సాయంతో మృతదేహం ముకేశ్‌దే అని గుర్తించగలిగారు. తమ 12 ఏళ్ల పోస్ట్‌మార్టమ్ కెరీర్‌లో ఇంతటి దారుణమైన హత్యను చూడలేదని వైద్యులు తెలిపారు. ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది కలిసి హత్య చేసి ఉంటారని వైద్యులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులు రితేశ్ చంద్రకర్, దినేశ్ చంద్రకర్, మహేంద్రలను అరెస్ట్‌చేశారు. ప్రధాన నిందితుడు సురేశ్ సైతం మృతుడికి దూరపు బంధువుకావడం గమనార్హం. బీజాపూర్ రోడ్డు పనులపై నోరు మెదపకుండా ఉండేందుకు మాట్లాడాలంటూ సురేశ్ సోదరుడు రితేశ్ ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరయ్యాక ముకేశ్ కనిపించకుండా పోయాడని, అతని మొబైల్ స్విచ్ఛాఫ్ వస్తోందని ముకేశ్ అన్న యుకేశ్ డిసెంబర్ 25న ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేయగా హత్య విషయం బయటికొచ్చింది.

ప్రధాన నిందితుడు హైదరాబాద్‌లో అరెస్ట్

వృత్తిరీత్యా కాంట్రాక్టర్ అయిన సురేశ్ చంద్రకర్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో అరెస్ట్‌చేసింది. హత్య జరిగిన జనవరి ఒకటో తేదీ నుంచి తప్పించుకు తిరుగుతున్న సురేశ్‌ను అతని డ్రైవర్‌కు చెందిన ఇంట్లో ఎట్టకేలకు అరెస్ట్‌చేశామని సిట్ ఇన్‌చార్జ్ పోలీసు అధికారి మయాంక్ గుర్జార్ సోమవారం వెల్లడించారు. సురేశ్‌ను బీజాపూర్‌కు తీసుకొచ్చామని, విచారణ కొనసాగుతోందని బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందర్‌రాజ్ చెప్పారు. నిందితులు రితేశ్, దినేశ్‌లు హతుడు ముకేశ్‌కు వరసకు సోదరులుకాగా మహేంద్ర రామ్‌టెకె సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. రాత్రి భోజనం చేసే సమయంలో ఉద్దేశపూర్వకంగా గొడవపడి ఈ ముగ్గురూ చంపేశారని తెలుస్తోంది. తర్వాత మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్‌లో పడేసి సిమెంట్‌తో కప్పేశారు.

సొంత యూట్యూబ్ చానల్

బీజాపూర్‌లో దాదాపు రూ.120 కోట్ల విలువైన రోడ్డు నిర్మాణ కాంట్రాక్టుల్లో భారీ అవకతవకలు జరిగాయని ఎన్‌డీటీవీ టీవీఛానెల్ తరఫున ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా చేసే 33 ఏళ్ల ముకేశ్ సొంతంగా 'బస్తర్ జంక్షన్' పేరిట యూట్యూబ్ ఛానల్‌ను విజయవంతంగా నడుపుతున్నాడు. 2021లో బీజాపూర్‌లో తకల్‌గూడలో భద్రతాబలగాలపైకి మావోయిస్టులు మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో 22 మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారు. సీఆర్‌పీఎఫ్ జవాను, కోబ్రా కమాండర్ అయిన రాకేశ్వర్ సింగ్ మన్హాస్‌ను బంధించి మావోలు తీసుకెళ్లగా చర్చలు జరిపి ఏప్రిల్‌లో విడిపించడంలో ముకేశ్ కీలకపాత్ర పోషించారు. ముకేశ్ మరణవార్త తెల్సి మహార్ వర్గీయులు సోమవారం కొవ్వొత్తుల ప్రదర్శన చేసి నివాళులర్పించారు. నిందితులకు కఠిన శిక్ష అమలుచేయాలని డిమాండ్‌చేశారు. రాయ్‌పూర్ ప్రెస్‌క్లబ్‌లో వందలాది పాత్రికేయులు ధర్నాచేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) సైతం దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. కేసు వివరాలను నివేదిక ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని పీసీఐ చైర్‌పర్సన్ జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ ఆదేశించారు. ది ప్రెస్ అసోసియేషన్ అండ్ ది ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా సైతం పారదర్శక దర్యాప్తునకు డిమాండ్‌చేశాయి.



గ్రేటర్..డబుల్‌డెక్కర్!
నార్త్‌సిటీకి డబుల్ డెక్కర్ కారిడార్లపైన స్పష్టత వచ్చింది. తాజాగా జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ మార్గంలోనూ డబుల్ డెక్కర్ నిర్మాణం చేపట్టనున్నారు. -8లో



ప్రకృతి సోయగం.. కన్హా శాంతివనం..
1600 ఎకరాల్లో ప్రకృతి సోయగంగా విరాజిల్లుతున్న కన్హా శాంతి వనం..ప్రశాంతతకు నిలయంగా నిలుస్తోంది. మెడిటేషన్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 29.0/17.0
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ప్రభుత్వ పాఠశాలకు రూ. కోటి 77 లక్షల ప్రాపర్టీ ట్యాక్స్



వనస్థలిపురం: హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1,77,71,195 ప్రాపర్టీ ట్యాక్స్ కట్టాలంటూ జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ అధికారులు నోటీసులు పంపించారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ప్రాపర్టీ ట్యాక్స్ కట్టాలంటూ నోటీసు అందజేశారు. అందులో 2024 ఏప్రిల్ నాటికి పాత బకాయిలు రూ. 53,51,946, దానికి వడ్డీ రూ.1,21,19,669, ప్రస్తుతం 2024–25 కి గానూ రూ. 2,77,388, ప్రస్తుత వడ్డీ రూ.22,192 కలిపి మొత్తంగా రూ.1,77,71,195 చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు ఇందిర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు ఇలాంటి నోటీసులు ఇవ్వడం ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఈ విషయంను డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గతంలో అసెస్‌మెంట్ చేసుకుంటేనే పంపుతాం– డీసీ యాదయ్య

ప్రభుత్వ పాఠశాలకు రూ. 1,77,71,195 కట్టాలంటూ నోటీసులు ఇవ్వడంపై 'సాక్షి' హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యను వివరణ కోరగా... గతంలో అసెస్‌మెంట్ చేసుకుంటే ప్రభుత్వ పాఠశాలలకు కూడా ట్యాక్స్ విధింపు ఉంటుందని అన్నారు. రికార్డులు పరిశీలించిన తర్వాత దీనిపై సమాధానం చెబుతామని ఆయన పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్‌లో నేడు లేడీస్ డే

అబిడ్స్: 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో మంగళవారం లేడీస్ డే నిర్వహిస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి సురేందర్ రెడ్డి వెల్లడించారు. ఎగ్జిబిషన్‌లో మంగళవారం రోజు కేవలం మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఉమెన్స్ స్పెషల్ డే ప్రోగ్రాంకు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ సౌమ్య మిశ్రా ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నట్లు వారు వెల్లడించారు.



ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అసదుద్దీన్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

అభివృద్ధి కోసం ఎవరితోనైనా కలుస్తాం.. పోరాడుతాం

ఆరాంఘర్–జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

- వంతెనకు డా.మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌గా నామకరణం
- రీజినల్ రింగ్‌రోడ్డుతో తెలంగాణ అభివృద్ధి వేగవంతం
- పాతబస్తీ అభివృద్ధికి అసద్‌తో కలిసి పనిచేస్తాం..
- మెట్రో రెండో దశపై ప్రధానితో మాట్లాడా...



సాక్షి, సిటీబ్యూరో/బహదూర్‌పురా /చార్మినార్: గ్రేటర్ నగరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 11 కిలోమీటర్ల అత్యంత పొడవైన పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం తర్వాత..తిరిగి కాంగ్రెస్ హయాంలోనే ఇప్పుడు రెండో అతి పెద్ద ఆరాంఘర్– జూపార్క్ ఫ్లై ఓవర్ ప్రారంభించుకున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగా నిర్మాణమైన ఈ ఫ్లైఓవర్‌ను సోమవారం సాయంత్రం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఏపీలో కానీ, ఇప్పుడు కానీ హైదరాబాద్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఈ ఫ్లైఓవర్‌కు డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అంటూ హైదరాబాద్ అభివృద్ధి కోసం రోడ్ల విస్తరణ, మెట్రో రైలు విస్తరణలతోపాటు గోదావరి జలాలు తేవడం ద్వారా తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన తదితర కార్యక్రమాలు ఒక్కటొక్కటిగా చేస్తున్నామన్నారు. నిజాం కృషితో హైదరాబాద్ నగరానికి లేక్స్ అండ్ రాక్స్ సిటీగా ప్రపంచంలోనే ఒక గొప్ప పేరు ఉండేదని, దాన్ని నిలుపుకొని ఉంటే, ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్‌తో పోటీ పడే నగరమే ఉండకపోయేదన్నారు. కానీ కాలక్రమేణా కబ్జాదారులు, ఆక్రమణల వల్ల నగర సుందరీకరణ పూర్తిగా దెబ్బతిన్నదని, నగరంలో చిన్న వర్షం వచ్చినా వరదలు, ట్రాఫిక్ జామ్స్ తప్పడం లేదన్నారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు..

ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి కోసం మోదీతో పోరాడాల్సి వచ్చినా, అసద్‌తో కలిసి పనిచేసేందుకైనా సిద్ధమన్నారు. నగరాభివృద్ధి కోసం ఎంఐఎంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రధాని వేరే పార్టీ అయినా నగరాభివృద్ధి కోసం మాట్లాడానన్నారు. అక్బరుద్దీన్ తన చిన్ననాటి స్నేహితుడన్నారు. పాతబస్తీ అభివృద్ధికి ఆయన అడిగిన పనులన్నింటికీ నిధులు మంజూరు చేసే జిమ్మేదారి తనదని భరోసా ఇచ్చారు. మీరాలంపై కేబుల్ బ్రిడ్జి నిర్మించి, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. చర్లపల్లి టెర్మినల్ చాలా కాలం పెండింగ్‌లో ఉండగా, తాను సీఎం అయ్యాక పనులు ముందుకు సాగాయన్నారు. టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానితో మాట్లాడానని, తెలంగాణ ఏర్పాటయ్యాక గత పదేళ్లలో హైదరాబాద్ మెట్రో రైలు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్న విషయాన్ని గుర్తుచేశానన్నారు. ముఖ్యంగా గౌలిగూడ, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మెట్రో పనులకు ఒక్క ఇటుక కూడా పడలేదని, అందుకే హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర మంత్రిమండలి ఆమోదించాల్సిందిగా కోరినట్లు చెప్పారు.

రీజినల్ రింగ్‌రోడ్డుతో అభివృద్ధి

ఔటర్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కూడా అత్యవసరమని, అది పూర్తయితే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రైలును, వికారాబాద్–కొడంగల్–కృష్ణా రైల్వే లైన్ కోసం కూడా కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలుస్తా, ఎవరితోనైనా పోరాడుతా అన్నారు.

ఒరిజినల్ సిటీ ఇదే..

హైదరాబాద్ పాత నగరం కాదని..ఇదే ఒరిజినల్ సిటీ అని, హైదరాబాద్ అభివృద్ధి కోసం 10 లేదా 11వ తేదీన ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంబంధిత అధికారులతో సచివాలయంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, తాము నిర్మించిన ఫ్లై ఓవర్‌ను రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని బీఆర్ఎస్ వాళ్లు చెప్పుకుంటున్నప్పటికీ, తాము అధికారంలోకి వచ్చాకే సరైన సమయానికి నిధులిచ్చి పనులు పూర్తిచేయించామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా చాంద్రాయణ గుట్ట నియోజకవర్గం పరిధిలో రూ.301 కోట్లతో సీవరేజ్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు.

ఎంతమంది జైలుకెళ్తారో నాకైతే తెల్వదు...

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ రాజకీయాలు..జైలు జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్తరేషన్ కార్డులు మంజూరు, రైతులకు ఈ ప్రభుత్వం సహకరించడం మంచి పరిణామమని అంటూ..రేవంత్‌రెడ్డి జైలులో ఉన్నప్పుడు తనకు వంట చేసిపెట్టిన వాళ్లను కూడా మర్చిపోకుండా పిలిపించుకుని సహాయం చేయడం మంచి విషయం అన్నారు. ప్రస్తుతం రాజకీయ నాయకులు జైలుకెళ్లడం సామాన్యంగా మారిందని, ఇప్పుడు మాత్రం ఎవరు.. ఎంతమంది జైలుకు వెళ్తారో తనకైతే తెలియదన్నారు. తనను కూడా అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు 1998లో జైలుకు పంపారన్నారు. తాను అప్పట్లో 50 రోజులు జైలు జీవితం గడిపానన్నారు. జైలుకెళ్తే కష్టసుఖాలు బాగా తెలుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. జూబ్లీ బస్టాండ్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైలును వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. మీరాలం మండి నుండి చార్మినార్ వరకు స్కైవాక్ ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ..పాతబస్తీ ఓవైసీ ఆస్పత్రి, చాంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్ వరకు నిర్మించనున్న మెట్రో రైలు ట్రిపుల్ డెక్కర్ ట్రాన్స్‌పోర్టు సిస్టంలో నడవాలన్నారు. ఇప్పటికే ఈ మార్గంలో కింద రోడ్డు ప్రయాణం కొనసాగుతుండగా పైనుంచి ఫ్లైఓవర్ ఉందన్నారు. ఈ ఫ్లై ఓవర్ పైనుంచి మెట్రో రైలు వెళ్లనుంది అన్నారు. గత ప్రభుత్వం ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్, సింగపూర్‌లా మారుస్తామన్నప్పటికీ, చార్మినార్ పాదచారుల పథకం కూడా పూర్తిచేయలేదన్నారు. టూరిజం పాలసీలో మక్కా మసీదుతోపాటు ఇతర మసీదులను కూడా చేరిస్తే బాగుంటుందన్నారు. ఓల్డ్‌సిటీలో బస్టాండ్లతోపాటు మినీబస్సులు కూడా అందుబాటులోకి తేవాలన్నారు.







'చర్లపల్లి'కి ఎయిర్‌పోర్ట్ లుక్..

అత్యాధునిక హంగులు, అత్యద్భుత వసతులతో ఎయిర్‌పోర్టును తలపించేలా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభమైంది. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించగా..గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, సోమయ్య, బండి సంజయ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఆధునిక రైల్వే టెర్మినల్‌గా నిర్మితమైన ఈ ప్రాంగణంలో ఎన్నో విశేషాలు..విశిష్టతలు ఉన్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా ఓటర్లు 46,23,788

గత సంవత్సరం కంటే 53,650 మంది ఎక్కువ..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత సంవత్సరం తుది జాబితా కంటే ఈ సంవత్సరం తుది జాబితా ఓటర్లు 53,650 మంది పెరిగారు. గత సంవత్సరం ఫిబ్రవరి 8వ తేదీన వెలువరించిన తుదిజాబితా మేరకు జిల్లాలో 45,70,138 ఓటర్లుండగా, ఈ సంవత్సరం తాజా తుది జాబితాలో 46,23,788 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 23,53,151 మంది కాగా, మహిళలు 22,70,292 మంది, థర్డ్ జెండర్లు 345 మంది ఉన్నారు.

- మొత్తం ఓటర్లు అత్యధికంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,89,954 మంది ఉండగా, అత్యల్పంగా చార్మినార్ నియోజకవర్గంలో 2,32,515 మంది ఉన్నారు.

పురుషులు :	2353151
మహిళలు :	2270292
థర్డ్‌జెండర్ :	345
వెరసి మొత్తం ఓటర్లు:	4623788

- గత అక్టోబర్‌లో వెలువరించిన ముసాయిదా జాబితాకు మార్పు చేర్పుల అనంతరం తాజాగా పెరిగిన ఓటర్లు కేవలం1,655 మంది మాత్రమే.
- ముసాయిదాలో మొత్తం ఓటర్లు: 46,22,133
- కొత్తగా చేరిన వారు: 14,159
- తొలగించినవి: 12,504
- ఇది 0.04 శాతంగా అధికారులు పేర్కొన్నారు.

ఖైరతాబాద్‌లో తగ్గిన ఓటర్లు 6575

మలక్‌పేట, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో కొత్తగా చేరిన వారికంటే, తొలగించిన వారు ఎక్కువగా ఉన్నారు. మలక్‌పేటలో కొత్త ఓటర్లు 1043 మంది కాగా, తొలగించిన వారు 1694 మంది ఉన్నారు. అంటే 651 మంది తగ్గారు. ఖైరతాబాద్‌లో కొత్తగా చేరిన వారు 863 మంది కాగా, ఇక్కడ తొలగించిన వారు భారీ సంఖ్యలో 7438 మంది ఉన్నారు. అంటే 6575 మంది తగ్గారు. డూప్లికేట్లు, చిరునామా మార్పులు, మరణించిన వారు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని తొలగించినట్లు అధికారులు తెలిపారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
ముషీరాబాద్	157920	150880	308813
మలక్‌పేట్	160693	158201	318905
అంబర్‌పేట	141515	139363	280890
ఖైరతాబాద్	152412	142136	294585
జూబ్లీహిల్స్	203137	186793	389954
సనత్‌నగర్	131446	122898	254356
నాంపల్లి	169088	161415	330512
కార్వాన్	186094	179075	365183
గోషామహల్	144178	132866	277073
చార్మినార్	121189	111296	232515
చాంద్రాయణగుట్ట	176198	178398	354631
యాకుత్‌పురా	184312	181787	366130
బహదూర్‌పురా	163648	162563	326260
సికింద్రాబాద్	133981	134706	268716
కంటోన్మెంట్	127340	127915	255265

మెట్రోతో ఓల్డ్‌సిటీకి మహర్దశ

- మొత్తం 41 మంది యజమానులకు రూ.20 కోట్ల నష్టపరిహారం చెల్లింపు
- మెట్రో నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తాం : ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

ప్రభావిత ఆస్తుల యజమానులకు చెక్కుల పంపిణీలో ఎన్వీఎస్




సాక్షి, సిటీబ్యూరో: మెట్రో నిర్మాణంతో పాత నగరానికి మహర్దశ రానుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. మెట్రో కోసం ఆస్తులు కోల్పోయిన వారికి సీఎం ఆదేశాల మేరకు సముచితమైన రీతిలో నష్టపరిహారాన్ని చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామన్నారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ మాట్లాడుతూ, మొదటి దశ కన్నా మరిన్ని అత్యాధునిక సదుపాయాలతో రెండో దశ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. దీంతో పాతనగరం రూపురేఖలు మారనున్నాయన్నారు. ఎంపీ సూచనల మేరకు మెట్రో స్టేషన్ల నుండి చార్మినార్, లాడ్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాలకు స్కై వాక్, ఫుట్ పాత్ తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి రూ..2,741 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ మార్గాన్ని నాలుగేళ్లలో పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పానికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. నాంపల్లిలో నిర్మించిన అధునాతన మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్టును వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎంజీబీఎస్ – చాంద్రాయణగుట్ట మార్గంలో ప్రభావితమైన 34 ఆస్తులకు సంబంధించిన 41 మంది యజమానులకు రు.20 కోట్ల నష్టపరిహారాన్ని సోమవారం చెల్లించారు.

మెట్రోకు ఆహ్వానం: ఎంపీ అసద్

ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, ఎంతో కాలంగా ఓల్డ్‌సిటీవాసులు ఎదురు చూస్తున్న మెట్రో నిర్మాణం కల సాకారం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మెట్రో నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. మీరాలంమండి, చార్మినార్ స్టేషన్ల వద్ద స్కైవాక్‌లను నిర్మించాలని సూచించారు. నిర్వాసితులకు మెట్రో స్టేషన్ల వద్ద వ్యాపారాలు చేసుకొనేందుకు సదుపాయం కల్పించాలని కోరారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం ముందుకు వచ్చిన నిర్వాసితులకు లాభదాయకమైన నష్టపరిహారాన్ని నిర్ణయించామన్నారు. దీనిని అందరు ఆహ్వానించారని చెప్పారు. మొత్తం 1100 ఆస్తులకు సుమారు రు.1,000 కోట్ల నష్టపరిహారం చెల్లించనున్నామని, ఇందుకు స్థానికులు తమకు పూర్తిగా సహకరిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మెట్రో రైల్ భూ సేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ కె.స్వర్ణలత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మొదటి 'వారం' 83 ఫిర్యాదులు!

- హైడ్రాలో ప్రారంభమైన ప్రజావాణి
- నేరుగా కమిషనర్ చేతికే వినతిపత్రాలు
- పరిష్కారానికి 3 వారాల గడువు నిర్దేశం
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ఫిర్యాదుదారులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీలో (హైడ్రా) సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం మొదలైంది. రాణిగంజ్‌లో ఉన్న బుద్ధ భవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో మొదటి వారం కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు 83 ఫిర్యాదులు అందాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు ఇది కొనసాగింది. అప్పటి వరకు అందుబాటులో ఉన్న రంగనాథ్ ఆయా ఫిర్యాదుల పరిష్కారానికి గరిష్ఠంగా మూడు వారాల గడువు నిర్దేశించారు. దీంతో ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి కోసం వచ్చిన ఫిర్యాదుదారులకు సిబ్బంది టోకెన్లు అందిస్తున్నారు. ఆ ప్రకారం వీరి నుంచి ఫిర్యాదులు తీసుకున్న రంగనాథ్ వీలున్నంత వరకు అక్కడికక్కడే సమస్య ఏంటి? ఏ ప్రాంతానికి చెందినది? తదితర వివరాలు తెలుసుకుంటున్నారు. తక్షణం స్థానిక అధికారులతో మాట్లాడుతున్న ఆయన పరిష్కరించాలని కోరుతున్నారు. హైడ్రా పరిధి ఓఆర్ఆర్ వరకే కాగా..కొందరు ఫిర్యాదుదారులు ఇతర జిల్లాల నుంచి, మరికొందరు ఇతర శాఖల సంబంధించిన సమస్యలతో హైడ్రా ప్రజావాణికి వచ్చారు. వీరికి విషయం వివరిస్తున్న అధికారులు సంబంధిత అధికారుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. వీటిపై ఆయా అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో నివేదికలు రూపొందించాలని రంగనాథ్ హైడ్రా సిబ్బందిని ఆదేశించారు. తమ పరిధిలోని అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తామని, గరిష్ఠంగా మూడు వారాల్లో పరిష్కారానికి కృషి చేస్తామని ఫిర్యాదుదారులకు హామీ ఇస్తున్నారు.

కీలక ఫిర్యాదుల్లో కొన్ని...

- తనకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలంతో పాటు పార్కు స్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ మహిళ కాజేసిందని, దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని విశ్రాంత సైనికుడు పి.సీతారామరాజు ఫిర్యాదు చేశారు. ఈమన 1971 నాటి ఇండో–పాక్ యుద్ధ సైనికుడు కావడం గమనార్హం.
- జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూమిని నోటరీ చేసి అమ్మేస్తున్నారని, మొత్తం 6 వేల ఎకరాలకు ప్రస్తుతం 2500 ఎకరాలే మిగిలిందని ముఖేష్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిని కూడా ప్లాట్లు చేసి అక్రమ లే ఔట్‌ల ద్వారా అమ్మే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల 15 ఎకరాల స్థలంపై స్థానికుడు కన్నేసినట్లు పేర్కొన్నారు.
- ఇరిగేషన్ నాలాకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని 60 గజాల చొప్పున ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారని, దీనివల్ల వరద నీరు వచ్చి చేరి పేద వారు ఇబ్బందిపడుతున్నారని చిలుకానగర్ కార్పొరేటర్ భర్త ప్రవీణ్ ముదిరాజ్ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- మియాపూర్ పరిసర ప్రాంతాల్లోని బక్షికుంట, రేగుల కుంటలను సుందరీకరిస్తే... వాటిల్లోకి స్థానికులు మురుగు నీరు వదులుతున్నారని చందానగర్‌కు చెందిన ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు.

ఒట్టేసి..బంధంతో కట్టేసి..

- మందుబాబు కిక్కు.. ఇన్‌స్పెక్టర్ లాజిక్కు..
- తాగుబోతు తండ్రికి కొడుకుతో కౌన్సెలింగ్
- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి మాధవి వినూత్న ప్రయోగం


కుమారుడితో ప్రామిస్ చేయిస్తున్న ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ మాధవి

ఉప్పల్ : అది ఉప్పల్ నల్ల చెరువు సెంటర్.. ఆదివారం రాత్రి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.. అదే సమయంలో ఓ వ్యక్తి తన ఫ్యామిలీతో కలిసి అటుగా బైక్‌పై వెళ్తున్నాడు.. ఇంకేముంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. పక్కనే ఫ్యామిలీ ఉండటంతో పరుపోతుందన్న భయంతో బైక్ పక్కగా ఆపి ఇన్‌స్పెక్టర్‌తో కాళ్లబేరానికి వచ్చాడు.. అంత వరకూ బాగానే నడిచినా..ఇందులో వింతేముంది? ఎప్పుడూ జరిగే తంతేగా అనుకోవద్దు.. ఇక్కడే ఉంది అసలైన కిక్కు.. కాస్తా భిన్నంగా ఆలోచించిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మి మాధవి.. కొద్దిసేపు అతడి భార్య, కుమారుడితో మాట్లాడారు. అనంతరం తండ్రికి కొడుకుతో కౌన్సెలింగ్ ఇప్పించారు. 'నాన్నా నువ్వు నాకు కావాలి.. నువ్వు ఇలా తాగి బైక్ నడపడం ఎంతో ప్రమాదం.. నీకేమైనా అయితే మేమేం కావాలి? అంటూ.. చెప్పడమే కాకుండా.. మరోసారి తాగి డ్రైవింగ్ చేయనని తనపై ఒట్టు వేయమని అడిగించారు..వచ్చీ రాని మాటలతో కొడుకు చెప్పినదానికి భావోద్వేగానికి గురైన తండ్రి కొడుకుకు ప్రామిస్ చేశాడు.. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది.

నా బండి ఫొటో ఎందుకు తీశావురా?

- మద్యం మత్తులో కౌన్సిలర్ భర్త వీరంగం
- ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై బూతు పురాణం
- నిందితుడిపై కేసు నమోదు


ప్రవీణ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్ : తప్పతాగి రాంగ్‌రూట్ లో రావడమే కాకుండా విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై కొంపల్లి కౌన్సిలర్ భర్త బూతులతో రెచ్చిపోయిన సంఘటన ఆదివారం రాత్రి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ట్రాఫిక్ కానిస్టేబుల్ బాల్ దాస్ విధుల్లో ఆదివారం సాయంత్రం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న అపర్ణ గ్రీన్ స్పేస్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో ఎన్సీఎల్ ప్రాంతానికి చెందిన కౌన్సిలర్ భర్త ప్రవీణ్ మద్యంమత్తులో బైక్‌పై రాంగ్ రూట్లో వస్తుండగా బాల్ దాస్ అతడిని ఫొటో తీశాడు. దీనిని గుర్తించిన ప్రవీణ్ వెనక్కి వెళ్లి నా బండి ఫొటో ఎందుకు తీశావు రా.. అంటూ దుర్భాషలాడాడు. నేను కౌన్సిలర్‌ను.. నా బండి ఫొటో తీస్తావా నీకు ఎంత ధైర్యం.. అంటూ రెచ్చిపోవడంతో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా 96 ఎంజీ వచ్చింది.. రాంగ్ రూట్ లో రావడమే కాకుండా.. హెల్మెట్ ధరించకుండా డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌ను తిట్టి.. ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించినందుకు అతడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. గతంలోనూ అతడిపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఓ బిల్డింగ్ యజమానిని బెదిరించిన ఘటనలో ప్రశ్నించిన జర్నలిస్టుపై దాడి చేసినందుకు గాను పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది.

బ్యాటరీ దొంగల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

సనత్‌నగర్: భారీ వాహనాల నుంచి బ్యాటరీల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట పాటిగడ్డలో పార్కు చేసిన డీసీఎంల నుంచి మూడు బ్యాటరీలను చోరీకి గురైనట్లు మీర్ అర్షద్ అలీ అనే వ్యక్తి ఈ నెల 4 న బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమవారం రసూల్‌పురా ఎక్స్‌రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాటరీల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులను ముషీరాబాద్, ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ సోహైల్ పాషా, సయ్యద్ ఇబాద్ అలియాస్ సయ్యద్ తబ్రేజ్‌గా గుర్తించారు. వీరు మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ బ్యాటరీల చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు వారి నుంచి రూ.1,50,000 విలువైన మూడు అమరాన్ బ్యాటరీలు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రేటర్..డబుల్ డెక్కర్!

- నార్త్‌సిటీ రెండు రూట్లలో డబుల్ డెక్కర్ కారిడార్లే..
- ఎలివేటెడ్ పియర్స్‌పైనే మెట్రో అలైన్‌మెంట్
- నిర్మాణంపైన 30 శాతం తగ్గనున్న వ్యయం
- తుదిదశలో భూసేకరణ ప్రక్రియ
- ప్రస్తుతం నాగ్‌పూర్‌లోనే అతిపెద్ద డబుల్‌డెక్కర్
- త్వరలో నోటిఫికేషన్‌కు హెచ్ఎండీఏ సన్నాహాలు



సాక్షి, సిటీబ్యూరో: నార్త్‌సిటీకి డబుల్ డెక్కర్ కారిడార్లపైన స్పష్టత వచ్చింది. మొదట ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు 5.32 కిలోమీటర్ల వరకే ప్రతిపాదించారు. తాజాగా జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ మార్గంలోనూ డబుల్ డెక్కర్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు కారిడార్లు వినియోగంలోకి వస్తే దేశంలోనే అతిపెద్ద డబుల్‌డెక్కర్ నెట్‌వర్క్ కలిగిన నగరంగా హైదరాబాద్ రికార్డు సాధించనుంది. ప్రస్తుతం నాగ్‌పూర్‌లో మాత్రమే 5.6 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఉంది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు ప్రతిపాదించిన 22 కిలోమీటర్ల మెట్రో మార్గంలో సుమారు 18 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ రానుంది. దీంతో నేలపైన, మొదటి అంతస్తు ఎలివేటెడ్‌లో వాహనాలు రాకపోకలు సాగించనుండగా, రెండో అంతస్తులో మెట్రో రైళ్లు పరుగులు తీయనున్నాయి. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు ప్రతిపాదిత 23 కిలోమీటర్ల మెట్రో రూట్‌లో ఇంచుమించు సుచిత్ర వరకు డబుల్ డెక్కర్ ఉంటుంది. అక్కడి నుంచి మేడ్చల్ వరకు ఎలివేటెడ్ మెట్రో కారిడార్ వస్తుందని హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దీంతో ఈ రెండు మార్గాల్లో మెట్రో నిర్మాణ వ్యయం 30 శాతం వరకు తగ్గనున్నట్లు అంచనా.

మెట్రో కోసం భూసేకరణ అవసరం లేదు..

ప్రస్తుతం నాగ్‌పూర్ కాంప్టీరోడ్డులో ఎల్ఐసీ స్క్వేర్ నుంచి ఆటోమోటివ్ స్క్వేర్ వరకు 5.6 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఉంది.సుమారు రూ.573 కోట్లతో దీనిని నిర్మించారు.అంత కంటే ముందు వార్ధా రూట్‌లో నిర్మించిన 3.14 కిలోమీటర్ల కంటే ఇది ఎక్కువ. ఈ డబుల్ డెక్కర్‌ను ఇంజినీరింగ్ అద్భుతంగా భావిస్తారు. రైలు, రోడ్డు, మెట్రో ఒకదానిపైన మరొకటి రాకపోకలు సాగిస్తున్నట్లుగా ఉంటాయి. నగరంలో ఉత్తరం వైపు నిర్మించనున్న డబుల్ డెక్కర్ మరో అద్భుతంగా ఆవిష్కృతం కానుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం హెచ్ఎండీఏ భూసేకరణ చేపట్టిన దృష్ట్యా మెట్రో కోసం ప్రత్యేక సేకరణ అవసరం లేదు. మెట్రో అలైన్‌మెంట్‌ల కోసం ఎలివేటెడ్ కారిడార్ పియర్స్ ఎత్తును పెంచుతారు. ఈ పియర్స్‌పైనే మెట్రో లైన్‌లు నిర్మిస్తారు. ఈ రెండు మార్గాలపైన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌మెట్రో రైల్ లిమిటెడ్ సంస్థ త్వరలో డీపీఆర్ రూపొందించనున్న దృష్ట్యా అప్పుడే డిజైన్‌లపైన మరింత స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ రెండు రూట్లలో హెచ్ఎండీఏ భూసేకరణ కొనసాగిస్తోంది. త్వరలో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. దాంతో ఎలివేటెడ్ కారిడార్ టెండర్‌లకు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

డెయిరీఫామ్ నుంచి ఎలివేటెడ్ మెట్రో..

ప్యారడైజ్ నుంచి మేడ్చల్ 23 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు 22 కిలోమీటర్ల మార్గంలో మెట్రో కారిడార్లను నిర్మించనున్నారు. మేడ్చల్ రూట్‌లో తాడ్‌బండ్, బోయినపల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఓఆర్ఆర్ ఎగ్జిట్ వరకు మెట్రో రానుంది. ఇదే మార్గంలో డెయిరీఫామ్ వరకు 5.32 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ ఉంటుంది. అలాగే జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రంపురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్ పేట్ కు 22 కిలోమీటర్ల పొడవున ఈ కారిడార్ విస్తరించి ఉంటుంది.ఈ రూట్‌లో దాదాపు పూర్తిస్థాయిలో డబుల్ డెక్కర్ వచ్చే అవకాశం ఉంది.

ఫోర్త్‌సిటీకి కూడా డబుల్ డెక్కరే..

నార్త్‌సిటీ తరహాలో ఫోర్త్‌సిటీకి కూడా డబుల్ డెక్కర్ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మెట్రో రెండో దశలో రూ.6000 కోట్ల అంచనాలతో సుమారు 41 కిలోమీటర్లు పొడిగించనున్న సంగతి తెలిసిందే.రెండో దశలో 5 కారిడార్‌లకు మాత్రమే డీపీఆర్ పూర్తి చేసి రాష్ట్రప్రభుత్వ ఆమోదం అనంతరం కేంద్రం అనుమతికి పంపించారు. తాజాగా నార్త్‌సిటీకి 3 నెలల్లో డీపీఆర్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించిన సంగతి తెలిసిందే.అదేవిధంగా ఫోర్త్‌సిటీ మెట్రోపైన కూడా దృష్టి సారించనున్నారు.

వైరస్‌పై యుద్ధానికి 'గాంధీ' సిద్ధం...


సిద్ధంగా ఉన్న ఆక్సిజన్ సిలిండర్లు

గాంధీఆస్పత్రి: హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ)ను ఎదుర్కొనేందుకు గాంధీ ఆస్పత్రి సిద్ధమైంది. కోవిడ్ నోడల్ సెంటరైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వైద్యులు, పాలనా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. సుమారు 2 వేల పడకలు గల ఆస్పత్రిలో 600 ఆక్సిజన్ పడకలు, 450కి పైగా వెంటిలేటర్లు, 400 మానిటర్లు, సుమారు 40 వేల కిలో లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులు, వందలాది ఆక్సిజన్ సిలిండర్లు, పీడియాట్రిక్ వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధంగా ఉంది. కోవిడ్ పాండమిక్ సమయంలో ఏర్పాటు చేసిన కరోనా వార్డులనే ఇప్పుడు వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. అన్నిరకాల వసతులు, సౌకర్యాలతో అత్యవసర విభాగాలు సిద్ధంగా ఉన్నాయి. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు.

కరోనా అంత ప్రమాదకరం కాదు..



హెచ్ఎంపీవీ వైరస్ కరోనా అంత ప్రమాదకరమైనది కాదు. లక్షణాలు కనిపించిన వెంటనే ఐసోలేషన్‌లో ఉంటూ వైద్యులను సంప్రదించాలి. హైరిస్క్‌గ్రూప్, వృద్ధులు, గర్భిణీలు, రెండేళ్లలోపు చిన్నారులకు త్వరగా సోకే అవకాశాలు ఉన్నాయి. వీరంతా మరింత అప్రమత్తంగా ఉండాలి. మాస్క్, శానిటైజర్లు తప్పనిసరిగా వినియోగించాలి. హెచ్ఎంపీవీ వైరస్ నాలుగు నుంచి ఏడు రోజుల్లో తగ్గిపోతుంది. ఈ వైరస్ ఎప్పటి నుంచో ఉంది, ఇప్పుడు చైనాలో ఎక్కువగా వ్యాపిస్తోంది.

– ప్రొఫెసర్ సునీల్‌కుమార్, గాంధీ జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ

ఉద్యాన్‌ఉత్సవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



కంటోన్మెంట్: ఉద్యాన్ ఉత్సవ్ వ్యవసాయదారులు, ఔత్సాహికులకు ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్రపతి నిలయంలో కొనసాగుతున్న ఉద్యా ఉత్సవ్‌ను సోమవారం గవర్నర్ సందర్శించారు. రాష్ట్రపతి నిలయం అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించడంతో పాటు రాష్ట్రపతి నిలయంలో పర్యటించారు. ఉద్యా ఉత్సవ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ రైతులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయన్నారు.

అందుబాటులోకి చర్లపల్లి రైల్వే టెర్మినల్

ప్రారంభమైన చర్లపల్లి రైల్వే టెర్మినల్



కుషాయిగూడ: అత్యాధునిక హంగులు, వసతులు ఎయిర్‌పోర్టును తలపించే రీతిలో రూపుదిద్దుకున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోదీ టెర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ. అతిపెద్ద రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

సంతోషకరం: ఎమ్మెల్యే బండారి



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లిలో దేశంలోనే అతిపెద్ద రైల్వే టెర్మినల్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో టెర్మినల్‌కు వచ్చే ప్రయాణికులకు రవాణా సదుపాయాలు, స్థానిక ప్రజల అవసరాలు, ఉపాధి మార్గాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నా కల ఫలించింది : ఎన్వీఎస్ఎస్



చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం ద్వారా తన కల ఫలించిందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. స్థల సేకరణ, స్థల పరిశీలన, డిజైనింగ్ చేసే నాటి నుంచి పలుమార్లు ఢిల్లీకి వెళ్లి అప్పటి రైల్వే మంత్రి దక్షిణమధ్య రైల్వే అధికారులను కలిశానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రూపురేఖలు మారతాయి...



రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామికవాడ చర్లపల్లిలో అతిపెద్ద రైల్వే టెర్మినల్ ప్రారంభించడం శుభపరిణామమని చర్లపల్లి పారిశ్రామికవాడ ఐలా చైర్మన్ జక్కా రోశిరెడ్డి అన్నారు. టెర్మినల్ ఏర్పాటుతో చర్లపల్లి పారిశ్రామికవాడ రూపురేఖలు మారనున్నాయన్నారు.


చర్లపల్లి టెర్మినల్ వద్ద జెండా ఊపుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..

స్థానికులకు ఉపాధి చూపాలి: బొంతు శ్రీదేవి



తాను కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న చర్లపల్లిలో రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేయడం సంతోషకరమని బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. టెర్మినల్ కోసం స్థలాలు ఇచ్చిన వారికి తగిన న్యాయం చేయాలన్నారు. టెర్మినల్‌లో స్థానికులకే ఉపాధి మార్గాలు చూపాలని డిమాండ్ చేశారు. ఆటోస్టాండ్‌లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం కల్పించడం వంటి అంశాల్లో దక్షిణమధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు


నిందితుడు కురుమూర్తి

రంగారెడ్డి కోర్టులు: ఓ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి సోమవారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇంటర్ చదువుతున్న ఓ బాలిక (17) తల్లిదండ్రులతో కలిసి సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండేది. అదే ప్రాంతానికి చెందిన కురుమూర్తి అనే యువకుడు ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2017 జూన్ 16న బాలికను ఇంటి నుండి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం నిందితుడికి పై విధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చింది. బాధిత బాలికకు రూ.3లక్షల నష్ట పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

మరో కేసులో నిందితుడికి 20 ఏళ్లు


నిందితుడు కార్తీక్

రంగారెడ్డి కోర్టులు: ఓ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.15వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి సోమవారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ బాలిక (17) వనస్థలిపురం ఠాణా పరిధిలోని తన పెద్దనాన్న ఇంట్లో ఉండేది. అదే ప్రాంతంలో ఉంటున్న ఇండ్ల కార్తీక్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి సదరు బాలికను 2018 ఏప్రిల్ 11న ఇంటి నుంచి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి పెద్దనాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం నిందితుడికి పై విధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చింది.

12 గంటల్లో మరమ్మతులు పూర్తి

- నీటి సరఫరా పునరుద్ధరణ
- అధికారులు, సిబ్బందికి జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అభినందనలు



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్-1లో కలబ్ గూర్ నుంచి లింగంపల్లి వరకు పీఎస్సీ, ఎంఎస్ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీలకు పలు ప్రాంతాల్లో మరమ్మతులు పూర్తయ్యాయి. కందివాగు, ఇస్నాపూర్, బీరంగూడ, అశోక్‌నగర్, బీహెచ్ఈఎల్ మెయిన్ గేట్, హుడా కాలనీ చందానగర్ ప్రాంతాల్లో రిపేర్లు పూర్తయ్యాయి. ఈ పనులు చేపట్టడానికి మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేశారు. తగిన యంత్రాలు, కార్మికుల సాయంతో జలమండలి అధికారులు, సిబ్బంది రికార్డు స్థాయిలో 12 గంటల్లో పనులు పూర్తి చేసి కలబ్‌గూర్ నుంచి 'రా వాటర్' సరఫరాను ప్రారంభించారు. రాజంపేట్‌లో ఫిల్టరేషన్ తర్వాత అర్ధరాత్రి 2 గంటల సమయంలో పటాన్‌చెరుకు.. అక్కడి నుంచి షట్‌డౌన్ నిర్ణయించిన సమయం కంటే ముందే.. తెల్లవారుజామున 4 గంటల సమయంలో లింగంపల్లికి నీటిని సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రికార్డు స్థాయిలో 12 గంటల్లో మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించిన అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాగే కష్టపడి పని చేయాలని సూచించారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

ఇబ్రహీంపట్నం: డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శేరిగూడ పరిధిలోని మల్లికార్జున కోళ్ల ఫీడింగ్ మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన ఆకాశ్(20) ఏడాదిగా పనిచేస్తున్నాడు. సోమ వారం మిల్లు నుంచి కోళ్ల దానా లోడుతో డీసీఎం వ్యాన్ వెలుపలికి వస్తోంది. ఈ క్రమంలో యువకుడు వాహనం ఎక్కే యత్నం చేయగా.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదవశాత్తు కిందపడ్డారు. దీంతో అతని పై నుంచి ముందు టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

శామీర్‌పేట్: ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట మండలం, మజీద్‌పూర్ గ్రామానికి చెందిన బిలాష్ కుమార్ బోయి (25) స్థానికంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అతను తన ఇంట్లో దూలానికి టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

అభినందన


బానోత్ ధర్మ

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థి సేవల విభాగ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బానోత్ ధర్మ ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో), స్కూల్ బోర్డు ఆఫ్ మెంబర్గా ఎన్నికై రెండు సంవత్సరాలపాటు కొనసాగనున్నారు. విశ్వవిద్యాలయ అధికారులు డాక్టర్ బానోత్ ధర్మను అభినందించారు.

ఆలయంలోని మడిగె, రూంలకు వేలంపాట



శ్రీనగర్కాలనీ: ఎల్లారెడ్డిగూడ విజయదుర్గ దేవాలయ ప్రాంగణంలోని మడిగె, రూంలకు సోమవారం టెండర్ను వేలంపాట ద్వారా నిర్వహించారు. మడిగెను స్థానికుడు శ్రావణ్గౌడ్, రూంను సుదర్శన్లు దక్కించుకున్నారు. వారికి ఈఓ విఠలయ్య, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ అన్నారావు, ఆలయ కమిటీ చైర్మన్ గొంటి లక్ష్మీయాదవ్, గొంటి శ్రీనివాసయాదవ్లు టెండర్ పత్రాలను అందించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల వసతులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. స్థానికుల నేతలు గొంటి సాయినాథ్ యాదవ్, శ్రీనివాస్, మనోజ్ యాదవ్, కిరణ్ యాదవ్, కన్యాకుమారి, చిన్నా ముదిరాజ్, హరి, ప్రసాద్ యాదవ్, పవన్, మహేష్, కృష్ణమోహన్, విక్రమ్యాదవ్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వస్త్ర ప్రదర్శన



శ్రీనగర్కాలనీ: శ్రీనగర్కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగ్దీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్పో-2025 నేటితో ముగియనున్నది. దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్గుప్తా తెలిపారు.

జిమ్నాస్టిక్స్లో గోల్డ్మెడల్స్




సాక్షి, సిటీబ్యూరో: అమీర్పేటలోని గురుగోబింద్ సింఘ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్లో ఆదివారం నిర్వహించిన ఫ్లోర్ ఎక్సర్సైస్ బాయ్స్ అండ్ గర్ల్స్ జిమ్నాస్టిక్ పోటీలో శ్రీసాయిరామ్ హైస్కూల్, బంజారాహిల్స్ బ్రాంచ్లో 9వ తరగతి చదువుతున్న శ్రీవిద్య, 7వ తరగతి చదువుతున్న పి.ప్రజ్వల్ కుమార్ బంగారు పతకాలు సాధించారు. సీనియర్ జిమ్నాస్టిక్ కోచ్ బ్రహ్మనంద ప్రసాద్ చిన్నారులకు అభినందనలు తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ

బంజారాహిల్స్: టీఎస్పీఈ యూనియన్ 1535 కేలండర్ను సోమవారం సీఎండీ ముషారఫ్ అలీ ఆవిష్కరించారు. టీజీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు ప్రమోద్, సెక్రటరీ కీర్తి శ్రీనివాస్, సోనీ, అనూష, శైలజ, లక్ష్మీ సురేష్ రాజు, లింగం, నగేష్, స్వరూప, కోటి, రాజేంద్ర సూరజ్, వసంత, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఎంజేసీఈటీలో ఆలోచింపజేసిన ఐఎఫ్డీపీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంజేసీఈటీ)లో 'జనరేటివ్ ఏఐ ఇన్నోవేషన్ అండ్ అప్లికేషన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' అనే అంశంపై అంతర్జాతీయ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఐఎఫ్డీపీ) జరిగింది. శోధ్గురు ఇంటర్నేషనల్, పాంటెక్ లెర్నింగ్, ఎంజేసీఈటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జెన్ ఏఐ పయనీర్ సీఈఓ ఉమామహేశ్వర్దేసు ముఖ్యఅతిథిగా హాజరై దీనిని ప్రారంభించారు. జనరేటివ్ ఏఐ, దాని ప్రభావం, భవిష్యత్తు ప్రణాళిక, ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల చొరవ, పరిశ్రమ చొరవ, జెన్ ఏఐ ఉద్యమంలో కళాశాలలు పాల్గొనవల్సిన ఆవశ్యకత గురించి బోధనా సిబ్బందికి వివరించారు. బోర్డు సభ్యుడు జస్టిస్ ఇబ్రహీం సిద్దిఖీ, ఎంజేసీఈటీ ప్రిన్సిపాల్ మహిపాల్సింగ్ రావత్, అకాడమిక్స్ డీన్ హమ్రాజ స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఫెర్హతుల్లా హుస్సేనీ, రిజిస్ట్రార్ కేవీ నర్సింహారావు, ఐఎఫ్డీపీ కన్వీనర్ సయ్యద్ షబ్బీర్ అహ్మద్, సమన్వయకర్త డాక్టర్ తస్నీమ్ బానో రెహ్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ఓటర్లు 1,980

ఖైరతాబాద్లో 2,94,585..జూబ్లీహిల్స్లో 3,89,954 మంది ఓటర్లు

- ఓటరు తుది జాబితాను విడుదల చేసిన అధికారులు
- రెండు నియోజకవర్గాల్లో పెరిగిన యువ ఓటర్లు
- తగ్గిన సీనియర్ సిటిజన్స్ ఓటర్ల సంఖ్య


తుది ఓటరు జాబితాను విడుదల చేస్తున్న ఖైరతాబాద్ ఎన్నికల అధికారిణి ప్రశాంతి

బంజారాహిల్స్: సవరించిన ఓటర్ల జాబితా (2025)ను రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం ఓటర్లు 2,94,585 మంది ఉన్నారు. ఇందులో కొత్తగా 843 మంది నమోదయ్యారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పుల ద్వారా 7,438 మందిని తొలగించారు. కొత్త ఓటర్లలో పురుషులు 1,52,412, మహిళలు 1,42,136, ఇతరులు 37 మంది ఉన్నారు. అలాగే ఈ జాబితాలో సీనియర్ సిటిజన్ ఓటర్లు 3,004 మంది, యువ ఓటర్లు 2,617 మంది, దివ్యాంగులు 1,772 మంది ఉన్నారు. అక్టోబర్ 29న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఈ నియోజకవర్గంలో 3,01, 160 మంది ఉన్నారు. తుది జాబితాలో సుమారుగా 7,000 మంది ఓటర్లు తగ్గిపోయారు. మార్పులు చేర్పుల అనంతరం తుది జాబితా విడుదల చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికి తిరిగి ఓటర్లు ఉన్నారో లేదో ప్రత్యక్షంగా తెలుసుకుని లేకపోతే జాబితా నుంచి తొలగించారు. కొత్త ఓటర్లు నమోదు చేయించుకున్నారు. దీని ప్రకారం యువ ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో..

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్పేట, యూసుఫ్గూడ, వెంగళరావునగర్, రహమత్నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,89,954 మంది తుది జాబితాలో ఉన్నారు. కొత్తగా 1137 మంది జాబితాలో చేరారు. 470 మందిని వివిధ కారణాల వల్ల తొలగించారు. అక్టోబర్ 29వ తేదీన విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఈ నియోజకవర్గంలో 3,89,287 మంది ఉండగా, తుది జాబితాలో మరో 700 మంది చేరారు.

సర్వే సిబ్బందికి ఎవరూ డబ్బులు ఇవ్వొద్దు

- రహమత్నగర్ వార్డు ఏఎంసీ బాలరాజు


మాట్లాడుతున్న ఏఎంసీ బాలరాజు

రహమత్నగర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం వచ్చే జీహెచ్ఎంసీ సిబ్బందికి ఎవరూ డబ్బులు ఇవ్వకూడదని, ఏ ఉద్యోగైన డబ్బులు డిమాండ్ చేస్తే తమకు తెలియజేయాలని రహమత్నగర్ వార్డు ఏఎంసీ బాలరాజు పేర్కొన్నారు. రహమత్నగర్ వార్డు కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రజాపాలనలో రహమత్నగర్ డివిజన్ నుంచి దాదాపు 12 వేలమందికి పైగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులోభాగంగా డిసెంబర్ 20వ నుంచి జీహెచ్ఎంసీ సిబ్బంది ఇంటింటి సర్వేను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. డివిజన్లో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలో దాదాపు 3వేల మంది దరఖాస్తుదారులకు వివరాల తమ సిబ్బంది సేకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం తమకు అందించిన లిస్టులో ఉన్న దరఖాస్తుదారునికి నివాసానికి వెళ్లి వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. సంక్రాంతిలోపు తాము సర్వేను పూర్తి చేయాలని భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం గడువు పెంచితే మరికొన్ని రోజులు సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రజపాలనలో దరఖాస్తు చేసుకున్న చాలామంది పేర్లు లిస్టులో లేకపోవడాన్ని తాము ఉన్నతాధికారులు తెలియజేయడం జరిగిందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు మాత్రమే నిర్ణయం తీసుకుంటారని బాలరాజు తెలిపారు. సర్వే పూర్తిగా నిష్పక్షపాతంగా జరుగుతున్నదని ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎంజేసీఈటీలో ముగిసిన హ్యాకథాన్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంజేసీఈటీ) ప్రాంగణంలో రెండు రోజులపాటు జరిగిన వార్షిక హ్యాకథాన్ సోమవారం ఘనంగా ముగిసింది. ఎంజేసీఈడీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం సీఎస్ఐ చాప్టర్, ఎంటర్ ప్రెన్యూర్షిప్ సెల్, ఎంహెచ్ఆర్డీకి చెందిన ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ)ల సహకారంతో జరిగిన ఈ హ్యాకథాన్లో సీబీఐటీ, సీఎంఆర్, వీజేఐటీ, సీవీఆర్, కేఎంఐటీ, ఎస్జీఐటీ, నారాయణమ్మ, వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి, మాతృశ్రీ, డెక్కన్, ఐఎస్ఎల్, లార్డ్స్ తదితర కళాశాలల నుంచి మొత్తం 300 మంది విద్యార్థులు పాల్గొని ఆయా అంశాల్లో ప్రతిభ చాటారు. సృజనాత్మకత, సాంకేతిక ఆవిష్కరణలను సాధించడమే లక్ష్యంగా ఈ హ్యాక్థాన్లో విద్యార్థులు పోటీపడ్డారు. ముగింపు సెషన్లో విజేత జట్లకు మూడు లక్షల నగదు అవార్డులను అందజేశారు. ఓపెన్ ఇన్నోవేషన్ సాఫ్ట్వేర్, ఓపెన్ ఇన్నోవేషన్ హార్డ్వేర్లో సెరిబ్రల్ సింక్, ది ఎలైట్లు రూ.35,000 చొప్పున, పెంటాస్టిక్ 4, టీమ్ ఎక్స్ట్రాన్లు రూ.25,000ల చొప్పున, పిక్సెల్ పోర్జ్, కాగ్నిషన్ రోబోటిక్స్ రూ.10,000, స్టిక్కీ ఫింగర్స్, సెంటినెల్, రోబోవిజార్డ్స్ టీమ్లు రూ.5000ల చొప్పున నగదు బహుమతులు గెలుచుకున్నారు. అలాగే గ్రామీణాభివృద్ధి, వ్యర్థాల నిర్వహణ ఆరోగ్య సంరక్షణలో టీమ్ వాయిస్, టీమ్ ఎంపవర్హెర్లు రూ.35,000ల చొప్పున, అడాకోడ్, జెన్కోడర్లు రూ.25,000, హెక్స్టెక్, టెక్స్కిన్లు రూ.10,000, రోకాట్స్, అసెన్షన్లు రూ.5000ల చొప్పున సాధించాయి. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావీద్,, ఎంజేసీఈటీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహిపాల్సింగ్ రావత్, ప్రొఫెసర్ సయ్యద్ ఫెర్హతుల్లా హుస్సేనీ, సీఎస్ఈ హెడ్ డాక్టర్ సయ్యద్ షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించాలి


కాచిగూడ: బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దేశంలో బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా యువత ముందుకు రావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కోరారు. సోమవారం బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘానికి అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బోను దుర్గా నరేష్కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భీమవరపు సురేష్, భీమవరపు హేమ, రామలింగం, ఆవుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బ్యాంకు కేలండర్ ఆవిష్కరణ



పంజగుట్ట: తిరుమల బ్యాంకు 2025 నూతన సంవత్సర కేలండర్ను సోమవారం రాజ్భవన్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, జితేందర్ తివారీలు గవర్నర్కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి బ్యాంకు మూడో బ్రాంచ్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేదర్నాథ్ నుంచి వచ్చిన సద్గురు దయానిధి స్వామి పాల్గొన్నారు.

సమాజ్వాదీ పార్టీ ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సింగ్రావు


నియామక పత్రం అందుకుంటున్న నర్సింగ్రావు

బంజారాహిల్స్: సమాజ్వాదీ పార్టీ ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మదిరె నర్సింగ్రావు నియమితులయ్యారు. లక్నోలోని సమాజ్వాదీ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్యాదవ్ ఆదేశాల మేరకు సమాజ్వాదీ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, మాజీ మంత్రి వ్యాస్జి గోండ్ చేతుల మీదుగా నర్సింగ్రావు నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా లక్నోలోని సమాజ్వాదీ పార్టీ కేంద్ర కార్యాలయంలో నగరానికి చెందిన సామాజిక వేత్త, సమాజ్ వాదీ పార్టీ సీనియర్ నేత దండుబోయిన నిత్య కళ్యాణయాదవ్తో కలిసి నర్సింగ్రావు సోమవారం అఖిలేష్యాదవ్ను కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో సమాజ్వాదీ పార్టీ సిద్ధాంతాలను వివరిస్తూ పార్టీ పట్ల యువతను, మహిళలను రైతులను ఆకర్షించేవిధంగా కృషి చేయాలని అఖిలేష్యాదవ్ సూచించారు. కళ్యాణ్యాదవ్ మాట్లాడుతూ త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలతో పాటు పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిఆపరు. నర్సింగ్రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులకు, గిరిజనులకు సమాజ్వాదీ పార్టీ సిద్ధాంతాలను వివరిస్తూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని, తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద పదవిని తనకు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ సభ జాతీయ అధ్యక్షుడు రాహుల్ నగమ్ వసి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఉత్పత్తులపై 50 శాతం రాయితీ



బంజారాహిల్స్: నందగిరిహిల్స్ రోడ్డునెంబర్-69లోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఉత్పత్తులపై 50శాతం రాయితీని ప్రకటించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఈ రాయితీ సౌకర్యం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రజాసేవలో నేతలు ముందుండాలి


మైనారిటీ నాయకులకు సన్మానిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్నగర్: పదవులు పొందిన నేతలు ప్రజాసేవలో ముందుండాలని రహమత్నగర్ కార్పొరేటర్ సీఎన్రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా మన్సూర్ఖాన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపాధ్యక్షునిగా ఎక్బాల్, రహమత్నగర్ డివిజన్ అధ్యక్షుడిగా నియామకమైన అహ్మద్లను సోమవారం తన కార్యాలయంలో సీఎన్రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువకులైన ముగ్గురు నేతలకు పదవులు రావడం ఆనందంగా ఉందన్నారు. పదవులు పొందిన వీరు పార్టీ కోసం శ్రమించాలని సూచించారు.

శుభాకాంక్షలు



రహమత్నగర్: హైద్రాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా. గౌతంరావు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ వేడుకల్లో పాల్గొని గౌతంరావు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంభాల గంగరాజు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

మధూస్ రెస్టారెంట్లో అగ్నిప్రమాదం



పంజగుట్ట: గ్రీన్ల్యాండ్స్ కూడలి వద్ద ఉన్న వైట్హౌస్ భవనంలోని మధూస్ రెస్టారెంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన మధు ఎనిమిది సంవత్సరాలుగా వైట్హౌస్ భవనంలోని ఏబ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్లో మధూస్ కిచ్చన్ పేరుతో రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం కిచెన్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. స్వల్ప అగ్ని ప్రమాదమే కావడంతో పెద్ద ముప్పు తప్పింది.

క్రైం కార్నర్..

బాలికపై లైంగిక దాడి

వెంగళరావునగర్: ఒంటరిగా ఉన్న బాలికపై లైంగిక దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. మధురానగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... రహమత్నగర్లో నివాసం ఉండే దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తెకు వివాహం అయింది. మిగిలిన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు చదువుకుంటున్నారు. ఈనెల 2వ తేదీన దంపతులు పనికి వెళ్లారు. ఇద్దరు పిల్లలు స్కూల్కు వెళ్లగా, రెండో కుమార్తె మాత్రం కడుపునొప్పితో బాధపడుతూ స్కూల్కు వెళ్లలేదు. విషయాన్ని తెలుసుకున్న బాలిక స్నేహితుడు బాలిక ఇంటికి వచ్చి బలవంతంగా అత్యాచారం చేశాడు. విషయాన్ని ఆ బాలిక తల్లికి తెలియజేసింది. దీంతో బాలిక తల్లి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్యూసీఎఫ్ఐకి రెండు వరల్డ్ అవార్డులు

పంజగుట్ట: దేశంలోనే మొదటిసారి క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) సంస్థకు అమెరికాకు చెందిన వరల్డ్ రికార్డ్స్ యూనియన్ వారు రెండు అవార్డులు ఇచ్చినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.కె.శ్రీవాత్సవ, డైరెక్టర్ మనోహర్, చేతన్ చితాల్కర్, మాజీ డైరెక్టర్ శ్రీనివాసన్లు మాట్లాడుతూ తామది లాభాపేక్ష లేని సంస్థఅని తమ సంస్థలో 2వేలకు పైగా పెద్ద, మధ్యతరహా, చిన్న సంస్థలు జీవితకాల సభ్యత్వం తీసుకుని వాటివ్యాపార అభివృద్ధిని మెరుగుపరచడంలో అద్భుత ఫలితాలు సాధించాయని తెలిపారు. దేశచరిత్రలో నాణ్యత సూత్రాల జాతీయ కన్వెన్షన్లో 12వేల మందికి పైగా పాల్గొని ఒక అవార్డు, నాణ్యత ప్రమాణాలపై అత్యధిక 5వేలకు పైగా కార్యక్రమాలు పూర్తిచేసి మరో అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సోదరి డీపీ పెట్టి... రూ.75వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

వెంగళరావునగర్: వాట్సాప్లో సోదరి డీపీ పెట్టి ఓ మహిళ నుంచి ఆన్లైన్ మోసగాళ్లు రూ.75 వేలు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. మధురానగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... సిద్ధార్థనగర్ పార్కు ఎదురుగా నివసించే మాధురీ కాజా ప్రైవేట్ జాబ్ చేస్తుంది. ఈనెల 5వ తేదీ ఉదయం తన సోదరి వాట్సాప్ డి.పి.తో గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. అత్యవసరంగా రూ.75 వేలు డబ్బులు కావాలని, మెడికల్ ఎమర్జెన్సీ అని అందులో పేర్కొంది. తన సోదరి వేరే నెంబర్ తీసుకుందని భావించిన మాధురి ఆ నెంబర్కు రూ.75 వేలు ట్రాన్స్ఫర్ చేసింది. అనంతరం ఆమెకు ఫోన్ చేయగా తన వద్ద సిగ్నల్స్ లేవని, సోమవారం మాట్లాడతానని చెప్పింది. అనంతరం విచారించగా సైబర్ నేరగాళ్లు దోచుకున్నట్టుగా గుర్తించింది. దీంతో బాధితురాలు సైబర్ పోలీసులకు సమాచారం అందించి మధురానగర్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


రసలాల్ పాస్వాన్

బంజారాహిల్స్: పనినిమిత్తం బీహార్ రాష్ట్రం నుంచి నగరానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రం మధుబని రాజ్నగర్కు చెందిన రసలాల్ పాస్వాన్ (45) హౌస్ కీపింగ్ పని చేస్తుంటాడు. అయితే పనినిమిత్తం గత నెల 28న నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11లోని గౌరీ శంకర్నగర్లో తన సోదరుడి కొడుకు వివేక్ ఇంట్లో ఉంటున్నాడు. గతనెల 31వ తేదీ ఉదయం నుంచి పాస్వాన్ కనిపించడం లేదు. దీంతో రాయదుర్గంలో ఉండే పాస్వాన్ కుమారుడు ధనిక్లాల్ పాస్వాన్కు సమాచారం అందించగా ఆయన చుట్టుపక్కల గాలించినప్పటికీ ఫలితం లభించలేదు. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ బెడ్రూం పేరుతో రూ. 16లక్షలు వసూలు

వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఇప్పిస్తానంటూ పలువురి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న నాగరాజరెడ్డి తనకు ప్రభుత్వంలో పెద్ద వ్యక్తులు తెలుసునని, డబుల్ బెడ్రూమ్లు ఇప్పిస్తానని అయితే కొంత మొత్తాన్ని ముట్టజెప్పాల్సి ఉంటుందని తోటి ఉద్యోగులను నమ్మించాడు. దీంతో ఆ సంస్థలో పనిచేసే ఎలక్ట్రిషియన్ సుధాకర్ పట్టితో పాటు మరో 8 మంది ఉద్యోగులు అతని మాటలు నమ్మి డబుల్ బెడ్రూమ్ల కోసం మొత్తం రూ.16, 64,000లు నాగరాజరెడ్డికి చెల్లించారు. అయితే అటు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పించక, ఇటు తమ డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండటంతో బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అవకాశం ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన మృగనయిని మహేశ్వరీ, చందేరీ ఫెస్టివల్ ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది. చీరల కొనుగోలుపై 20 శాతం తగ్గింపు ధరలకు అందజేస్తున్నారు.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ నందగిరిహిల్స్ రోడ్ నం–69లోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్‌లో కళా ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది. ఈ ఉత్పత్తులపై 50 శాతం వరకు రాయితీ ఇస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కాస్త సమయం.. హాయి జీవితం

ఆరోగ్యం కోసం నిత్యం గంట సమయం కేటాయించాలి
అన్ని వయసుల వారికి శారీరక శ్రమ అవసరం
మెనూలో పోషకాహారం తప్పనిసరి ఉండాలి
నగర శివారు ప్రాంతాల్లో పెరిగిన వాకర్స్

రోజురోజుకూ మారుతున్న ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, శారీరక శ్రమ తగ్గిపోవడం తదితర కారణాలతో మనుషులను రోగాలు చుట్టుముడుతున్నాయి. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకున్నా.. ఆస్పత్రి పాలైతే రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం ఎంత బిజీగా ఉన్నా కాస్త సమయం ఆరోగ్యం కోసం కేటాయిస్తే జీవితం హాయిగా సాగిపోతుంది. **మరీ ముఖ్యంగా చలికాలంలో ఆరోగ్యంపై మరింత శ్రద్ధ అవసరం అని వైద్య నిపుణులు అంటున్నారు. పోషకాహారం తీసుకుంటే మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని వారు సూచిస్తున్నారు.** – సాక్షి, సిటీబ్యూరో



డబ్బు పొదుపు త్వరగా ప్రారంభిస్తే విశ్రాంత జీవితం వరకు పెద్ద మొత్తం సమకూరుతోందని ఆర్థిక నిపుణులు చెబుతారు. ఉద్యోగం రాగానే, ఉపాధి దొరకగానే చిన్న మొత్తంలోనైనా పొదుపు చేయడం ప్రారంభించాలని సూచిస్తారు. అలాగే ఆరోగ్యం విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చిన్న వయస్సు నుంచి పోషకాహారం, వ్యాయామం, ఆటలు అలవాటు చేసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తవు.



◆ నగరంతో సహా శివారుల్లో కొందరు నడకకు పరిమితమైతే.. మరికొందరు జిమ్‌ల్లో కసరత్తుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇంకొందరు ఆటలు చాలనుకుంటారు. కానీ అన్ని రకాల వ్యాయామాలు చేసినప్పుడే శరీరానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వారంలో మూడు రోజులు గుండె వ్యాయామం కోసం నడక, పరుగు, సైక్లింగ్‌తో పాటు కండపుష్టి కోసం మూడు రోజులు బరువులు లేపే కసరత్తులు అవసరమని పేర్కొంటున్నారు. యోగా, ప్రాణాయామం కూడా జత చేస్తే ఆరోగ్యం సొంతం అవుతుందంటున్నారు.

నిత్యం గంట చాలు

భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా సంపాదనలో పొదుపునకు కేటాయించిన తర్వాతే మిగతా మొత్తం ఖర్చు చేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తారు. వ్యాయామం విషయంలోనూ ఇదే పద్ధతి అవలంభించాల్సి ఉంటోంది. రోజుకు 23 గంటలు అన్నట్లుగా ప్రణాళిక వేసుకుని, మిగతా ఒక గంట మాత్రం ఖచ్చితంగా ఆరోగ్య పరిరక్షణ కోసం రోజూ వ్యాయామం కోసం సమయం కేటాయిస్తేనే ఊబకాయం వంటి సమస్యలు, జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చని పేర్కొంటున్నారు.

నగర శివారుల్లో ఇలా..

గ్రేటర్‌తో సహా శివారుల్లోని పురపాలికలు, గ్రామ పంచాతీల్లో ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. అలాగే, పార్కులు, లంగ్స్ స్పేస్‌ల్లో వాకింగ్ ట్రాక్‌లు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలతో సహా కాలనీలు, మైదానాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో కూడా పల్లె, పట్టణ, ప్రకృతి వనాలు, వ్యాయామం చేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. యోగా శిక్షణ కేంద్రాలకు తోడు సొంతంగా యోగాసనాలు, ధ్యానం వంటివి సాధన చేస్తున్న వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ప్రతినిత్యం వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.

నడకతో ఆరోగ్యానికి ఎంతో మేలు

నడక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఉదయం గంట సేపు, సాయంత్రం అర గంట వాకింగ్ చేస్తాను. దాదాపు పదేళ్ల నుంచి వాకింగ్ చేస్తున్నాను. వర్షం వచ్చినా సరే.. కనీసం గంట సేపు వాకింగ్ చేస్తాను. అలాగే, వ్యాయామం, అప్పుడప్పుడు యోగా చేస్తున్నాను. మా కాలనీలోని మిత్రులను కూడా వాకింగ్‌కు తీసుకెళ్తున్నాను. నడకతో ఉత్సాహం పెరుగుతోంది. ఎల్లప్పుడూ ఆనందం, మానసిక ప్రశాంతంగా ఉంటాను.

– ఎం.శ్రీనివాస్‌రావు, భవానీనగర్, కాప్రా.

రోజంతా ఉత్సాహంగా ఉంటా

యోగా చేయడం వల్ల రోజంతా ఉత్సాహం ఉంటుంది. శరీరం ఫిట్‌గా ఉంటుంది. మానసిక ప్రశాంతత వల్ల విధుల నిర్వహణతో పాటు రోజు వారిగా చేసే పనులను సులభంగా.. అవలీలగా చేస్తున్నట్లు అనిపిస్తోంది. పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులందరం ప్రతిరోజూ యోగా చేస్తాం. నేను 15 ఏళ్లుగా యోగా చేస్తున్నాను. అనారోగ్య సమస్యలు తలెత్తలేదు. ఆరోగ్యంతో సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నాం.

– బి.శ్రీనివాస్‌రెడ్డి, కీసర

నిమ్స్‌లో మీడియా సెంటర్

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో జర్నలిస్టుల కోసం మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేశామని నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.లక్ష్మీ భాస్కర్ తెలిపారు. ఆస్పత్రిలోని సమాచారం కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన మీడియా సెల్ సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా లక్ష్మీభాస్కర్ మాట్లాడుతూ.. కవరేజీ కోసం వచ్చే జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ మీడియా సెల్ కేంద్రంగా పర్యవేక్షించేందుకు నోడల్ అధికారి, కో ఆర్డినేటర్లు పనిచేస్తారని చెప్పారు. సమాచారం సేకరణ కోసం వచ్చే జర్నలిస్టులు పార్కింగ్‌తో పాటు పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇక నుంచి వైద్యులు ఇంటర్వ్యూలు, విజయవంతమైన ఆపరేషన్లు, వివిధ వైద్య విభాగాలకు సంబంధించిన అవగాహన సదస్సులు, ఇతర కార్యక్రమాలకు హాజరయ్యే జర్నలిస్టులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా యాజమాన్యం అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నగర పారిశ్రామికవేత్తకు అత్యున్నత గుర్తింపు

'టై' గ్లోబల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల చైర్మన్‌గా మురళి బుక్కపట్నం



రాయదుర్గం: ప్రపంచంలోనే అతిపెద్ద పారిశ్రామికవేత్తల నెట్‌వర్క్ అయిన 'టై' సంస్థకు 2025 సంవత్సరానికి గ్లోబల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల చైర్మన్‌గా మురళీ బుక్కపట్నం ఎన్నికయ్యారు. హైదరాబాద్‌కు దక్కిన గొప్ప గౌరవం. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవస్థాపక సంస్థ అయిన సిలికాన్ వ్యాలీలో 1992లో ఏర్పాటు చేసిన ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్('టై') గ్లోబల్‌కు ఆయన నాయకత్వం వహిస్తారు. ఒక హైదరాబాదీ పారిశ్రామికవేత్త ఇంత ఉన్నత స్థానానికి చేరుకోవడం గర్వకారణమని టై సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. టై అనేది ఒక లాభాపేక్ష లేని సంస్థగా 15 దేశాల్లోని 65 నగరాల్లో 10వేల మంది సభ్యులను కలిగి ఉంది.

చర్లపల్లిలో రహదారి భద్రతపై అవగాహన



రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం ఉప్పల్ ప్రాంతీయ రవాణా కార్యాలయం పరిధిలోని చర్లపల్లిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంవీఐలు ఉమ, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

బాలిక గుండె–ఊపిరితిత్తుల మధ్య కణతి తొలగింపు

కొండాపూర్ కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

గచ్చిబౌలి: 15 ఏళ్ల బాలిక గుండె– ఊపిరితిత్తుల మధ్య కణతి, గుండె గోడలకు పెద్ద రంధ్రం ఉండటంతో రెండు రకాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురైంది. కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్‌లో చీఫ్ కార్డియోథెరాసిక్ సర్జన్ డాక్టర్ నిసర్గ, కన్సల్టెంట్ మినిమల్ ఇన్వేజివ్, ఆంతో థెరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్‌రెడ్డి అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన కూలి పనులు చేసుకునే దంపతుల కుమార్తెకు పుట్టుకతోనే గుండె సంబంధ సమస్యలు ఉన్నాయి. పుట్టుకతోనే గుండె గోడకు రంధ్రం(ఏఎస్‌డీ) ఉండటాన్ని గుర్తించలేదు. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో స్థానిక వైద్యుల సూచన మేరకు కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చారు. ఏఎస్‌డీ సమస్యతో పాటు ఊపిరితిత్తుల వద్ద కణతి ఉన్నట్లు గుర్తించారు. టెరటోమా కణతిని శస్త్ర చికిత్స చేసి తొలగించారు. తర్వాత గుండె గోడకు ఉన్న రంధ్రాన్ని పూడ్చి శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. ఐదు రోజుల అనంతరం బాలికను డిచ్ఛార్జి చేసినట్లు డాక్టర్లు తెలిపారు.

అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలి



బీజేపీ రాష్ట్ర కార్యాలయ ముట్టడికి వెళ్తున్న చెన్నయ్య తదితరులు

మాల సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి

గన్‌ఫౌండ్రీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా కొనసాగే నైతిక అర్హత లేదని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం మాల సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడటంపై మండిపడ్డారు. తక్షణమే యావత్ సమాజానికి క్షమాపణలు చెప్పాలని, మంత్రి మండలి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యాలయం ముట్టడికి యత్నించిన జేఏసీ ప్రతినిధులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ కో చైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లు, చెరుకు రాంచందర్, గోపోజు రమేష్, ఇందిరా, లలిత పాల్గొన్నారు.

9న సింగపూర్‌లో ఉద్యోగాల కోసం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

విజయనగర్‌కాలనీ: సింగాపూర్‌లో మేసన్స్, స్టీల్ ఫిక్సర్‌ల ఉద్యోగాల భర్తీకి ఈ నెల 9న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టాంకాం) జనరల్ మేనేజర్ కె.నాగభారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీసం ఎస్సెస్సీ ఉత్తీర్ణతతో పాటు 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు అర్హులు. ఇంతకుముందు సింగపూర్‌లో పనిచేసి వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలకు మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలోని టాంకాం కార్యాలయంలో అమలులో పాస్‌పోర్ట్‌తో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలతో నేరుగా హాజరుకావాలన్నారు. వివరాలకు 94400 50951/49861/51452 నంబర్లలో సంప్రదించవచ్చు.

చేయని నేరానికి దెబ్బలుతిన్న కార్మికుడికి పరిహారం

నిమ్స్ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు

లక్డీకాపూల్: రోగి బంగారు గొలుసు పోయిందన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కార్మికుడు లింగయ్యకు పరిహారం చెల్లించారు. ఇటీవల ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్ వద్ద జరిగిన ఘటనపై కార్మికుడిని విచారించే క్రమంలో నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది పంజాగుట్ట పోలీసులకు అప్పగించిన సంగతి తెలిసిందే. కేసు విచారణలో పంజాగుట్ట పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో లింగయ్య తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు పొందుతున్న విషయం కూడా తెలిసిందే.. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్లు ఏకమై నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది పాల్పడుతున్న అవినీతి అక్రమాలను డైరెక్టర్ బీరప్ప దృష్టికి తీసుకువెళ్లినట్లు నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొంటున్నారు. దీనిపై తీవ్రంగా స్పందించిన నిమ్స్ డైరెక్టర్ లింగయ్య ఘటనకు బాధ్యుడైన నిమ్స్ సెక్యూరిటీ అధికారి రామారావుకు మెమో ఇవ్వడంతో పాటు బాధితుడికి రూ.లక్ష పరిహారం ఇప్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా బాధిత లింగయ్యకు పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వడానికి నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మీ భాస్కర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన సోమవారం నిమ్స్‌లో నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా లింగయ్యకు అన్ని విధాలుగా సహకారం అందించిన నిమ్స్ డైరెక్టర్ బీరప్పకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు బాలయ్య, వెంకటేష్ శ్రీనివాస్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌లో లీగల్ సర్వీసెస్ అథారిటీ స్టాల్ ప్రారంభం



ప్రారంభిస్తున్న జస్టిస్ సుజాయ్ పాల్

అబిడ్స్: 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన శాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ స్టాల్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్ పాల్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. లీగల్ సర్వీసెస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సామాన్య ప్రజలకు లీగల్ సర్వీసెస్ సేవలు అందించేందుకు ఈ స్టాల్ ఏర్పాటైందన్నారు. ప్రజలకు వివిధ రకాల న్యాయ సలహాలు, స్కీమ్స్ వంటి సేవలు అందిస్తారని వివరించారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రెటరి సీహెచ్ పంచాక్షరి, చీఫ్ జడ్జ్ వై.రేణుకా, జిల్లా జడ్జ్ శశిధర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.కళార్చన, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరి జలీల్ పాషా, కిరణ్‌కుమార్, శ్రీదేవి పాల్గొన్నారు.

దేశ రక్షణలో ఎంఈఎస్ అధికారుల పాత్ర కీలకం



ఎంఈఎస్ అధికారుల శిక్షణలో శశాంక్ గోయల్ తదితరులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్(ఎంఈఎస్) ఆఫీసర్ల కోసం ఫౌండేషన్ కోర్సును సోమవారం ప్రారంభించారు. పూణెలోని కాలేజ్ ఆఫ్ మిలిటరీ ఇంజినీరింగ్ స్పాన్సర్ చేసింది. ఈ కోర్సు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ మాట్లాడుతూ దేశ రక్షణలో ఎంఈఎస్ అధికారుల పాత్ర కీలకమన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో కొత్త సాంకేతికత, నిర్వాహక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఎంఈఎస్‌లో ఆఫీసర్ల పాత్ర కేవలం ఒక వృత్తి కాదని, మనం గొప్ప దేశాన్ని రక్షించే అత్యున్నత స్థాయిలో ఉంచే బృంద నాయకుల పాత్ర అని పేర్కొన్నారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా ఎంఈఎస్ అధికారులకు విధాన రూపకల్పన, ప్రజాపరిపాలన, ప్రభావంతమైన సేవా బట్వాడాకు అవసరమైన సాధనాలపై అవగాహన అందిస్తోందన్నారు. పాఠ్య, పాఠ్యేతర కార్యకలాపాలతో పాటు గ్రామాలు, స్థానిక సంస్థలు, ట్రెక్, క్రీడా సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఎంఈఎస్ అధికారుల వ్యక్తిత్వాన్ని మరింత పెంపొందిస్తుందన్నారు. సికింద్రాబాద్ ఆర్ అండ్ డీ అదనపు చీఫ్ ఇంజినీర్ కల్నల్ జే సతీష్ భరద్వాజ మాట్లాడుతూ అధికారులు ఎంఈఎస్‌లో ముఖ్యమైన భాగంగా నిలవడానికి, కార్యకలాపాలకు దోహదపడేందుకు, మన సైనిక మౌలిక సదుపాయాల భద్రత, కార్యచరణ నిర్ధారించడానికి, ప్రపంచ స్థాయి ఇంజనీరింగ్ పరిష్కారాలను అందించడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కీలకమైన వంతెనలను నిర్మించడం, సైనిక స్థావరాలను నిర్మించడం, కమ్యూనికేషన్ వ్యవస్థలను నిర్వహించడం, దేశ రక్షణలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీఎస్ కోర్సు డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ కందుకూరి ఉషారాణి, అకడమిక్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్బాస్ అలీ, కోర్సు డైరెక్టర్ చంద్రజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ టేబుల్ కేలండర్‌ను టీపీయూఎస్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద పద్మశాలి విద్యార్థులకు, పేద పద్మశాలి కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. వారి పరిధిలో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఇటీవలే రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఎన్నికల్లో మెజారిటీతో గెలిచిన ఎల్.నీరజాక్షిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్, ఉపాధ్యక్షుడు గుండు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కడవేరు లక్ష్మీపతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శిరందాసు కృష్ణయ్య, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



గిగ్ ఎకానమీ, కార్మికుల స్థితిగతులపై సెమినార్



చందానగర్: సవాళ్లు, అవకాశాలు, విధాన పరిష్కారాలు అనే పేరుతో కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో సెమినార్ నిర్వహించారు. గిగ్ కార్మికులు, క్యాబ్ డ్రైవర్లు, ఆల్ ఇండియా జీబీజీ వర్కర్స్ యూనియన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ మన ఆర్థిక వ్యవస్థల్లో రిటైల్ సేవా రంగంలో గిగ్ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పాత్ర పోషిస్తుందన్నారు. నీతి ఆయోగ్, నిపుణుల అభిప్రాయం ప్రకారం గిగ్ ఆర్థిక వ్యవస్థ దశాబ్దంలో 450 బిలియన్ డాలర్ల(రూ.37 లక్షల కోట్లు) టర్నోవర్‌తో దేశంలో వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. 77 లక్షల మంది తాత్కాలిక కార్మికులు, ఫ్రీలాన్సర్‌లకు ఉపాధి కల్పిస్తోందన్నారు. కార్మికులు ఎక్కువగా ఉబెర్, ఓలా, స్విగ్గీ, జొమాటో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఇతర డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లలో పని చేస్తున్నారన్నారు. దేశంలో ఈ సంఖ్య 2029–30 నాటికి 2.35 కోట్లకు, శ్రామికశక్తిలో 4.1 శాతం పెరుగుతుందన్నారు. గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ కింగ్‌షుక్, డెవలప్‌మెంట్ ఎకనామిస్ట్ డాక్టర్ పీఎస్ఎం.రావు, ఆల్ ఇండియా గిగ్, ప్లాట్‌ఫారం, యాప్ ఆధారిత వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ సలావుద్దీన్, ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు అవమానం

కుషాయిగూడ: చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులకు అవమానం జరిగింది. టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన శిలఫలకంపై స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్లను వేయకుండా రైల్వే అధికారులు మరిచారు. ఈ విషయం స్థానికంగా వైరల్‌గా మారింది. ఈ విషయంపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పందిస్తూ స్థానిక ఎమ్మెల్యేను విస్మరించడం అధికారుల విజ్ఞతకే వదిలేస్తానన్నారు. ఓ గొప్ప కార్యక్రమం జరుగుతున్న సమయంలో వివాదస్పదం చేయడం సరి కాదని భావించినట్లు తెలిపారు.

భర్తల సాయంతోనే సులభంగా సాధారణ ప్రసవం

కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యనిపుణుల వెల్లడి



కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో గర్భిణులు, వారి భర్తలు, వైద్య బృందం

రాయదుర్గం: మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి వారి ప్రసవం అయ్యేవరకు, ఆ తర్వాత కూడా వారికి భర్తల నైతిక మద్దతు చాలా అవసరం ఉంటుందని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్య నిపుణులు, కన్సల్టెంట్ గైనకాలజిస్టులు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ నిపుణులు వెల్లడించారు. గచ్చిబౌలిలోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి 'మామ్ టు బి కార్నివాల్–2025' పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 6 నెలల గర్భం ఉన్న 60 మంది మహిళలు వారి భర్తలు సంయుక్తంగా పాల్గొనడంతో ఆస్పత్రి ప్రాంగణమంతా సందడిగా మారింది. 'మామ్ టు బి కార్నివాల్–2025' కార్యక్రమం కిమ్స్ కడల్స్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ డీఎస్ నిఖితా రెడ్డి, డాక్టర్ కావ్యప్రియ వజ్రాల, డాక్టర్ సాహితీ బల్మూరి ఆధ్వర్యంలో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. క్లిష్టమైన ప్రసవాల సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. డెలివరీ సమయంలో ఎక్కువగా రక్తస్రావం అయినప్పుడు గర్భ సంచి తొలగించాల్సిన అవసరం లేకుండా యుట్రిన్ ఆర్టరీ ఎంబోలైజేషన్ పద్ధతితో గర్భసంచిని కాపాడే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా నెలలు నిండకుండా పుట్టిన పిల్లలను రక్షించడానికి లెవల్ ఫోర్ ఎన్ఐసీయూల సౌకర్యం ఉందన్నారు. ఇక్కడ 700 గ్రాముల కంటే తక్కువ బరువుతో పుట్టిన శిశువులకు విజయవంతంగా చికిత్స అందించి కాపాడినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

సంస్థ రుణం తీర్చుకుంటున్నా..

నళిని కుద్ర విండ్ టన్నెల్ సౌకర్యాన్ని ఆవిష్కరించిన బిట్స్ పిలానీ



సాక్షి, సిటీబ్యూరో: నా కెరీర్‌ను తీర్చిదిద్దడంలో బిట్స్ పిలానీ కీలక పాత్ర పోషించింది. నా ఎదుగుదలకు సహకరించిన సంస్థకు రుణం తీర్చుకునే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నానని గ్లింట్ సహ వ్యవస్థాపకుడు గౌతమ్ కుద్రా అన్నారు. ఏరోస్పేస్, ఆటోమోటివ్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో పురోగతికి రూపొందించిన నళిని కుద్ర విండ్ టన్నెల్ ఫెసిలిటీని బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనలను వేగవంతం చేయడం, ఏరోస్పేస్, క్వాంటం ఫిజిక్స్ రంగంలో నూతన ఆవిష్కరణలకు నళిని కుద్ర విండ్ టెన్నల్ ఫెసిలిటీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశిస్తున్నానన్నారు. ఏరోడైనమిక్స్, పునరుత్పాదక శక్తి, అధునాతన ఇంజినీరింగ్ పరిశోధనలు, ఆవిష్కరణలను నడపడానికి సహాయపడుతుందన్నారు. బిట్స్ పిలానీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వీ.రాంగోపాల్ రావు, బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ, పూర్వ విద్యార్థుల సంబంధాల డీన్–ప్రొఫెసర్ ఆర్య కుమార్, కాకతీయ శాండ్‌బాక్స్, సియెర్రా అట్లాంటిక్ సహ వ్యవస్థాపకుడు, గ్లోబల్ టెక్నాలజీ లీడర్ రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, మంగళవారం, 7, జనవరి, 2025

- అబ్బుర పరిచే కట్టడాలు, ఆర్కిటెక్చర్ వర్క్
- ప్రపంచంలోనే అతి పెద్ద మెడిటేషన్ కేంద్రం
- లక్షల మందికి ఒకే చోట ఉచిత శిక్షణ, వసతి
- దేశ, విదేశాల నుంచి సందర్శకుల రద్దీ
- రాష్ట్రపతి, ప్రధాన మంత్రి నుంచి ముఖ్యమంత్రి వరకూ సందర్శన




చుట్టూ ప్రకృతి అందాలు, విశాలమైన ఓపెన్ ఎయిర్ మందిరాలు, క్రీడా ప్రాంగణాలు, ఉచిత మెడిటేషన, వసతి సౌకర్యాలు, ప్రశాంతమైన వాతావరణం, అంతరించిపోనున్న మొక్క జాతుల నర్సరీ ఇది.. ప్రకృతి సోయగంగా విరాజిల్లుతున్న కన్హా శాంతి వనం.. 1,600 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటైన మందిరాల్లో లక్ష మంది ఒకే చోట, ఒకే సారి మెడిటేషన్ చేయడానికి అనువుగా మన హైదరాబాద్ కేంద్రంగా ఇది నిర్మితమైంది. నగర జీవనంలో ప్రతి ఒక్కరూ పలు రకాల ఒత్తిళ్లతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. విద్యార్థి నుంచి ఉద్యోగి, వ్యాపారి, గృహిణి, వృద్ధుల వరకూ ఇలా అన్ని వయసుల వారు ఒత్తిడి బాధితులే. దీనిని అధిగమించేందుకు మెడిటేషన్ ఓ చక్కని పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు. మానసిక సమస్యలను తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ మెడిటేషన్ ప్రాధాన్యతను గుర్తించాలి..ఈ నేపథ్యంలో కన్హా శాంతి వనం గురించిన మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీబ్యూరో

ప్రకృతి సోయగం.. కన్హా శాంతివనం..

పచ్చని పర్యావరణంలో మెడిటేషన్ కేంద్రం





కన్హా శాంతి ఆశ్రమం పర్యావరణం, ఆధ్యాత్మిక ప్రదేశం. సరళమైన జీవనానికి డెస్టినేషన్‌గా నిలుస్తుంది. ఆరోగ్యం, వివిధ అంశాలను ప్రోత్సహించే ఇంటరాక్టివ్ ప్రోగ్రామ్స్‌తో పాటు ఆధ్యాత్మిక శిక్షణ అందుబాటులో ఉంటుంది. వృద్ధులకు వెల్‌నెస్ సెంటర్, ఆయుర్వేద, నేచురోపతి, వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక ప్రధానంగా మెడిటేషనకేంద్రం నిర్మాణంలోనే ఓ ప్రత్యేకత ఉంది. వాతావరణ పరిస్థితులను సమతుల్యం చేయడానికి మెడిటేషన్ ఫ్లోర్ కింద నీటిని నిల్వ చేస్తారు. కనీసం మూడు రోజుల నుంచి 15 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో వసతి, భోజనం, అన్నీ ఉచితంగా అందజేస్తారు.

వివిధ దేశాల నుంచి..

ఈ మెడిటేషన్ ఆశ్రమానికి ప్రపంచంలోని 162 దేశాల్లో శాఖలు ఉన్నాయి. వివిధ కళాశాల విద్యార్థులు ఇక్కడ వర్క్‌షాప్ నిర్వహించడం, రీ ట్రీట్ ప్రోగ్రాం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పాటు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఇక్కడి మెడిటేషన్ తరగతుల్లో భాగస్వాములవుతున్నారు.

ప్రముఖులు సైతం..

రెండేళ్ల నుంచి నగరంలో ఈ పేరు అందరి నోటా నానుతోంది.. దీంతో పాటు మరెన్నో ప్రత్యేకతలు కన్హా శాంతి వనం సొంతం కావడంతో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు సైతం ఈ వనాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.

పోస్టల్ పిన్ కోడ్ ఆధారిత సేవలు..

హార్ట్‌ఫుల్‌గా మెడిటేషన్‌లో శిక్షణ తీసుకోవాలనుకునే సులువైన పద్ధతిలో శిక్షకులు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ వెబ్‌సైట్‌లో తపాలా శాఖ పిన్‌కోడ్ నమోదు చేయగానే అక్కడ ఉండే శిక్షకుల వివరాలు అందుబాటులోకి వస్తాయి. దీని ద్వారా కన్హా శాంతి వనంలో వారంలో రెండు బ్యాచ్‌లకు మెడిటేషన్ శిక్షణ పొందవచ్చు.

అబ్బురపరిచే ఆర్కిటెక్చర్..

కన్హా శాంతి వనం అబ్బురపరిచే ఆర్కిటెక్చర్‌కు అద్దం పడుతోంది. వర్షను నీటిని సైతం ఒడిసి పట్టేలా నిర్మాణాలు ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు.. ప్రస్తుత కన్హా వనం ప్రాంతం రెండు దశాబ్దాల క్రితం నెర్రెలు వారిన నేలలు కనిపించేవి. నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కానీ నేడు ఈ వనంలో వర్షపు నీరు చుక్క కూడా వృథా కాకుండా చుట్టూ కృత్రిమ చెరువులు నిర్మించారు. వాటినే గార్డెన్, మొక్కలు, రన్నింగ్ వాటర్, ఇతర అవసరాలకు వినియోగిస్తారు.

ఇలా చేరుకోవచ్చు..

నగరంలోని సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, శంషాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపిస్తోంది. సొంత వాహనాల్లో రావాలనుకునే వాళ్లు హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై తిమ్మాపూర్ వద్ద చేగూరు రోడ్డుకు తిరిగితే ఆశ్రమం చేరుకోవచ్చు.

మొదటి సారి వచ్చాను..



నా మిత్రులు శాంతి వనానికి పోదామన్నారు. ఇక్కడి వాతావరణం, మెడిటేషన్ కేంద్రం, అన్నీ బాగున్నాయి. వనంలో వివిధ ప్రాంతాలను సందర్శించడానికి ఉచిత వాహనం ఏర్పాటు చేశారు.
– వెంకటేశ్వర రావు, విశ్రాంత ఉద్యోగి, నాగోల్



ట్రైనర్‌గా 24 ఏళ్ల నుంచి..



కనీసం మూడు రోజులు మెడిటేషన్ ట్రై చేయండి. మార్పు మీకే కనిపిస్తుంది. గుండె, మెదడు రెండూ కలసి పనిచేస్తే ఆరోగ్యం. ప్రస్తుతం గుండె మాట మెదడు వినే పరిస్థితి కనిపించడం లేదు. గత 24 ఏళ్లుగా మెడిటేషన్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాను. బెంగళూరులో కొన్నాళ్లు, ఇక్కడ కొన్నాళ్లు శిక్షణ ఇస్తుంటాను. ఆన్‌లైన్‌లోనూ తరగతులు చెబుతాను.
– సునీతా ప్రసాద్, మెడిటేషన్ ట్రైనర్

ఇది సెక్యులర్ సిటీ..



కన్హా శాంతి వనంలో మెడిటేషన్ కోసం వచ్చే వారికి ఎలాంటి రుసుమూ వసూలు చేయడంలేదు. హైదరాబాద్ సెక్యులర్ సిటీ. సందర్శకుల్లో అన్ని వర్గాలనూ దృష్టిలో ఉంచుకుని ఉచిత శిక్షణ, వసతి సదుపాయం కల్పిస్తున్నాం. కేవలం రూ.10లకు భోజనం లభిస్తుంది. మూడు స్టార్ హోటల్స్ లోనూ భోజనం చేయవచ్చు. – కరుణాకర్, కన్హా శాంతివనం కో-ఆర్డినేటర్



నటన, మోడలింగ్ ఇష్టం



ఫరెవర్ మిసెస్ ఇండియా తెలంగాణ విజేత ఆది ఆంధ్ర రమాదేవి

సాక్షి, సిటీబ్యూరో: ఫరెవర్ మిసెస్ ఇండియా 2024లో ఆది ఆంధ్ర రమాదేవి తెలంగాణ రాష్ట్ర విజేతగా నిలిచారు. జైపూర్ జీ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఈ టైటిల్ గెలుచుకోవడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. నటన, మోడలింగ్ అంటే ఇష్టమని తెలిపారు. శివలీలలు టీవీ సీరియల్‌లో మునికన్య పాత్ర ఎంతో ప్రేరణ ఇచ్చిందన్నారు. 'నేను పక్కా తెలంగాణ పిల్లని, ఈ విషయాన్ని చెప్పుకోడానికి గర్విస్తాను. కాల్ సెంటర్లో, ఓ కన్సల్టెన్సీలో హెచ్ ఆర్ ప్రొఫెషనల్‌గా పనిచేశాను. పరిశ్రమలో అనుభవాన్ని సంపాదించాను' అని అన్నారు. తనకు గుర్తింపు తెచ్చిన డిజైనర్లకు ధన్యవాదాలు తెలిపారు.

కళలతో మానసిక ప్రశాంతత

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్

అమీర్‌పేట : ఎలాంటి కళ అయినా మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. అమీర్‌పేట హోటల్ గ్రీన్‌పార్క్ మ్యారీ గోల్డ్ హోటల్‌లో ఇకెబనా ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షిక పూల ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. కాండం, ఆకులు, పూలను మనసుకు హత్తుకునేలా అందంగా అమర్చడం ఇకెబనాలో మాత్రమే చూడగలమని అన్నారు. జపాన్‌లో ఉద్భవించిన సంప్రదాయ ఇకెబనా కళ ఆకులు, పువ్వులతో ముడిపడి ఉందన్నారు. 27 మంది ఇకెబనా సొసైటీ సభ్యులు 33 రకాల పూల మొక్కలను అమర్చిన తీరును గవర్నర్ ఆసక్తిగా తిలకించారు. ఇకెబనా అధ్యక్షులు వినీత కుమార్, ఉపాధ్యక్షులు సుకన్య రెడ్డి, ఉషా భాగియ, మీనాక్షి సుజనాని, హేమ పాట్కర్ పాల్గొన్నారు.



అలరించిన సింగిడి కల్చరల్ ఫెస్ట్

ప్రత్యేక ఆకర్షణగా విదేశీ కళాకారుల నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతిలో సింగిడి అంతర్జాతీయ కల్చరల్ ఫెస్ట్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలంక, కెనడ దేశాలకు చెందిన ప్రతినిధులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విదేశాల్లో స్థిరపడినప్పటికీ మన శాస్త్రీయ సంగీత నృత్య కళలను ప్రదర్శించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల అన్నారు. మన సంస్కృతిని, సంప్రదాయాలనూ విదేశాల్లో సైతం చాటిచెప్పాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కళాకారులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు ప్రముఖులకు 6వ సింగిడి అవార్డులను ప్రదానం చేశారు. భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్, సింగిడి వ్యవస్థాపకులు డీఆర్‌కె విశ్వకర్మ పాల్గొన్నారు.



తమాషా.. టమాట

12 అడుగులు పెరిగిన టమాట మొక్క | స్థానికులను అబ్బురపరుస్తూ ఫలసాయం

జీడిమెట్ల: టమాట మొక్క ఏకంగా పన్నెండు అడుగులు పెరిగి అందరినీ ఆకర్షిస్తోంది. నగరంలోని సుభాష్‌నగర్ ఆదివాసి మెస్ అండ్ కర్రీస్ పాయింట్ వెనుక ఉన్న స్థలంలో ఈమొక్క మొలిచింది. దీనికి ఆదివాసి మెస్‌లో పని చేసేవారు ప్రతిరోజూ నీరు పోస్తున్నారు. తమాషా ఏంటంటే ఈ మొక్కను పనిగట్టుకుని విత్తినది కాదు. మెస్‌లో పడేసిన కూరగాయల చెత్తలోని విత్తనం ద్వారా ఈ మొక్క పెరిగిందని వారు చెబుతున్నారు. ఈమొక్క ఇంకా పెద్దగా పెరిగే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు.







మిట్టీ కేఫ్.. ఇది విభిన్నం

- దివ్యాంగుల ప్రతిభకు ఉపాధి సాధనంగా..
- బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు
- తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్/సీఎస్ఆర్ చేయూత

కంటోన్మెంట్: దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మిట్టీ కేఫ్ ఆధ్వర్యంలో బొల్లారం రాష్ట్రపతి నిలయం ఆవరణలో నూతన కేఫే ఏర్పడింది. పూర్తిగా దివ్యాంగుల ఆధ్వర్యంలో నిర్వహణ సాగే ఈ కేఫే ఏర్పాటుకు తెలంగాణ సోషల్ ఇంపాక్ట్/గ్రూప్ సిఎస్ఆర్ వింగ్ చేయూతను అందిస్తుంది. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది సందర్భంగా ఈ మిట్టీ కేఫ్‌ను అధికారికంగా ప్రారంభించారు. మానసిక, శారీరక ఆరోగ్య వైకల్యం కలిగిన వారి సమస్యలను సమాజం దృష్టికి తెచ్చి, స్పందించేలా చేసేందుకు ఈ మిట్టీ కేఫ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, సుప్రీం కోర్టు కాంప్లెక్స్‌తో పాటు పలు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 47కి పైగా ప్రదేశాల్లో మిట్టీ కేఫ్‌లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకురాలు స్వర్ణభ మిత్ర వివరించారు.



ఏమిటీ మిట్టీ కేఫ్?

ఈ కేఫ్‌లలో ప్రత్యేకంగా నెలకొల్పిన స్టాల్‌లో దివ్యాంగులు స్వయంగా రూపొందించిన గృహాలంకరణ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు, నోటు పుస్తకాలు, పెన్నులు విక్రయిస్తున్నారు. సామాజిక దృక్పథంతో ఏర్పాటు చేస్తున్న మిట్టీ కేఫ్ ఆలోచనను గుర్తించి, వాటి నిర్వహణకు సీఎస్ఆర్ కింద పలు ప్రభుత్వరంగ, ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కేఫ్‌లను పలువురు సెలిబ్రిటీలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు.





దివ్యాంగులకు ఉపాధి..

నగరంలోని రాష్ట్రపతి నిలయం అధికారులు ఉచితంగా కేటాయించిన స్థలంలో మిట్టీ కేఫ్‌ను నెలకొల్పారు. ఇందులో 15 మంది మానసిక, శారీరక వైకల్యం కలిగిన వ్యక్తులు ఈ కేఫ్‌ను స్వయంగా నడుపుతున్నారు. వీరికి నెలకు రూ.15 వేల నుండి రూ.50 వేల వరకూ వేతనంగా అందుతుంది. ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవంతో జీవించేందుకు మిట్టీ కేఫ్ అండగా ఉంటున్నట్లు నిర్వాహకురాలు స్వాతి తెలిపారు.

కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ..

మిట్టీ కేఫ్‌లలో సమోసా, చాట్, పకోడీ, మసాలా టీ, బిస్కెట్లు, కాఫీ, మ్యాగీ, శాండ్ విచ్, పలు రకాల ఐస్క్రీమ్స్, ఇతర చిరుతిండ్లు స్వయంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటికి అవసరమైన పెట్టుబడి, నిర్వహణా ఖర్చులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ బ్యాంకింగ్ గ్రూపులు భరిస్తున్నాయి. దీనికి తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ సిఎస్ఆర్ వింగ్ చొరవ తీసుకుని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుపుతోంది. రూ. 36-46 లక్షలు టర్నోవర్ దిశగా కృషి చేస్తున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల శీతాకాల విడిదికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మిట్టీ కేఫ్‌ను సందర్శించారు. పలు వస్తువులు కొనుగోలు చేసి నిర్వాహకులను, ఉద్యోగులను అభినందించారు.

క్లుప్తంగా...

'గోదావరి'కి సాంకేతిక లోపం

ఖమ్మంలో కాసేపు నిలిపివేత

ఖమ్మం రాపర్తినగర్: విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు బ్రేక్ బైండింగ్ జరగడంతో ఆదివారం రాత్రి ఒంటి గంటకు ఖమ్మం రైల్వేస్టేషన్‌లో కాసేపు నిలిపివేశారు. ఎక్కువ దూరం ప్రయాణిస్తుండడంతో పట్టాలు, చక్రాల మధ్య ఒత్తిడితో బ్రేక్ బైండింగ్ జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈక్రమాంలో స్వల్పంగా నిప్పురవ్వలు రాగా.. సరిచేసి పంపించారు. ఇలాంటి ఘటనలతో ప్రయాణికులకు ఎలాంటి హానీ జరగదని అధికారులు స్పష్టం చేశారు. కాగా, రైలు బోగీల్లో మంటలు వచ్చాయని సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అవాస్తవమని అధికారులు స్పష్టం చేశారు.

ఎంఈఎస్ అధికారులకు ఫౌండేషన్ కోర్సు



సాక్షి, హైదరాబాద్: మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్ (ఎంఈఎస్) అధికారులకు ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ ఫౌండేషన్ కోర్సును సోమవారం ప్రారంభించింది. ఈ కోర్సును పుణేలోని మిలిటరీ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఎస్ అధికారులు దేశ రక్షణ రంగ సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఈ కోర్సు ఎంఈఎస్ అధికారులు విధానాల రూపకల్పనలను అర్థం చేసుకోవడంలో, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ కందుకూరి ఉషారాణి ఫౌండేషన్ కోర్సు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ డీ అడిషనల్ చీఫ్ ఇంజనీర్ సతీశ్ భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పతంజలి 30వ వ్యవస్థాపక దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: పతంజలి 30వ వ్యవస్థాపక దినోత్సవం హరిద్వార్‌లోని పతంజలి వెల్‌నెస్‌లో యోగా భవన్ ఆడిటోరియంలో పతంజలి యోగాపీఠం అధినేత స్వామి రామ్‌దేవ్ మహారాజ్, ప్రధాన కార్యదర్శి ఆచార్య బాలకృష్ణ సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పతంజలి యోగాపీఠ్‌కు చెందిన 6,000 మంది సమన్వయకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్ గత 30 ఏళ్లలో పతంజలి ప్రయాణం గురించి, దాని సేవ, పోరాటం, అంకితభావాన్ని వివరించారు. సంస్థ భవిష్యత్ ప్రణాళికలను ఆయన తెలిపారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వాతంత్ర్యం, సైద్ధాంతిక, సాంస్కృతిక అడ్డంకులు, వ్యాధులు, వ్యసనాల నుంచి విముక్తి వంటి సవాళ్ల నుంచి దేశాన్ని విముక్తి చేసే పనిని ప్రారంభించడమే పతంజలి లక్ష్యం అని పేర్కొన్నారు.

'హామీలపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి'


సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించని పక్షంలో బీసీలు తిరగబడక తప్పని పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. సోమవారం ఆయన పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడుతో ఆనంద్‌గౌడ్‌తో కలసి మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఏ హామీ ఇచ్చినా దాని అమల్లో మాత్రం ఎక్కడా చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు.

ఏపీ ఓటర్లు 4,14,40,447



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 4,14,40,447 అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రకటించారు. ముసాయిదా ఓటర్ల జాబితాకు సవరణ అనంతరం తుది జాబితాను ఆయన సోమవారం విడుదల చేశారు. రాష్ట్రంలో పురుషులకన్నామహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. సర్వీసు ఓటర్లతో కలిపి పురుష ఓటర్లు 2,03,52,816 మంది ఉండగా మహిళా ఓటర్లు 2,10,84,231 మంది ఉన్నారు. 3,400 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. నికర ఓటర్ల పెరుగుదల 19,512. ముసాయిదా జాబితాలో 18 నుంచి 19 ఏళ్ల వయస్సు ఓటర్ల సంఖ్య 4,86,226 కాగా, తుది జాబితాలో 5,14,646కు పెరిగింది. అంటే ముసాయిదా జాబితాకన్నా తుది జాబితాలో 18 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు ఓటర్లు 28,420 మంది పెరిగారు. దివ్యాంగ ఓటర్లు 5,18,383 మంది ఉన్నారు. ఓటర్లు, జనాభా నిష్పత్తి 719గా ఉంది. లింగ నిష్పత్తి 1039గా ఉంది. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 20,64,184 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7,73,388 మంది ఓటర్లు ఉన్నారు. సర్వీసు ఓటర్లు ముసాయిదా జాబితాలో 67,143 ఉండగా తుది జాబితాలో 66,690 మంది ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం పోలింగ్ స్టేషన్ల సంఖ్య 46,397.

మహమ్మారి కాదు.. మామూలు వైరస్సే!



అతిగా భయాందోళన అవసరం లేదంటున్న వైద్య నిపుణులు

- క్షేత్ర స్థాయిలో ప్రభావం అంతగా ఏమీ లేదని వివరణ
- కరోనా తరహాలో జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒంటి నొప్పులతో ఇబ్బంది
- కొందరిలో శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం
- వైరస్ సోకిన తర్వాత మూడు నుంచి ఆరు రోజుల్లో లక్షణాలు బయటికి..
- అయితే ఇది మహమ్మారిగా మారే ప్రమాదం లేదంటున్న వైద్యులు

సాక్షి, హైదరాబాద్: 'హ్యూమన్ మెటా నిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)'విషయంలో జరుగుతున్న ప్రచారం హడలెత్తిస్తోందని... కానీ మరీ అతిగా భయాందోళన అవసరం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 50, 60 ఏళ్లుగా ఈ వైరస్ వ్యాప్తిలో ఉందని.. ఇది కరోనా తరహాలో మహమ్మారిలా మారే ప్రమాదం లేదని సూచిస్తున్నారు. మాస్కులు, శానిటైజర్లు వంటివి వినియోగించడం, పరిశుభ్రత పాటించడం ద్వారా ఈ వైరస్‌కు దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు. అలాగని నిర్లక్ష్యం వహించవద్దని, తగిన అప్రమత్తతతో మసలుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు మాత్రం జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

దేశంలో కేసుల నమోదుతో ఆందోళన

చైనాలో హెచ్‌ఎంపీవీ కేసులు తీవ్రస్థాయిలో నమోదవుతున్నాయన్న ప్రచారం.. దానికితోడు మన దేశంలోనూ ఆరు కేసులు నమోదయ్యాయన్న వార్తలతో జనంలో భయాందోళన వ్యక్తమవుతోంది. మన దేశానికి సంబంధించి వైరస్ వ్యాప్తి అధికంగా లేకపోయినా, పాజిటివ్ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరగకపోయినా.. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో దీనిపై ఆందోళనకర ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో మరీ భయపడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వైరస్ లక్షణాలు, ప్రస్తుత పరిస్థితి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేస్తున్నారు.

శ్వాస మార్గంలో వృద్ధి చెందే లక్షణంతో..

కరోనా వైరస్ తరహాలోనే హెచ్‌ఎంపీవీ కూడా 'ఆర్‌ఎన్‌ఏ'రకం వైరస్. అందువల్ల దీనిలోనూ కరోనా తరహాలో జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒంటి ఒప్పులు తదితర లక్షణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ ప్రధానంగా మనం శ్వాస తీసుకునే మార్గం (రెస్పిరేటరీ ట్రాక్ట్)లోనే వృద్ధి చెందుతుందని... అంటే ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల తరహాలో కొన్నిరోజుల్లో దానంతట అదే తగ్గిపోతుందని వివరిస్తున్నారు. ఇది కలసి వచ్చే అంశమని పేర్కొంటున్నారు. వైరస్ ప్రధానంగా నోటి తుంపరలు, తుమ్ముల ద్వారా వెలువడే తుంపరల ద్వారా వ్యాపిస్తుందని... ఆ తుంపరలు పడిన చోట తాకడం, వైరస్ సోకినవారిని తాకడం ద్వారా ఇతరులకు విస్తరిస్తుందని స్పష్టం చేస్తున్నారు. మాస్కులు, శానిటైజర్ల వాడకం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం ద్వారా ఈ వైరస్‌కు దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు.

చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్త



చైనాలో హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి తీవ్రస్థాయికి చేరినట్టు వార్తలు వస్తున్నాయి. ఇది సహజంగానే ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకు కారణమైంది. ఈ ఆర్‌ఎన్‌ఏ వైరస్‌ను 2001లో గుర్తించారు. అప్పటి నుంచి ఇది ఏటా చలికాలంలో చిన్న పిల్లలు, వృద్ధుల్లో సీజనల్ వైరల్ అనారోగ్యంగా కొనసాగుతోంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులకు మాత్రం ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుంది.

– జీసీ ఖిల్నానీ,
ఢిల్లీ ఎయిమ్స్ పల్మనరీ విభాగం మాజీ హెడ్

మహమ్మారిగా మారే ప్రమాదం లేదు



హెచ్‌ఎంపీవీ వైరస్ ద్వారా రోగి సీరియస్ అయ్యే అవకాశాలు చాలా తక్కువ. ఇది కోవిడ్ మాదిరిగా మహమ్మారిగా మారే ప్రమాదం అసలే లేదు. ప్రపంచవ్యాప్తంగా 50, 60 ఏళ్లకుపైగానే ఇది వ్యాప్తిలో ఉంది. దీనివల్ల కేసులు పెరగొచ్చునేమోగానీ తీవ్రత అంత ఉండకపోవచ్చు. మనుషుల్లో యాంటీబాడీస్‌తోపాటు తగిన మేర రోగ నిరోధక శక్తి ఉంటే ఈ వైరస్ పెద్దగా ప్రభావం చూపదు. సాధారణ ఫ్లూ మాదిరిగానే ఉంటుంది. కొందరు వైద్య నిపుణుల అంచనాల మేరకు ఫ్లూ వ్యాక్సిన్ ద్వారా ఈ వైరస్ కేసులు సీరియస్ కాకుండా రక్షణ ఉండవచ్చు.

– ప్రొఫెసర్ కిరణ్ మాదల,
క్రిటికల్ కేర్ మెడిసిన్, గాంధీ ఆస్పత్రి

అతిగా భయాందోళన అనవసరం



హెచ్‌ఎంపీవీ వైరస్ గురించి అతిగా భయాందోళనకు గురికావాల్సిన అవసరం ఎంత మాత్రం లేదు. అయితే బయటికి వెళ్లినప్పుడు, గుంపుల్లోకి వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం, చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటిదాకా వెల్లడైన అంశాల మేరకు ఈ వైరస్ చాలా స్వల్ప లక్షణాలు కలిగి ఉంటుంది. సాధారణ జలుబు మాదిరిగా ముక్కు కారడం, దగ్గు, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది, గొంతునొప్పి, శ్వాస తీసుకునేప్పుడు ఈల వేసినట్టు శబ్దాలు రావడం, శరీరంపై దద్దుర్లు రావడం వంటి వాటి ద్వారా దీనిని గుర్తించవచ్చు.

– డాక్టర్ హరికిషన్ గోనుగుంట్ల,
చీఫ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద ఆస్పత్రి

అన్ని వ్యవస్థలు సిద్ధంగా ఉంటే ఎదుర్కోవడం సులువే



హెచ్‌ఎంపీవీ వైరస్ మహమ్మారిలా వ్యాపించే అవకాశం లేదు. అయినా వ్యవస్థలన్నీ అప్రమత్తంగా, పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. ఈ వైరస్ తరహా లక్షణాలతో కేసులు వచ్చినప్పుడు ఆస్పత్రులు జాగ్రత్తగా చూసుకోవాలి. ఎలాంటి ఇన్ఫెక్షన్లకైనా చికిత్స అందించేందుకు సిద్ధంకావాలి. ల్యాబ్స్ కూడా నిర్ధారణ పరీక్షలకు అవసరమైన వనరులు సమకూర్చుకోవాలి. వైరస్ లక్షణాలు, నివారణ, జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలి.

– డాక్టర్ దేవానంద్ కొలతోడి,
రీజినల్ సీఈవో, ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్, హైదరాబాద్

వ్యవస్థలన్నీ అప్రమత్తంగా ఉన్నాయి.. ఆందోళన వద్దు



కరోనాలా వ్యాప్తి చెందుతూ ఉత్పాతం సృష్టించే లక్షణం హెచ్‌ఎంపీవీకి చాలా తక్కువ. కరోనా సమయంలోలాగే తుమ్ములు, దగ్గు నుంచి వచ్చే తుంపర్లకు దూరంగా ఉంటూ, చేతులు తరచూ శుభ్రం చేసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఉండాలి. మంచి ఆహారం తీసుకుంటూ రోగ నిరోధక శక్తి పెంపొందించుకుంటే ఈ వైరస్ వల్ల ప్రమాదం దాదాపుగా ఉండదు. పైగా ఇప్పుడు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలు అప్రమత్తంగా ఉన్నాయి. వైరస్ వ్యాప్తిని గమనిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టేందుకు సంసిద్ధమయ్యాయి. ఆందోళన అవసరం లేదు.

– డాక్టర్ గురవారెడ్డి, సన్‌షైన్ హాస్పిటల్స్

ఇదేమీ కొత్త వైరస్ కాదు.. ఎలా ఎదుర్కోవాలో డాక్టర్లకు తెలుసు



హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ ఏమీ కాదు. చైనాలో వ్యాపిస్తున్నది ఏమైనా తీవ్రమైన స్ట్రెయినా, మామూలేదనా అన్నదానిపైనా స్పష్టత లేదు. ఇటీవల హఠాత్తుగా వ్యాపించడం వల్ల వార్తల్లోకి వచ్చిందేతప్ప.. క్షేత్రస్థాయిలో అంత తీవ్రత ఏమీ లేదని వైద్యులంతా చెబుతున్న మాటే. పీడియాట్రిక్ ఏజ్ గ్రూపులోనూ ఇదేమీ కొత్త వైరస్ కాదు. దీన్ని ఎలా ఎదుర్కోవాలన్నది డాక్టర్లందరికీ తెలిసిన విషయమే. అది కొత్తది కాకపోవడం వల్లే.. వెదకడం మొదలుపెట్టగానే కేసులు వెలుగులోకి వస్తున్నాయి.

– డాక్టర్ రోహిత్‌రెడ్డి పాతూరి,
చీఫ్ పల్మనాలజిస్ట్, టీఎక్స్ హాస్పిటల్స్

మాస్క్, శానిటైజర్ వంటి జాగ్రత్తలతో నివారణ సాధ్యమే



చిన్నపాటి ముందు జాగ్రత్తలు పాటిస్తే చాలు హెచ్‌ఎంపీవీ వైరస్‌ను దాదాపుగా నివారించవచ్చు. ముక్కు, నోరు కప్పేలా మాస్క్ ధరించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. చేతులు శుభ్రపర్చుకుంటూ ఉండాలి. వ్యాధిగ్రస్తుల నుంచి దూరంగా ఉండాలి. తగిన స్థాయిలో నీళ్లు తాగుతూ ఉండాలి. చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. వారికి సమయానికి వ్యాక్సిన్లన్నీ ఇప్పించాలి. దీనివల్ల ఉత్పన్నమయ్యే వ్యాధి నిరోధకత ఈ వైరస్ నుంచి కూడా రక్షణ కల్పించే అవకాశముంది. పెద్దలు, వృద్ధులు జలుబు వంటి లక్షణాలున్నవారి నుంచి దూరంగా ఉండాలి.

– డాక్టర్ జయచంద్ర, క్లినికల్ డైరెక్టర్ అండ్ సీనియర్
ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్

3,35,27,925

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం 3,30,21,735 మంది ఓటర్లు ఉన్నారు. 2024తో పోల్చుకుంటే–2025లో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

పోలింగ్ కేంద్రాల వారీగా 119 శాసనసభ నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను వెబ్‌సైట్ (https://ceotelangana.nic.in)లో ఉంచినట్టు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. కొత్తగా నమోదైన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను పోస్టు ద్వారా ఇళ్లకు ఉచితంగా పంపిస్తున్నామన్నారు. ఓటర్ల నమోదు, వివరాల దిద్దుబాటు నిరంతర ప్రక్రియ అని, ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ (https://voters.eci. gov.in)లేదా ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ద్వారా ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు సైతం ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, వారిని18 ఏళ్లు నిండిన తర్వాత జాబితాలో చేర్చుతామని వివరించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6, ప్రవాస ఓటర్లకు ఫారం–6ఏ, స్వచ్ఛందంగా ఆధార్ వివరాలు ఇవ్వడానికి ఫారం–6బీ, ఓటర్ల తొలగింపు కోసం ఫారం–7, వివరాల దిద్దుబాటు/నవీకరణ కోసం ఫారం–8 ఉపయోగించాలని చెప్పారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాల సంఖ్య

రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 35,356 నుంచి 35,907కి పెరిగింది. పట్టణ పోలింగ్ కేంద్రాల సంఖ్య 14,464 నుంచి 14,750కి, గ్రామీణ పోలింగ్ కేంద్రాల సంఖ్య 20,892 నుంచి 21,157కి పెరిగింది. మొత్తం 551 పోలింగ్ కేంద్రాలు కొత్తగా ఏర్పాటు కానుండగా, అందులో 286 పట్టణ, 265 గ్రామీణ పోలింగ్ కేంద్రాలున్నాయి.

90 నియోజకవర్గాల్లో మహిళలే ఎక్కువ

రాష్ట్రంలోని 90 నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉండడం గమనార్హం. కేవలం 29 స్థానాల్లోనే పురుష ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లోని నియోజకవర్గాలు మినహాయిస్తే దాదాపుగా అన్ని చోట్లా మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు.

ఓటర్లలో ఎవరెంతమంది..	
యువ ఓటర్లు (18-19 ఏళ్లు)	: 5,45,026
వయోజన ఓటర్లు : (85 ఏళ్లు, ఆపై)	2,22,091
ప్రవాస ఓటర్లు:	3,591
దివ్యాంగ ఓటర్లు:	5,26,993

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు... సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో...

ఆస్పత్రుల్లో ఔషధాలు అందుబాటులో ఉండాలి

మెడిసిన్ మానిటరింగ్‌కు ప్రతి జిల్లాకు త్రీమెన్ కమిటీ: మంత్రి రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: ఆస్పత్రుల్లో వైద్యులు కోరిన అన్ని రకాల ఔషధాలను సరఫరా చేస్తున్నా, మందుల కొరత ఉందని వస్తున్న వార్తలు ప్రభుత్వ పనితీరుపై అపోహలు కలగజేస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. మందులు లేవని ఎలాంటి ఫిర్యాదు వచ్చినా, వార్త లు వ్యాప్తి చెందినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణి స్తుందని ఆయన హెచ్చరించారు. ఎంసీహెచ్ ఆర్డీ లో సోమవారం ఏర్పాటు చేసిన ఫార్మసీ, ఈ- ఔష. ది వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఔషధాలకు సంబంధించిన అంశంపై రెగ్యులర్ మానిటరింగ్ కోసం ప్రతి జిల్లాలోనూ ముగ్గురు సభ్యులతో కమిటీ ని నియమి స్తున్నట్టు చెప్పారు. డీఎంహెచ్‌వో, డీసీ హెచ్‌ఎస్, జిల్లాలోని టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ కమిటీ లో ఉంటారని, అన్ని ఆస్పత్రుల్లో మెడిసిన్ ఉండేలా కమిటీ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా ప్రారంభించిన ఎన్‌సీడీ (నాన్ క్లినికల్ డిసీజ్)లలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం డీఎంహెచ్‌ఓలు, డీసీ హెచ్‌లు, జీజీహెచ్ సూపరింటెండెంట్లతో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఐఏఎంసీకి భూకేటాయింపు సబబే

- 'ప్రైవేటు'కు ఇవ్వడాన్ని సమర్థించుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించేందుకేనని వెల్లడి
- తదుపరి విచారణ జనవరి 28కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో రూ. 300 కోట్ల విలువైన 3.7 ఎకరాలను అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు ఉచితంగా కేటాయించడంతోపాటు ఐఏఎంసీ ట్రస్ట్‌కు ఏటా రూ. 3 కోట్ల నిధులను ఇస్తుండటాన్ని సవాల్‌చేస్తూ హైకోర్టులో దాఖలైన 'పిల్'పై రాష్ట్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ కె. సుజన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టగా భూకేటాయింపు నిర్ణయాన్ని సమర్థించుకుంది. వ్యాపారంతోపాటు సంస్థాగత మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడానికి హైదరాబాద్‌లో ఐఏఎంసీ అవసరం ఉందని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదించారు. మధ్యవర్తిత్వ చట్టంలోని అంశాలు మధ్యవర్తిత్వ సంస్థల ఏర్పాటుకు పిలుపునిస్తున్నాయని.. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ కూడా మధ్యవర్తిత్వ సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం ఉండాలని సిఫారసు చేసిందని గుర్తుచేశారు. ఐఏఎంసీకి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ మంత్రి ట్రస్టీలుగా ఉన్నారని వివరించారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాలు తీసుకొనే ఇలాంటి నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోకూడదన్నారు.

ప్రత్యామ్నాయ పరిష్కారం అవసరం..

విచారణ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ పలు వ్యాఖ్యలు చేశారు. మధ్యవర్తిత్వం వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జ్యుడీషియల్ అకాడమీలో 70 మంది న్యాయవాదులకు మధ్యవర్తులుగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పెండింగ్ కేసుల సంఖ్య 5 కోట్లు దాటిందని.. మనం తప్పనిసరిగా మధ్యవర్తిత్వం లాంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఏఎంసీ తరఫున సీనియర్ న్యాయవాది ఇ. ప్రకాశ్‌రెడ్డి వాదించారు. సింగపూర్ తదితర దేశాల్లో ఇటువంటి సంస్థలకు ప్రభుత్వ మద్దతు లభిస్తోందని చెప్పారు. అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం జనవరి 28కి వాయిదా వేసింది.

చట్ట ఉల్లంఘనగా అభివర్ణించిన పిటిషనర్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్‌లోని సర్వే నంబర్ 83/1 ప్లాట్ నంబర్ 27 లోని 3.7 ఎకరాల ప్రభుత్వ భూమిని ఐఏఎంసీకి కేటాయిస్తూ 2021 నవంబర్ 26న రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 126 విడుదల చేయడం తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) చట్టాన్ని ఉల్లంఘించడమేనని న్యాయవాది కె.రఘునాథ్ రావు తన 'పిల్'లో పేర్కొన్నారు.


వ్యవసాయశాఖ ద్వారానే సబ్సిడీ యంత్రాలు

- ఆగ్రోస్‌ను దూరం పెట్టిన ప్రభుత్వం
- మీ సేవ ద్వారా దరఖాస్తుల స్వీకరణ.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రైతులకు సబ్సిడీతో యంత్ర పరికరాలు కొనుగోలు చేసి ఇచ్చేందుకు వ్యవసాయశాఖ సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిలిచిపోగా, ఈ యాసంగి నుంచి తిరిగి ప్రారంభించనున్నారు.గతంలో ఆగ్రోస్ (ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ద్వారా యంత్ర పరికరాలు అందించే విధానం ఉండగా, ప్రభుత్వం దానికి స్వస్తి పలికింది. నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆగ్రోస్ స్థానంలో వ్యవసాయశాఖ కమిషనరేట్ రైతులకు సాగుకు అవసరమైన యంత్రాలను 50 శాతం సబ్సిడీతో కొనుగోలు చేసి పంపిణీ చేయనుంది. ఈ మేరకు సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు సంబంధించి వ్యవసాయశాఖ రూ.50 కోట్లు నిధులు కేటాయించింది. ఇందులో రూ.25 కోట్లు విడుదల చేస్తూ గతేడాది నవంబర్ 2న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆగ్రోస్ సంస్థ పథకం అమలుకు సంబంధించిన ముందస్తు చర్యలు చేపట్టింది. యంత్ర పరికరాల సరఫరాదారులతో ఎంప్యానల్ చేసుకుంది. ఏఏ పరికరాలు ఎవరు సరఫరా చేస్తారో జాబితా కూడా రూపొందించింది. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయనున్నట్టు ప్రకటించారు. కానీ సోమవారం జారీ అయిన ఆదేశాల్లో ఆగ్రోస్ కాకుండా వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచే దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆగ్రోస్ రూపొందించిన పరికరాల తయారీదారులు, సరఫరాదారుల జాబితా ఇవ్వాలని వ్యవసాయశాఖ ఆదేశించింది. యంత్రాలు అవసరమైన రైతుల నుంచి మండల వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంటారు. మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేస్తుంది. ఈ మేరకు రైతులు 50 శాతం మొత్తాన్ని ముందుగానే చెల్లిస్తే, ప్రభుత్వం మిగతా 50 శాతాన్ని సబ్సిడీగా భరించి సరఫరాదారుల నుంచి ఆ పరికరాలను తెప్పించి రైతులకు అందజేస్తుంది. యాంత్రీకరణ పథకాన్ని సంక్రాంతి నుంచి అమలు చేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. రైతులకు అవసరమైన అన్ని పరికరాలు కాకుండా కేవలం కొన్ని పరికరాలను మాత్రమే సబ్సిడీతో ఇవ్వాలని నిర్ణయించింది.

వర్గీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ



పంజగుట్ట (హైదరాబాద్): మాల కులంలో కొందరు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని, అయినా సమాజం మొత్తం తమకు అండగా ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా బీసీ కళానేతలు, నిరుద్యోగ కళానేతలు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. దేశంలో మూడు రాజకీయ పదవులు పొందిన కుటుంబాల్లో సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీ ఉండగా తర్వాత తెలంగాణలో వెంకటస్వామి కుటుంబమే ఉందని అన్నారు. కాగా, వర్గీకరణను వ్యతిరేకించేవారు ఎందుకు వ్యతిరేకమో కారణాలు చెప్పడం లేదని ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 7వ తేదీన జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దరువు అంజన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, వెంకటేశ్ నేత, నకిరకంటి కిరణ్, గణేష్ మీసాల తదితరులు మాట్లాడారు.

వేధింపులకు ప్రేమజంట బలి

- పెట్రోల్ పోసుకుని కారులో సజీవ దహనం
- బంధువు బ్లాక్‌మెయిల్ చేయడంతో మనస్తాపం చెందిన ప్రేమికులు



మంటలకు ఆహుతైన కారు



శ్రీరాం (ఫైల్)

ఘట్‌కేసర్: ప్రేమ విషయం ఇంట్లో చెబుతానని ఓ వ్యక్తి వేధించడంతో ప్రేమ జంట బలైంది. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం, బంధువులు తెలిపిన వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామానికి చెందిన పర్వతం అంజయ్య కుమారుడు పర్వతం శ్రీరామ్ (25) బతుకుదెరువు నిమిత్తం 15 ఏళ్ల క్రితం బీబీనగర్ మండలం జమీలాపేటకు వెళ్లి స్థిరపడ్డారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ నారపల్లి సమీపంలో సైకిల్ దుకాణం నడుపుతున్నాడు. చౌదరిగూడకు చెందిన ఇంటర్ చదివే ఓ మైనర్ బాలికను శ్రీరామ్ ప్రేమించాడు.

బ్లాక్‌మెయిల్ చేసిన దగ్గరి బంధువు...

శ్రీరామ్‌తో ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెబుతానని బాలిక దగ్గరి బంధువు, అన్న వరుసైన చింటు (22) బ్లాక్‌మెయిల్ చేసి వీరివద్ద రూ. 1,35,000 తీసుకున్నాడు. ఇంకా డబ్బు ఇవ్వాలని కాలేజ్ దగ్గరికి వెళ్లి బాలికను వేధించడమే కాకుండా, బంగారు ఉంగరం ఇవ్వాలని కోరాడు. చింటు వేధింపులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని, చివరికి ప్రియుడికి విషయం తెలిపింది. అదే విధంగా కులాంతర వివాహానికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోరని, ప్రేమ ఓడిపోవద్దని వారం కిందటే వారిద్దరు మరణించాలని నిర్ణయించుకున్నారు. సోమవారం ఉదయం షాపింగ్ వెళ్లాలని శ్రీరామ్ తన స్నేహితుడి దగ్గర ఎర్టిగా కారును తీసుకున్నాడు. సోమవారం సాయంత్రం ప్రేమ వ్యవహారం, బ్లాక్‌మెయిల్ విషయాన్ని వివరిస్తూ బాలిక తండ్రికి 'అంకుల్' అని సంబోధిస్తూ సూసైడ్ నోట్ రాసి, తన అన్న కుమారుడికి వాట్సాప్ ద్వారా పంపించాడు. అనంతరం ఎర్టిగా వాహనంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఘనాపూర్ సమీపంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద కారులోనే నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంటలకు తాళలేక శ్రీరామ్ కారు డోరు తెరుచుకొని సర్వీస్ రోడ్డు ఫుట్‌పాత్‌పై పడి మృతిచెందాడు. బాలిక కారు ముందు సీటులో కూర్చొని గుర్తు పట్టలేని మాంసం ముద్దలా కాలి ఆహుతి అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫైర్ ఇంజన్ సాయంతో మంటలు ఆర్పారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ఘటన స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





నఖ శిఖం.. పరిశుభ్రం

ఆరోగ్యం కోసం వ్యక్తిగత పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యముంది. అందునా కొత్త కొత్త వైరస్‌లు వెలుగు చూస్తున్న ప్రస్తుత తరుణంలో వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్) మరింత అవసరం. ఈ నేపథ్యంలో తల మొదలుకొని... పాదాల వరకు అన్ని అవయవాలకు సంబంధించిన వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎలాగో తెలిపే ప్రత్యేక పేజీ... నేటి 'సాక్షి ప్లస్' డిజిటల్ హెల్త్ పేజీలో...


● హూప్ డాన్సర్

హూప్ హూప్ హుర్రే

ఆ సన్నటి పెద్ద రింగును 'హూప్' అంటారు. పిల్లలు సరదాగా నడుము చుట్టూ దానిని తిప్పుతారు. సర్కస్‌లో హూప్‌తో చేసే ఫీట్లు ఉండేవి. కాని ఇప్పుడు హూప్ డాన్స్ ఫిట్‌నెస్‌కు ఒక దారిగా ఉంది. సరదాగా ఉంటూనే శరీరాన్ని విపరీతంగా కదిలించే ఈ డాన్స్‌లో దేశంలోనే నంబర్ 1గా ఉంది ఈషా్న కుట్టి. ఆమె పరిచయం.

'మూవ్‌మెంట్ థెరపీ గురించి ఇప్పుడు ఎక్కువ మంది మాట్లాడుతున్నారు సైకాలజీలో. అంటే శరీర కదలికల వల్ల స్వస్థత పొందడం. హూపింగ్‌తో మూవ్‌మెంట్ థెరపీ చేయవచ్చు. హూపింగ్ వల్ల కండరాలు శక్తిమంతమవుతాయి. గుండె బాగవుతుంది. యాంగ్జయిటీ, స్ట్రెస్ మాయమవుతాయి. హూపింగ్‌లో ఆట ఉంది. వ్యాయామం ఉంది. నృత్యం ఉంది. మూడూ కలగలసిన హూపింగ్ స్త్రీల ఫిట్‌నెస్‌కు బాగా ఉపయోగం' అంటుంది ఈష్న కుట్టి.

ఢిల్లీలో స్థిరపడ్డ మలయాళ కుటుంబంలో జన్మించిన 25 ఏళ్ల ఈష్న కుట్టి ఇప్పుడు భారతదేశంలో నెంబర్ 1 హూపర్‌గా గుర్తింపు పొందింది. హూప్ లేదా హులా హూప్ అని పిలిచే 'టాయ్ రింగ్'తో విన్యాసాలు చేసేవారిని హూపర్స్ అంటారు. మన దేశంలో ఎప్పటినుంచో హూపింగ్ ఉన్నా 1950లలో ఆట వస్తువుగా దీని తయారీ మొదలయ్యాక వ్యాప్తిలోకి వచ్చింది. నడుమును తిప్పుతూ హూప్‌ను నడుము చుట్టూ తిప్పడంతో మొదలెట్టి మెరుపు వేగంతో హూప్‌ను కదిలిస్తూ ఎన్నో విన్యాసాలు చేయొచ్చు. ఇలా చేయడాన్ని 'ఫ్లో ఆర్ట్'లో భాగంగా చూస్తారు. బంతులు ఎగరేయడం, జగ్లింగ్ చేయడం.. ఇవన్నీ ఫ్లో ఆర్ట్ కిందకే వస్తాయి. హూపింగ్ కూడా.



చిన్న వయసులోనే...

'చిన్నప్పుడు మా బంధువు ఒకామె హూప్‌ను గిఫ్ట్‌గా ఇచ్చింది. కాసేపు ఆడుకోవడానికి ట్రై చేసి మానుకున్నాను. కాని ఒకరోజు ఇంట్లో ఎవరూ లేనప్పుడు ప్రాక్టీసు చేశాను. మెల్లగా వచ్చేసింది. దాంతో ఎవరూ లేనప్పుడు ప్రాక్టీసు కొనసాగించాను. మెల్ల మెల్లగా హూప్ నా శరీరంలో భాగమైపోయింది' అంటుంది ఈష్న. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజీలో సైకాలజీ చదివిన ఈష్న 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్'లో 'డిప్లమా ఇన్ డాన్స్ మూవ్‌మెంట్ థెరపీ' కూడా చేసింది.

'సైకాలజీ, హూపింగ్ తెలియడం వల్ల మనిషికి ఉత్సాహం, ఆరోగ్యం కలిగించడానికి ఉపయోగించే ప్రయత్నం చేస్తున్నాను' అంటుంది ఈష్న.

తిహార్ జైలులో...

తిహార్ మహిళా జైలులో ఖైదీలకు ఆరు నెలల పాటు హూపింగ్ నేర్పించడానికి వెళ్లింది ఈష్న. 'జైలుకు వెళ్లి ఖైదీలను కలవడం ఎవరికైనా కష్టమే. కాని అక్కడ ముప్పై నుంచి 60 ఏళ్ల వరకూ ఉన్న మహిళా ఖైదీలకు హూపింగ్ నేర్పించాను. వారు హూప్ రింగ్‌తో రేయింబవళ్లు ప్రాక్టీసు చేసేవారు. నేను వెళ్లినప్పుడల్లా ఆ ముందుసారి కన్నా మరింత ఉత్సాహంగా, హుషారుగా కనిపించారు' అంది ఈష్న.

ఇలా చేయాలి

'సౌకర్యవంతమైన బట్టలు, సరైన ఫ్లోర్ ఉంటే హూప్‌తో మీరు ఎన్ని విన్యాసాలైనా సాధన చేయొచ్చు. మార్కెట్‌లో హూప్ రింగ్‌లు 28 ఇంచ్‌ల నుంచి 39 ఇంచ్‌ల వరకూ దొరుకుతాయి. వాటితో ప్రాక్టీసు చేయడమే. ఈ ఆటలో పోటీలేదు పోలిక లేదు. అందుకే మన ఇష్టం వచ్చినట్టు ఆడవచ్చు. ఒక రకంగా బయటకు రాని స్త్రీలకు బెస్ట్ ఆటవిడుపు' అంటుంది ఈష్న.

మన దేశంలో హూపింగ్ నేర్పించే టీచర్లు తక్కువ కనుక ఆమె తరచూ నగరాలు తిరుగుతూ స్త్రీలకు క్యాంప్స్ నిర్వహిస్తూ నేర్పిస్తూ ఉంటుంది. 'హూప్ రింగ్ మీ బెస్ట్ ఫ్రెండ్ కాగలదు. మీ మంచి చెడుల్లో అది పక్కనే ఉంటే భావోద్వేగాలు అదుపులో ఉంటాయి' అంటున్న ఈష్నకు ఇటీవల కార్పొరేట్ ఈవెంట్స్‌లో షో చేయమని ఆహ్వానాలు అందుతున్నాయి. డబ్బు కూడా బాగా వస్తోంది. షోలలో ఆమె చేసే హూపింగ్ నోరెళ్లబెట్టేలా ఉంటుంది.

ఒక్క రింగు ఆమె జీవితాన్నే మార్చేసింది. మీ జీవితాన్ని కూడా మార్చొచ్చు.

క్యారమ్స్ కాశీమా



నాన్న కల సాకారం చేస్తాను

క్యారమ్స్ ఆడుతుంటే ఉత్సాహంగా ఉండడమే కాదు కొత్తశక్తి నాలో ప్రవహిస్తున్నట్లుగా ఉంటుంది. ఆ శక్తే నన్ను చెన్నైలోని న్యూ వాషర్‌మెన్‌పేట మురికివాడ నుంచి అమెరికా వరకు తీసుకువెళ్లింది. 'క్యారమ్స్ అకాడమీ' ఏర్పాటు చేసి మురికివాడలోని పేద పిల్లలకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాలనేది నాన్న కల. ఆయన కల నెరవేర్చాలని ఉంది.

– కాశీమా

పైన లైట్ బల్బు వెలుగుతుండగా... ఆ కాంతిలో...
క్యారమ్ బోర్డ్‌పై 'టప్' 'టప్' అంటూ శబ్దాలు వినిపించేవి. లక్ష్యాన్ని ఛేదించడం నుంచి ఛేదించక పోవడం వరకు ఆ శబ్దాలలో ఎన్నో అర్థాలు ఉండేవి. ఆ అర్థాలను ఔపోసన పట్టింది చెన్నైకి చెందిన కాశీమా.
'క్యారమ్స్' కుటుంబ ఆట అంటారు.
ఆ ఆటలోని రెడ్, వైట్, బ్లాక్ కాయిన్స్, స్ట్రైకర్... కాశీమాకు కుటుంబ సభ్యులు అయ్యాయి. వాటితో అనుబంధం ఆమెను క్యారమ్స్ ప్లేయర్‌గా అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది.

ఆరు సంవత్సరాల వయసు నుంచి కాశీమా క్యారమ్స్ ఆడడం మొదలు పెట్టింది. కుమార్తె క్యారమ్స్‌లో చూపుతున్న ప్రతిభకు సంబరపడిపోయేవాడు తండ్రి మెహబూబ్ బాషా.

ఉత్తరచెన్నై పరిధిలో ఎక్కడ టోర్నమెంట్ జరిగినా కాశీమాను ఆడించేవాడు బాషా. కప్పులు గెలుచుకోవడం సంగతి ఎలా ఉన్నా ఇరుగు, పొరుగు, బంధువులు 'అమ్మాయిని అలా బయటికి తీసుకువెళ్లవచ్చా? ఇది పద్ధతేనా!' అనేవారు. అయితే మెహబూబ్ వారి మాటల్ని పట్టించుకునేవాడు కాదు.

'వారి మాటలు పట్టించుకోవద్దు. క్యారమ్స్‌లో నువ్వు పెద్దపేరు తెచ్చుకోవాలి' అంటూ కూతుర్ని ప్రోత్సహించేవాడు బాషా.

గల్లీనుంచి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల వరకు ఎన్నో పతకాలు సొంతం చేసుకున్న కాశీమా జాతీయ స్థాయిలో పదికి పైగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించింది. కాశీమా ప్రతిభ అర్జున అవార్డు గ్రహీత మరియా ఇరుదయం దృష్టిలో పడింది. ఆయన శిక్షణలో తనలోని ప్రతిభను మరింత మెరుగు పరుచుకునే అవకాశం కాశీమాకు వచ్చింది.

అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియాలలో జరిగిన 6వ క్యారమ్ ప్రపంచ కప్ పోటీలలో 18 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. మనదేశం నుంచి పాల్గొన్న కాశీమా సింగిల్స్, డబుల్స్, గ్రూప్ పోటీలలో మూడు బంగారు పతకాలు సాధించి క్యారమ్స్‌లో విశ్వవిజేతగా నిలిచింది.

అమెరికాకు వెళ్లడానికి ముందు వీసా రెండుసార్లు తిరస్కరణకు గురి కావడంతో కాశీమా పడిన బాధ ఇంతా అంతా కాదు. 'నేను కచ్చితంగా అమెరికాకు వెళ్లాలి. వెళ్లడమే కాదు పతకాలు సాధించాలి' అని గట్టిగా అనుకుంది. పట్టువదలకుండా ప్రయత్నించి అమెరికాలో అడుగుపెట్టిన కాశీమా ఏకంగా మూడు స్వర్ణాలతో క్యారమ్స్ విశ్వవిజేతగా చెన్నైలో అడుగు పెట్టింది. ఆటకు అడ్డుపడే విధంగా విమర్శలు చేసిన వారే కాశీమాకు చెన్నైలో బ్రహ్మరథం పట్టడం విశేషం. ఆమె విజయానికి మరింత ప్రోత్సాహాన్నిస్తూ తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఇటీవలే ఆమెకు కోటి రూపాయల చెక్ అందజేశారు.

'క్యారమ్స్' అనేది జీవితంలాంటిది. కాయిన్స్ లక్ష్యాలు అనుకుంటే 'స్ట్రైకర్' అనేది ఆ లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం లాంటిది. స్ట్రైకర్ మీద పట్టు ఉన్న కాశీమా మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

– అస్మతీన్ మైదీన్, సాక్షి, చెన్నై



తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ నుంచి కోటి రూపాయల చెక్కు అందుకుంటున్న కాశీమా. (పక్కన) కాశీమా కుటుంబ సభ్యులు

● ముగ్గు ముచ్చట

21 చుక్కలు, 11 వరకు, నందు చుక్క



కె. దీక్ష, 7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్వేలి, అన్నమయ్య జిల్లా.





15 చుక్కలు 1 వచ్చేవరకు



భార్గవి, కాన్‌కుర్తి, దామర్‌గిద్ద, నారాయణపేట

ముగ్గులకు ఆహ్వానం... ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సాగుబడి
పూర్వాషాఢ కార్తె: జనవరి 10 వరకు
ఉత్తరాషాఢ కార్తె : 11 నుంచి

పంటభూమిలో విషానికి బ్యాక్టీరియాతో చెక్

- మట్టిలోని విషపూరిత రసాయనిక కాలుష్యాన్ని హరించే శక్తిగల బ్యాక్టీరియాలను కనుగొన్న ముంబై ఐఐటీ పరిశోధకులు
- సూడోమోనాస్, అసినెటోబాక్టర్ వంటి బ్యాక్టీరియాల మిశ్రమంతో మట్టిలోని విషరసాయనాల విచ్ఛిన్నం
- తద్వారా గోధుమ, పెసర, పాలకూర, మెంతి తదితర పంటల్లో 40 నుంచి 45% వరకు పెరిగిన దిగుబడులు
- అంతేకాదు.. శిలీంధ్ర తెగుళ్లకూ చక్కని పరిష్కారం

పెసర పంటపై ప్రయోగ ఫలితాలు



కలుషితం కాని మట్టిలో పెసర మొక్కలు | పురుగుమందులతో కలుషితమైన మట్టిలో పెసర మొక్కలు | కలుషితం కాని మట్టిలో బ్యాక్టీరియా మిశ్రమం కలిపిన తర్వాత పెసర మొక్కల్లో పెరుగుదల | పురుగుమందులతో కలుషితమైన మట్టిలో బ్యాక్టీరియా మిశ్రమం కలిపిన తర్వాత పెసర మొక్కల్లో పెరుగుదల



కలుషితం కాని మట్టిలో పెరిగిన మొక్కల వేర్లు | పురుగుమందులతో కలుషితమైన మట్టిలో పెరిగిన మొక్కల వేర్లు | కలుషితం కాని మట్టిలో బాక్టీరియా మిశ్రమాన్ని కలిపిన తర్వాత పెరిగిన మొక్కల వేర్లు | పురుగుమందులతో కలుషితమైన మట్టిలో బాక్టీరియా మిశ్రమం కలిపిన తర్వాత పెరిగిన మొక్కల వేర్లు

రసాయనిక వ్యవసాయం వల్ల కాలుష్య కాసారంగా మారిపోయిన వ్యవసాయ భూములను తక్కువ ఖర్చుతో, సులభంగా, సమర్థవంతంగా శుద్ధి చేసే కొన్ని జాతుల సూక్ష్మజీవుల మిశ్రమాన్ని ముంబై ఐఐటి పరిశోధకులు కనుగొన్నారు. రసాయనిక పురుగుమందుల వల్ల, ఇతరత్రా కాలుష్య కారకాల వల్ల పంట భూములు నాశనమవుతున్న సంగతి తెలిసిందే. విషతుల్య కాలుష్య కారకాలను హరించటంతో పాటు నేలలో ఉన్నప్పటికీ మొక్కలకు అందుబాటులో లేని పోషకాలను అందుబాటులోకి తేవటం ద్వారా పనిలో పనిగా పంట దిగుబడిని కూడా పెంపొందించడానికి ఈ 'బ్యాక్టీరియా కాక్టెయిల్' ఉపయోగపడుతున్నదని ముంబై ఐఐటి పరిశోధకులు ప్రకటించారు.

ముంబై ఐఐటిలో బయోసైన్సెస్, బయోఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రశాంత్ ఫలే మార్గదర్శకత్వంలో సందేశ్ పపడే ఈ పరిశోధన చేశారు. మట్టిలోని విషాలను విచ్ఛిన్నం చేసి తీసివేయటంతో పాటు ఈ బ్యాక్టీరియా అధికోత్పత్తికి దోహదం చేసే గ్రోత్ హార్మోన్ల పెరుగుదలకు ఊతం ఇస్తున్నాయని, అదేసమయంలో హానికారక శిలీంధ్రాలను అరికడుతున్నాయని, తద్వారా పోషకాల లభ్యత పెరుగుతోందని గుర్తించారు. రసాయనిక పురుగుమందులు, తెగుళ్ల మందుల వాడకాన్ని తగ్గించటానికి.. నేలల ఆరోగ్యం, ఉత్పాదకశక్తిని పెంపొందించడానికి ఉపయోడపడుతోందని ప్రొఫెసర్ ప్రశాంత్ ఫలే వెల్లడించారు.

రసాయనిక పురుగుమందులు, తెగుళ్ల మందులలోని బెంజీన్ వంటి ఆరోమాటిక్ కాంపౌండ్స్ వల్ల నేలలు కలుషితం కావటం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య. ఈ సమ్మేళనాలు విషతుల్యమైనవి. విత్తనం మొలక శాతాన్ని ఇవి తగ్గిస్తాయి. పంట మొక్కల ఎదుగుదలకు, దిగుబడికి ప్రతిబంధకంగా మారుతున్నాయి. ధాన్యాలు, గింజల్లో, మొక్క భాగాల్లో ఈ విషతుల్యమైన సమ్మేళనాలు చేరిపోతాయి. కార్బారిల్, నాఫ్తలిన్, బెంజోయేట్, 2,4–డైక్లోరోఫెనాక్సియేసెటిక్ ఆసిడ్, థాలేట్స్‌ను పురుగుమందుల్లో విస్తృతంగా వాడుతున్నారు. సౌందర్యసాధనాలు, దుస్తులు, నిర్మాణ రంగం, ఆహార రంగంలో వాడే ప్రిజర్వేటివ్స్, అద్దకం, పెట్రోలియం, ప్లాస్టిక్ ఉత్పత్తి రంగాల్లో కూడా ఈ విషతుల్యమైన సమ్మేళనాలను వాడుతున్నారు. వీటి వల్ల మట్టి, నీరు, గాలి కలుషితం అవుతున్నాయి.

అయితే, ఈ కలుషితాలను తొలగించడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న రసాయనిక పద్ధతి లేదా కలుషితమైన మట్టిని తొలగించటం వంటి పద్ధతులు అధిక ఖర్చుతో కూడినవే కాక సమస్యను సమూలంగా పరిష్కరించకుండా తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే కలిగిస్తున్నాయి. ఈ దృష్ట్యా సమస్యాత్మక నేలలను శుద్ధి చేసుకోవటానికి ఐఐటి ముంబై పరిశోధకుల కృషి తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

శిలీంధ్ర తెగుళ్లకూ పరిష్కారం

వందలాది శిలీంధ్ర తెగుళ్లు 168 రకాల పంటల్లో 10-23% పంట నష్టం కలిగిస్తున్నాయని ఎఫ్.ఎ.ఓ. అంచనా. తెగుళ్లను తట్టుకునే వంగడాలు వచ్చినప్పటికీ శిలీంధ్ర తెగుళ్లు వెనక్కి తగ్గటం లేదు. అయితే, ఈ పరిశోధనలో వాడిన మిత్ర సూక్ష్మజీవులు ఉత్పత్తి చేసే లైటిక్ ఎంజైములు, హైడ్రోజెన్ సైనేడ్ వంటివి పంటలకు హాని చేసే శిలీంధ్రాలను చంపుతున్నాయని గుర్తించారు. 'ఈ బ్యాక్టీరియా మొక్కలకు సహజ రక్షణ వ్యవస్థను కల్పిస్తున్నాయి. రసాయనిక పురుగుమందులు పర్యావరణానికి, మేలుచేసే సూక్ష్మజీవరాశికి హాని చేస్తుంటే.. ఈ బ్యాక్టీరియా మిశ్రమం పర్యావరణానికి మేలు చేస్తూ కేవలం హానికారక శిలీంధ్రాలను మాత్రమే అరికడుతున్నాయని ప్రొఫెసర్ ఫలే తెలిపారు. తమ పరిశోధనలో వాడిన వివిధ జాతుల బ్యాక్టీరియా మిశ్రమం బయో ఫార్ములేషన్స్ రూపంలో వాణిజ్యపరంగా రైతులకు అందుబాటులోకి రావటానికి మరికొంత కాలం వేచి ఉండాల్సి ఉందని ప్రొఫెసర్ ఫలే వివరించారు.

సహజ పద్ధతిలో శుద్ధి

ఘాటైన వాసనలతో కూడిన రసాయనిక విషపదార్థాలను చక్కగా విచ్ఛిన్నం చేయటానికి సూడోమోనాస్, అసినెటోబాక్టర్ తదితర జాతుల బ్యాక్టీరియా ఉపయోగపడుతున్నట్లు గుర్తించారు. ఇవి విషతుల్య సమ్మేళనాలను తిని.. హానికరం కాని, విషరహిత సమ్మేళనాలుగా మార్చుతున్నాయి. ఆ క్రమంలో కలుషిత పర్యావరణాన్ని ఇవి సహజంగా శుద్ధి చేస్తున్నాయని ప్రొఫెసర్ ప్రశాంత్ ఫలే వ్యాఖ్యానించారు.

పెరిగిన పోషకాల లభ్యత

ఫాస్ఫరస్, పొటాషియం వంటి నీట కరగని స్థూల పోషకాలను ఈ బ్యాక్టీరియా నీట కరిగేలా చేస్తుంది. తద్వారా పంట మొక్కల వేర్లు అదనపు పోషకాలను పీల్చుకునే అవకాశం కల్పిస్తాయి. నిస్సారమైన భూముల్లో పెరిగే పంట ఐరన్‌ను ఎక్కువగా తీసుకోలేకపోతుంటుంది.

ఈ సూక్ష్మజీవులు సైడెరోఫోర్స్ అనే పదార్థాన్ని విడుదల చేయటం ద్వారా ఐరన్‌ను సరిగ్గా తీసుకునేలా చేస్తాయి. అంతేకాకుండా ఇండోల్ అసెటిక్ ఆసిడ్ (ఐఎఎ) అనే గ్రోత్ హార్మోన్‌ను ఈ బ్యాక్టీరియా విడుదల చేసి దిగుబడిని పెంచుతుంది.

ఇంకా ప్రొఫెసర్ ఫలే ఇలా అన్నారు.. 'సూడోమోనాస్, అసెనెటోబాక్టర్ జెనెరకు చెందిన అనేక జాతుల సూక్ష్మజీవుల మిశ్రమాన్ని వాడిన తర్వాత గోధుమ, పెసర, పాలకూర, మెంతికూర తదితర పంటల దిగుబడి 40–45% వరకు పెరిగింది.

మట్టిలో రసాయనాలను కొన్ని రకాల బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేస్తుంటే, మరి కొన్ని సూక్ష్మజీవులు మొక్కల పెరుగుదలను పెంపొందించే హార్మోన్ ఉత్పత్తికి, చీడపీడల బెడద నుంచి దీటుగా తట్టుకునేందుకు ఉపయోగపడుతున్నాయని, కలసికట్టుగా పనిచేస్తే కలిగే ప్రయోజనం ఇదే అన్నారు ప్రొ॥ ఫలే.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

11న తార్నాకలో సేంద్రియ సంత

గ్రామభారతి, సిఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ తార్నాకలోని మర్రి కృష్ణా హాల్‌లో ఈ నెల 11 (శనివారం)న ఉ. 10 నుంచి సా. 7 గం. వరకు సేంద్రియ / ప్రకృతి ఆహారోత్పత్తుల మూలం సంత జరగనుంది. దేశీ వరి బియ్యం, చిరుధాన్యాలు, ఇతర ఉత్పత్తులు, సంప్రదాయ పిండి వంటలు, చేనేత వస్త్రాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు నిర్వాహకులు సూర్యకళ తెలిపారు. సంప్రదాయ రుచులతో కూడిన ఆర్గానిక్ భోజనం ఈ సంత ప్రత్యేకత. ఇతర వివరాలకు.. 94908 50766.



రోజుకు 8 టన్నుల పండ్లు కోసే బాహుబలి రోబో!

బత్తాయి చెట్ల నుంచి పండ్లు కోసే రోబోని ఇజ్రేలుకు చెందిన కంపెనీ నానోవెల్ రూపొందించింది. దీనికి వివిధ ఎత్తుల్లో 6 రోబోటిక్ చేతుల్ని అమర్చారు. తోట మధ్యలో వెళ్తూ చెట్టు కొమ్మలకు తగినంత సైజు పెరిగిన, పక్వానికి వచ్చి రంగు మారిన పండ్లను కృత్రిమ మేధతో గుర్తించి కోసేలా దీన్ని రూపొందించారు. వాక్యూమ్ టెక్నాలజీతో పండును పట్టుకొని, తొడిమెను కత్తిరిస్తుంది. చేతిలోకి వచ్చిన పండు కన్వేయర్ బెల్ట్ ద్వారా బుట్ట లోకి చేరుతుంది. ఈ పనులన్నీ రోబో తనంతట తానే చేసేస్తుంది. దూరం నుంచి చూస్తే చిన్న చక్రాలున్న షెడ్డు మాదిరిగా కనిపించే ఈ రోబో.. ప్రస్తుతం ఒక ట్రాక్టర్ లాక్కెళ్తూ ఉంటే పండ్లను కోస్తుంది. మున్ముందు ట్రాక్టర్ అవసరం లేకుండా తనంతట తానే కదిలి వెళ్లేలా దీన్ని మెరుగుపరచనున్నట్లు నానోవెల్ కంపెనీ ప్రకటించింది.



బత్తాయి చెట్ల మధ్య రోబో



పక్వానికి వచ్చిన బత్తాయిని కోస్తున్న రోబో

అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతంలో భారీ బత్తాయి తోటల యజమానులను కోత కూలీల కొరత వేధిస్తోంది. ఈ రోబో వారికి ఊరటనిస్తుందని నానోవెల్ ఆశిస్తోంది. కాలిఫోర్నియా సిట్రస్ రీసెర్చ్ బోర్డుతో ఒప్పందం చేసుకున్న ఈ కంపెనీ బత్తాయిలు కోసే ఈ రోబో పనితీరును కాలిఫోర్నియా బత్తాయి, నారింజ తోటల్లో పరీక్షించబోతున్నది. అక్కడి భారీ కమతాల్లో సాగయ్యే సిట్రస్ పండ్ల తోటల అవసరాలకు అనుగుణంగా ఈ రోబోకు అవసరమైన మార్పులు చేర్పులు చేయబోతున్నారు.

ఈ సంవత్సరం సెప్టెంబర్‌లో లండన్‌లో జరిగే వరల్డ్ అగ్రి-టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో కూడా ఈ రోబోను ప్రదర్శించబోతున్నామని నానోవెల్ సీఈవో ఇసాక్ మేజర్ చెప్పారు. భారీ తోటల్లో పండ్ల కోత కూలీల కొరతను ఎదుర్కొంటున్న అమెరికా, స్పెయిన్, ఇటలీ తదితర దేశాల్లో ఈ భారీ రోబోకు ఆదరణ బాగుంటుందని భావిస్తున్నామన్నారు. అంటే, సమీప భవిష్యత్తులో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ ఇటువంటి రోబోలు రాబోతున్నాయి.

పండ్లను కోయటంతో పాటు మిగిలిన కాయలు ఎన్ని ఎప్పటికి కోతకు వస్తాయి? తోటలో చెట్ల స్థితిగతులపై కూడా గణాంకాలను ఈ రోబో సేకరించటం వల్ల తోట యజమానులకు వెసులుబాటు కలుగుతుంది.

ఆరు రోబోటిక్ చేతులతో ఏకకాలంలో పనిచేసే ఈ భారీ రోబో గంటకు బుట్ట (400 కిలోల) ఆరెంజ్‌లను కోయగలదు. రాత్రీ పగలు తేడా లేకుండా 24 గంటల్లో 20 బుట్టల (8 టన్నులు) పండ్లు కోయగలదు. అందువల్ల దీన్ని 'బాహుబలి రోబో' అనొచ్చు! ఇక ధర ఎంతో.. అంటారా? అది కూడా భారీగానే ఉంటుంది మరి!

స్మృతి సారథ్యంలో...

ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ బరిలో భారత జట్టు




న్యూఢిల్లీ: ఐర్లాండ్‌తో స్వదేశంలో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొనే భారత మహిళల క్రికెట్ జట్టును సెలక్టర్లు ప్రకటించారు. 15 మంది సభ్యుల ఈ టీమ్‌కు స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌కు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. వెస్టిండీస్‌తో ఇటీవల జరిగిన టి20 సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లకు స్మృతినే కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించింది. విండీస్‌తో వన్డే పోరులో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన పేస్ బౌలర్ రేణుకా సింగ్‌కు కూడా విరామం ఇచ్చారు. విండీస్‌తో సిరీస్‌లో అరంగేట్రం చేసిన ప్రతీక, తనూజ తమ స్థానాలను నిలబెట్టుకోగా... రాఘ్వీ బిస్త్‌కు తొలిసారి వన్డే టీమ్ పిలుపు దక్కింది. భారత వన్డే టీమ్‌లోకి ఎంపికైనా మ్యాచ్ ఆడని సయాలీ సత్‌ఘరేకు మరో అవకాశం దక్కింది. మరోవైపు ఇప్పటికే స్థానం కోల్పోయిన షఫాలీ వర్మ, అరుంధతి రెడ్డి, రాధా యాదవ్‌లపై మాత్రం సెలక్టర్లు ఇంకా విశ్వాసం ఉంచలేదు. రాజ్‌కోట్‌లో ఈ నెల 10, 12, 15 తేదీల్లో మూడు వన్డేలు జరుగుతాయి. ఇప్పటి వరకు భారత్, ఐర్లాండ్ మధ్య 12 వన్డేలు జరగ్గా...అన్నీ భారత్ గెలిచింది.

జట్టు వివరాలు: స్మృతి మంధాన (కెప్టెన్), దీప్తి శర్మ (వైస్‌కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, ఉమా ఛెత్రి, రిచా ఘోష్, తేజల్ హసబ్నిస్, రాఘ్వీ బిస్త్, మిన్ను మణి, ప్రియా మిశ్రా, తనూజ కన్వర్, టిటాస్ సాధు, సైమా ఠాకూర్, సయాలీ సత్‌ఘరే.

బ్రిటిష్ ఓపెన్ స్క్వాష్ టోర్నీ విజేత అనాహత్

బర్మింగ్‌హామ్: భారత యువ స్క్వాష్ ప్లేయర్ అనాహత్ సింగ్... బ్రిటిష్ ఓపెన్ జూనియర్ సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. సోమవారం జరిగిన అండర్–17 బాలికల సింగిల్స్ ఫైనల్లో 16 ఏళ్ల అనాహత్ 4–11, 11–9, 6–11, 11–5, 11–3తో మలిక ఎల్ కరాక్సీ (ఈజిప్ట్)పై గెలుపొందింది. ఇప్పటికే అండర్–11, అండర్–15 కేటగిరీల్లో ఈ టోర్నీలో విజేతగా నిలిచిన అనాహత్... గతేడాది అండర్–17 విభాగం ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఢిల్లీకి చెందిన అనాహత్ 2022లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొని... భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అనాహత్ ప్రస్తుతం 82వ ర్యాంక్‌లో ఉంది.


అనాహత్

మళ్లీ బలంగా పైకి లేస్తాం: యశస్వి జైస్వాల్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో సిరీస్‌లో భారత జట్టు తరఫున యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 1 సెంచరీ, 2 అర్ధసెంచరీలు సహా అతను 43.44 సగటుతో 391 పరుగులు చేశాడు. ట్రవిస్ హెడ్ (448) తర్వాత ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో అతనిది రెండో స్థానం. ఈ సిరీస్ ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని యశస్వి సోషల్ మీడియాలో వ్యాఖ్యానించాడు. ముున్ముందు మరింత మంచి ఫలితాలు సాధిస్తామని అతను విశ్వాసం వ్యక్తం చేశాడు. 'ఆస్ట్రేలియా గడ్డపై ఎంతో నేర్చుకున్నాను. దురదృష్టవశాత్తూ మేం ఆశించిన ఫలితం రాలేదు. అయితే ముున్ముందు మరింత బలంగా పైకి లేస్తాం. మీ అందరి మద్దతు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది' అని తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో యశస్వి ఈ పోస్ట్ చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'ఆటగాళ్లు గాయపడాలని ఎవరూ కోరుకోరు... కానీ ఇలాంటి పిచ్‌పై అతడిని ఎదుర్కోవడం అంటే మాకు ఒక పీడకలగా మారి ఉండేది... అతను బౌలింగ్‌కు దిగడం లేదని తెలిసిన వెంటనే మాకు ఇక్కడ గెలిచే అవకాశం ఉందని అర్థమైంది'... ఒక బౌలర్ గురించి ప్రత్యర్థి బ్యాటర్ ఇలాంటి మాట చెబుతున్నాడంటే సదరు బౌలర్ ఆ బ్యాటర్‌పై, జట్టులోని ఇతర ఆటగాళ్లపై చూపించిన ప్రభావం ఏమిటో అర్థమవుతుంది. 'మీ గుండెల్లో నిద్రపోతా' అంటూ సినిమాల్లో వినిపించే రొటీన్ డైలాగ్‌ను నిజంగానే అన్వయిస్తే ఎలా ఉంటుందో ఈ వ్యాఖ్య చూపించింది! అంతటి పదునైన బౌలింగ్‌తో భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆస్ట్రేలియాపై చెలరేగిపోయాడు. ఈ ఒక్క సిరీస్‌లోనే ఎన్నో ఘనతలను లిఖించుకున్న అతను అప్పుడే 'ఆల్‌టైమ్ గ్రేట్'లలో ఒకడిగా మారాడంటే అతిశయోక్తి కాదు.

-సాక్షి క్రీడా విభాగం



భయం పుట్టించాడు!

- బుమ్రా అసాధారణ బౌలింగ్ ప్రదర్శన
- ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఎన్నో రికార్డులు
- 'ఆల్‌టైమ్ గ్రేట్' బౌలర్లలో ఒకడిగా గుర్తింపు

బుమ్రా బౌలింగ్‌లో బెదిరిపోయిన తీరు గురించి ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా స్వయంగా చెప్పుకున్నాడు. ఈ సిరీస్‌లో బుమ్రా బౌలింగ్‌లో 112 బంతులు ఎదుర్కొన్న ఖ్వాజా 33 పరుగులే చేసి 6 సార్లు అవుటయ్యాడంటే అతను ఎంతగా ఇబ్బంది పడ్డాడో అర్థమవుతుంది. బుమ్రా లేని సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో స్వేచ్ఛగా ఆడి అతను 45 బంతుల్లో 41 పరుగులు సాధించాడు. అయితే ఖ్వాజా మాత్రమే కాదు... ప్రతీ ఆసీస్ బ్యాటర్ అతని బౌలింగ్ బారిన పడినవారే. మెక్‌స్వీనీ, హెడ్ చెరో 4 సార్లు బుమ్రా బౌలింగ్‌లో అవుట్ కాగా... టాప్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ 3 సార్లు వెనుదిరిగాడు. అయితే క్లీన్ బౌల్డ్ లేదా ఎల్బీడబ్ల్యూ. లేదంటే కాస్త డ్రైవ్ కోసం ప్రయత్నిస్తే కీపర్‌కు లేదా స్లిప్‌లో క్యాచ్! ఒక్క బ్యాటర్ కూడా ఒక్కసారైనా నేరుగా షాట్ ఆడే సాహసమే చేయలేదు. ఫలితంగా కేవలం 13.06 సగటుతో ఏకంగా 32 వికెట్లు తీసి బుమ్రా సిరీస్‌ను ముగించాడు. అతని బౌలింగ్ లేకపోతే భారత్ 0–4తో లేదా 0–5తో కూడా ఓడేదేమో!

అసాధారణ ప్రదర్శన...

ఇన్నింగ్స్ మొదలు కాగానే చెలరేగిపోయి శుభారంభాలు అందించాల్సి వచ్చినా... నిలదొక్కుకుంటున్న మిడిలార్డర్‌ను పడగొట్టాలన్నా... కీలక భాగస్వామ్యాలను విడదీయాలన్నా బుమ్రా వల్లే సాధ్యమైంది. సిరీస్ ఆసాంతం ఇది సాగింది. ప్రతిష్టాత్మక సిరీస్‌లో ప్రత్యర్థి గడ్డపై తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైన తర్వాత ఏ జట్టయినా గెలుపు గురించి ఆలోచించగలదా! కానీ బుమ్రా దానిని సాధ్యం చేసి చూపించాడు. అతని దెబ్బకు ఐదు వికెట్లు సమర్పించుకున్న ఆసీస్ ఆ టెస్టులో మళ్లీ కోలుకోలేకపోయింది. తర్వాతి మూడు టెస్టుల్లోనూ అక్కడక్కడా భారత జట్టు మ్యాచ్‌పై ఆశలు పెంచుకోగలిగిందంటే బుమ్రానే కారణం. సిరీస్‌లో 908 బంతులేసిన బుమ్రా ఒక్కడే 32 వికెట్లు తీయగా, మిగిలిన భారత బౌలర్లంతా కలిపి 2814 బంతుల్లో 48 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగారు. అతని సగటు 13.06 కాగా, మిగిలిన బౌలర్ల సగటు 34.82 చూస్తేనే తేడా ఏమిటో అర్థమవుతుంది. 20కంటే తక్కువ సగటుతో 200 వికెట్లు మైలురాయిని దాటిన బుమ్రా... ఎందరో గొప్ప బౌలర్లకు సాధ్యంకాని ఈ అరుదైన ఘనతను అందుకొని దిగ్గజాల సరసన నిలవగలిగాడు. విదేశీ గడ్డపై ఒక సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా కూడా అతను నిలిచాడు.

భరించలేనంత భారాన్ని మోసి...

ప్రధాన బ్యాటర్లపై నమ్మకం లేక లోయర్ ఆర్డర్‌లో అదనపు పరుగుల కోసం భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఎంచుకున్న బౌలింగ్ ఆల్‌రౌండర్ వ్యూహం బుమ్రాపై భారాన్ని అమితంగా పెంచేసింది. నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్ వరకు కూడా ఇతర పేసర్లు సిరాజ్, ఆకాశ్‌దీప్ ఆశించిన రీతిలో ప్రభావం చూపలేకపోయారు. బ్యాటింగ్ బలం కోసం మరో ప్రధాన పేస్ బౌలర్‌ను ఆడించలేని స్థితి. దాంతో బాధ్యత మొత్తం బుమ్రా భుజాలపైనే పడింది. చివరకు అది కీలక సమయంలో జట్టునే దెబ్బ కొట్టింది. బౌలింగ్ భారం ఎక్కువై అతను వెన్ను నొప్పితో తప్పుకోవాల్సి వచ్చింది. సిరీస్ మొత్తంలో పచ్చికతో పేస్‌కు అత్యంత అనుకూలంగా కనిపించిన సిడ్నీ పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా బౌలింగ్ చేయకపోవడమే భారత్ విజయావకాశాలను దెబ్బ తీసిందనేది వాస్తవం. సిరీస్‌లో బుమ్రా ఏకంగా 151.2 ఓవర్లు బౌలింగ్ చేశాడు. భారత్ వేసిన ఓవర్లలో ఇది 24.4 శాతం కాగా... భారత్ పడగొట్టిన మొత్తం వికెట్లతో 40 శాతం బుమ్రానే పడగొట్టడం విశేషం. 'బుమ్రాలాంటి అరుదైన ఆటగాడిపై భారం వేయకుండా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంది. అతను చాలా ఎక్కువగా బౌలింగ్ చేశాడు. కానీ అతను అద్భుత ఫామ్‌తో చెలరేగిపోతున్న సమయంలో దానిని సమర్థంగా వాడుకోవడం కూడా జట్టుకు అవసరం' అంటూ రోహిత్ శర్మ అప్పటికే తమ ప్రధాన పేసర్ పరిస్థితి గురించి చెప్పేశాడు.

ఎంత కాలం ఆటకు దూరం?

బుమ్రా వెన్ను నొప్పి తీవ్రత ఎంత అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. భారత్‌కు వచ్చిన తర్వాతే అతని పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియవచ్చు. గ్రేడ్–1 గాయం లేదా గ్రేడ్–2 అయినా సరే గరిష్టంగా 6 వారాల్లో కోలుకునే అవకాశం ఉంది. అయితే అంతకుమించి ఉంటే మాత్రం సమస్యే. కనీసం మూడు నెలల తర్వాత గానీ సాధారణ స్థితికి వచ్చే అవకాశం లేదు. తర్వాత టెస్టు మ్యాచ్ కోసం జూన్ వరకు సమయం ఉండగా... ఫిబ్రవరి–మార్చి సమయంలోనే భారత్ ముందు చాంపియన్స్ ట్రోఫీ రూపంలో ప్రతిష్టాత్మక టోర్నీ ఉంది. ఇతర సిరీస్‌లను పక్కన పెట్టినా ఈ మెగా టోర్నీలో అతను ఆడటం జట్టుకు ఎంతో అవసరం. అయితే దానికి ముందు సన్నాహకంగా భారత్‌లోనే ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్ కూడా ఆడతాడా అనేది చర్చనీయాంశం.

సినిమా



''గత కొన్నేళ్లుగా నేను నిర్మించిన సినిమాల్లో ఎక్కువ శాతం హిట్స్ కాలేకపోయాయి. అనుకున్న రిజల్ట్‌తో సినిమాలు రావటం లేదని నా సన్నిహితులు, శ్రేయోభిలాషులు అనడంతో నాలో తెలియని భయం ప్రారంభమైంది. నాలో స్టోరీ జడ్జ్‌మెంట్ పోయిందా? మళ్లీ హీరోల కాంబినేషన్‌లకే వెళ్లాలా? అని ఆలోచించాను. చిత్ర పరిశ్రమలో విజయాలు ఉంటేనే విలువ ఉంటుంది. ఈ సంక్రాంతికి వస్తున్న 'గేమ్ చేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలతో కచ్చితంగా నేను కమ్ బ్యాక్ అవుతాను'' అని నిర్మాత 'దిల్' రాజు చెప్పారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన 'గేమ్ చేంజర్' ఈ నెల 10న, వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ నెల 14న విడుదల కానున్నాయి. ఈ సినిమాల నిర్మాత 'దిల్' రాజు సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో పంచుకున్న విశేషాలు...

అప్పుడు భయం ప్రారంభమైంది

- 'దిల్' రాజు

- 'గేమ్ చేంజర్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా. 2021 ఆగస్ట్‌లో ఈ చిత్రాన్ని ప్రారంభించాను. ఈ మూవీ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు చూశాను. 'భారతీయుడు 2' సినిమా తర్వాత శంకర్‌గారి నుంచి వస్తున్న చిత్రం 'గేమ్ చేంజర్'. అలాగే 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రామ్‌చరణ్ నటించిన సినిమా కూడా ఇదే. కాబట్టి ఈ మూవీ విజయం మా ముగ్గురికీ ఎంతో ముఖ్యం. అన్ని వాణిజ్య అంశాలతో పాటు గౌరవంగా ఫీల్ అయ్యే సినిమా 'గేమ్ చేంజర్'.
- 'సంక్రాంతికి వస్తున్నాం' సూపర్ హిట్ అని అంటున్నారు. ఈ బజ్ రావటానికి కారణం అనిల్ రావిపూడి. 'ఎఫ్ 2' లాగా సూపర్ హిట్ కొట్టాలని కష్టపడ్డాడు. ఈ సినిమా కూడా బిగ్ హిట్ కాబోతోంది. ఏపీలో సినిమాల బెనిఫిట్ షోలు, టికెట్ ధరలపై ఓ స్పష్టత వచ్చింది. ఈ విషయాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారిని కూడా కలిసి వినతి చేస్తాను. అయితే తుది నిర్ణయం ప్రభుత్వానిదే.

మృతులకు సాయం

ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి వచ్చి, తిరిగి వెళుతున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అరవ మణికంఠ (23), తోకాడ చరణ్ (22) మృతి చెందిన సంగతి తెలిసిందే. వీరి కుటుంబాలకు హీరో రామ్‌చరణ్ ఐదు లక్షల చొప్పున పది లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే నిర్మాత 'దిల్' రాజు కూడా చెరో ఐదు లక్షల చొప్పున పది లక్షలు సాయం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా ఉంటానని ప్రకటించారు.


అల్లు అర్జున్, సుకుమార్

రప్పా రప్పా సరికొత్త రికార్డప్పా

- 32 రోజుల్లో రూ.1831 కోట్ల కలెక్షన్స్ సాధించిన పుష్ప 2
- 'బాహుబలి-2' వసూళ్లను అధిగమించిన పుష్పరాజ్

పుష్పరాజ్ ('పుష్ప' సినిమాలో అల్లు అర్జున్ పాత్ర పేరు) అస్సలు తగ్గడం లేదు. వసూళ్ల విషయంలో రప్పా రప్పా అంటూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. కేవలం 32 రోజుల్లోనే 'పుష్ప 2 : ది రూల్' ప్రపంచ వ్యాప్తంగా రూ.1831 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డు సృష్టించినట్లు మేకర్స్ ప్రకటించారు. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జోడీగా నటించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల ప్రత్యేక పాటలో నటించారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 5న విడుదలైంది. అయితే డిసెంబరు 4 నుంచి ప్రీమియర్స్ మొదలైన సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్‌లలో 'పుష్ప 2: ది రూల్' విడుదలైంది. సినిమా రిలీజైన 32 రోజుల్లోనే రూ.1831 కోట్లు గ్రాస్ వసూలు చేసి, రూ.1810 కోట్లు వసూలు చేసిన 'బాహుబలి-2' సినిమా వసూళ్లను 'పుష్ప 2' అధిగమించి, సరికొత్త రికార్డును క్రియేట్ చేసినట్లు చిత్రబృందం పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఆమీర్‌ఖాన్ నటించిన హిందీ సినిమా 'దంగల్' ప్రపంచవ్యాప్తంగా రూ.2 వేల కోట్లకుపైగా వసూళ్లతో ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే రూ.1831 కోట్ల వసూళ్లతో రెండో స్థానంలో 'పుష్ప 2: ది రూల్' నిలిచింది. కాగా బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు సినిమాల్లో మాత్రం 'పుష్ప 2: ది రూల్' మొదటి స్థానంలో నిలిచింది.


'దిల్' రాజు, శిరీష్, అనిల్ రావిపూడి, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, మీనాక్షి

సంక్రాంతికి అలరిస్తుంది

- వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో మహేశ్‌బాబు 'ఎక్స్' వేదికగా షేర్ చేసి, చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అలాగే ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని సోమవారం రాత్రి నిజామాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ–''సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఈ సంక్రాంతికి వస్తున్నాం. హోల్‌సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఈ చిత్రం తీశాడు అనిల్. మీ ఫ్యామిలీతో వచ్చి చూడండి.. తప్పకుండా అందరూ ఎంజాయ్ చేస్తారు. ఈ సంక్రాంతికి వస్తున్న 'గేమ్ చేంజర్, 'డాకు మహారాజ్' సినిమాలు కూడా విజయం సాధించాలి. 'దిల్' రాజు, శిరీష్‌లతో ఇంకా మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. మా 'సంక్రాంతికి వస్తున్నాం' చూడండి.. మామూలుగా ఉండదు'' అన్నారు.


కాజల్

భక్తుల్ని ఆదుకునే త్రిశక్తి

''ముల్లోకాలు ఏలే తల్లి.. భక్తుల్ని ఆదుకునే త్రిశక్తి... శ్రీ కాళహస్తిలో వెలసిన శ్రీ జ్ఞానప్రసూనాంబిక..' అంటూ పార్వతి మాతను కీర్తిస్తూ, 'కన్నప్ప' సినిమాలో పార్వతీ దేవి రోల్ చేసిన కాజల్ అగర్వాల్ ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. విష్ణు మంచు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో మోహన్ బాబు, శరత్‌కుమార్, బ్రహ్మానందం, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్‌కుమార్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ మూవీలో పార్వతీ దేవిగా కాజల్ అగర్వాల్ నటిస్తున్నట్లు వెల్లడించి, ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.




గేమ్ చేంజర్ ప్రత్యేకం

- అంజలి

''గేమ్ చేంజర్' చిత్రంలో నా పాత్ర పేరు పార్వతి. మా అమ్మ పేరు కూడా పార్వతి. శంకర్‌గారు ఈ చిత్ర కథ, నా పాత్ర గురించి చెప్పినప్పుడు మా అమ్మే గుర్తుకొచ్చారు. శంకర్‌గారు నా నటన చూసి చాలా చోట్ల మెచ్చుకున్నారు. నా కెరీర్‌లో 'గేమ్ చేంజర్' సినిమా, నా పాత్ర చాలా ప్రత్యేకం'' అని అంజలి చెప్పారు. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ చేంజర్'. అంజలి, కియారా అద్వానీ హీరోయిన్లుగా నటించారు. అనిత సమర్పణలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ మూవీ తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి విలేకరులతో పంచుకున్న విశేషాలు...

- నేను నటించిన 'గేమ్ చేంజర్'(తెలుగు), 'మదగజరాజ'(తమిళ్) సినిమాలు ఈ సంక్రాంతికి విడుదలవుతుండటంతో హ్యాపీగా ఉంది. ఈ రెండు చిత్రాలకు మంచి స్పందన వస్తుందనే నమ్మకం ఉంది. 'గేమ్ చేంజర్'లో నేను చేసిన పార్వతి పాత్ర ఆడియన్స్‌కి చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. నా కెరీర్‌లో ఇదే బెస్ట్ క్యారెక్టర్. ఈ పాత్రతో నాకు జాతీయ అవార్డు వస్తుందని అంటున్నారు. కథ విన్నప్పుడు నాకూ అలానే అనిపించింది. అదే నిజమైతే అంతకంటే గొప్ప సక్సెస్ ఇంకేం ఉంటుంది.
- ఈ మూవీలో రామ్‌చరణ్ చేసిన అప్పన్న, నేను చేసిన పార్వతిల ప్రేమ, వారి బంధం చాలా గొప్పగా ఉంటుంది. అదే ఈ సినిమాకు ప్లస్ అవుతుంది. చరణ్ సెట్స్‌లో అందరితోనూ బాగా మాట్లాడతారు. 'దిల్' రాజుగారి బ్యానర్‌లో మూడో సినిమా, శంకర్‌గారి దర్శకత్వంలో తొలి సినిమా, రామ్ చరణ్‌గారితో మొదటి సినిమా.. ఇలా అన్ని రకాలుగా ఈ చిత్రం నాకు ప్రత్యేకం. శంకర్, మణిరత్నంగార్ల చిత్రాల్లో నటించాలని అందరికీ ఉంటుంది. శంకర్‌గారి చిత్రంలో ఛాన్స్ రావడం నా అదృష్టం. 'గేమ్ చేంజర్' చూసిన చిరంజీవిగారు.. నా పాత్రను మెచ్చుకోవడమే పెద్ద అవార్డులా అనిపిస్తోంది. తమన్ సంగీతానికి మంచి స్పందన రావడం సంతోషంగా ఉంది.

వేసవిలో యాక్షన్


అజిత్

అజిత్ కుమార్ హీరోగా నటించిన స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. త్రిష హీరోయిన్. 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మించారు. ఈ మూవీని వేసవిలో ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''అజిత్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. ఇండియన్ మూవీ చరిత్రలోనే 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఓ మైలురాయిగా నిలుస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించారు. కాగా ఈ చిత్రాన్ని తొలుత సంక్రాంతికి రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ, ఏప్రిల్‌లో రిలీజ్ అవుతోంది.


విశాల్

విశాల్‌కు అస్వస్థత

హీరో విశాల్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆయన హీరోగా సుందర్. సి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మదగజరాజ'. అంజలి, వరలక్ష్మీ శరత్‌కుమార్ హీరోయిన్లుగా నటించారు. కొన్ని కారణాల వల్ల విడుదలకు నోచుకోని ఈ మూవీ పన్నెండేళ్ల తర్వాత ఈ నెల 12న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చెన్నైలో నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న విశాల్ చాలా సన్నగా కనిపించారు. అలాగే ఆయన మాటలతో పాటు మైకు పట్టుకున్న చేయి కూడా వణుకుతూనే ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అసలు విశాల్‌కు ఏమైంది? అని ఆయన అభిమానులు ఆందోళన చెందారు. కాగా ఆయన అధిక జ్వరంతో బాధపడుతున్నారని, ఈ కారణంగానే 'మదగజరాజ' ఈవెంట్‌లో కాస్త అస్వస్థతగా కనిపించారని, వైద్యులు బెడ్ రెస్ట్ సూచించారంటూ విశాల్ హెల్త్ బులిటెన్‌ను ఆయన సిబ్బంది మీడియాకి రిలీజ్ చేశారు. దీంతో విశాల్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

సాక్షి బిజినెస్

మంగళవారం
7-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,258	389
77,965	23,616

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,924	▲	303
డోజోన్స్	43,081	▲	349
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,250	▲	26
డాక్స్	20,216	▲	310
షాంఘై	3,206	▽	5
నికాయ్	39,307	▽	587

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	77,161
బంగారం (99.5 స్వచ్ఛత)	76,852
వెండి (కిలో)	89,152

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	85.38	86.40
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	105.40	108.22
€	యూరో	ఒకటికి	87.30	89.89
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	53.80	55.14
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	52.35	54.53
S$	సింగపూర్ డాలర్	ఫారెక్స్‌కు	60.93	65.00
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్‌కు	22.41	24.17
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్‌కు	10.84	12.66
¥	చైనా యువాన్	ఫారెక్స్‌కు	10.97	12.56

దలాల్ స్ట్రీట్‌లో వైరస్ సైరన్!



ఒక్క రోజులో రూ.11 లక్షల కోట్ల ఆవిరి

సెన్సెక్స్ సూచీ 1,258 పాయింట్ల పతనంతో స్టాక్ మార్కెట్లో రూ.11 లక్షల కోట్ల సంపద కరిగిపోయింది. దీంతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.438.79 లక్షల కోట్లకు చేరింది.

భారత్‌లో చైనా 'హెచ్‌ఎంపీవీ' కేసులు
- క్యూ3 కార్పొరేట్ ఫలితాలపై ఆందోళనలు
- అన్ని రంగాల్లోనూ వెల్లువెత్తిన విక్రయాలు
- 1.5 శాతానికి పైగా కుప్పకూలిన సూచీలు
- 78 వేల కిందికి సెన్సెక్స్;1,258 పాయింట్లు క్రాష్
- 389 పాయింట్లు పతనమైన నిఫ్టీ...

ముంబై: చైనాలో కలకలం సృష్టిస్తున్న హ్యూమన్ మెటా న్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) కేసులు భారత్‌లో నమోదవడంతో దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల అలజడి రేగింది. ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ విక్రయాలకు పాల్పడటంతో సోమవారం స్టాక్ సూచీలు ఒకటిన్నర శాతానికి పైగా కుప్పకూలాయి. డిసెంబర్ క్వార్టర్ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలపై ఆందోళనలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస పెట్టుబడుల ఉపసంహరణ మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 1,258 పాయింట్లు పతనమై 78వేల స్థాయి దిగువన 77,965 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24 వేల స్థాయిని కోల్పోయి 389 పాయింట్ల నష్టంతో 23,616 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. మెటల్, బ్యాంకులు, రియల్ ఎస్టేట్, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఫైనాన్స్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,441 పాయింట్లు క్షీణించి 77,782 వద్ద, నిఫ్టీ 453 పాయింట్లు పతనమై 23,552 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 3%, మిడ్ క్యాప్ సూచీ 2.50 శాతం పతనాన్ని చవిచూశాయి. హెచ్‌ఎంపీవీ వ్యాప్తి భయాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

నష్టాలు ఎందుకంటే...

అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త ఆర్థిక విధానాలపై అనిశ్చితులు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై అనుమానాలు నెలకొన్నాయి. యూఎస్ బాండ్లపై రాబడులు 4.62 శాతానికి చేరుకోవడంతో ఎఫ్‌ఐఐల పెట్టుబడులు తరలిపోతున్నాయి. మరోవైపు డాలర్ ర్యాలీ ఆగడం లేదు. ఈ పరిణామాలు భారత్ లాంటి వర్ధమాన దేశాలకు ప్రతికూలంగా మారాయి. వీటికి తోడు తాజాగా భారత్‌లో హెచ్‌ఎంపీవీ కేసులు వెలుగులోకి వచ్చాయి. దేశీయ కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగా ఉండొచ్చని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థలు చెబుతున్నాయి. సాంకేతికంగా నిఫ్టీ, బ్యాంకు నిఫ్టీ 200 రోజుల మూవింగ్ యావరేజీ(డీఎంఏ) స్థాయిని కోల్పోవడంతో దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల సునామీ నెలకొంది.

- సెన్సెక్స్‌లో మొత్తం 30 షేర్లలో టైటాన్(0.60%), హెచ్‌సీఎల్‌టెక్(0.25%) మాత్రమే లాభపడ్డాయి. టాటా స్టీల్(4.50%), ఎన్‌టీపీసీ(3.50%), కోటక్ బ్యాంక్(3.25%), పవర్‌గ్రిడ్(3.10%), అదానీ పోర్ట్స్(3%) అత్యధికంగా నష్టపోయాయి.
- ఇండెక్సుల వారీగా యుటిలిటీ సూచీ అత్యధికంగా 4% పవర్ ఇండెక్స్ 3.75% పతనమయ్యాయి.

వెండి ఆభరణాలకూ హాల్ మార్కింగ్

- వెండి కళాకృతులకు సైతం
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- బీఐఎస్‌కు సూచనలు



న్యూఢిల్లీ: బంగారం ఆభరణాలకు తప్పనిసరి హాల్ మార్కింగ్ విజయవంతం కావడంతో వెండి ఆభరణాలు, కళాకృతులకు సైతం ఈ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయడాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదనను పరిశీలించాలంటూ భారతీయ ప్రమాణాల సంస్థను (బీఐఎస్) కోరినట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. 'బంగారం మాదిరే వెండికీ హాల్ మార్కింగ్‌ను తప్పనిసరి చేయాలంటూ వినియోగదారుల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. దీన్ని జాగ్రత్తగా పరిశీలించి ఒక నిర్ణయం తీసుకోండి' అని బీఐఎస్ 78వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంత్రి జోషి కోరారు. ఈ దిశగా కార్యాచరణను ప్రభుత్వం ఇప్పటికే మొదలు పెట్టిందని చెప్పారు. 'అమలు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని, వినియోగదారులు, ఆభరణాల డీలర్ల స్పందనలను తెలుసుకోవాలని కోరాను. భాగస్వాములు అందరితో మాట్లాడిన తర్వాతే ప్రక్రియ మొదలు పెడతాం'అని తెలిపారు. కాగా, మూడు నుంచి ఆరు నెలల్లో వెండికి హాల్‌మార్కింగ్‌ను అమలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ చెప్పారు.

ఐటీసీ హోటల్స్ @ రూ. 270

ఐటీసీ నుంచి హోటళ్ల విడదీత

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ నుంచి తాజాగా హోటళ్ల విభాగాన్ని విడదీయడంతో ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలలో షేరు ధరలో సవరణ చోటు చేసుకుంది. ఆతిథ్య రంగ విభాగం ఐటీసీ హోటల్స్‌ను 1:10 నిష్పత్తిలో విడదీసేందుకు జనవరి 6 రికార్డ్ డేట్ కావడంతో ఐటీసీ షేరు రూ. 27 తక్కువగా ట్రేడ్ ప్రారంభమైంది. వెరసి ఐటీసీ హోటల్స్ షేరు ధరను రూ. 27గా విడదీసినట్లయ్యింది. ఐటీసీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 10 షేర్లకుగాను 1 ఐటీసీ హోటల్స్ షేరును జారీ చేయనుంది. దీంతో ఒక్కో షేరు ధర రూ. 270గా అంచనా వేస్తున్నారు. సోమవారం ట్రేడింగ్‌లో ప్రత్యేక సెషన్ తదుపరి బీఎస్‌ఈలో ఐటీసీ రూ. 455 వద్ద ప్రారంభమైంది. మార్కెట్ల క్షీణత నేపథ్యంలో చివరికి 2.8 శాతం నష్టంతో రూ. 443 వద్ద ముగిసింది. మూడు రోజుల ట్రేడింగ్ ద్వారా ఐటీసీ హోటల్స్ షేరు మార్కెట్ ధర ఖరారు కానుంది. సుమారు నాలుగు వారాల్లో లిస్టయ్యే అవకాశం ఉంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

పసిడి కాంతుల్లో సెంట్రల్ బ్యాంకులు	ఎన్ఎండీసీ, కేఐవోసీఎల్ విలీనం!

ఎఫ్ అండ్ ఓ తగ్గింది..

- ఫలితమిస్తున్న సెబీ నిబంధనలు
- డిసెంబర్‌లో 37 శాతం తగ్గిన డెరివేటివ్స్ పరిమాణం
- రోజువారీ రూ.442 లక్షల కోట్ల నుంచి రూ.280 లక్షల కోట్లకు
- ట్రేడింగ్ వదిలి ఇన్వెస్ట్‌మెంట్‌కు మళ్లుతున్న చిన్న మదుపరులు
- ఫలితంగా డిసెంబర్లో 4.4 శాతం పెరిగిన క్యాష్ సెగ్మెంట్



అన్నీ కలిసొస్తే ఒక్కరోజులోనే సొమ్ము రెట్టింపయిపోవచ్చు. ఇంకా ఎక్కువే కావచ్చు కూడా. మరి ఇంత లాభం ఇంకెక్కడైనా ఉంటుందా? ఇదిగో... ఇలాంటి ఆలోచనే చాలామంది చిన్న ఇన్వెస్టర్లను స్టాక్ మార్కెట్లలో డెరివేటివ్స్‌గా పేర్కొనే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌వైపు మళ్లిస్తోంది. ఇక ఇన్వెస్ట్‌మెంట్ సాధనమైన స్టాక్ మార్కెట్లను గ్యాంబ్లింగ్ డెన్‌గా మారుస్తోంది. నిజానికి ఇలాంటి ఆలోచనలతో డెరివేటివ్ సెగ్మెంట్లోకి అడుగుపెట్టిన వారెవరూ లాభాలు ఆర్జించిన దాఖలాల్లేవు. 2023–24లో దాదాపు కోటి మంది ఇన్వెస్టర్లు సగటున రూ.2 లక్షల చొప్పున పోగొట్టుకున్నారన్నది సెబీ నివేదిక. అంటే దాదాపు 2 లక్షల కోట్లు. ఇవి స్టాక్ మార్కెట్లలో పోగొట్టుకున్నవే అయినా... వీళ్లేమీ షేర్లలో ఇన్వెస్ట్ చేసి నష్టపోలేదన్నది గమనార్హం. ఎప్పటికప్పుడు విపరీతమైన ఊగిసలాటతో ఉండే డెరివేటివ్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ చేసి నష్టపోయారన్నది నిజం. సత్వర లాభాలపై అత్యాశతో డెరివేటివ్స్‌లో ట్రేడింగ్ చేసేవారిలో 95 శాతం మంది భారీగా నష్టపోతున్నారని, నిరంతరం నష్టాలొస్తూ... అప్పుల్లో కూరుకుపోతున్నప్పటికీ ఆశ వదలక ఏళ్ల తరబడి ట్రేడింగ్‌ను కొనసాగిస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే చిన్న ఇన్వెస్టర్లు ఇందులోకి రాకుండా కట్టడి చేసేందుకు వారి ప్రయోజనాలను కాపాడేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ.. ఎప్పటికప్పుడు పలు చర్యలు తీసుకుంటోంది. ఇటీవలి అధ్యయనాల్లో దారుణమైన వాస్తవాలు వెలుగు చూడటంతో... ఇటీవల మరీ తీవ్రమైన చర్యలు తీసుకుంది. ఎక్స్ఛేంజీలు పలు ఇండెక్సుల్లో వీక్లీ డెరివేటివ్స్‌ను ఆరంభించటంతో రిటైలర్లు వాటిని ఆశ్రయిస్తున్నారని గ్రహించి... వాటిని రద్దు చేసింది. ఒక ఎక్స్ఛేంజీ నుంచి ఒక ఇండెక్స్‌కే వీక్లీ డెరివేటివ్స్‌కు అనుమతినిచ్చింది. దీంతో బీఎస్‌ఈ నుంచి సెన్సెక్స్, ఎన్ఎస్‌ఈ నుంచి నిఫ్టీ మాత్రమే వీక్లీ డెరివేటివ్స్ నిర్వహిస్తున్నాయి. గతంలో మాదిరి బ్యాంక్‌నిఫ్టీ, ఫిన్ నిఫ్టీ వంటి ఇండెక్సుల్లో వీక్లీ డెరివేటివ్స్ రద్దయ్యాయి. ఇవే కాదు. ఇటీవల కాంట్రాక్టుల సైజులు, మార్జిన్లను కూడా భారీగా పెంచింది. ఇవన్నీ నవంబర్ నుంచి అమల్లోకి రావటంతో ట్రేడింగ్‌కు కావాల్సిన పెట్టుబడి అమాంతంగా పెరిగింది. చాలామంది రిటైలర్లు వెనక్కి తగ్గారు. అందుకే డిసెంబర్‌లో డెరివేటివ్స్ వాల్యూమ్స్ గణనీయంగా తగ్గిపోయాయి. నెలవారీగా చూస్తే ట్రేడింగ్ పరిమాణం 37% పడిపోయింది. ప్రధాన ఎక్స్ఛేంజీలైన బీఎస్‌ఈ, ఎన్ఎస్‌ఈల్లో డిసెంబర్‌లో డెరివేటివ్స్ సెగ్మెంట్‌కి సంబంధించి సగటు రోజువారీ టర్నోవరు (ఏడీటీవీ) సుమారు రూ.280 లక్షల కోట్లకు తగ్గింది. ఇది నవంబర్లో రూ.442 లక్షలు. సెన్సెక్స్, నిఫ్టీ కొత్త రికార్డు గరిష్టాలను తాకిన సెప్టెంబర్‌లో అయితే ఏడీటీవీ ఏకంగా రూ. 537 లక్షల కోట్లుగా నమోదైంది. దానితో పోలిస్తే డిసెంబర్లో పరిమాణం సగానికి పడిపోయింది. ఇది 16 నెలల కనిష్ఠ స్థాయి కూడా. దీన్ని బట్టి.. సెబీ చర్యలు ఫలితమిచ్చినట్టేనని, రిటైలర్ల నష్టాలు తగ్గుతాయనేది మార్కెట్ వర్గాల మాటా!

మరింతగా పడిపోయే అవకాశం...

ఇంట్రాడేలో కూడా పొజిషన్లను నిశితంగా పర్యవేక్షించడంలాంటి మరిన్ని కఠిన నిబంధనలు వచ్చే కొద్ది నెలల్లో అమల్లోకి రాబోతున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో డెరివేటివ్స్ వాల్యూమ్స్ ఇంకా పడిపోయే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఎంతవరకూ పడిపోతాయన్నది ఇపుడే అంచనా వేయలేమని బీఎస్‌ఈ వర్గాలు చెబుతున్నాయి. కాంట్రాక్టుల సంఖ్య తగ్గినా ప్రీమియం మెరుగుపడితే, ఆదాయం కూడా పెరుగుతుందని, వ్యయాలూ తగ్గుతాయని... అలా జరిగితే ప్రయోజనకరమేనని వివరించాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్

క్యాష్ విభాగం అప్..

డెరివేటివ్స్ ట్రేడింగ్ నిబంధనలను కఠినతరం చేస్తూనే మదుపరులు దీర్ఘకాలిక ఇన్వెస్టింగ్ వైపు మళ్లేలా కూడా సెబీ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే టాప్- 500 స్టాక్స్‌కి ట్రేడింగ్ రోజునే (సేమ్ డే) సెటిల్మెంట్ నిబంధనను కూడా అమల్లోకి తేనుంది. అంటే కొన్న రోజునే షేర్లు ఖాతాలోకి రావటం... అమ్మిన రోజునే నగదు ఖాతాలోకి రావటం వంటివన్న మాట. నిబంధనలు కఠినం చేయటం వల్ల డెరివేటివ్స్ వాల్యూమ్స్ క్షీణించినా.. ఇలాంటి సానుకూల పరిణామాలతో క్యాష్ సెగ్మెంట్ మాత్రం పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. క్యాష్ మార్కెట్ టర్నోవరు వరుసగా అయిదు నెలల పాటు తగ్గినా.. డిసెంబర్‌లో మాత్రం 4.4 శాతం పెరగడం (నెలవారీగా చూస్తే) ఇందుకు నిదర్శనమని వివరించాయి. ఇటీవల ఐపీవోలతో మార్కెట్ సందడిగా ఉండటం, స్విగ్గీ.. హ్యుందాయ్‌లాంటి భారీ లిస్టింగ్‌లు మొదలైన వాటితో ఈ సెగ్మెంట్‌పై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరగడం దీనికి కారణమని పేర్కొన్నాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం– ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– తెలంగాణ హిస్టరీ
» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– ఇంగ్లిష్

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ గాంధీనగర్‌లో లైబ్రేరియన్ పోస్టులు

గాంధీనగర్(గుజరాత్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గాంధీనగర్ (ఐఐటీజీఎన్) డైరెక్ట్ లేదా డిప్యుటేషన్ ప్రాతిపదికన లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** లైబ్రేరియన్–01, సూపరింటెండింగ్ ఇంజనీర్–01.
» **అర్హత: లైబ్రేరియన్:** అభ్యర్థులు లైబ్రరీ సైన్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పీహెచ్‌డీ కలిగి ఉండాలి. లేదా కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. డిప్యూటీ లైబ్రేరియన్‌గా 10 ఏళ్ల అనుభవం ఉండాలి.
» **సూపరింటెండింగ్ ఇంజనీర్:** బీఈ/బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఏడు సంవత్సరాలతో సహా 12ఏళ్ల అనుభవం కలిగి ఉండాలి.
» **వయసు:** 30.01.2025 నాటికి లైబ్రేరియన్‌కు 57 ఏళ్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** లైబ్రేరియన్ పోస్టుకు రూ.1,44,200 నుంచి రూ.2,18,200. సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు రూ.1,23,100 నుంచి రూ.2,15,900.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.01.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2025.
» **వెబ్‌సైట్:** https://iitgn.ac.in/careers

రైల్‌టెల్, న్యూఢిల్లీలో టెక్నికల్ పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(రైల్‌టెల్) ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు బ్యాక్‌లాగ్ ఖాళీలతో సహా టెక్నికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్)–09, డిప్యూటీ మేనేజర్ (టెక్నికల్)–03.
» **అర్హత:** అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్): ఎలక్ట్రానిక్స్‌లో డిప్లొమా లేదా ఆప్టికల్ ఫైబర్ కేబుల్, టెలికాం/డేటా నెట్‌వర్క్ నిర్వహణ తత్సమాన విభాగాల్లో ఐదేళ్ల అనుభవం ఉండాలి.
» **డిప్యూటీ మేనేజర్(టెక్నికల్):** సంబంధిత విభాగాలలో బీఈ/బీటెక్/ఎంసీఏ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ మేనేజర్: 21 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **డిప్యూటీ మేనేజర్:** 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** అసిస్టెంట్ మేనేజర్‌కు నెలకు రూ.30,000 నుంచి రూ.1,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ పరీక్ష. మొత్తం 150 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రొఫెషనల్ నాలెడ్జ్(100 మార్కులు), జనరల్ ఆప్టిట్యూడ్(50 మార్కులు)నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు.
» **పరీక్ష కేంద్రాలు:** ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, హైదరాబాద్/సికింద్రాబాద్.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** హైదరాబాద్/సికింద్రాబాద్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.01.2025.
» **వెబ్‌సైట్:** https://www.railtel.in

త్రివిధ దళాలకు దారి.. సైనిక్ స్కూల్స్

» సైనిక్ స్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశం
» 2025–26 సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
» ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా అడ్మిషన్
» సీబీఎస్‌ఈ విధానంలో బోధన
» ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ

ఆరో తరగతి నుంచే విద్యార్థులను సాయుధ దళాల్లో చేరేలా సన్నద్ధం చేస్తున్న పాఠశాలలు.. సైనిక్ స్కూల్స్! భావి భారత పౌరులు.. త్రివిధ దళాల్లో అడుగు పెట్టి దేశ సేవ చేసేలా శిక్షణనిస్తున్న.. ఈ సైనిక్ స్కూల్స్‌లో చేరాలని ఎంతోమంది కోరుకుంటారు!! 2025-26 విద్యా సంవత్సరానికి గాను దేశ వ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూల్స్‌లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఏఐఎస్ఎస్ఈఈ) నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. సైనిక్ స్కూల్స్ ప్రాధాన్యత, ప్రవేశాలు, పాఠశాలలు, సీట్లు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

సైనిక్ స్కూల్స్..పాఠశాల స్థాయి నుంచే త్రివిధ దళాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు దాదాపు ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటైన విద్యా సంస్థలు. వీటి పర్యవేక్షణకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే ప్రత్యేకంగా సైనిక్ స్కూల్ సొసైటీని సైతం నెలకొల్పారు. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యా బోధన సాగిస్తూ.. విద్యార్థులకు ధైర్య సాహసాలు నూరిపోయడమే కాకుండా.. త్రివిధ దళాల్లో చేరేలా ప్రోత్సహిస్తున్నాయి సైనిక్ స్కూల్స్.

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 33

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణలో 33 సైనిక్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో ఆరో తరగతిలో 3,156 సీట్లు, తొమ్మిదో తరగతిలో 379 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు 2025–26 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా పీపీపీ విధానంలో మరో 40 సైనిక్ స్కూల్స్‌కు అనుమతించారు. వీటిలో 1,590 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో 93 సీట్లు, తొమ్మిదో తరగతిలో 22 సీట్లు, కలికిరిలో ఆరో తరగతిలో 105 సీట్లు, తొమ్మిదో తరగతిలో 16 సీట్లు ఉన్నాయి. పీపీపీ విధానంలో.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నంలో సైనిక్ స్కూల్ అందుబాటులోకి రానుంది. ఇందులో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ఏపీలోని సైనిక్ స్కూల్స్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు పోటీ పడొచ్చు.

అర్హతలు

- **ఆరో తరగతి:** మార్చి 31, 2025 నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్యలో ఉండాలి. (ఏప్రిల్ 1, 2013–మార్చి 31, 2015 మధ్యలో జన్మించాలి).
- **తొమ్మిదో తరగతి:** మార్చి 31, 2025 నాటికి 13 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- తొమ్మిదో తరగతి అభ్యర్థులు ప్రవేశ సమయానికి ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.

రాత పరీక్షలో ప్రతిభ

జాతీయ స్థాయిలో నిర్వహించే ఏఐఎస్ఎస్ఈఈలో ప్రతిభ ఆధారంగా సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్ష ఆరు, తొమ్మిది తరగతులకు వేర్వేరుగా నిర్వహిస్తారు.

ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

సైనిక్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి 125 ప్రశ్నలు–300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు–150 మార్కులకు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు– 50 మార్కులకు ఉంటాయి. మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు, మిగతా విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు.

9వ తరగతి ప్రవేశ పరీక్ష

తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు 150 ప్రశ్నలు–400 మార్కులకు అయిదు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు–200 మార్కులకు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, ఇంగ్లిష్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, జనరల్ సైన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, సోషల్ సైన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు, మిగతా విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు.

ఓఎంఆర్ షీట్ విధానం

ఆరు, తొమ్మిది తరగతులకు జరిపే రెండు పరీక్షలు కూడా పేపర్ పెన్సిల్ విధానంలోనే ఉంటాయి. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు రెండున్నర గంటలు, తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు మూడు గంటల సమయం కేటాయిస్తారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు తమకు నచ్చిన భాషలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు తెలుగు, ఉర్దూ మీడియంలను ప్రాంతీయ భాషలుగా పేర్కొని పరీక్ష రాసే అవకాశం ఉంది. తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షను మాత్రం ఇంగ్లిష్ మాధ్యమంలోనే నిర్వహిస్తారు.

హోంస్టేట్ కోటా

సైనిక్ స్కూల్స్ ప్రవేశాల విషయంలో హోంస్టేట్ కోటా విధానాన్ని అమలు చేస్తున్నారు. సైనిక్ స్కూల్ ఏర్పాటైన రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు ఆయా పాఠశాలలోని మొత్తం సీట్లలో 67 శాతం సీట్లను కేటాయిస్తారు. మిగతా 33 శాతం సీట్లను అదర్ స్టేట్ కోటా పేరుతో అన్ని రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. అదే విధంగా హోం స్టేట్, అదర్ స్టేట్ కోటాల్లో అందుబాటులో ఉండే సీట్లలో.. 25 శాతం సీట్లను త్రివిధ దళాల్లో విధులు నిర్వహిస్తున్న వారి పిల్లలకు కేటాయిస్తారు.

ప్రాధాన్యత ఆధారంగా

ఏఐఎస్ఎస్ఈఈలో సాధించిన ప్రతిభ, విద్యార్థులు దరఖాస్తు సమయంలో ప్రాథమ్యంగా పేర్కొన్న పాఠశాలల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి సీట్లు ఖరారు చేస్తారు. ఆ తర్వాత దశలో విద్యార్థులు సదరు పాఠశాలలో నిర్దేశిత తేదీలోపు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

సాయుధ దళాల్లో చేరేలా

త్రివిధ దళాల్లోని కొలువుల్లో సైనిక్ స్కూల్స్ నుంచి ఉత్తీర్ణత సాధించిన వారి ప్రాతినిధ్యం కొంత ఎక్కువగా ఉంటోందని చెప్పొచ్చు. ఎన్‌డీఏ పరీక్షలో ప్రతి ఏటా 30 శాతం వరకు సైనిక్ స్కూళ్ల విద్యార్థులు ఎంపికవుతున్నారు. దీనికి ప్రధాన కారణం.. హైస్కూల్ స్థాయి నుంచే ఆ దిశగా శిక్షణనివ్వడం, ఎన్‌సీసీ శిక్షణ, ఇతర ఫిజికల్ ట్రైనింగ్ యాక్టివిటీస్ నిలుస్తున్నాయి.

మంచి మార్కులు సాధించాలంటే

జాతీయ స్థాయిలో నిర్వహించే ఏఐఎస్ఎస్ఈఈలో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు అధ్యయనం చేయాల్సిన అంశాలు..
- విద్యార్థులు ముందుగా తాము దరఖాస్తు చేసుకుంటున్న తరగతి ఆధారంగా అంతకు ముందు తరగతులకు సంబంధించిన అకాడమీ పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అభ్యసించడం ఉపయుక్తంగా ఉంటుంది.
- ఆరో తరగతి ప్రవేశ పరీక్ష అభ్యర్థులు ప్రధానంగా నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను చదవాలి.
- తొమ్మిదో తరగతి అభ్యర్థులు అయిదు నుంచి ఎనిమిది తరగతుల పుస్తకాలను ముఖ్యంగా మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్ అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు సంబంధించి గ్రామర్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఆర్టికల్స్, ప్రిపొజిషన్స్, వెర్బ్స్‌పై దృష్టి పెట్టాలి.
- జనరల్ సైన్స్‌కు సంబంధించి సైన్స్‌లోని ప్రాథమిక అంశాలు, మొక్కలు, బ్యాక్టీరియా, వ్యాధులు–కారకాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- సోషల్ సైన్స్‌కు సంబంధించి పర్యావరణం, హిస్టరీ, జాగ్రఫీ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా సివిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక భావనలు తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌లో జనాభా, జన గణన గణాంకాలు, పంటలు –ఉత్పత్తులు.. అవి ఎక్కువగా పండే ప్రదేశాలు తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- జనరల్ నాలెడ్జ్‌లో ముఖ్యమైన వ్యక్తులు, అవార్డులు–విజేతలు, ముఖ్యమైన ప్రదేశాలు, క్రీడలు–విజేతలు, ప్రధాన మంత్రులు, రాష్ట్రపతి వంటి పదవులు చేపట్టిన వ్యక్తుల గురించి తెలుసుకోవాలి.



ముఖ్య సమాచారం
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, జనవరి 13.
- ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సవరణలు: 2025, జనవరి 16 నుంచి 18 వరకు.
- ఏఐఎస్ఎస్ఈఈ పరీక్ష తేదీ: 2025, జనవరి 19.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://exams.nta.ac.in/AISSEE

చాట్‌జీపీటీకి గ్రోక్ స్ట్రోక్!



కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రముఖ టెక్ కంపెనీల మధ్య పోటీ

చాట్‌జీపీటీకి పోటీగా 'గ్రోక్'ను తెరపైకి తెచ్చిన ఎలన్ మస్క్

విస్తృత, వైవిధ్యమైన సేవలతో అగ్రగామిగా చాట్‌జీపీటీ

2021కి ముందునాటి సమాచారం ఆధారంగానే దాని సేవలు

'రియల్ టైమ్'సమాచార సేవలతో గట్టి పోటీనిస్తున్న గ్రోక్

హాస్యంతోపాటు ఘాటైన ప్రశ్నలకూ సమాధానమిచ్చేలా దీనికి తర్ఫీదు

రాజకీయంగా చాట్‌జీపీటీ ధోరణి తటస్థం.. గ్రోక్ మాత్రం విభిన్నం

కృత్రిమ మేధ (ఏఐ) రంగం కొత్తపుంతలు తొక్కుతూ శరవేగంగా పురోగతి సాధిస్తున్న సమయంలో.. రెండు ప్రముఖ టెక్ కంపెనీల మధ్య పోటీకి దారితీసింది. కృత్రిమ మేధ ఫలాలను సామాన్యులకు సైతం పరిచయం చేసి, టెక్ రంగంలో సంచలనం సృష్టించిన 'చాట్‌జీపీటీ'కి పోటీగా సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'అధినేత ఎలన్ మస్క్‌కు చెందిన 'గ్రోక్'తెరపైకి దూసుకొస్తోంది. ఎలన్ మస్క్ తన 'ఎక్స్ఏఐ'సంస్థ ద్వారా గత ఏడాది నవంబర్ 3న 'గ్రోక్'ను మార్కెట్లోకి తెచ్చారు. చాట్‌జీపీటీ, గ్రోక్ రెండూ ఏఐ టూల్స్ అయినా రెండింటి మధ్య ఎన్నో వైవిధ్యాలు ఉన్నాయి. తమకు 'గ్రోక్'బాగా నచ్చిందని, 'చాట్‌జీపీటీ'సబ్‌స్క్రిప్షన్‌ను వదిలేసుకుని ఇకపై గ్రోక్‌నే వినియోగిస్తామని 'ఎక్స్'లో కొందరు పోస్టులు పెడుతుండగా.. ఎలన్ మస్క్ వాటిని షేర్ చేస్తూ ప్రమోట్ చేసుకుంటున్నారు. నిజానికి కృత్రిమ మేధ రంగంలో అగ్రగామిగా ఉన్న 'చాట్‌జీపీటీ'కి గ్రోక్ పోటీ ఇవ్వగలదా అన్నది భవిష్యత్తులో తేలిపోనుంది. - సాక్షి, హైదరాబాద్

ప్రస్తుతానికి చాట్‌జీపీటీదే ఆధిపత్యం..

'గ్రోక్'తాజా వెర్షన్‌కు ఆధారం ఎక్స్ఏఐకి చెందిన గ్రోక్–2 మోడల్. ఉచితంగా ఏఐ ఆధారిత సేవలు అందిస్తున్న ఇతర టూల్స్‌తో పోలిస్తే పనితీరు, సామర్థ్యంలో ఇది ముందంజలో ఉందని టెక్ నిపుణులు చెబుతున్నారు. కొన్ని అంశాల్లో 'చాట్‌జీపీటీ'ఉచిత వెర్షన్ (జీపీటీ 3.5)ను సైతం గ్రోక్ అధిగమించినట్టు పలు పరీక్షల్లో తేలిందని అంటున్నారు. అయితే 'చాట్‌జీపీటీ ప్లస్'వెర్షన్‌లో ఉపయోగించే 'జీపీటీ–4'మోడల్ సామర్థ్యంతో పోల్చితే 'గ్రోక్'వెనకబడే ఉందని స్పష్టం చేస్తున్నారు. మార్కెట్లో ఎక్కువ కాలం నుంచి కొనసాగుతుండటంతో పాటు గణనీయ స్థాయిలో డేటాతో శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో చాట్‌జీపీటీ ప్రత్యేకంగా నిలుస్తోందని... వినియోగదారులకు అవసరమైన సేవల నుంచి సృజనాత్మక రచనల వరకు విస్తృత శ్రేణిలో సృజన చూపగలుగుతోందని పేర్కొంటున్నారు.

రియల్ టైమ్‌లో గ్రోక్ పైచేయి

'గ్రోక్'సామాజిక మాధ్యమం 'ఎక్స్'నుంచి రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి వర్తమాన అంశాలు, సరళులపై తాజా సమాచారాన్ని అందించగలుగుతుంది. అవసరమైతే ఇంటర్నెట్‌లోనూ రియల్ టైమ్ సమాచారాన్ని సేకరించి విశ్లేషిస్తుంది. ఈ అంశంలో గ్రోక్ ముందంజలో ఉంది. చాట్‌జీపీటీ అత్యంత శక్తివంతమైనదే అయినా 'గ్రోక్'తరహాలో రియల్ టైమ్ అప్‌డేషన్ లేదు. కటాఫ్ తేదీ (2021)కి ముందు నాటి సమాచార పరిజ్ఞానాన్ని మాత్రమే చాట్‌జీపీటీ వినియోగించి సేవలు అందిస్తుంది. అయితే డబ్బులు చెల్లించి సబ్‌స్క్రయిబ్ చేసుకునే ప్రీమియం వెర్షన్ (చాట్‌జీపీటీ ప్లస్) దీనికి మినహాయింపు.

'గ్రోక్'పేరు ఎందుకు ?

'గ్రోక్'అనే ఆంగ్ల పదానికి అర్థం 'ఎవరినైనా/ఏదైన అంశాన్ని లోతుగా అవగతం చేసుకోవడం'. రాబర్ట్ ఎ.హెన్లీన్ తన సైన్స్‌ఫిక్షన్ నవల 'స్ట్రేంజర్ ఇన్ ఏ స్ట్రేంజ్ ల్యాండ్'లో వాడిన 'గ్రోక్'పదం నుంచి స్ఫూర్తి పొందిన ఎలన్‌మస్క్ తన ఏఐ టూల్‌కు ఈ పేరును పెట్టారు.

హాస్యాన్ని మేళవించి.. సమాచారం అందించే గ్రోక్..

'గ్రోక్'హాస్యాన్ని మేళవించి సరదా సంభాషణలతో, కొంతవరకు తిరుగుబాటు వైఖరిని కూడా మేళవించి సమాధానాలు ఇస్తుందని దీని రూపకర్తలు చెబుతున్నారు. ఇతర ఏఐ టూల్స్ చెప్పలేకపోయే ఘాటైన ప్రశ్నలకు సైతం సమాధానమిచ్చేలా దీనిని రూపొందించామని అంటున్నారు. రాజకీయ అంశాల విషయంలో గ్రోక్ ధోరణి అందరికీ నచ్చకపోవచ్చని.. అందుకే రాజకీయంగా పూర్తిగా సరైనది కాదని పేర్కొంటున్నారు. మరోవైపు చాట్‌జీపీటీ తటస్థంగా, మర్యాదపూర్వకంగా, సమగ్రమైన ధోరణిలో స్పందిస్తుంది.

గ్రోక్ 'ఎక్స్'లోనే.. జీపీటీ అన్నిచోట్లా..

- గ్రోక్ ప్రస్తుతం 'ఎక్స్'యాప్‌లోనే సమ్మిళితమై సేవలందిస్తోంది. అంటే 'ఎక్స్'వినియోగదారులకు మాత్రమే అందుబాటులోకి ఉంది. దీనిని తొలుత 'ఎక్స్ (ట్విట్టర్)'ప్రీమియం ప్లస్, ప్రీమియం వినియోగదారులకు మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. అనంతరం కొన్ని పరిమితుల మేరకు ఉచిత వినియోగదారులకు సైతం అందుబాటులోకి తెచ్చారు. భవిష్యత్తులో 'ఎక్స్'ప్రీమియం, ప్రీమియం ప్లస్ చందాలు కట్టాల్సిన అవసరం లేకుండా.. 'గ్రోక్'కే చందా కట్టి సబ్‌స్క్రయిబ్ చేసుకోవచ్చని రూపకర్తలు చెబుతున్నారు.
- మరోవైపు 'చాట్‌జీపీటీ–3.5'పాత వెర్షన్ అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంది. వినియోగదారులకు మరింత విస్తృతమైన సేవలందించే అత్యాధునిక 'జీపీటీ–4'వెర్షన్‌కు మాత్రం డబ్బులు చెల్లించి సబ్‌స్క్రయిబ్ చేసుకోవాల్సి ఉంటుంది. వీటిని వెబ్, మొబైల్ యాప్స్, ఎంఎస్ ఆఫీస్ ద్వారా విస్తృత రీతిలో పొందవచ్చు.

దేనికది ప్రత్యేకం

- కంటెంట్ సృష్టి, అనువాదం, కస్టమర్ సపోర్ట్, విద్య, వ్యక్తిగత సహాయం, కోడింగ్, మేధోమథనం వంటి వైవిధ్యభరిత సేవలను విస్తృత రీతిలో చాట్‌జీపీటీ అందిస్తోంది. వినియోగదారులు టెక్స్ట్‌తోపాటు చిత్రాలను ఇన్‌పుట్‌గా వాడే సదుపాయాన్ని చాట్‌జీపీటీ ప్లస్ కల్పిస్తోంది. నిర్దిష్టమైన పరిశ్రమలు, వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు కస్టమైజ్డ్ సేవలను సైతం చాట్‌జీపీటీ అందిస్తోంది.
- ఇక 'గ్రోక్'విషయానికి వస్తే సామాజిక మాధ్యమాలతో అనుసంధానం, రియల్ టైమ్ సమాచారం, వినోదం, సాధారణ ప్రశ్నలకు సమాధానాలు వంటి సేవలను వినూత్న రీతిలో అందిస్తోంది. 'గ్రోక్'ను అగ్రగామిగా నిలపాలనే వ్యూహంతో ఎలన్ మస్క్ భవిష్యత్తులో మరెన్నో వైవిధ్యభరిత సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెబుతున్నారు కూడా.

క్షీణిస్తున్న ఉష్ణోగ్రతలు .. పెరుగుతున్న చలి

మెదక్‌లో 7.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. వాటికితోడు దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న గాలులతో చలి తీవ్రత పెరిగింది. సోమవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే మెదక్‌లో అత్యంత తక్కువగా 7.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లో కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 5.7 డిగ్రీ సెల్సియస్ తక్కువగా నమోదైంది. హనుమకొండ, హైదరాబాద్, నిజామాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో ఉండగా మిగిలిన ప్రాంతాల్లో తక్కువగా నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో రాష్ట్రంలోని చాలాచోట్ల ఉదయం పూట పొగమంచు ఏర్పడుతోంది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఈ గుడ్డు చాలా కాస్ట్‌లీ



ప్రత్యేక పర్యవేక్షణలో కోళ్లు

'పందెం కోడి' గుడ్డు ధర రూ.400 నుంచి రూ.700



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కోడిగుడ్డు రూ.400 నుంచి రూ.700 ధర పలుకుతోంది. ఏంటీ కోడిగుడ్డుకు ఇంత ధరా. ఏమిటీ దీని స్పెషాలిటీ అనుకుంటున్నారా? ఇవి అలాంటి.. ఇలాంటి గుడ్లు కాదండోయ్. ఈ గుడ్లు వెరీ స్పెషల్. సంక్రాంతి సంబరాల్లో పౌరుషాన్ని చాటి.. పందేలరాయుళ్లకు కాసుల వర్షాన్ని కురిపించే పందెం కోళ్ల జాతికి సంబంధించిన గుడ్లకు భారీ ధర పలుకుతోంది. కోస్తా జిల్లాల నుంచి వీటిని తీసుకొచ్చి ప్రకాశం జిల్లా తీరంలోని కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లో పెంచుతున్నారు. వీటి గుడ్లను జాతి పెట్టలతో పొదిగించి.. పుంజులను ప్రత్యేకంగా సంరక్షిస్తున్నారు. పందెం కోళ్లలో చాలా రకాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా తూర్పు కోడి, పెర్విన్ కోడి, భీమవరం కోడి, ఎర్ర మైల, అబ్రాసు మైల, కాకి నెమలి, తెల్ల నెమలి, నల్లపడ కోడి, కాకి డేగ, ఎర్ర కక్కెర, తెల్లకోడి, కాకి నెమలి, పెట్టమారు వంటి పుంజులు ఈ జాబితాలో ఉన్నాయి. రకాన్ని బట్టి గుడ్డు ధరలు పలుకుతున్నాయి. తూర్పు కోడి, భీమవరం కోడి, ఎర్ర కక్కెర, తెల్లకోడి పెట్టిన ఒక్కో గుడ్డు ధర సుమారు రూ.400 వరకు ఉంటుంది. క్రాస్ బ్రీడ్‌లైన అబ్రాసు మైల, తెల్ల కక్కెర, ఎర్ర మైల తదితర రకాల జాతులకు చెందిన గుడ్డు ఒక్కొక్కటీ రూ.500 నుంచి రూ.700 వరకు ఉంటుంది. పందెం కోడి రకం గుడ్ల కోసం ప్రత్యేకంగా పెంచిన నల్ల పెట్ట, డేగ పెట్ట, తెల్ల పెట్ట, బూడిదరంగు పెట్ట, అబ్రాసు పెట్ట, కక్కెర పెట్టలను ఉపయోగిస్తారు. పందెం కోళ్లతో ఈ పెట్టలు కలవటం ద్వారా గుడ్లు పెడతాయి. ఈ కోళ్లు గుడ్లు పెట్టడమే కానీ.. వాటిని పొదగవు. ఈ కోళ్లు మూడు నెలల్లో 10 నుంచి 15 వరకు గుడ్లను పెడతాయి. ఈ గుడ్లను ప్రత్యేక నాటుకోళ్లతో పొదిగిస్తారు.

చైనా మాంజా అమ్మినా, నిల్వ చేసినా..

ఐదేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్లు
040 -23231440,
1800 4255 364



సాక్షి, హైదరాబాద్: పతంగులు ఎగురవేయడానికి ఎట్టి పరిస్థితుల్లో చైనామాంజా వాడొద్దని... దానిని అమ్మినా, నిల్వ చేసినా, రవాణా చేసినా చట్ట ప్రకారం శిక్షలు తప్పవని పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ హెచ్చరించారు. చైనీస్ మాంజా వాడకం వల్ల కలిగే అనర్థాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర పర్యావరణ చట్టం (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు–2016) ప్రకారం చైనా మాంజా వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. పండుగ సీజన్‌లో నిఘా కోసం ప్రత్యేకంగా ఐదు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. చైనా దారం అమ్మకం గురించిన వివరాలు తెలిస్తే అటవీ శాఖ టోల్ ఫ్రీ నెంబర్లు 040 –23231440, 1800 4255 364కు తెలియజేయాలని కోరారు. సోమవారం అరణ్యభవన్‌లో జరిగిన కార్యక్రమంలో...చైనీస్ మాంజాపై ప్రజలకి అవగాహన, పక్షుల రక్షణకు సంబంధించి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎన్‌జీవోల సహకారంతో స్కూలు పిల్లలతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చైనా మాంజా అమ్మినా, నిలువ చేసినా, రవాణా చేసినా ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుంది. మాంజా వాడకం వల్ల మనుషులకు, పక్షులకు హానిజరిగితే మూడేళ్ల నుంచి 7 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్


శ్రీ స్తంబాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

ఖమ్మం.. చారిత్రక గుమ్మం!

నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన జిల్లా ప్రజలు

ఆకట్టుకుంటున్న పర్యాటక ప్రాంతాలు

ఖమ్మం కోటకు ఘన చరిత్ర

ఖమ్మం మయూరి సెంటర్‌:

చారిత్రక నేపథ్యం కలిగిన ఖమ్మం జిల్లాను 1953లో పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఖమ్మం జిల్లా.. వరంగల్‌ జిల్లాలో భాగంగా ఉంది. ఖమ్మం, మధిర, ఇల్లెందు, బూర్గంపాడు, పాల్వంచ రెవెన్యూ డివిజన్లను విడదీసి ఖమ్మం జిల్లాగా ఏర్పాటు చేశారు. అలాగే 1959లో అప్పటివరకు తూర్పుగోదావరి జిల్లాలోని భద్రాచలం, వెంకటాపురం రెవెన్యూ డివిజన్లను జిల్లాలో కలిపారు. ఈ జిల్లా భూభాగం వేర్వేరు రాజవంశాల కాలాల్లో వేరుగా ఉంది. ఖమ్మం నగరం మధ్యలోని స్తంభాద్రి నుంచే మండపాలు, స్తంభాలకు కావల్సిన రాళ్లు తరలిస్తూ ఉండేవారు. అందుకే ఖమ్మంకు స్తంభాద్రి అనే ప్రాచీన నామం ఉంది. చరిత్రకారుల కథనం ప్రకారం ఖమ్మం అనే పేరు.. నగరంలోని నృసింహాద్రి అని పిలిచే నారసింహాలయం నుంచి వచ్చినట్లు, కాలక్రమంలో స్తంభ శిఖరిగా.. ఆ పై స్తంభాద్రిగా మారినట్లు చరిత్రకారులు స్పష్టం చేస్తున్నారు. ఉర్దూ భాషలో కంబ అంటే రాతి స్తంభం అని.. అందుకే ఖమ్మం అనే పేరు నగరంలోని నల రాతి శిఖరం నుంచి వచ్చినట్లు మరో వాదన ఉంది.

ప్రధాన పర్యాటక ప్రాంతాలివే..

జిల్లాతోపాటు ఖమ్మం నగరంలో అనేక పర్యాటక ప్రాంతాలున్నాయి. నగరంలో నరసింహస్వామి ఆలయం, శ్రీజలాంజనేయ స్వామి ఆలయం, లకారం చెరువు, దానవాయిగూడెం పార్కు, తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయం, నేలకొండపల్లి వంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

నైజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా..

చివరి నైజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వాన జరిగిన సాయుధ రైతాంగ పోరాటానికి కాకలుతీరిన నాయకులు, యోధులను అందించిన ప్రాంతంగా ఖమ్మం చరిత్రలో నిలిచిపోయింది. 1931లో ఖమ్మంలో మొదటి స్వాతంత్ర్య ఉద్యమం జరిగింది. 1945లో ఖమ్మంలో 12వ రాష్ట్ర ఆంధ్ర మహాసభ నిర్వహించారు. ఖమ్మం నగరంతో పాటు జిల్లా ప్రజలు గర్వంగా చెప్పుకునే గాంధీ ఖమ్మం సందర్శన 1946లో జరిగింది. 1946 ఆగస్టు 5న మహాత్మాగాంధీ ఖమ్మం సందర్శించారు.

ఖమ్మం కోట చారిత్రక నేపథ్యం..

సుల్తాన్‌ కులీ కుత్బుల్‌ ముల్క్‌ 1531లో అప్పటి ఖమ్మం పాలకుడైన సీతాబ్‌ఖాన్‌ (సీతాపతిరాజు)ను ఓడించి ఖమ్మం కోటను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ దుర్గం కుతుబ్‌షాహి పాలనలో ఉంది. గ్రానైట్‌ రాళ్లతో నిర్మించిన ఈ పటిష్టమైన కోట నాలుగు చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కోటకు 10 ద్వారాలున్నాయి. పశ్చిమం వైపు దిగువ కోట ప్రధాన ద్వారం, తూర్పు వైపు రాతి దర్వాజా, కోట చుట్టూ 60 ఫిరంగులను మోహరించే వీలుంది. కోట లోపల జాఫరుద్దౌలా కాలంలో నిర్మించిన ఒక పాత మసీదు, మహల్‌ ఉన్నాయి. 60 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉన్న జాఫర్‌బౌలి అనే బావి కూడా ఉంది. కోట ముట్టడి జరిగినప్పుడు తప్పించుకోవడానికి ఒక రహస్య సొరంగం కూడా ఉంది.

అభివృద్ధి వైపు అడుగులు..

ఖమ్మం కోటగా కీర్తి గడించిన ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే కోటలోని జాఫర్‌బౌలి (బావి)ని ఆధునికీకరించారు. కోటపైకి పర్యాటకులు వెళ్లేందుకు రోప్‌ వే నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన ప్రభుత్వం.. పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టింది. రోప్‌వే నిర్మాణం జరిగితే ఖిల్లాను సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని, దీని ద్వారా కోటకు ఉన్న ఘనమైన చరిత్ర ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ఎస్టీఎఫ్‌ కేలండర్‌ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్‌: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం తన కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (ఎస్టీఎఫ్‌) డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, సంఘాల నాయకులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. డైరీ ఆవిష్కరణ సందర్భంగా ఎస్టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్‌ బిల్లులు, డీఏలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్‌ ప్రధాన కార్యదర్శి పోచయ్య, వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్‌ కేలండర్‌ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ ప్రోగ్రెసివ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ (టీపీటీఎఫ్‌) రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్‌ జి.హరగోపాల్‌ టీపీటీఎఫ్‌–2025 నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరగోపాల్‌ మాట్లాడుతూ సమాజంలో పెరిగిపోతున్న అసమానతలను రూపుమాపడానికి కామన్‌ స్కూల్‌ విధానాన్ని అమలు చేయడమే పరిష్కార మార్గం అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్‌ కె.లక్ష్మీనారాయణ, టీపీటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌ కుమార్‌, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు అశోక్‌ కుమార్‌, కార్యదర్శులు లక్ష్మయ్య యాదవ్‌, డి.రాజయ్య, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకుడు ప్రకాశరావు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు రామకృష్ణ, మహేశ్‌ ప్రదీప్‌, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.




కూసుమంచి మండలం లోక్యాతండాలో వరి నార్లు తీసుకొస్తున్న కూలీలు

యాసంగి జోరు..

లోక్యాతండాలో నాట్లు వేస్తున్న కూలీలు

ఖమ్మం జిల్లాలో యాసంగి పంటల సాగు ఊపందుకుంది. భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉండటానికి తోడు నాగార్జునసాగర్‌ ప్రాజెక్టు నుంచి కూడా నీరు విడుదలవుతోంది. దీంతో రైతులు సాగు బాట పట్టారు. వరి సాగుకు నారు సిద్ధం చేసుకోగా.. దుక్కులు దున్నడంతో పాటు నాట్లు వేయించడంలో నిమగ్నమయ్యారు. – రాధారపు రాజు, స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, ఖమ్మం

ఫార్ములా ఈ – రేస్‌ కేసులో ఏసీబీది స్వామి భక్తి

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: 'ఫార్ములా ఈ–రేస్‌' అంశంలో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రేవంత్‌ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వివాదాస్పదం చేస్తోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఫార్ములా ఈ–రేస్‌ కేసు విషయంలో ఏసీబీ స్వామిభక్తి ప్రదర్శిస్తోందన్నారు. ఆయన సోమవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఫార్ములా–ఈ కార్‌ రేస్‌ అంశంపై రేవంత్‌ నివాసంలో బహిరంగ చర్చ జరిపినా తాము సిద్ధమని నిరంజన్‌రెడ్డి ప్రకటించారు. హైకోర్టులో తీర్పు రిజర్వు చేసిన ప్రస్తుత పరిస్థితిలో.. కేటీఆర్‌ను ఏసీబీ విచారణకు పిలవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

కమలాపూర్‌ కేసులో హాజరు నుంచి మినహాయింపు

సాక్షి, హైదరాబాద్‌: సరైన ఆధారాలు లేకుండా హనుమకొండ జిల్లా కమలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఊరటనిచ్చింది. ట్రయల్‌ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్‌ దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మీకు దండం పెడతా.. ఒక్క చాన్స్‌ ఇవ్వండి. నన్ను సాదుకుంటారో.. చంపుకుంటారో మీ ఇష్టం' అంటూ ఓటర్లను ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారనేది ఆరోపణ. ఓట్లు వేసి గెలిపిస్తే డిసెంబర్‌ 4న విజయ యాత్రకు వస్తానని, లేకపోతే తన శవయాత్రకు రావాలని.. ఏ యాత్ర చేయాలనేది ఓటర్లే నిర్ణయించాలని పాడి కౌశిక్‌రెడ్డి ఉద్వేగంగా మాట్లాడారంటూ కమలాపూర్‌ ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. దీనిని నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ నిమిత్తం పరిగణనలోకి తీసుకుంది. అయితే, తాను ఎలాంటి నేరం చేయలేదని, రాజకీయ కక్షతోనే కేసును పెట్టారని కౌశిక్‌రెడ్డి చెప్పారు. ఈ కేసును కొట్టివేయాలని కౌశిక్‌రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ పై జస్టిస్‌ కె.లక్ష్మణ్‌ సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్‌ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

టామ్‌కామ్‌ ద్వారా విదేశాల్లో ఉపాధి

- ఏజెంట్ల మోసాలను అరికట్టడంలో భాగంగా ప్రభుత్వరంగ సంస్థకే ప్రాధాన్యం ఇస్తున్న సర్కారు
- సౌదీ అరేబియా, గ్రీస్‌, సింగపూర్‌లలోని కంపెనీల్లో ఉద్యోగాలు



మోర్తాడ్‌(బాల్కొండ): విదేశాల్లో ఉపాధి పొందాలనుకునే వారికి తెలంగాణ ఓవర్సీస్‌ మ్యాన్‌పవర్‌ కంపెనీ లిమిటెడ్‌(టామ్‌కామ్‌) శుభవార్త అందించింది. ఏజెంట్ల మోసాలను అరికట్టడంలో భాగంగా విదేశాల్లోని కంపెనీలకు, వలస కార్మికులకు ప్రభుత్వరంగ సంస్థనే మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. గతంలో కేవలం గల్ఫ్‌ దేశాల వీసాలను ఇప్పించిన టామ్‌కామ్‌ కొన్ని నెలల నుంచి పాశ్చాత్య దేశాల్లోనూ యువతకు ఉపాధి బాటలు వేస్తోంది. ఇజ్రాయెల్‌, జర్మనీ వీసాల జారీతో వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపిన టామ్‌కామ్‌ తాజాగా సౌదీ అరేబియా, గ్రీస్‌, సింగపూర్‌ దేశాల్లో ఉపాధి చూపనుంది. ఆసక్తి ఉన్నవారు టామ్‌కామ్‌ను సంప్రదిస్తే అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

→ సౌదీ అరేబియాలో వేర్‌హౌజ్‌లలో పనిచేయడానికి అవకాశాలు ఉన్నాయి. ఇంటర్‌ చదివిన అభ్యర్థులకు ఇంగ్లిష్‌ భాషలో ప్రావీణ్యంతో పాటు కంప్యూటర్‌కు సంబంధించి బేసిక్‌ నాలెడ్జి ఉండాలని టామ్‌కామ్‌ సూచించింది. 22 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులకు వేర్‌హౌజ్‌లలో ఉపాధి కల్పించనున్నారు. మన కరెన్సీలో రూ.40 వేల వేతనం ఉచిత వసతి, రవాణా సదుపాయం కూడా కంపెనీనే కల్పిస్తుంది. అభ్యర్థులకు ఈసీఎన్‌ఆర్‌ పాస్‌పోర్టు తప్పనిసరి అనే నిబంధన ఉంది.

→ గ్రీస్‌లో ఉపాధి పొందాలనుకునే మహిళలకు హౌస్‌ కీపింగ్‌, బార్‌ అండ్‌ రెస్టారెంట్‌లలో వెయిటర్‌లుగా పనిచేయడానికి యువతీ యువకులకు అవకాశం ఉంది. మన కరెన్సీలో రూ.1.02 లక్షల వేతనం వస్తుంది. అభ్యర్థుల వయస్సు 18–45 ఏళ్ల మధ్య ఉండాలి. డిప్లొమా, డిగ్రీ, హోటల్‌ మేనేజ్‌మెంట్‌ చదివిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. మగవారికైతే ఎలక్ట్రీషియన్‌, కార్పెంటర్‌, ప్లంబర్‌, టైల్స్‌, మార్బుల్‌ మేషన్‌లకు ఉపాధి కల్పిస్తారు. వీరికి కూడా వేతనం రూ.1.02 లక్షల వరకు ఉంది. గార్డెనింగ్‌, క్లీనర్‌లుగా పని చేసేవారికి రూ.88 వేల వరకు వేతనం చెల్లిస్తారు. గ్రీస్‌లో కార్మిక చట్టాలను అనుసరించి ఓవర్‌టైం పని కల్పించనున్నారు.

→ సింగపూర్‌లో ప్లాస్టర్‌ మేషన్‌, స్టీల్‌ ఫిక్సర్‌ రంగాల్లో కూడా ఉపాధి కల్పిస్తారు. ఆయా రంగాల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు 45 ఏళ్ల లోపు వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని టామ్‌కామ్‌ వెల్లడించింది. మన కరెన్సీలో రూ.29 వేల నుంచి రూ.31 వేల వేతనం చెల్లిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు టామ్‌కామ్‌ ఈమెయిల్‌ tomcom.rerume@fmai.comకు వివరాలను పంపించాల్సి ఉంటుంది. టామ్‌కామ్‌ కార్యాలయమున్న ఐటీఐ మల్లెపల్లి హైదరాబాద్‌ క్యాంపస్‌లో స్వయంగా సంప్రదించవచ్చని జనరల్‌ మేనేజర్‌ నాగభారతి వెల్లడించారు. ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ టామ్‌కామ్‌ ద్వారా యువతకు ఉపాధి కల్పించడంలో ఎలాంటి మోసానికి తావు ఇవ్వకుండా వీసాల జారీ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జెండర్లు	సర్వీస్ ఓటర్లు	మొత్తం	నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జెండర్లు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
సిర్పూర్	1,15,323	1,15,811	16	305	2,31,455	మలక్‌పేట	1,60,693	1,58,201	11	9	3,18,914
ఆసిఫాబాద్(ఎస్టీ)	1,13,815	1,15,813	16	121	2,29,765	అంబర్‌పేట	1,41,515	1,39,363	12	24	2,80,914
చెన్నూరు(ఎస్సీ)	96,964	99,049	7	141	1,96,161	ఖైరతాబాద్	1,52,412	1,42,136	37	18	2,94,603
బెల్లంపల్లి(ఎస్సీ)	88,109	90,286	13	178	1,78,586	జూబ్లీహిల్స్	2,03,137	1,86,793	24	18	3,89,972
మంచిర్యాల	1,39,306	1,42,421	26	365	2,82,118	సనత్‌నగర్	1,31,446	1,22,898	12	10	2,54,366
ఆదిలాబాద్	1,21,050	1,26,805	6	248	2,48,109	నాంపల్లి	1,69,088	1,61,415	9	26	3,30,538
బోథ్(ఎస్టీ)	1,03,554	1,10,453	2	579	2,14,588	కార్వాన్	1,86,094	1,79,075	14	53	3,65,236
ఖానాపూర్(ఎస్టీ)	1,11,157	1,16,549	14	431	2,28,151	గోషామహల్	1,44,178	1,32,866	29	13	2,77,086
నిర్మల్	1,23,088	1,37,730	21	248	2,61,087	చార్మినార్	1,21,189	1,11,296	30	10	2,32,525
ముథోల్	1,25,148	1,32,948	17	293	2,58,406	చాంద్రాయణగుట్ట	1,76,198	1,78,398	35	95	3,54,726
ఆర్మూర్	99,657	1,14,473	6	130	2,14,266	యాకుత్‌పుర	1,84,312	1,81,787	31	13	3,66,143
బోధన్	1,06,999	1,17,768	5	169	2,24,941	బహదూర్‌పుర	1,63,648	1,62,563	49	7	3,26,267
బాన్సువాడ	94,577	1,04,145	16	201	1,98,939	సికింద్రాబాద్	1,33,981	1,34,706	29	27	2,68,743
నిజామాబాద్ అర్బన్	1,48,162	1,59,255	42	65	3,07,524	కంటోన్మెంట్(ఎస్సీ)	1,27,340	1,27,915	10	55	2,55,320
నిజామాబాద్ రూరల్	1,21,627	1,38,852	6	191	2,60,676	మహబూబ్‌నగర్	1,29,684	1,32,612	15	316	2,62,627
బాల్కొండ	1,06,108	1,23,512	4	72	2,29,696	జడ్చర్ల	1,11,557	1,12,914	6	262	2,24,739
జుక్కల్(ఎస్సీ)	1,01,076	1,05,316	10	147	2,06,549	దేవరకద్ర	1,18,939	1,22,040	1	193	2,41,173
ఎల్లారెడ్డి	1,08,075	1,17,781	2	287	2,26,145	నాగర్‌కర్నూల్	1,17,934	1,19,483	5	218	2,37,640
కామారెడ్డి	1,23,919	1,34,118	20	166	2,58,223	అచ్చంపేట (ఎస్సీ)	1,23,935	1,25,681	4	176	2,49,796
కోరుట్ల	1,17,762	1,30,504	4	50	2,48,320	కొల్లాపూర్	1,21,796	1,19,659	5	182	2,41,642
జగిత్యాల	1,14,499	1,24,593	22	46	2,39,160	వనపర్తి	1,36,047	1,39,008	4	212	2,75,271
ధర్మపురి	1,13,558	1,19,615	9	141	2,33,323	గద్వాల	1,26,502	1,31,947	11	39	2,58,499
రామగుండం	1,07,892	1,08,258	29	210	16,389	అలంపూర్(ఎస్సీ)	1,19,021	1,22,491	10	65	2,41,587
మంథని	1,17,660	1,23,091	15	169	2,40,935	నారాయణపేట	1,17,536	1,21,089	4	171	2,38,800
పెద్దపల్లి	1,28,180	1,32,258	7	274	2,60,719	మక్తల్	1,21,474	1,26,629	2	65	2,48,170
కరీంనగర్	1,83,480	1,84,641	45	103	3,68,269	దేవరకొండ (ఎస్టీ)	1,32,611	1,31,800	19	92	2,64,522
చొప్పదండి	1,13,878	1,21,963	8	204	2,36,053	నాగార్జునసాగర్	1,16,278	1,21,300	19	100	2,37,697
మానకొండూరు(ఎస్సీ)	1,10,301	1,16,083	1	140	2,26,525	మిర్యాలగూడ	1,16,222	1,21,313	26	113	2,37,674
హుజూరాబాద్	1,22,678	1,29,666	7	167	2,52,518	నల్లగొండ	1,22,222	1,29,133	56	80	2,51,491
వేములవాడ	1,08,854	1,19,217	30	63	2,28,164	మునుగోడు	1,29,235	1,30,688	3	50	2,59,976
సిరిసిల్ల	1,20,498	1,27,829	7	106	2,48,440	నకిరేకల్(ఎస్సీ)	1,25,991	1,29,316	4	108	2,55,419
నారాయణఖేడ్	1,18,848	1,18,563	9	65	2,37,485	హుజూర్‌నగర్	1,22,663	1,30,430	17	119	2,53,229
అంధోల్(ఎస్సీ)	1,23,244	1,29,386	3	51	2,52,684	కోదాడ	1,20,150	1,27,077	20	121	2,47,368
జహీరాబాద్(ఎస్సీ)	1,38,914	1,39,315	3	104	2,78,336	సూర్యాపేట	1,19,999	1,26,424	14	102	2,46,539
సంగారెడ్డి	1,24,235	1,28,097	38	62	2,52,432	తుంగతుర్తి(ఎస్సీ)	1,29,654	1,31,697	6	140	2,61,497
పటాన్‌చెరు	2,15,945	2,03,466	85	73	4,19,569	భువనగిరి	1,09,820	1,12,830	1	54	2,22,705
మెదక్	1,04,917	1,15,987	4	89	2,20,997	ఆలేరు	1,18,297	1,19,931	20	104	2,38,352
నర్సాపూర్	1,11,611	1,18,701	5	38	2,30,355	జనగామ	1,20,891	1,25,069	10	136	2,46,106
హుస్నాబాద్	1,23,083	1,27,837	6	224	2,51,150	స్టేషన్ ఘన్‌పూర్ (ఎస్సీ)	1,26,630	1,30,723	4	173	2,57,530
సిద్దిపేట	1,17,509	1,22,459	71	103	2,40,142	పాలకుర్తి	1,27,758	1,30,543	14	155	2,58,470
దుబ్బాక	97,653	1,03,859	0	55	2,01,567	డోర్నకల్(ఎస్టీ)	1,10,016	1,14,627	7	183	2,24,833
గజ్వేల్	1,40,207	1,45,235	5	69	2,85,516	మహబూబాబాద్(ఎస్టీ)	1,27,527	1,33,088	47	197	2,60,859
ఇబ్రహీంపట్నం	1,72,820	1,70,121	34	54	3,43,029	నర్సంపేట	1,15,838	1,21,487	11	355	2,37,691
ఎల్బీనగర్	3,14,613	2,91,386	133	58	6,06,190	వరంగల్ ఈస్ట్	1,26,066	1,33,338	341	90	2,59,835
మహేశ్వరం	2,88,519	2,75,461	66	79	5,64,125	వర్ధన్నపేట(ఎస్సీ)	1,35,061	1,40,664	18	184	2,75,927
రాజేంద్రనగర్	3,20,368	2,98,652	36	102	6,19,158	పరకాల	1,08,263	1,14,937	2	165	2,23,367
శేరిలింగంపల్లి	4,04,111	3,61,666	144	61	7,65,982	వరంగల్ వెస్ట్	1,40,100	1,45,061	16	74	2,85,251
చేవెళ్ల(ఎస్సీ)	1,37,156	1,37,147	5	68	2,74,376	భూపాలపల్లి	1,36,952	1,41,022	8	203	2,78,185
కల్వకుర్తి	1,24,414	1,22,107	2	136	2,46,659	ములుగు(ఎస్టీ)	1,14,504	1,20,730	26	226	2,35,486
షాద్‌నగర్	1,21,271	1,21,976	13	56	2,43,316	పినపాక(ఎస్టీ)	1,00,279	1,04,694	5	204	2,05,182
పరిగి	1,35,522	1,35,528	10	247	2,71,307	ఇల్లెందు(ఎస్టీ)	1,10,480	1,16,057	3	275	2,26,815
వికారాబాద్(ఎస్సీ)	1,16,388	1,18,524	21	79	2,35,012	కొత్తగూడెం	1,19,708	1,28,488	39	155	2,48,390
తాండూరు	1,19,824	1,27,952	7	53	2,47,836	అశ్వారావుపేట(ఎస్టీ)	77,939	82,634	7	49	1,60,629
కొడంగల్	1,20,879	1,25,640	7	170	2,46,696	భద్రాచలం(ఎస్టీ)	73,579	80,491	10	54	1,54,134
మేడ్చల్	3,43,299	3,29,017	60	158	6,72,534	ఖమ్మం	1,55,326	1,68,859	49	74	3,24,308
మల్కాజ్‌గిరి	2,57,578	2,55,522	14	242	5,13,356	పాలేరు	1,16,655	1,26,225	8	163	2,43,051
కుత్బుల్లాపూర్	3,82,611	3,51,274	166	104	7,34,155	మధిర(ఎస్సీ)	1,07,550	1,15,805	10	145	2,23,510
కూకట్‌పల్లి	2,53,218	2,32,703	128	45	4,86,094	వైరా (ఎస్టీ)	94,196	1,00,340	4	198	1,94,738
ఉప్పల్	2,80,669	2,62,230	48	165	5,43,112	సత్తుపల్లి(ఎస్సీ)	1,19,073	1,26,455	17	108	2,45,653
ముషీరాబాద్	1,57,920	1,50,880	13	26	3,08,839						

జలవనరుల శాఖలో పదోన్నతులపై ఏకాభిప్రాయం

ఏపీ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ సమావేశంలో తీర్మానం

సాక్షి, అమరావతి : రాష్ట్ర జలవనరుల శాఖలో పదోన్నతులపై ఆరు జోన్‌ల పరిధిలోని ఏపీ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ నేతలు ఏకాభిప్రాయానికొచ్చారు. వర్టికల్ పద్ధతిలో రూపొందించిన సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతి కల్పించి.. 2024, డిసెంబర్ 31 వరకూ ఆ శాఖలో ఖాళీగా ఉన్న 220 ఈఈ, ఎస్ఈ, సీఈ పోస్టులను భర్తీ చేయాలని తీర్మానించారు. ఇకపై అంటే.. 2025, జనవరి 1 నుంచి జోనల్ విధానం ప్రకారమే పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆరు జోన్‌ల నుంచి హాజరైన సంఘాల నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారని ఏపీ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డోలా తిరుమలరావు మీడియాకు తెలిపారు. సోమవారం విజయవాడలోని జలవనరుల శాఖ శిక్షణ కేంద్రంలో ఏపీ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయా జోన్‌ల సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు 200 మందికి పైగా ఇంజినీర్లు హాజరయ్యారు. జలవనరుల శాఖలో 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల అంశంపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో చేసిన తీర్మానాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌లకు మంగళవారం అందిస్తామని తిరుమలరావు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి

వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కారుమూరి

సాక్షి,అమరావతి: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు, వారి ఇబ్బందులు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని మాజీమంత్రి, వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డితో కలిసి ఆయన న్యూ ఇయర్ డైరీ 2025, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ రంగ అభివృద్ధికి గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలను కారుమూరి నాగేశ్వరరావు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గల్ల మహేశ్వర రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రావుల మల్లికార్జున రెడ్డి, స్టేట్ చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శపురి వెంకటరమణ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.బాలాజీ, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'పీఆర్‌ఎస్‌ఐ' అమరావతి చాప్టర్ అధ్యక్షురాలిగా అనిత

జాయింట్ సెక్రటరీగా బషీర్



సాక్షి, అమరావతి: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) అమరావతి చాప్టర్ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ జి.అనిత ఎన్నికయ్యారు. ఆమె ప్రస్తుతం నాగార్జున వర్సిటీ జర్నలిజం విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఏపీ సచివాలయంలో డిప్యూటేషన్‌పై సేవలందిస్తున్నారు. వర్చ్యువల్ విధానంలో సోమవారం జరిగిన చాప్టర్ సర్వ సభ్య సమావేశంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షురాలితో పాటు కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు రిటర్నింగ్ అధికారి వై.బాబ్జీ ప్రకటించారు. కొత్త కమిటీకి అనిత చైర్మన్ కాగా, కేఎల్ వర్సిటీ నుంచి జె.రాజేంద్ర కుమార్ వైస్ చైర్మన్‌గా, కౌటిల్య సోషియో పొలిటికల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ నుంచి కందాడై పార్థసారథి కార్యదర్శిగా ఎంపికయ్యారు. వీరితో పాటూ ఏపీ ట్రాన్స్‌కో కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డివిజనల్ మేనేజర్ పి.బషీర్ జాయింట్ సెక్రటరీగా, నాగార్జున వర్సిటీ రీసెర్చ్ స్కాలర్ ఓలివా ఎరమల కోశాధికారిగా ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆ పిటిషన్‌ను నేను విచారించడం సమంజసం కాదు

విజయ్‌కుమార్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ శ్రీనివాసరెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రకటనల జారీ, బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ పూర్వ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి తప్పుకొన్నారు. విజయ్‌కుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచారణకు రాగా... ఆయన తన పొరుగునే ఉంటారని, అందువల్ల ఈ వ్యాజ్యాన్ని తాను విచారించడం నైతికంగా సమంజసం కాదని జస్టిస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందువల్లే విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాజ్యం మరో బెంచ్ ముందు బుధవారం విచారణకు వచ్చేలా చర్యలు చేపట్టాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పక్షులు మెచ్చేలా.. కుచ్చులు



సిద్ధాంతం సమీపంలోని ఓ దుకాణం వద్ద వరికుచ్చులు



పూర్వం పక్షులకు ఆహారంగా కొన్ని వరి కంకులను కుచ్చులుగా, తోరణాలుగా తయారు చేసి ఇంటి సింహద్వారాలకు, వాసాలకు, ఆలయాల వద్ద వేలాడదీసేవారు. ఆత్మీయులకు వాటిని కానుకగా పంపేవారు. అయితే వరికోత యంత్రాల రాకతో చాలావరకు ఈ వరి కుచ్చులు పెట్టేవారు తగ్గిపోయారు. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలోని హైవే వెంబడి షాపుల్లో తోరణాలుగా, జల్లెడగా వివిధ ఆకృతుల్లో కుచ్చులను వాటి ఆకారం మేరకు రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. దారి వెంబడి వెళ్లే వారు వీటిని కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. కొందరు ప్రత్యేకంగా తయారుచేయించి విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలోని తమ వారికి పంపుతున్నారు. – సాక్షి, భీమవరం

సరుగుడు జలపాతం వద్ద సందడి



అనకాపల్లి జిల్లాలోని సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు సందడి చేస్తున్నారు. బండరాళ్లపై నుంచి దూకి వస్తున్న జల ధారల కింద జలకాలాడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. -నాతవరం

గిరిజనులకు సికిల్‌సెల్ స్క్రీనింగ్



కేంద్ర ప్రభుత్వ కార్యక్రమానికి గతేడాది శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్

ఏడాదిలో తొలిదశ సికిల్ సెల్ స్క్రీనింగ్ పూర్తి చేసేలా కార్యాచరణ

19,90,277 మందికి స్క్రీనింగ్ లక్ష్యం

9,38,007 మందికి స్క్రీనింగ్.. 4,36,556 సికిల్ సెల్ కార్డులు

మరో 10,52,270 మందికి 2025 మార్చి నాటికి పూర్తి చేసేలా ప్రస్తుత ప్రభుత్వం ప్రణాళిక

ప్రాణాంతకమైన సికిల్‌సెల్ వ్యాధిని పూర్తిగా నివారించి, గిరిజనులను దాని బారినుంచి కాపాడటంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. దేశంలోని గిరిజన ప్రాంతాల్లో 'మిషన్ టు ఎలిమినేషన్ సికిల్‌సెల్ ఎనీమియా 2023-24'ను నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని గతేడాది కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలనూ అప్రమత్తం చేసింది. దీంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరిగే 2047 నాటికి గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ అనేది లేకుండా చేసేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా స్క్రీనింగ్(నిర్ధారణ పరీక్షలు) నిర్వహిస్తున్నారు. - సాక్షి, అమరావతి

వైఎస్సార్‌సీపీ హయాంలోనే కార్యాచరణ..

రాష్ట్రంలో 40 ఏళ్లలోపు గిరిజనులు 19,90,277 మంది ఉన్నట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించింది. వారందరికీ మూడేళ్లలో (మూడు దశల్లో) రోగ నిర్ధారణ పరీక్షలు పూర్తిచేసి రోగ లక్షణాలున్నవారిని గుర్తించాలని ప్రణాళిక రూపొందించింది. ఈ నేపథ్యంలోనే తొలిదశ రోగ నిర్ధారణ పరీక్షలు గతేడాది చేపట్టారు. ఇప్పటి వరకు 9,38,007 మందికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేసి 4,36,556 సికిల్ సెల్ కార్డులు పంపిణీ చేశారు. మరో 10,52,270 మందికి 2025 మార్చి నాటికి పరీక్షలు పూర్తి చేసేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

బాధితులకు భరోసా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

తొలిదశలో రాష్ట్రంలోని ఏజెన్సీ జిల్లాల్లో అత్యధికంగా సికిల్‌సెల్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అత్యధిక పరీక్షలు నిర్వహించిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో సికిల్‌సెల్ రోగులు, క్యారియర్స్ కూడా ఎక్కువగానే ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సికిల్‌సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తులకు గొప్ప భరోసా ఇచ్చింది. గిరిజనుల్లో 1,913 మంది సికిల్‌సెల్, 1,707 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు గత ప్రభుత్వం నెలకు రూ.10 వేల చొప్పున పెన్షన్ అందించడంతోపాటు ఉచిత వైద్యం అందించింది. దేశంలోనే ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే కావడం గమనార్హం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధితులకు సామాజిక భద్రతా పెన్షన్ పెంచి మరీ ఇచ్చారు.

గిరిజనుల్లోనే తీవ్రత ఎందుకంటే..

సికిల్‌సెల్, తలసేమియా రెండూ రక్తసంబంధ వ్యాధులే. ఇవి రెండూ గిరిజనుల్లోనే ఎక్కువగా ఉండటానికి ప్రధాన కారణం రక్త సంబంధీకుల మధ్యే వివాహాలు ఎక్కువగా జరగడమని గుర్తించారు. మైదాన ప్రాంతాల్లో బయటి వాళ్లతో పెళ్లి సంబంధాలు కలుపుకోవడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. అదే గిరిజన ప్రాంతాల్లో గూడెం, ఊళ్లలో అతి తక్కువ జనాభా ఉండటం, వాటి పరిధి తక్కువగా ఉండటంతో వాళ్లలో వాళ్లే మేనరికపు వివాహాలు చేసుకుంటారు. రక్త సంబంధీకుల మధ్యే తరచూ వివాహాలు జరగడంతో జన్యుపరమైన సమస్యలతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పరిశోధకుల నిర్ధారించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ రోగ లక్షణాలున్న ఇద్దరు వివాహం చేసుకోకుండా అవగాహన కల్పిస్తారు. దీనివల్ల భావితరాలకు సికిల్‌సెల్ సోకుండా అడ్డుకట్ట వేస్తారు. అప్పటికే రోగ లక్షణాలున్నవారికి పెన్షన్‌తోపాటు వైద్యసేవలు అందించి వారి జీవితకాలాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తారు.

రోగ లక్షణాలను బట్టి కార్డులు



సికిల్ సెల్ రోగ లక్షణాలు (బాధితులు), రోగవ్యాప్తికి కారకులుగా (క్యారియర్స్)ఉన్నవారిని గుర్తించి తగు వైద్య సహాయం అందించాల్సి ఉంటుంది.

క్యారియర్స్‌గా ఉన్నవారికి ప్రాణాపాయం లేకపోయినా వారి ద్వారా పిల్లలకు ఆ రోగం సంక్రమించే అవకాశం ఉంది.


రోగ నిర్ధారణ పరీక్షల అనంతరం సంబంధిత వ్యక్తికి సికిల్‌సెల్, తలసేమియా వంటి రోగ లక్షణాలు ఉన్నాయో? లేదో? తెలిపే కార్డులు ఇస్తారు.

చదువురాని వారికి సైతం అర్థమయ్యే రీతిలో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ఈ కార్డుల్ని డిజైన్ చేశారు.

సికిల్‌సెల్, తలసేమియా వ్యాధుల తీవ్రతను తెలిపేలా తెలుపు, పసుపు రంగుల్లో వాటిని రూపొందిస్తున్నారు.

రోగ లక్షణాలు లేకపోతే పూర్తిగా తెలుపు, లక్షణాల తీవ్రతను బట్టి తెలుపు నుంచి ముదురు పసుపురంగు వరకు ఉండేలా కార్డులు ఇస్తారు.

కూటమి నేతలకు మేతగా...!



విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ స్థలాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్లాన్

- 2.20 ఎకరాల్లో ఉన్న సర్కిల్ ఆఫీసు, గెస్ట్ హౌస్ నేలమట్టం చేసేందుకు కుట్ర
- ఫైళ్లు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- సొంత లాభం కోసమే ప్రభుత్వ పెద్దల ఆరాటం!
- ప్రతిపాదన దశలోనే ఉందంటున్న అధికారులు

సాక్షి, అమరావతి: కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సంపద సృష్టిస్తామనే మాటను పక్కన పెట్టి ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతోంది. అంతటితో ఆగకుండా విద్యుత్ శాఖ ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించి కొందరు నేతలకు లబ్ధి కలిగించాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న కార్యాలయాలను సైతం కూల్చివేసి ఖాళీ స్థలాలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. విశాఖలో రూ.100 కోట్లకుపైగా విలువైన 2.20 ఎకరాల స్థలాన్ని బహుళ అంతస్తుల భవనం పేరిట కార్పొరేట్ సంస్థకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు నిదర్శనం.

సొంత లాభమే లక్ష్యంగా..

విశాఖపట్నం నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా రోడ్డును ఆనుకుని సుమారు 2.20 ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కార్యాలయాలు, ఉద్యోగుల అతిథి గృహం ఉన్నాయి. అక్కడ ప్రస్తుతం ఉన్న రెండు అంతస్తుల భవనంలో విశాఖపట్నం పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఈ) ఆపరేషన్స్ సర్కిల్ కార్యాలయం కొనసాగుతోంది. అదేవిధంగా విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో పనుల కోసం 11 జిల్లాల నుంచి వచ్చే అధికారులు, సిబ్బందికి ఇక్కడ ఉన్న అతిథి గృహం ఒక్కటే వసతి కల్పిస్తోంది. అయితే, ఆ భవనాలను నేలమట్టం చేసి రూ.100 కోట్లకు పైగా విలువ చేసే స్థలాన్ని బహుళ అంతస్తుల భారీ భవన సముదాయాన్ని నిర్మించేందుకు కార్పొరేట్ సంస్థలకు కేటాయించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దీనిద్వారా రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు నేతలకు ఆర్థికంగా భారీ లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా కొత్తగా నిర్మించే భారీ భవనంలోని ఒకటి, రెండు అంతస్తుల్లో ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ కార్యకలాపాలకు అవకాశం కల్పించడం, లేదా నగరంలోనే సాగర్‌నగర్ వద్ద నిర్మిస్తున్న మరో భవనంలోకి విశాఖ సర్కిల్ ఆఫీసును తరలించడం అనే రెండు ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం తయారు చేస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేయాల్సిందిగా సర్కిల్ అధికారులను ఆదేశించింది. మరోవైపు తమ కార్యాలయాన్ని కూల్చివేసి విలువైన స్థలాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే వార్తలతో సర్కిల్ పరిధిలోని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిలా మారి కంపెనీ స్థలాలను ఇలా లాక్కొని ప్రైవేట్ డెవలపర్లకు అప్పగించడం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం రమేష్ స్వగ్రామం పోట్లదుర్తిలో ఉద్రిక్తత

- శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ భూమిలో జిమ్, పార్క్ నిర్మాణానికి యత్నం
- వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

సాక్షి ప్రతినిధి కడప: వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్వగ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో జిమ్, పార్క్, ప్రహరీల నిర్మాణానికి ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు ప్రయత్నించారు. ఇందుకోసం ఎంపీ రమేష్ ఎంపీ నిధుల కింద సుమారు రూ.90లక్షలు విడుదల చేశారు. అయితే ఈ దేవాలయం ప్రాంగణంలోని ఆలయం భూమిలో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టొద్దని గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ముందుగానే ప్రొద్దుటూరు డీఎస్పీ పర్యవేక్షణలో పోలీసు బలగాలు మోహరించాయి. జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, దేవాదాయ శాఖ కమిషనర్ మల్లిఖార్జున, తహసీల్దార్ శోభన్‌బాబు పోట్లదుర్తికి చేరుకున్నారు. ఆలయానికి సంబంధించి సుమారు 3.09 ఎకరాల భూమి ఉంది. ఇందులో చాలా వరకు ఆక్రమణకు గురైంది. శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయం తిరునాల ప్రతి ఏడాది మే నెలలో జరుగుతుంది. వేలాదిమంది భక్తులు వస్తారని, ఆలయం ప్రాంగణంలో ఉన్న భూమిలో కట్టడాలు కడితే స్థలం కుదించుకుని పోయి భక్తులకు ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఇక్కడ పనులు జరుగుతున్నాయని అయితే జిమ్, పార్క్ లేకుండా కేవలం ప్రహరీ మాత్రమే కడతారని జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ గ్రామస్తులకు తెలిపారు. అధికారుల రాకతో సీఎం సురేష్‌నాయుడు వర్గీయులు వెనక్కి తగ్గారు.

సంజయ్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: తనపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ ఎన్.సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేస్తామని, విచారణను వాయిదా వేయాలని ఏసీబీ అభ్యర్థించింది. ఈ మేరకు విచారణను వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అగ్నిమాపకశాఖ డీజీగా, సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సంజయ్ దాదాపు రూ.1.75 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తూ ఆయనపై ఏసీబీ గత నెల 24న కేసు నమోదు చేసింది. కాగా, ఇదే వ్యవహారంలో ఏసీబీ కేసు ఎదుర్కొంటున్న సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు శరణు సూర్య లలిత, వీరమాచినేని శ్రీహరిత, శరణు వినయ్‌కుమార్, పాలవలస వెంకట తులసీరాం తదితరులు కూడా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నిటిపై హైకోర్టు మంగళవారం విచారణ జరపనుంది.

కదం తొక్కిన స్టీల్‌ప్లాంట్ కార్మికులు

పెండింగ్ జీతాల కోసం ఆందోళన



మహారాణిపేట: సమస్యల సాధన కోసం స్టీల్‌ప్లాంట్ కార్మికులు కదం తొక్కారు. కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న వారు, సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు నగరం నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు భారీ బైక్ ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఉద్యోగులకు నాలుగు నెలల బకాయి జీతం వెంటనే చెల్లించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ చేసి మూడేళ్లపాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, నిలిపివేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. దాదాపు 20 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినితో మాస్టారు అసభ్య చాటింగ్!

- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- టీడీపీ నేతల రాజీయత్నం

నందిగాం: శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలోని హరిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు గత నెల 31రాత్రి ఓ విద్యార్థినితో అసభ్యంగా చాటింగ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో టీడీపీ నేతలు రాజీయత్నాలకు దిగడం చర్చనీయాంశమయ్యింది. హరిదాసుపురం డ్రిల్ మాస్టారు డిసెంబరు 31 అర్ధరాత్రి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక సెల్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో అసభ్య చాటింగ్ చేసినట్లు సమాచారం. బాలిక కుటుంబసభ్యులు చాటింగ్ చూసి మరుసటి రోజు డ్రిల్ మాస్టర్‌ను నిలదీయడమే కాకుండా నందిగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో కొంతమంది తెలుగుదేశం నాయకులు ఉపాధ్యాయుడు తరఫున వకల్తా పుచ్చుకుని రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు.

● టోటల్ బాడీ హైజీన్

నఖ శిఖం... పరిశుభ్రం

గొంతు శుభ్రత

గొంతు శుభ్రంగా ఉంచుకోవడం కోసం శుభ్రమైన నీళ్లలో కాస్తంత ఉప్పు వేసి, అది కరిగాక పుక్కిలించాలి. దీంతో గొంతులోని బ్యాక్టీరియా తగ్గుతుంది. కొంతమందిలో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో డాక్టర్లు పుక్కిలించాల్సిన మౌత్‌వాష్‌లు సూచిస్తారు. వాటితో శుభ్రం చేసుకోవాలి.

● తిన్న తర్వాత తప్పనిసరిగా నోటితో పాటు గొంతు కూడా శుభ్రమయ్యేలా పుక్కిలించాలి. దీనివల్ల చాలా జబ్బులు నివారితమవుతాయి ● అపరిశుభ్రమైన నీళ్లు, ఆహారం వల్ల, అలాంటి నీటితో తయారైన ఐస్‌క్రీములతో, అలాగే నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినడంతో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. ఆ ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. చెవి, ముక్కు, గొంతు... ఈ మూడు కీలక అవయవాల్లో ఏ భాగంలో ఆరోగ్య సమస్య తలెత్తినా అది ఇతర భాగాలకు వ్యాపించే అవకాశాలెక్కువ. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... ఈ కీలక అవయవాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయడం సరి కాదు. ముఖ్యంగా పిల్లల్లో ఇలాంటి ఇన్ఫెక్షన్లను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు.



చాలామంది రోజూ ఉదయం బ్రష్ చేసుకోవడం తర్వాత స్నానం మొదలు దేహ పరిశుభ్రతను చకచకా చేస్తుంటారు. ఈ క్రమంలో దేహమంతా శుభ్రమవుతుందో లేదో చూడరు. ఉదాహరణకు స్నానం సమయంలో చెవుల వెనక భాగంలో... చెవి వెనక భాగం తలతో కనెక్ట్ అయ్యే ప్రాంతంలో, మెడ వెనక, చెవుల ముడతల్లో ఇలాంటి చోట్ల శుభ్రమవుతోందా, కావడం లేదా అన్నది చూడరు. రోజువారీ హైజీన్ పాటించకపోతే అది మరికొన్ని ఆరోగ్య సమస్యలకూ, దేహ / చర్మ సమస్యలకు దారితీయవచ్చు. అలాంటి పరిస్థితి రాకుండా శరీర పరిశుభ్రత పాటించడం ఎలాగో తెలుసుకోవడం కోసమే ఈ కథనం.

దేహ పరిశుభ్రత కోసం పళ్లు తోముకోవడం మొదలుకొని, కాళ్లు, పాదాల శుభ్రత వరకు ఎలాంటి హైజీన్ పాటించాలో చూద్దాం. పైగా ఇప్పుడు కొత్త కొత్త వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్న పుకార్లు వ్యాపిస్తున్న తరుణంలో ఆపాదమస్తకం శుభ్రత పాటించడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత జాగ్రత్తలతో మరింత మెరుగైన ఆరోగ్యాన్ని పొందడమే కాకుండా, మరెన్నో వ్యాధులను నివారించుకోవచ్చు కూడా.

చెవుల సంరక్షణ

చెవులను చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలి. చాలామంది చెవుల వెనక భాగాన్ని శుభ్రం చేసుకోవడం మరచిపోతుంటారు. కానీ స్నానం సమయంలో చెవుల వెనకభాగంతో పాటు... బయటి చెవి (ఎక్స్‌టర్నల్ ఇయర్ పిన్నా)ను చెవిలోపలివరకూ శుభ్రం చేసుకోవాలి. మన చెవుల్లో వచ్చే గులివి / గుమిలి చెవికి రక్షణ కల్పించడం కోసమే పుడుతుంది. కాబట్టి దాన్ని శుభ్రం చేసుకోడానికి పిన్నీసులు, ఇయర్‌బడ్స్ లాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. చెవి లోపల గువిలి మరీ ఎక్కువగా ఉంటే 'డీ-వ్యాక్స్' అనే చుక్కల మందును వేసుకోవాలి. మరీ చెవులు మూసుకుపోయినంతగా గువిలి ఉత్పన్నమవుతుంటే ఈఎన్‌టీ డాక్టర్‌ను సంప్రదిస్తే వారే సురక్షితమైన రీతిలో చెవులను శుభ్రం చేస్తారు.

● **ఇయర్‌బడ్స్ వద్దు :** కొందరు ఇయర్ బడ్స్‌తో తమ చెవులను తరచూ శుభ్రపరుస్తుంటారు. ఏమీ తోచనప్పుడు, ఏ పనీ లేనప్పుడు కూడా చెవుల్లో ఇయర్‌బడ్ పెట్టుకుని తిప్పేస్తుంటారు. నిజానికి చెవులు తమంతట తామే శుభ్రపరచుకుంటాయి. ప్రకృతి వాటినలా డిజైన్ చేసింది. వాస్తవానికి ఇయర్‌బడ్స్ వాడినప్పుడు కొన్నిసార్లు గువిలి చెవి లోపలికి ఇంకా లోతుగా వెళ్తుంది. చెవిలోకి ఏదైనా బయటి వస్తువు / పురుగు ప్రవేశించినప్పుడు అడ్డుకుని, చెవిని రక్షించడం కోసమే ఈ గువిలి స్రవిస్తుంటుంది. ఇయర్‌బడ్స్‌తో లేదా అగ్గిపుల్లలతో శుభ్రం చేయడం మొదలుపెట్టగానే చెవిలోని గ్రంథులు మరింత ఎక్కువగా గువిలిని స్రవిస్తాయి. దాంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. అందుకే చెవులను తరచూ శుభ్రపరచుకునే వారిలోనే గువిలి లేదా వ్యాక్స్ ఎక్కువగా స్రవిస్తుంది. కాబట్టి ఇయర్‌బడ్స్, అగ్గిపుల్లలు, పుల్లలు, పెన్నులు, పిన్నీసులు వంటి వాటితో చెవులను శుభ్రం చేసుకోకూడదు.

● **పిల్లలూ... పదునైన వస్తువులు :** కొంతమంది పిల్లలు తమ తెలిసీ తెలియనిదనంతో గుచ్చుకుపోయేలా ఉండే వాడియైన / పదునునైన వస్తువులు చెవుల్లో పెట్టుకుంటారు. ఉదాహరణకు పెన్సిళ్లు, పుల్లలు, పెన్నులు, పిన్నులు వంటివి. వాటితో కర్ణభేరి దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. చెవికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు వచ్చే ముప్పు కూడా ఉంటుంది. దాంతో భవిష్యత్తులో వినికిడి సమస్యలు రావచ్చు. అందుకే అలాంటి వస్తువుల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి.

● **నూనె పోయకూడదు :** చెవులను శుభ్రం చేయడానికి కొందరు కొబ్బరి నూనె, ఆముదం లాంటివి చెవుల్లో పోస్తుంటారు. అలా ఎంతమాత్రమూ చేయకూడదు. అలా చేయడం వల్ల చెవి ఇన్ఫెక్షన్‌తో పాటు మరెన్నో సమస్యలు రావచ్చు. ఏవైనా సమస్యలుంటే ఈఎన్‌టీ వైద్యులతో సరైన చికిత్స తీసుకోవాలి.

నోటి పరిశుభ్రత

ప్రతిరోజూ మనందరమూ పొద్దున్నే పళ్లను బ్రష్ చేసుకుంటాం. ఇలా బ్రష్ చేసుకునే టైమ్‌లో ముందువైపునకే ప్రాధాన్యమిస్తాం. కానీ పలువరసలో అన్నివైపులా శుభ్రమయ్యేలా బ్రష్ ఉపయోగించాలి. అలాగే ఆహారం తీసుకున్న ప్రతిసారీ పళ్లను కొద్దిగా నీళ్లతో నోరు పుక్కిలించాలి. నోరు అనేక సూక్ష్మజీవులకు నిలయం. ఆహారం తీసుకున్న ప్రతిసారీ బ్రషింగ్ చేసుకోవడం కుదరదు కాబట్టి... కొద్దిగా నీటిని నోట్లోకి తీసుకుని పుక్కిలిస్తూ నోరంతా శుభ్రం చేసుకోవడం అవసరం. ఆహారం తీసుకున్న తర్వాత నోట్లో బ్యాక్టీరియా పెరిగేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతుంది కాబట్టి ఈ పుక్కిలింతల వల్ల అది నోరు శుభ్రమవుతుంది. ఇక ప్రతిరోజూ ఉదయం, రాత్రి నిద్రపోబోయే ముందు బ్రషింగ్ చేసుకోవడం అవసరమన్నది మనందరికీ తెలిసినప్పటికీ చాలా మంది ఈ నియమం పాటించరన్నది తెలిసిందే. బ్రషింగ్ తర్వాత పళ్లపైనా, చిగుర్లపైనా వేలి చివరలతో గుండ్రంగా తిప్పుతూ మసాజ్ చేసుకుంటున్నట్లుగా రాయాలి. దీనివల్ల చిగుర్లకు రక్తప్రసరణ పెరిగి చిగుర్ల వ్యాధులు నివారితమవుతాయి.

పొగాకు వంటివి నమలడం, జర్దాపాన్ వంటివి తినడం, ఖైనీ, గుట్కా, పాన్‌మసాలాల వంటి దురలవాట్లు నోటి దుర్వాసనతో పాటు శారీరకంగా కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. నోటి క్యాన్సర్లు మొదలుకొని ఇతరత్రా అనేక ఆరోగ్య సమస్యలకు తావిస్తాయి. అంతేకాదు... నలుగురిలో మాట్లాడటానికి ఇబ్బందిగా ఉండే వాతావరణాన్ని కలిగిస్తాయి. అలాంటి దురలవాట్లు పూర్తిగా మానేయాలి.

మార్కెట్‌లో దొరికే మౌత్‌వాష్‌లతో తరచూ నోరు కడుక్కుంటూ ఉండటం కూడా మంచిదే. ముఖ్యంగా నోటి దుర్వాసనతో బాధపడేవారు తరచూ మౌత్‌వాష్‌తో శుభ్రం చేసుకోవడం ఇంకా మంచిది.

సరైన స్నానం

ప్రతి రోజూ ప్రతివారూ స్నానం చేస్తారు. అయితే చాలా మంది దేహం శుభ్రమవుతోందా లేదా అన్నది చూసుకోకుండా యాంత్రికంగా ఈ పని చేస్తుంటారు. ముఖ్యంగా చిన్నారుల్లో (కొందరు పెద్దవాళ్లలనూ) ఈ ధోరణి కనిపిస్తుంది. చాలామంది తమ చెవుల వెనక భాగాలనూ, శరీరంలో మడతపడే చోట్లను శుభ్రం చేసుకునే విషయాన్ని అంతగా పట్టించుకోరు. వాస్తవానికి చర్మం ముడతలు పడే ప్రాంతాలైన కీళ్లు, బాహుమూలాలు, మోకాలి వెనక భాగాలతో పాటు ప్రైవేట్ పార్ట్స్‌పై కొద్దిగా ఎక్కువగా దృష్టి సారించాల్సిన అవసరముంటుంది.

తలస్నానం ఎలాగంటే...: తలస్నానం వారంలో రెండుసార్లు చేయడం మంచిది. తలలో చుండ్రు వంటి సమస్యలు ఉన్నవారు రోజు విడిచి రోజు తలస్నానం చేయడమూ మంచిదే. తలస్నానం చేసే ముందర కొందరు తలకు నూనె రాస్తారు. అందరూ తలకు నూనె రాయాల్సిన అవసరం లేదు. కేవలం పొడిబారినట్లు ఉండే చర్మమూ, వెంట్రుకలు ఉన్నవారు మాత్రమే తలస్నానానికి ముందర నూనెతో మృదువుగా మసాజ్ చేసుకోవాలి. జిడ్డుచర్మం ఉండేవారు తలకు నూనె రాయకపోయినా పర్వాలేదు. ఆ తర్వాత అదంతా శుభ్రమయ్యేలా మంచి షాంపూతో స్నానం చేయాలి. మైల్డ్ షాంపూ వాడటమే మేలు. కొందరు మెడికేటెడ్ షాంపూలు వాడతారు. అలాంటివి కేవలం డాక్టర్ సలహా మీద మాత్రమే వాడాలి.

మరికొన్ని జాగ్రత్తలు...

ఆహ్లాదం కలిగించి అనేక ఆరోగ్య సమస్యలను దూరంపెట్టే స్నానం చేసేటప్పుడు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలివి... ● స్నానానికి ఉపయోగించే నీళ్లు మరీ చల్లగా లేదా మరీ బాగా వేడిగా ఉండకూడదు. చన్నీటి స్నానం మంచిదనేది కేవలం అపోహ. చల్లటి స్నానం వల్ల సైనస్, ఆస్తమా వంటి సమస్యలు ఉన్నవారికి చల్లటినీళ్ల స్నానం దాన్ని ట్రిగర్ చేసే అవకాశాలెక్కువ. ఇక మరీ బలహీనంగా ఉన్నవాళ్లుగానీ లేదా వృద్ధులుగానీ మరీ ఎక్కువగా చల్లగా ఉండే నీళ్లతో స్నానం కాని, మరీ ఎక్కువ వేడిగా ఉండే నీళ్లతో స్నానం గానీ చేయడం సరికాదు ● ఒకవేళ తప్పని పరిస్థితుల్లో చల్లటి నీళ్లతో స్నానం చేయాల్సి వస్తే... ఆ స్నానం వ్యవధిని వీలైనంతగా తగ్గించడం మంచిది ● ఒకవేళ చల్లటి నీళ్లతో స్నానం చేయాల్సి వస్తే... దానికి ముందర వార్మప్‌గా కాస్తంత వ్యాయామం మంచిది ● కడుపు నిండా తిన్నవెంటనే స్నానం చేయకూడదు. భోజనం తర్వాత రెండు మూడు గంట తర్వాతే స్నానం చేయడం మంచిది ● చన్నీళ్లు లేదా వేణ్ణీళ్లతో గానీ స్నానం తర్వాత తలనొప్పి, జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తే అది మీ ఆరోగ్యానికి అంతగా సరిపడదని గుర్తుంచుకుని, ఇలాంటివాళ్లు కేవలం గోరువెచ్చటి నీళ్లతో మాత్రమే స్నానం చేయాలి.

చేతుల పరిరక్షణ

ఆహారం తీసుకునే ముందర చేతుల్ని తప్పనిసరిగా శుభ్రంగా కడుక్కోవాలి. ఇక మూత్ర, మల విసర్జన తర్వాత (అంటే వాష్‌రూమ్‌కు వెళ్లి వచ్చాక) రెండు చేతులనూ తప్పనిసరిగా శుభ్రంగా కడుక్కోవాలి. దీనికో కారణముంది. వాష్‌రూమ్ తలుపు తెరిచే సమయంలో 'నాబ్'ను చాలామంది ముట్టుకుంటారు. వాళ్ల చేతుల్లో ఏవైనా బ్యాక్టీరియల్, వైరల్, ఏకకణజీవుల వంటి పరాన్నజీవులు ఉంటే... వారు ముట్టుకున్న చోటిని మళ్లీ మనం ముట్టుకోవడం వల్ల మనకూ ఆ వైరస్, బ్యాక్టీరియా, ఏకకణజీవులు సంక్రమించవచ్చు. ఇలా జబ్బు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించడాన్ని 'ఫోమైట్ ట్రాన్స్‌మిషన్'గా చెబుతారు. ఇలా ఈ మార్గంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున వాష్‌రూమ్‌కు వెళ్లివచ్చాక తప్పక చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

చర్మ సంరక్షణ కోసం...

కొంతమందిలో చర్మం పొడిబారడం ఓ సమస్యగా మారుతుంది. ఇలాంటివారు తరచూ మాయిశ్చరైజింగ్ క్రీమ్స్ రాసుకోవాలి. వేసవికాలంలో ఈ సమస్య పెద్దగా లేకపోయినా చలికాలంలో వారిని మరింతగా బాధపెడుతుంటుంది. అందుకే ఆ సీజన్‌లో తప్పనిసరిగా రాసుకోవాలి. లేకపోతే చర్మం మీద మంట, దురద వస్తాయి. పొడిచర్మం ఉన్నవారి పైచర్మం దోక్కుపోయినప్పుడు... కిందిచర్మం తేలిగ్గా ఇన్ఫెక్షన్‌కు దారితీయవచ్చు.

● ఎండలోకి వెళ్లేటప్పుడు అది సీజన్ అయినా సరైన ఎస్‌పీఎఫ్ ఉన్న సన్ స్క్రీన్ రాసుకోవాలి. దీన్ని ప్రతి మూడు గంటలకోమారు రాసుకుంటూ ఉండాలి ● వీలైనంత వరకు శరీరమంతా కప్పేలా ఫుల్ స్లీవ్స్ వేసుకోవడం మంచిది ● ముఖం మీది చర్మం కూడా కవర్ అయ్యేలా స్కార్ఫ్ ధరించడం మేలు

● ఇక శరీరంపై చర్మం ముడుతలు పడి ఉండే మెడ, భుజాలు, బాహుమూలాల వద్ద, తొడలు, గజ్జల వంటి చోట్ల శుభ్రంగా, పొడిగా ఉంచుకోకపోతే అక్కడ ఫంగల్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. అందుకే స్నానం తర్వాత చర్మం ముడుతలు ఉన్నచోట్ల ప్రత్యేకంగా పూర్తిగా పొడిగా అయ్యేలా టవల్‌తో తుడుచుకోవాలి.

డయాబెటిస్ ఉన్నవారి పాద సంరక్షణకు...

ఇవి డయాబెటిస్ ఉన్నవారికే కాకుండా, ఆరోగ్యవంతులు కూడా పాటించడానికి అనువైన నియమాలని గుర్తుంచుకోండి. కాకపోతే డయాబెటిస్ ఉన్నవారికి మరింత మేలు చేస్తాయి.

- తరచూ తామే స్వయంగా కాలిని పరీక్షించుకుంటూ ఉండాలి. ఇలా చేసే సమయంలో కాలి పైభాగాన్నీ నిశితంగా పరీక్షించుకోవడం వీలవుతుంది. కానీ కిందనుండే పాదం భాగం కనిపించదు కాబట్టి దాన్ని పరిశీలించడానికి పాదాల కింద అద్దం పెట్టి చూసుకోవాలి. అలాగే కాలి వేళ్ల మధ్య భాగాలనూ అంతే నిశితంగా పరీక్షించుకుంటూ ఉండాలి. మొత్తం కాలిభాగంలో ఏ చిన్న పొక్కులాంటిది ఉన్నా దాన్ని విస్మరించకూడదు. భవిష్యత్తులో అది పుండుగా మారే ప్రమాదం ఉంటుంది. డయాబెటిస్ సమస్యతో బాధపడే వారిలో పుండ్లు పడటం వల్ల గ్యాంగ్రీన్ ఏర్పడితే ఒక్కోసారి పూర్తి పాదాన్ని, కాలిని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.
- పాదాలను ఎప్పుడూ పొడిగా ఉంచుకోవాలి. రోజూ కాళ్లు కడుక్కున్న తర్వాత వెంటనే పూర్తిగా పొడిగా అయ్యేలా తుడుచుకోవాలి. కాలి వేళ్ల మధ్య కూడా పొడిగా ఉండేలా చూసుకోవాలి. ఇలా పొడిబారడం కోసం కాలివేళ్ల మధ్య పౌడర్ రాసుకోవడం మంచిది.
- మరీ వేడి వస్తువులూ, పదార్థాల నుంచి కాళ్లను దూరంగా ఉంచుకోవాలి. డయాబెటిస్ ఉన్నవారు హాట్ వాటర్ బ్యాగ్‌తో కాళ్లకు కాపడం పెట్టుకోకపోవడమే మంచిది. పాదాలను మృదువుగా ఉంచుకోవాలి. ఇందుకోసం కాళ్లు కడుక్కున్న తర్వాత పొడిగా తుడుచుకొని, ఆ తర్వాత వాజిలైన్‌ను కాలికీ, వేళ్లకూ మధ్య రుద్దుతూ, ఆ వాజిలైన్ తడిదనం, జిడ్డుదనం పోయేలా పూర్తిగా పొడిబారేంతవరకు మృదువుగా రుద్దాలి. అలా ఎప్పుడూ పొడిగా ఉండేలా చూసుకోవాలి.
- కాళ్ల మీద పులిపిరి కాయలూ, కాలి కింద ఆనెకాయల్లాంటివి ఏవైనా ఏర్పడితే వెంటనే డాక్టర్‌కు చూపించుకోవాలి.
- కాలిగోళ్లను క్రమం తప్పకుండా తొలగించుకోవాలి. ఇలా చేసేటప్పుడు గోళ్లను మరీ లోపలికి కట్ చేసుకోకూడదు. అలాంటప్పుడు ఒక్కోసారి గోరు మూలల్లో రక్తం వచ్చేంతగా గోరు కట్ కావచ్చు. అలా జరిగిన కొందరిలో గోరు లోపలి వైపునకు పెరగవచ్చు. ఇది డయాబెటిస్ రోగుల్లో చాలా ప్రమాదం.
- కాలికి చెప్పులు, బూట్లు వంటి పాదరక్షలు లేకుండా నడవకూడదు. ఇవి కూడా కాలికి చాలా సౌకర్యంగా ఉండాలి. ఏమాత్రం అసౌకర్యం ఉన్నా ఆ పాదరక్షలు వాడకూడదు. ఎందుకంటే మన సొంత పాదరక్షల వల్ల ఏదైనా చిన్నపాటి గాయం అయినా మళ్లీ అదే గాయం రేగి ఎప్పటికీ మానకపోతే అది గ్యాంగ్రీన్‌గా మారే ప్రమాదం ఉంటుంది. డయాబెటిస్ బాధితుల్లో దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి.
- ఇంట్లో కూడా పాదరక్షలు లేకుండా నడవకండి. ప్రత్యేకంగా తడి, తేమలో పనిచేసే మహిళలు (ఆమాటకొస్తే పురుషులు కూడా) స్లిప్పర్స్ వంటివి తొడుక్కునే తమ రోజువారీ ఇంటి పనులు చేసుకోవడం మంచిది.
- డయాబెటిస్ వ్యాధిగ్రస్తులైతే కనీసం ఏడాదికోసారి ఆర్థోపెడిక్ లేదా మెడికల్ స్పెషలిస్ట్ వంటి కాలి వైద్య నిపుణులకు చూపించుకుంటూ ఉండాలి.

కాళ్లు / పాదాల శుభ్రత...

కాళ్లు లేదా పాదాలకు సమస్య వచ్చినప్పుడు తప్ప వాటి ఉనికినే మనమెవరమూ గుర్తించం. ప్రతిరోజూ పాదాలను పరీక్షించుకుంటూ ఉండటం అవసరం. మరీ ముఖ్యంగా డయాబెటిస్‌తో బాధపడేవారైతే... రోజూ రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు పాదాలు, మడమలు శుభ్రంగా ఉన్నాయా లేక ఏవైనా పగుళ్లు ఉన్నాయా అన్నది పరీక్షించుకోవాలి. పాదాలపై పుండ్లుగానీ, ఇన్ఫెక్షన్లుగానీ, పగుళ్లుగానీ ఏర్పడకుండా సంరక్షించుకుంటూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాదాలు కడుక్కున్న తర్వాత అవి పూర్తిగా పొడిగా మారేలా తుడుచుకోవాలి. కాలివేళ్ల గోళ్లు తీసుకుంటూ ఉండాలి.

గోళ్లు

గోళ్లను క్రమం తప్పకుండా ట్రిమ్ చేసుకోవాలి. అంటే గోరు చివరకంటా కత్తిరించకుండా, కొద్దిపాటి గోరంచు ఉండేలా ఎప్పటికప్పుడు కత్తిరించుకుంటూ ఉండాలి. ఇలా చేయడం వల్ల గోళ్లలో మట్టి చేరదు. ఇలా మట్టిచేరకుండా ఉండేలా జాగ్రత్త తీసుకోవడం వల్ల మనం భోజనం చేసే సమయంలో గోళ్ల ద్వారా ఆహారం కలుషితం కాకుండా ఉంటుంది.



బిజినెస్ రీల్

పెట్రోకెమికల్స్‌పై అదానీ దృష్టి

ఇండోరమా రిసోర్సెస్‌తో జట్టు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ బిజినెస్‌లుగల అదానీ గ్రూప్ తాజాగా పెట్రోకెమికల్స్ విభాగంలోకి ప్రవేశించే సన్నాహాలకు తెరతీసింది. థాయ్‌లాండ్ సంస్థ ఇండోరమా రిసోర్సెస్‌తో ఇందుకు చేతులు కలిపింది. ఇండోరమా రిసోర్సెస్‌తో కలిపి అనుబంధ కంపెనీ అదానీ పెట్రోకెమికల్స్ భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేసినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తాజాగా పేర్కొంది. సమాన భాగస్వామ్యం (50:50 శాతం వాటా)తో వలోర్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్(వీపీఎల్) పేరుతో జేవీని ఏర్పాటు చేసినట్లు అదానీ గ్రూప్ దిగ్గజం వెల్లడించింది. జేవీ ద్వారా రిఫైనరీ, పెట్రోకెమికల్, కెమికల్ బిజినెస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేసింది. దశలవారీగా రిఫైనరీలు, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు, స్పెషాలిటీ కెమికల్స్, హైడ్రోజన్ తదితర బిజినెస్‌ల కోసమే అదానీ పెట్రోకెమికల్స్‌ను నెలకొల్పినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వివరించింది. 2022లోనే గుజరాత్‌లో పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై 4 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడించిన సంగతి తెలిసిందే.

రుణ సమాచారం పొందడంపై కస్టమర్లకు అలర్ట్‌లు

ఆర్‌బీఐ మాస్టర్ సర్క్యులర్ జారీ



ముంబై: క్రెడిట్ సమాచార సంస్థల (క్రెడిట్ బ్యూరోలు/సీఐసీలు) నుంచి రుణ సమాచార నివేదికను (క్రెడిట్ రిపోర్ట్) ఏదైనా బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ పొందినట్టయితే ఇక మీదట వెంటనే కస్టమర్లకు తెలిసిపోతుంది. ఈ విషయాన్ని ఎస్ఎంఎస్‌లు/ఈమెయిల్ అలర్ట్‌ల ద్వారా కస్టమర్లకు తెలియజేయాలని సీఐసీలను ఆర్‌బీఐ ఆదేశించింది. తమ క్రెడిట్ రిపోర్ట్‌లో (సీఐఆర్) డేటా కరెక్షన్ కోసం కస్టమర్ చేసిన అభ్యర్థనను తిరస్కరించిన పక్షంలో, అందుకు కారణాలు తెలియజేయాలని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను కోరింది. దీనివల్ల కస్టమర్లు మెరుగ్గా అర్థం చేసుకోగలరని పేర్కొంది. ఈ మేరకు కస్టమర్ల రుణ సమాచారం విషయంలో బ్యాంక్‌లు, రుణ సమాచార సంస్థలకు (సీఐసీలు/బ్యూరోలు) ఇప్పటి వరకు జారీ చేసిన పలు ఆదేశాలను ఏకీకృతం చేస్తూ ఆర్‌బీఐ మాస్టర్ సర్క్యులర్ జారీ చేసింది. కస్టమర్ల ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరించని సందర్భాల్లో ఆలస్యం చేసిన ప్రతి రోజుకు రూ.100 చొప్పున చెల్లించాలని ఆదేశించింది.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	7,440.00	1.94
TATACONSUM	950	1.12
TITAN	3,476.50	0.72
HCLTECH	1,948.60	0.1
ICICIBANK	1,266.00	0.08

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	132	-4.6
TRENT	6,989.95	-4.35
BPCL	285.5	-3.68
NTPC	327.5	-3.63
ADANIENT	2,472.00	-3.61

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-1-2025

విశాఖ	510-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	475-00
వరంగల్	477-00
రిటైల్ ధర	5.35

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,398
ఎన్ఎస్ఈ	1,05,241
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,19,526
ఎఫ్ఐఐ	- 2,575
డీఐఐ	+ 5750

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.55 (రాత్రి 11.30కు)	$ 73.96 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.25 (రాత్రి 11.30కు)	$ 76.51 (క్రితం ముగింపు)

పసిడి కాంతుల్లో సెంట్రల్ బ్యాంకులు

- నవంబర్‌లో ఆర్‌బీఐ కొనుగోళ్లు 8 టన్నులు
- ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకుల క్యూ
- కొనుగోళ్లు 53 టన్నులు
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక



ముంబై: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి ధోరణులు, భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం భయాల వంటి అంశాలతో ప్రపంచ బ్యాంకులు తమ పసిడి నిల్వలను పెంచుకోవడంపై దృష్టి సారించాయి. 2024 నవంబర్‌లో ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకుల 53 టన్నుల పసిడి నిల్వలను పెంచుకోగా, ఇందులో భారత్ రిజర్వ్ బ్యాంక్ వాటా 8 టన్నులు. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- 2024లో ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాల కేంద్ర బ్యాంకులు బంగారాన్ని స్థిరమైన, భద్రమైన అసెట్‌గా భావించి, కొనుగోళ్లకు ఆసక్తి ప్రదర్శించాయి. ముఖ్యంగా 2024 చివరి భాగాన్ని పరిశీలిస్తే, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోళ్లకు మొగ్గచూపాయి.
- అమెరికా ఎన్నికల అనంతరం నవంబర్‌లో బంగారం ధరలు తగ్గాయి. దీనిని కొనుగోళ్లకు ఒక మంచి అవకాశంగా సెంట్రల్ బ్యాంకుల భావించాయి.
- నవంబర్‌లో జరిగిన కొనుగోళ్లతో 2024లో ఆర్‌బీఐ 73 టన్నుల బంగారం కొనుగోలు చేసినట్లు అయ్యింది. దీనితో భారత్ సెంట్రల్ బ్యాంక్ వద్ద మొత్తం బంగారం నిల్వలు 876 టన్నులకు చేరాయి.
- 2024లో రెండవ అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్ కొనసాగింది. మొదటి స్థానంలో పోలాండ్ ఉంది. పోలాండ్ నేషనల్ బ్యాంకు నవంబర్‌లో 21 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయగా, 2024లో మొత్తం 90 టన్నుల బంగారం కొనుగోలు చేసింది.
- ఉజ్బెకిస్తాన్ కేంద్ర బ్యాంకు 9 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయగా, 2024లో మొత్తం 11 టన్నుల బంగారం కొనుగోలు చేసింది.దీనితో ఈ దేశం వద్ద మొత్తం పసిడి నిల్వలు 382 టన్నులకు చేరాయి.
- కజికిస్తాన్ నేషనల్ బ్యాంక్ నవంబర్‌లో 5 టన్నుల పసిడిని కొనుగోలు చేయగా, మొత్తం దేశ బంగారం నిల్వలు 295 టన్నులకు చేరాయి.
- చైనా పీపుల్స్ బ్యాంక్ (పీబీఓసీ) ఆరు నెలల విరామం తర్వాత బంగారం కొనుగోళ్లను పునఃప్రారంభించి, నవంబర్‌లో 5 టన్నులు కొనుగోళ్లు జరిగింది. వార్షికంగా నికర కొనుగోళ్లు 34 టన్నులు. మొత్తం పసిడి నిల్వలు 2,264 టన్నులకు (మొత్తం విదేశీ మారకద్రవ్య నిల్వలో 5 శాతం) చేరాయి.
- జోర్డాన్ నవంబర్‌లో 4 టన్నుల పసిడి కొనుగోళ్లు జరిగింది. జూలై తర్వాత దేశం పసిడి కొనుగోళ్లు జరిపింది నవంబర్‌లోనే కావడం గమనార్హం. దేశం మొత్తం పసిడి నిల్వలు 73 టన్నులకు ఎగశాయి.
- టర్కీ నవంబర్‌లో జరిపిన కొనుగోళ్ల పరిమాణం 3 టన్నులు.
- చెక్ నేషనల్ బ్యాంక్ వరుసగా 21 నెలలుగా కొనుగోళ్లు జరుపుతోంది. నవంబర్‌లో జరిపిన కొనుగోళ్లు 2 టన్నులు. వార్షికంగా కొనుగోళ్లు 20 టన్నులు. దీనితో బ్యాంకు వద్ద మొత్తం నిల్వలు 50 టన్నులపైకి ఎగశాయి.
- ఘనా నేషనల్ బ్యాంక్ నవంబర్‌లో టన్నుల కొనుగోళు చేయగా, వార్షికంగా చేసిన కొనుగోళ్లు 10 టన్నులు. దీనితో దేశం వద్ద మొత్తం పసిడి నిల్వలు 29 టన్నులకు చేయాయి. ఎకానమీ స్థిరత్వానికి పసిడి నిల్వలు కీలకమని ఘనా భావిస్తోంది.

సింగపూర్ అమ్మకాలు..

కాగా, సింగపూర్ మానిటరీ అథారిటీ నవంబర్‌లో 5 టన్నుల బంగారాన్ని విక్రయించింది. 2024లో ఇప్పటి వరకు 7 టన్నుల నికర అమ్మకాలు జరిపింది. దీనితో మొత్తం నిల్వలు 223 టన్నులకు తగ్గాయి.

డిసెంబర్‌లో 'సేవలు' బాగున్నాయ్

నాలుగు నెలల గరిష్టం ● 59.3కు హెచ్ఎస్‌బీసీ సూచీ



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న సేవల రంగం డిసెంబర్‌లో మంచి పనితీరును కనబరచింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ నవంబర్‌లో 58.4 వద్ద ఉంటే, డిసెంబర్‌లో 59.3కు ఎగసింది. గడచిన నాలుగు నెలల్లో ఇంత స్థాయికి సూచీ మెరుగుదల ఇదే తొలిసారి. బలమైన డిమాండ్ పరిస్థితులు, ద్రవ్యోల్బణం ఒత్తిడులు తగ్గడం వంటి అంశాలు తాజా సానుకూల ఫలితానికి కారణమని నెలవారీ సర్వే గణాంకాలు వెల్లడించాయి. ఉపాధి వృద్ధి కూడా డిసెంబర్ ప్రోత్సాహకరంగా ఉందని గణాంకాలు పేర్కొన్నాయి. కాగా, సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు.

సేవలు–తయారీ కాంపోజిట్ ఇండెక్స్ అప్

కాగా, సేవలు–తయారీ కలగలిపిన హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా డిసెంబర్‌లో నాలుగు నెలల గరిష్ట స్థాయి 59.2కు ఎగసింది. నవంబర్‌లో ఈ రేటు 58.6గా నమోదైంది. కాగా, ఒక్క హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ డిసెంబర్‌లో 12 నెలల కనిష్ఠ స్థాయి 56.4కు పడిపోయింది. కొత్త బిజినెస్ ఆర్డర్లు, ఉత్పత్తిలో మందగమనం కనిపించిందని సర్వే పేర్కొంది. దీర్ఘకాలికంగా తయారీ సూచీ 54.1గా ఉండడం గమనార్హం.

క్వాడ్రంట్ ఫ్యూచర్‌కు యాంకర్ నిధులు

రూ. 131 కోట్లు సమీకరణ



న్యూఢిల్లీ: రైల్వే సిగ్నలింగ్, రక్షణ(కవచ్) వ్యవస్థల కంపెనీ క్వాడ్రంట్ ఫ్యూచర్ టెక్ ఐపీలో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్లకు 45 లక్షల షేర్లను విక్రయించింది. తద్వారా దాదాపు రూ. 131 కోట్లు అందుకుంది. ఎంఎఫ్ సంస్థలు వైట్ఓక్ క్యాపిటల్, కొటక్, ఎల్ఐసీ, బీఓఐసహా సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ మారిషస్ తదితర 22 సంస్థలు ఇన్వెస్ట్ చేశాయి. షేరుకి రూ. 290 ధరలో షేర్లను జారీ చేయనుంది. రూ. 275–290 ధరల శ్రేణిలో నేడు(7న) ప్రారంభం కానున్న ఇష్యూ 9న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 290 కోట్ల విలువైన షేర్లను కొత్తగా జారీ చేయనుంది. నిధులను ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ అభివృద్ధి, రుణ చెల్లింపులు తదితరాలకు వినియోగించనుంది.

ఎన్ఎండీసీ, కేఐవోసీఎల్ విలీనం!

స్టీల్ శాఖ ప్రతిపాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ నవరత్న కంపెనీ, ఇనుపఖనిజ దిగ్గజం ఎన్ఎండీసీ లిమిటెడ్‌తో మినీరత్న కేఐవోసీఎల్‌ను విలీనం చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందుకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని డీపీఈసహా పలు ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు లభించవలసి ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్టీల్ పరిశ్రమలోని పీఎస్‌యూలను కన్సాలిడేట్ చేసే వ్యూహంలో భాగంగా రెండు సంస్థల విలీనానికి ప్రతిపాదించినట్లు తెలియజేశాయి. గతేడాది(2023–24) ఎన్ఎండీసీ రూ. 21,294 కోట్ల టర్నోవర్ సాధించింది. నిజానికి నెల రోజుల క్రితమే స్టీల్ శాఖ ఎన్ఎండీసీ, కేఐవోసీఎల్ విలీన ప్రతిపాదనను ఆర్థిక శాఖకు దాఖలు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. వెరసి ఈ రెండు కంపెనీల విలీనానికి వివిధ శాఖలు, నియంత్రణ సంస్థలలో నిలిచిపోయిన అనుమతులను సాధించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించాయి. గతంలో కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీగా కార్యకలాపాలు నిర్వహించిన మినీరత్న కేఐవోసీఎల్ 1976లో ఏర్పాటైంది. స్టీల్ శాఖ అధ్యక్షతన ఇనుప ఖనిజ మైనింగ్, పెల్లట్ ఉత్పత్తిలో కీలక సీపీఎస్ఈగా ఆవిర్భవించింది. ఇక దేశీయంగా ఇనుపఖనిజ ఉత్పత్తిలో ఎన్ఎండీసీ అతిపెద్ద కంపెనీగా నిలుస్తున్న సంగతి తెలిసిందే.

ఈ వార్తల నేపథ్యంలో ఎన్ఎండీసీ షేరు ఎన్ఎస్ఈలో 4 శాతం పతనమై రూ. 65 వద్ద నిలవగా.. కేఐవోసీఎల్ 6.6 శాతం జంప్‌చేసి రూ. 424 వద్ద స్థిరపడింది.

ఏటా 40 కోట్ల మంది విమాన ప్రయాణం



న్యూఢిల్లీ: ప్రాంతీయ విమానయాన కనెక్టివిటీ ప్రభుత్వానికి ప్రాధాన్యతాంశంగా కొనసాగుతుందని పౌర విమానయాన శాఖ కార్యదర్శి వుమ్లున్మాంగ్ వుల్నామ్ సోమవారం తెలిపారు. సీప్లేన్‌ల కార్యకలాపాల కోసం తగిన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 'దేశంలో విమానయాన రంగం వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి. 10 సంవత్సరాల క్రితం దేశీయంగా 11 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారు. ఈ సంఖ్య రెట్టింపై 22 కోట్లకు చేరుకుంది. 2029 నాటికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 40 కోట్లను తాకుతుంది. విమాన ప్రయాణం పట్ల ప్రజల్లో ఆకాంక్ష ఉంది' అని వివరించారు. 'సేవలు అందించని, లేదా తక్కువ సేవలందించే ఎయిర్‌పోర్టుల నుండి ప్రాంతీయ విమాన కనెక్టివిటీని మెరుగుపరచడంతోపాటు విమాన ప్రయాణ వ్యయానిన మరింత తగ్గించడం ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ (ఆర్‌సీఎస్) పథకం లేదా ఉడాన్ లక్ష్యంగా పెట్టుకుంది.

1.46 కోట్ల మంది..

హెలికాప్టర్లు, సీప్లేన్‌ల కార్యకలాపాలను పెంచడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని వుమ్లున్మాంగ్ వివరించారు. 2016 అక్టోబర్‌లో ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం ప్రారంభమైంది. దీని కింద 2024 నవంబర్ 30 నాటికి 13 హెలిపోర్ట్‌లు, 2 వాటర్ ఏరోడ్రోమ్‌లుసహా సేవలు అందించని, తక్కువ సర్వీస్‌లు ఉన్న 87 విమానాశ్రయాలను కలుపుతూ 613 మార్గాలు అందుబాటులోనికి వచ్చాయి. రీజినల్ కనెక్టివిటీ స్కీమ్ కింద ఇప్పటివరకు 2.86 లక్షల సర్వీసుల ద్వారా 1.46 కోట్ల మంది దేశీయంగా వివిధ నగరాలకు రాకపోకలు సాగించారని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ 2024 డిసెంబర్‌లో పార్లమెంటుకు తెలిపింది.

నువోకో చేతికి వద్రాజ్ సిమెంట్!

రుణదాతల కమిటీ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: దివాలా చట్ట చర్యలలో ఉన్న వద్రాజ్ సిమెంట్(వీసీఎల్) కొనుగోలుకి వేసిన బిడ్ విజయవంతమైనట్లు సిమెంట్ రంగ కంపెనీ నువోకో విస్టాస్ కార్ప్ వెల్లడించింది. రుణ పరిష్కార చర్యల్లో భాగంగా దాఖలు చేసిన ప్రణాళికను రుణదాతల కమిటీ(సీవోసీ) ఆమోదించడంతోపాటు ఎల్‌వోఐను జారీ చేసినట్లు తెలియజేసింది. అయితే బిడ్ విలువ(ఫైనాన్షియల్) వివరాలు వెల్లడించనప్పటికీ పూర్తి అనుబంధ సంస్థ వన్య కార్పొరేషన్ ద్వారా రుణ భారం భారీగా పెరగకుండానే లావాదేవీని పూర్తి చేయనున్నట్లు వివరించింది. 15 నెలలకు విస్తరించిన ప్రణాళిక ప్రకారం దశలవారీగా పెట్టుబడులు చేపట్టనున్నట్లు తెలియజేసింది. తద్వారా 2026–27 మూడో త్రైమాసికానికల్లా సిమెంట్ ఉత్పత్తిని ప్రారంభించే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలియజేసింది. అయితే ఇందుకు జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్ నుంచి ఆమోదముద్ర లభించవలసి ఉన్నట్లు పేర్కొంది. గతేడాది ఫిబ్రవరిలో పీఎన్‌బీ ఫిర్యాదుమేరకు వీసీఎల్‌పై ఎన్‌సీఎల్‌టీ దివాలా చట్ట చర్యలకు అనుమతించింది. వీఎల్‌సీ రూ. 87.5 కోట్ల చెల్లింపుల్లో విఫలంకావడంతో పీఎన్‌బీ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. కాగా.. రూ. 7,000 కోట్ల రుణ భారంతోనున్న వీసీఎల్ కొనుగోలుకి అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, ఆర్సెలర్ మిట్టల్ పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.



ఎఫ్ఎంసీజీ కంపెనీలకు ద్రవ్యోల్బణం సెగ

- డిసెంబర్ క్వార్టర్‌లో అమ్మకాలపై ప్రతికూల ప్రభావం
- ఆదాయ వృద్ధి కనిష్ట సింగిల్ డిజిట్ స్థాయికి పరిమితం
- స్థూల మార్జిన్లు తగ్గొచ్చని పరిశ్రమ వర్గాల అంచనాలు

న్యూఢిల్లీ: వంటనూనెలు, కొబ్బరి, పామాయిల్ వంటి కీలక ముడిసరుకుల రేట్లు పెరిగిపోవడం, ధరల పెంపుపరంగా తీసుకున్న చర్యలు మొదలైనవన్నీ ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీలకు సవాలుగా మారాయి. వీటి కారణంగా అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో అమ్మకాలు నెమ్మదించడం, స్థూల మార్జిన్లు క్షీణించడంతో పాటు నిర్వహణ లాభాలు ఒక మోస్తరు స్థాయిలోనే ఉండొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. పలు ఎఫ్ఎంసీజీ సంస్థల ఆదాయ వృద్ధి కనిష్ఠ స్థాయి సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. డాబర్, మారికో తదితర లిస్టెడ్ ఎఫ్ఎంసీజీ కంపెనీలు మూడో క్వార్టర్ ఆర్థిక ఫలితాలకు సంబంధించి ఇచ్చిన అప్‌డేట్‌లను బట్టి చూస్తే అమ్మకాల వృద్ధి అదే స్థాయిలో లేదా కనిష్ట సింగిల్–డిజిట్ స్థాయిలోనో ఉండొచ్చని విశ్లేషకులు తెలిపారు. ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం కారణంగా పట్టణ ప్రాంతాల్లో వినియోగం తగ్గిపోయిన తరుణంలో, ముడి వస్తువుల ధరల పెరుగుదలపరమైన ఒత్తిళ్లను అధిగమించేందుకు ఉత్పత్తుల రేట్లను తప్పనిసరిగా పెంచాల్సి రావడం పరిశ్రమకు కాస్త ప్రతికూలం కాగలదని వివరించారు. డిసెంబర్ క్వార్టర్‌లో కనిష్ఠ స్థాయి సింగిల్ డిజిట్‌కు పరిమితం కావచ్చని డాబర్ అంచనా వేస్తోంది. క్యూ3లో కొన్ని సెగ్మెంట్లలో నెలకొన్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను, వ్యయాల తగ్గింపు, ఉత్పత్తుల రేట్లను కొంత మేర పెంచడం ద్వారా ఎదుర్కొన్నట్లు డాబర్ తెలిపింది.

మెరుగ్గా గ్రామీణం ..

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల వినియోగం మరింత వేగంగా వృద్ధి చెందినట్లు డాబర్ చ్యవన్‌ప్రాష్, వాటికా తదితర బ్రాండ్లను తయారు చేసే డాబర్ వెల్లడించింది. ఈ–కామర్స్, క్విక్ కామర్స్ వంటి ప్రత్యామ్నాయ మాధ్యమాలు వృద్ధి చెందుతుండగా, కిరాణా స్టోర్స్ వంటి విభాగాల్లో కొంత ఒత్తిడి నెలకొన్నట్లు వివరించింది. అటు మారికో కూడా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం దన్నుతో డిమాండ్ స్థిరపడుతున్న ధోరణులు కనిపిస్తున్నాయని తెలిపింది. డిసెంబర్ క్వార్టర్లో వార్షిక ప్రాతిపదికన దేశీయంగా అమ్మకాల పరిమాణం వృద్ధి చెందవచ్చని, కానీ ముడి సరుకుల రేట్లు అధికంగా ఉన్నందున సీక్వెన్షియల్ ప్రాతిపదికన నిర్వహణ లాభాల వృద్ధి ఒక మోస్తరు స్థాయిలోనే ఉండొచ్చని వివరించింది. ముడిసరుకుల రేట్లు ఊహించిన దాని కన్నా అధికంగా పెరిగిపోవడంతో స్థూల మార్జిన్లు ముందుగా అనుకున్న దానికంటే తక్కువగా ఉండొచ్చని మారికో పేర్కొంది. సఫోలా, పారాచూట్, హెయిర్ అండ్ కేర్, నిహార్, లివాన్ తదితర ఉత్పత్తులను కంపెనీ విక్రయిస్తోంది.

పట్టణాల్లో ఇంకో మూడు క్వార్టర్లు ఇలాగే ..

ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, వేతనాల వృద్ధి అంతంతమాత్రంగాన ఉండటం, ఇళ్ల అద్దెలు భారీగా పెరిగిపోవడంతో పట్టణ ప్రాంతాల్లో డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతోందని వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ నువామా తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో మందగమనం మరో రెండు, మూడు త్రైమాసికాల పాటు కొనసాగవచ్చని అంచనా వేస్తున్నట్లు వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ క్రమంగా పుంజుకుంటోందని, మెరుగైన వర్షపాతం, ఉచిత పథకాలు మొదలైన అంశాల కారణంగా పట్టణ ప్రాంత డిమాండ్‌ను దాటేయొచ్చని పేర్కొంది. సబ్బులు, స్నాక్స్, టీ మొదలైన వాటి విషయంలో ధరల పెంపు కారణంగా వినియోగదారులు చిన్న ప్యాక్‌ల వైపు మొగ్గు చూపుతున్నారని నువామా తెలిపింది.

కొన్ని ముడి సరుకులకు సంబంధించి వార్షికంగా ద్రవ్యోల్బణం దాదాపు 30 శాతం పెరిగిందని, దీంతో సబ్బులు, టీ, స్నాక్స్ వంటి ఉత్పత్తులకు సంబంధించి మార్జిన్లు గణనీయంగా తగ్గొచ్చని వివరించింది. ఇక చలికాలం రావడం కూడా కాస్త ఆలస్యం కావడంతో బాడీ లోషన్, చ్యవన్‌ప్రాష్ వంటి నిర్దిష్ట సీజన్ ఉత్పత్తులపై ప్రభావం పడుతోంది. డైరెక్ట్ టు కన్జూమర్ బ్రాండ్లు, క్విక్ కామర్స్ వేగంగా వృద్ధి చెందుతుండటం వల్ల మార్జిన్లపై ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని అంచనాలు నెలకొన్నాయి.

13 రెట్లు సబ్‌స్క్రైబ్ అయిన స్టాండర్డ్ గ్లాస్ ఐపీవో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా రంగానికి ప్రత్యేక ఇంజనీరింగ్ పరికరాలను తయారు చేస్తున్న హైదరాబాద్ కంపెనీ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవో తొలిరోజు 13.32 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఆఫర్‌లో 2.08 కోట్ల షేర్లకు గాను 27.75 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. గ్రే మార్కెట్‌లో షేర్లు రూ.97 ప్రీమియంతో ట్రేడయ్యాయి. సేల్‌ను ప్రారంభించిన నిమిషాల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ కావడం విశేషం. ఇక బిడ్డింగ్ రౌండ్‌లో ముందున్న ఎన్ఐఐ విభాగం 25.43 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్స్ 14.46, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ కొనుగోలుదారుల (క్యూఐబీ) విభాగం 1.82 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. షేర్లను జనవరి 13న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ చేయనున్నారు. ఇష్యూ జనవరి 8న ముగుస్తుంది. ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ.133–140 మధ్య నిర్ణయించారు. ఐపీవోలో భాగంగా రూ.210 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. 1.42 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు విక్రయిస్తారు. ఇన్వెస్టర్లు కనీసం 107 ఈక్విటీ షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ.123 కోట్లు అందుకుంది.

ఖోఖోకు ఒడిశా ప్రభుత్వం చేయూత

మూడేళ్ల పాటు ఏడాదికి రూ. 5 కోట్ల చొప్పున ప్రోత్సాహకం



భువనేశ్వర్: భారత హాకీ జట్లకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం... ఇప్పుడు మరో దేశీయ క్రీడను కూడా ప్రోత్సహించేందుకు ముందుకొచ్చింది. వచ్చే మూడేళ్ల పాటు భారత జాతీయ ఖోఖో జట్టుకు స్పాన్సర్‌గా వ్యవహరించనున్నట్లు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సోమవారం ప్రకటించారు. 2025 జనవరి నుంచి 2027 డిసెంబర్ మధ్య ఏడాదికి రూ. 5 కోట్ల చొప్పున కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 19 వరకు తొలి ఖోఖో వరల్డ్‌కప్‌నకు భారత్ ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. 'దేశీయ క్రీడలకు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది. ఖోఖోను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాం. ఇది మన సంస్కృతిని గుర్తుచేసుకోవడంతో పాటు అథ్లెట్లకు కొత్త అవకాశాలను సృష్టించడానికి ఉపయోగపడుతుంది' అని మోహన్ చరణ్ మాఝీ అన్నారు. ఒడిశా ముఖ్యమంత్రి నిర్ణయాన్ని భారత ఖోఖో సమాఖ్య అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ స్వాగతించారు. 'ఇటీవలి కాలంలో హాకీ క్రీడలో ఎలాంటి మార్పులు వచ్చాయో అందరం చూశాం. ఇప్పుడు ఖోఖో కూడా అలాగే దినదిన అభివృద్ధి సాధించడం ఖాయం. ఒడిశా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోంది. ఈ ప్రోత్సాహంతో భారత ఖోఖో లో నవ శకం ఆరంభమైందనిపిస్తోంది. దీని వల్ల మెరుగైన మౌలిక వసతుల కల్పనతో పాటు... ఆటకు మరింత ఆదరణ దక్కేలా కృషి చేయవచ్చు' అని మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు.



అఫ్గానిస్తాన్ తొలిసారి...

రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్ సొంతం

- జింబాబ్వేపై రెండో టెస్టులో 72 పరుగులతో విజయం
- రషీద్ ఖాన్ కెరీర్ అత్యుత్తమ గణాంకాలు నమోదు

బులవాయో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన అఫ్గానిస్తాన్ జట్టు రెండు టెస్టులతో కూడిన ద్వైపాక్షిక సిరీస్‌ను తొలిసారి దక్కించుకుంది. అంతేకాకుండా ఆసియా అవతల తొలి టెస్టు సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. జింబాబ్వేతో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా సోమవారం ముగిసిన రెండో టెస్టులో అఫ్గానిస్తాన్ 72 పరుగుల తేడాతో విజయం సాధించింది. 278 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 205/8తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే అదే స్కోరు వద్ద ఆలౌటైంది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (103 బంతుల్లో 53; 4 ఫోర్లు, 1 సిక్స్) చివరి వికెట్ రూపంలో పెవిలియన్ చేరాడు. ఆఖరి రోజు ఆటలో 15 బంతులు ఎదుర్కొన్న జింబాబ్వే ఒక్క పరుగు కూడా జత చేయకుండా రెండు వికెట్లను కోల్పోయింది. ఇరు జట్ల మధ్య భారీ స్కోర్లు నమోదైన తొలి టెస్టు చివరకు 'డ్రా' కావడంతో... ఈ విజయంతో అఫ్గానిస్తాన్ 1-0తో టెస్టు సిరీస్ చేజిక్కించుకుంది. కెరీర్ బెస్ట్ (7/66) ప్రదర్శన కనబర్చిన స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 48 పరుగులు చేసిన రషీద్, 11 వికెట్లు పడగొట్టాడు. రహమత్ షాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. ఈ పర్యటనలో భాగంగా టి20 సిరీస్‌ను 2-1తో గెలుచుకున్న అఫ్గానిస్తాన్ జట్టు వన్డే సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకుంది. ఇప్పుడు టెస్టు సిరీస్ కూడా నెగ్గి... పర్యటనను విజయవంతంగా ముగించింది.

ఐసీసీ టెస్టు హోదా సాధించిన అనంతరం 11 టెస్టు మ్యాచ్‌లు ఆడిన అఫ్గానిస్తాన్... అందులో నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఓవరాల్‌గా అఫ్గానిస్తాన్‌కు ఇది మూడో టెస్టు సిరీస్ విజయం. తటస్థ వేదికగా 2018-19లో ఐర్లాండ్‌తో భారత్‌లో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో గెలిచిన అఫ్గానిస్తాన్ తొలి సిరీస్ కైవసం చేసుకోగా... 2019లో బంగ్లాదేశ్‌తో ఏకైక టెస్టులోనూ నెగ్గి అఫ్గానిస్తాన్ సిరీస్ పట్టేసింది. ఈ రెండు ఆసియాలో జరగ్గా... ఇప్పుడు తొలిసారి జింబాబ్వే గడ్డపై అఫ్గాన్ టెస్టు సిరీస్‌ను గెలుచుకుంది. 2020-21లో అఫ్గానిస్తాన్, జింబాబ్వే మధ్య జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ 1-1తో 'డ్రా' గా ముగిసింది.

టెస్టు క్రికెట్ వర్గీకరణ!

- రెండు శ్రేణుల్లో నిర్వహించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ యోచన
- భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లతో అగ్రశ్రేణి



జై షా

దుబాయ్: టెస్టు క్రికెట్ మనుగడ కోసం సిరీస్‌లకు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త తరహా మార్పుల గురించి యోచిస్తోంది. టెస్టులపై మరింత ఆసక్తి పెంచేందుకు, ఎక్కువ సంఖ్యలో హోరాహోరీ సమరాలు చూసేందుకు ఈ ఫార్మాట్‌ను రెండు శ్రేణుల్లో నిర్వహించాలని భావిస్తోంది. టెస్టులు ఎక్కువగా ఆడే మూడు ప్రధాన జట్లు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లతో ఒక శ్రేణి... ఇతర జట్లు కలిపి మరో శ్రేణిలో ఉండే విధంగా ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. దీని అమలు, విధివిధానాలపై ఇంకా స్పష్టత లేకున్నా... ఐసీసీ చైర్మన్‌గా జై షా ఎంపికయ్యాక పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. దీనిపై చర్చించేందుకు ఈ నెలలోనే క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) చైర్మన్ మైక్ బెయిర్డ్, ఈసీబీ చైర్మన్ రిచర్డ్ థాంప్సన్‌లతో జై షా చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రకటించిన భవిష్యత్తు పర్యటనల కార్యక్రమం (ఎఫ్‌టీపీ) 2027తో ముగుస్తుంది. ఆ తర్వాతి నుంచి కొత్త విధానాన్ని తీసుకురావాలని ఐసీసీ అనుకుంటోంది. నిజానికి ఇలాంటి ప్రతిపాదన 2016లో వచ్చింది. అయితే ఇలా చేస్తే తమ ఆదాయం కోల్పోవడంతో పాటు పెద్ద జట్లతో తలపడే అవకాశం కూడా చేజారుతుందని జింబాబ్వే, బంగ్లాదేశ్ సహా పలు జట్లు దీనిని తీవ్రంగా వ్యతిరేకించాయి. దాంతో ఐసీసీ అప్పట్లో ఈ ఆలోచనను పక్కన పెట్టింది. అయితే ఇప్పుడు దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత మారిన పరిస్థితుల నేపథ్యంలో మళ్లీ ఇది ముందుకు వచ్చింది. టాప్-3 జట్ల మధ్యే ఎక్కువ మ్యాచ్‌లు చూడాలని అభిమానులు కోరుకుంటారని, ఆ మ్యాచ్‌లే అత్యంత ఆసక్తికరంగా సాగి టెస్టు క్రికెట్ బతికిస్తాయంటూ మాజీ క్రికెటర్ రవిశాస్త్రి తదితరులు ఈ తరహా రెండు శ్రేణుల టెస్టు సిరీస్‌లకు గతంలోనే మద్దతు పలికారు. పెద్ద జట్టు, చిన్న జట్టు మధ్య టెస్టులు జరిగితే ఎవరూ పట్టించుకోరని అతను ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాడు.

'షూటౌట్'లో సూర్మా హాకీ క్లబ్ గెలుపు

రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ పురుషుల టోర్నమెంట్‌లో సూర్మా హాకీ క్లబ్ మరో విజయం అందుకుంది. ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో 'షూటౌట్'లో సూర్మా క్లబ్ 3-1తో గెలిచింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. దాంతో ఫలితం తేలేందుకు 'షూటౌట్'ను నిర్వహించారు. 'షూటౌట్'లో సూర్మా జట్టు మూడు గోల్స్ చేయగా... ఢిల్లీ జట్టు ఒక్క గోల్ మాత్రమే సాధించింది. నేడు జరిగే మ్యాచ్‌లో వేదాంత కళింగ లాన్సర్స్ జట్టుతో ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టు తలపడుతుంది.

సాత్విక్-చిరాగ్ జోడీపైనే దృష్టి

నేటి నుంచి మలేసియా ఓపెన్ టోర్నీ

- సింగిల్స్‌లో లక్ష్య సేన్, ప్రణయ్, ప్రియాన్షు పోటీ



లక్ష్య సేన్

కౌలాలంపూర్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కొత్త సీజన్‌కు నేడు తెర లేవనుంది. ప్రతిష్టాత్మక మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీకి రంగం సిద్ధమైంది. గత ఏడాది పురుషుల డబుల్స్ విభాగంలో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి రన్నరప్‌గా నిలిచింది. ఈసారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా సాత్విక్-చిరాగ్ ద్వయం బరిలోకి దిగనుంది. ఏడో సీడింగ్ పొందిన భారత జోడీ బుధవారం జరిగే తమ తొలి రౌండ్ మ్యాచ్‌లో మింగ్ చె లు-టాంగ్ కాయ్ వె (చైనీస్ తైపీ) జంటతో తలపడుతుంది. మలేసియాకు చెందిన కిమ్ టాన్ హెర్ మళ్లీ కోచ్‌గా రావడంతో సాత్విక్-చిరాగ్ ఈ ఏడాదిని శుభారంభంతో మొదలుపెట్టే అవకాశముంది. గత సంవత్సరం పారిస్ ఒలింపిక్స్‌లో మినహాయించి సాత్విక్-చిరాగ్ నిలకడగా రాణించారు. నాలుగు టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రెండింటిలో విజేతగా నిలిచారు. మరో రెండింటిలో రన్నరప్‌తో సంతృప్తి పడ్డారు. పారిస్ ఒలింపిక్స్ నుంచి కచ్చితంగా పతకంతో తిరిగి వస్తారని భావించినా... క్వార్టర్ ఫైనల్లోనే సాత్విక్-చిరాగ్ ద్వయం వెనుదిరి నిరాశకు గురి చేసింది.

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగుతున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్న లక్ష్య సేన్ కొత్త ఏడాదిని టైటిల్‌తో మొదలుపెట్టాలని ఆశిస్తున్నాడు. అయితే అతనికి ఈ టోర్నీలో క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. నేడు జరిగే తొలి రౌండ్‌లో చి యు జెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్... బ్రియన్ యాంగ్ (కెనడా)తో ప్రణయ్... ఏడో సీడ్ లీ షి ఫెంగ్ (చైనా)తో ప్రియాన్షు పోటీపడనున్నారు. తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ గెలిస్తే రెండో రౌండ్‌లో అతనికి డెన్మార్క్ స్టార్, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత విక్టర్ అక్సెల్‌సన్ ఎదురయ్యే అవకాశముంది. యాంగ్‌పై ప్రణయ్, ఫెంగ్‌పై ప్రియాన్షు గెలిస్తే ప్రిక్వార్టర్ ఫైనల్లో ముఖాముఖిగా తలపడతారు. మహిళల డబుల్స్‌లో భారత్ నుంచి మూడు జోడీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. నేడు జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌లో ఒర్నిచా-సుకిత్త (థాయ్‌లాండ్)లతో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) తలపడతారు. బుధవారం జరిగే ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మిసాకి మత్సుతోమో-చిహారు షిడా (జపాన్)లతో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో... బెన్‌యాపా-నుంతాకర్న్ (థాయ్‌లాండ్)లతో రుతుపర్ణ-శ్వేతాపర్ణ పోటీపడతారు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అనుపమా ఉపాధ్యాయ్, మాళవిక బన్సోద్ బరిలో ఉన్నారు. నేడు జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో జూలీ జేకబ్సన్ (డెన్మార్క్)తో ఆకర్షి; పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్)తో అనుపమ ఆడతారు. బుధవారం జరిగే మ్యాచ్‌లో గో జిన్ వె (మలేసియా)తో మాళవిక తలపడుతుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్ నుంచి తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల...ఆద్యా-సతీశ్ కుమార్... అశిత్ సూర్య-అమృత జోడీలు పోటీపడతాయి.



చిరాగ్ సాత్విక్

దక్షిణాఫ్రికాదే సిరీస్

రెండో టెస్టులో పాకిస్తాన్‌పై 10 వికెట్ల తేడాతో ఘనవిజయం



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ 'క్లీన్‌స్వీప్' చేసి చరిత్ర సృష్టించిన పాకిస్తాన్ క్రికెట్ జట్టు... టెస్టు సిరీస్‌లో 'వైట్‌వాష్'కు గురైంది. సోమవారం ముగిసిన రెండో టెస్టులో పాకిస్తాన్‌పై 10 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా ఘనవిజయం సాధించి 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 213/1తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ చివరకు 122.1 ఓవర్లలో 478 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షాన్ మసూద్ (251 బంతుల్లో 145; 17 ఫోర్లు) భారీ సెంచరీతో ఆకట్టుకోగా... ఆఘా సల్మాన్ (95 బంతుల్లో 48; 5 ఫోర్లు), మొహమ్మద్ రిజ్వాన్ (75 బంతుల్లో 41; 2 ఫోర్లు), ఆమేర్ జమాల్ (34; 7 ఫోర్లు) రాణించారు. సఫారీ బౌలర్లలో కగిసో రబడ, కేశవ్ మహరాజ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 615 పరుగుల భారీ స్కోరు చేయగా... తొలి ఇన్నింగ్స్‌లో 194 పరుగులకే ఆలౌటైన పాకిస్తాన్ ఫాలోఆన్‌లో కాస్త పోరాడింది. దీంతో దక్షిణాఫ్రికా ఎదుట 58 పరుగుల స్వల్ప లక్ష్యం నిలవగా... ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 7.1 ఓవర్లలో 58 పరుగులు చేసి గెలిచింది. డేవిడ్ బెడింగ్‌హామ్ (30 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్క్‌రమ్ (14 నాటౌట్) ధాటిగా ఆడి మ్యాచ్‌ను ముగించారు. తొలి ఇన్నింగ్స్‌లో ద్విశతకంతో చెలరేగిన రికెల్టన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', మార్కో యాన్సెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్




ఆక్లాండ్ (న్యూజిలాండ్): కొత్త సీజన్‌లో భారత టెన్నిస్ సింగిల్స్ నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. ఆడిన రెండు టోర్నమెంట్‌లలో అతను మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. గతవారం కాన్‌బెర్రా ఏటీపీ చాలెంజర్-125 టోర్నీలో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన నగాల్... సోమవారం మొదలైన ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలోనూ తొలి రౌండ్‌లో ఓటమి చవిచూశాడు. ప్రపంచ 41వ ర్యాంకర్ అలెక్స్ మికెల్సన్ (అమెరికా)తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 96వ ర్యాంకర్ సుమిత్ నగాల్ 7-6 (10/8), 4-6, 2-6తో పోరాడి ఓడిపోయాడు. 2 గంటల 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. తొలి రౌండ్‌లో ఓడిన నగాల్‌కు 7,295 డాలర్ల (రూ. 6 లక్షల 25 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. సుమిత్ నగాల్ తదుపరి ఈనెల 12 నుంచి మెల్‌బోర్న్‌లో మొదలయ్యే సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగుతాడు.

బాలాజీ జోడీ సంచలనం



అడిలైడ్: కొత్త ఏడాదిలో భారత డబుల్స్ టెన్నిస్ ప్లేయర్ శ్రీరామ్ బాలాజీ తొలి విజయాన్ని అందుకున్నాడు. సోమవారం మొదలైన అడిలైడ్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో శ్రీరామ్ బాలాజీ (భారత్)-మిగెల్ వరేలా (మెక్సికో) ద్వయం శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బాలాజీ-వరేలా జంట 4-6, 6-2, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో ప్రపంచ 15వ ర్యాంకర్ రోహన్ బోపన్న (భారత్)-ప్రపంచ 47వ ర్యాంకర్ నికోలస్ బారింటోస్ (కొలంబియా) జోడీని బోల్తా కొట్టించింది. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను కోల్పోయిన ఇండో-మెక్సికన్ జోడీ రెండో సెట్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో 65వ ర్యాంకర్ బాలాజీ-59వ ర్యాంకర్ వరేలా పైచేయి సాధించారు. తొలుత పది పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకోవడంతోపాటు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గతవారం బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో బాలాజీ-వరేలా జోడీ తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది.

రిషి ధావన్ వీడ్కోలు



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ రిషి ధావన్ దేశవాళీ పరిమిత ఓవర్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. విజయ్ హజారే ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 34 ఏళ్ల రిషి ధావన్... రంజీ ట్రోఫీకి మాత్రం అందుబాటులో ఉంటానని వెల్లడించాడు. 2016లో టీమిండియా తరఫున 3 వన్డేలు, ఒక టి20 మ్యాచ్ ఆడిన రిషి జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకోలేకపోయాడు. 'భారత పరిమిత ఓవర్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నా. ఈ నిర్ణయంతో ఎలాంటి బాధ లేదు. దాదాపు రెండు దశాబ్దాలుగా క్రికెట్ ఆడుతున్నా. ఆట నాకు అన్నీ ఇచ్చింది. మద్దతుగా నిలిచిన భారత క్రికెట్ నియంత్రణ మండలి, హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘంతో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు' అని సామాజిక మాధ్యమాల వేదికగా సోమవారం వెల్లడించాడు. 2021-22 సీజన్‌లో హిమాచల్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ గెలవడంలో రిషి కీలక పాత్ర పోషించాడు. ఓవరాల్‌గా 134 లిస్ట్ 'ఎ' మ్యాచ్‌లాడిన రిషి... 2906 పరుగులు చేయడంతో పాటు 186 వికెట్లు పడగొట్టాడు. 135 టి20ల్లో 1740 పరుగులు చేసి 118 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

రిషితా రెడ్డి శుభారంభం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జే300 టోర్నమెంట్ బాలికల సింగిల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి బసిరెడ్డి రిషితా రెడ్డి శుభారంభం చేసింది. సోమవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రిషితా రెడ్డి 7-6 (7/4), 6-3తో కజకిస్తాన్ ప్లేయర్ ఇవా కొరిషెవాపై విజయం సాధించింది. భారత్‌కే చెందిన ఐశ్వర్య జాదవ్ 6-2, 6-3తో దరియా కొర్షెకోవా (రష్యా)ను ఓడించింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐషి బిష్ట్ (భారత్) 4-6, 3-6తో అయి వతనాబె (జపాన్) చేతిలో, మహిక ఖన్నా (భారత్) 2-6, 3-6తో ఎకతెరీనా తుపత్సినా (రష్యా) చేతిలో ఓటమి పాలయ్యారు.





అమెరికా జట్టుదే యునైటెడ్ కప్

సిడ్నీ: యునైటెడ్ కప్ మిక్స్‌డ్ టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అమెరికా జట్టు విజేతగా నిలిచింది. పోలాండ్ జట్టుతో జరిగిన ఫైనల్లో అమెరికా 2-0తో విజయం సాధించింది. పోలాండ్ వరుసగా రెండో ఏడాది రన్నరప్‌తో సరిపెట్టుకుంది. తొలి సింగిల్స్‌లో టేలర్ ఫ్రిట్జ్ 6-4, 5-7, 7-6 (7/4)తో హుబెర్ట్ హుర్కాజ్‌ను ఓడించి అమెరికాకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండో సింగిల్స్‌లో కోకో గాఫ్ 6-4, 6-4తో ప్రపంచ మాజీ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌పై గెలిచి అమెరికాకు టైటిల్‌ను ఖరారు చేసింది. ఈ టోర్నీలో కోకో గాఫ్ ఆడిన ఐదు సింగిల్స్ మ్యాచ్‌లను రెండు సెట్‌లలోనే నెగ్గడం విశేషం. 2023లో తొలిసారి యునైటెడ్ కప్‌ను నిర్వహించగా... ఇటలీపై గెలిచి అమెరికా విజేతగా నిలిచింది. 2024లో పోలాండ్‌ను ఓడించి జర్మనీ టైటిల్ దక్కించుకుంది.

18 ఏళ్ల తర్వాత...

పాక్‌లో టెస్టు సిరీస్ ఆడనున్న విండీస్

కరాచీ: వెస్టిండీస్ క్రికెట్ జట్టు 18 ఏళ్ల తర్వాత పాకిస్తాన్‌లో పర్యటిస్తోంది. చివరిసారిగా 2006లో పాకిస్తాన్‌లో టెస్టు మ్యాచ్ ఆడిన వెస్టిండీస్... మళ్లీ ఇన్నేళ్ల తర్వాత టెస్టు సిరీస్ ఆడేందుకు సోమవారం ఇస్లామాబాద్‌లో అడుగుపెట్టింది. ఈ మధ్య కాలంలో కరీబియన్ జట్టు పాకిస్తాన్ గడ్డపై రెండుసార్లు పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఈ నెల 16 నుంచి కరాచీ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. 24 నుంచి జరగనున్న రెండో టెస్టుకు ముల్తాన్ ఆతిథ్యమిస్తుంది. అంతకుముందు 10 నుంచి విండీస్ జట్టు పాకిస్తాన్ షాహీన్స్‌తో మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2023-25లో ఇరు జట్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. విండీస్ జట్టుకు క్రెయిగ్ బ్రాత్‌వైట్ సారథ్యం వహిస్తుండగా... అమీర్ జాంగో తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు.

వెస్టిండీస్ జట్టు: క్రెయిగ్ బ్రాత్‌వైట్ (కెప్టెన్), అలిక్ అథనాజ్, కీసీ కార్టీ, జోషువా డిసిల్వా, జస్టిన్ గ్రేవ్స్, కవెమ్ హాడ్జ్, టెవిన్ ఇమ్లాచ్, అమీర్ జంగూ, మికిల్ లూయిస్, గుడకేశ్ మోతీ, అండర్సన్ ఫిలిప్, కీమర్ రోచ్, జేడెన్ సీల్స్, కెవిన్ సింక్లెయిర్, వారికన్.


అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎలక్టోరల్ కాలేజీ ఓట్లను నిర్ధారించేందుకు కాంగ్రెస్ సంయుక్త సమావేశమైన వేళ మంచుతుఫానులో క్యాపిటల్ భవనం


తీవ్ర తుఫాను కారణంగా అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో శ్వేతసౌధంపై హిమపాతం

భారత్‌కు తిరిగిరాకుండానే హెచ్‌1బీ రెన్యూవల్!



పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- స్టాంపింగ్ కోసం స్వదేశం వెళ్లకుండానే రెన్యూవల్ చేసేందుకు అమెరికా యోచన
- భారీగా లబ్ధిపొందనున్న భారతీయులు

వాషింగ్టన్: ప్రయోగాత్మక పైలట్ ప్రాజెక్టు విజయవంతమవడంతో స్వదేశానికి రాకుండానే అమెరికా గడ్డ మీదనే హెచ్-1బీ వీసా రెన్యూవల్ కోరుకునే వేలాది మంది భారతీయుల కల త్వరలో నెరవేరే అవకాశాలు మెరుగయ్యాయి. అమెరికన్ సంస్థల్లో పనిచేస్తూ హెచ్-1బీ వీసా పొందిన విదేశీ ఉద్యోగులు తమ వీసా రెన్యూవల్ కోసం ఖచ్చితంగా తమ తమ స్వదేశాలకు స్వయంగా వెళ్లి స్టాంపింగ్ పూర్తి చేయించుకుని తిరిగి అమెరికాకు రావాల్సి వచ్చేది. చాన్నాళ్ల నుంచి ఇదే నిబంధన అమల్లో ఉంది. అయితే ఇకపై ఏ దేశానికి చెందిన హెచ్-1బీ వీసాదారులైనాసరే స్వదేశానికి వెళ్లకుండా అమెరికా గడ్డ మీదనే రెన్యూవల్‌కు సాధ్యాసాధ్యాలపై గత ఏడాది అమెరికా ప్రభుత్వం ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పైలట్ ప్రాజెక్టులో భాగమైన దాదాపు 20,000 మంది హెచ్-1వీ వీసాదారులు సంబంధిత ధృవీకరణ పత్రాలను విజయవంతంగా సమర్పించడంతో అందరికీ వీసా రెన్యువల్ సుసాధ్యమైంది. ఇలా పైలట్ ప్రాజెక్‌ట్ ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విజయవంతంగా పూర్తికావడంతో ఇకపై హెచ్-1బీ వీసాదారులు అందరికీ తమ దేశంలోనే రెన్యూవల్ చేయాలని అమెరికా యోచిస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే అత్యధికంగా లబ్ధిపొందేది భారతీయులే. ఎందుకంటే ఏటా హెచ్-1బీ వీసాదారుల్లో భారతీయులే గణనీయమైన స్థాయిలో ఉన్నారు. 2023లో మొత్తం 3,86,000 హెచ్-1బీ వీసాలు మంజూరైతే అందులో 72.3 శాతం వీసాలు భారతీయులకే దక్కాయి. 2022 ఏడాదిలో ఏకంగా 77 శాతం వీసాలను మనవాళ్లే ఒడిసిపట్టారు. వీసా రెన్యూవల్ స్టాంపింగ్ కోసం లక్షల రూపాయల ఖర్చుపెట్టి విమాన టికెట్లు కొనుగోలు చేసి భారత్‌కు తిరిగి రావడం, వీసా అపాయిమెంట్‌లకు సంబంధించిన స్లాట్ బుకింగ్ సమస్యలు, దరఖాస్తు పరిశీలన ప్రక్రియకు చాలా రోజులు వేచి ఉండటం, తిరిగి మళ్లీ లక్షలు ఖర్చుపెట్టి అమెరికాకు తిరిగిరావడం ఎంతో వ్యయప్రయాసాలతో కూడిన వ్యవహారం. స్వదేశంలో రెన్యూవల్ అమలైతే ఈ బాధలన్నీ తీరతాయని అక్కడి హెచ్-1వీ వీసాలున్న భారతీయులు ఆశిస్తున్నారు. ఈ అవకాశం ఈ ఏడాది నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం సూచనప్రాయంగా తెలిపింది. కాబోయే అమెరికా అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధినేత డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసాలకు పూర్తి మద్దతు తెలిపిన తరుణంలో అమెరికా గడ్డ మీదనే వీసా రెన్యూవల్ సదుపాయం త్వరలో అమల్లోకి వస్తుండటం గమనార్హం. హెచ్-1బీతోపాటు విద్యార్థి వీసా కోటాలోనూ భారతీయులే అత్యధికంగా ఉండటం విశేషం. గత ఏడాది అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఏకంగా 3,31,000 మంది భారతీయులు విద్యార్థి వీసాలు పొందారు. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయుల సంఖ్యే అధికం. 2008/09 విద్యాసంవత్సరం నుంచి చూస్తే ఇంతమంది భారతీయ విద్యార్థులు అమెరికాకు రావడం ఇదే తొలిసారి.

పౌరసత్వ రద్దు యోచన దారుణం: బైడెన్

వాషింగ్టన్: అమెరికాలో జన్మ హక్కు పౌరసత్వాన్ని రద్దు చేయాలన్న కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలను అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా తప్పుబట్టారు. తల్లిదండ్రుల ఇమిగ్రేషన్ హోదాతో నిమిత్తం లేకుండా అమెరికాలో జన్మించిన వారందరికీ అమెరికా పౌరసత్వం కల్పిస్తోంది. ఈ జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. తాను అధికారం చేపట్టిన తొలి రోజే ఈ మేరకు కార్యనిర్వాహక చర్యలు తీసుకునే ఆలోచన ఉన్నట్టు చెప్పారు. రాజ్యాంగబద్ధమైన జన్మహక్కును మార్చాలనే ఆలోచనే దారుణమని బైడెన్ అన్నారు. అమెరికా జన్మించినవాళ్లు దేశ పౌరులు కాకుండా ఎలా పోతారని ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సరిహద్దు నిబంధనల అమలును బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ద్వైపాక్షిక ఇమిగ్రేషన్ బిల్లుకు మద్దతుగా ఓటేయొద్దని చట్టసభ సభ్యులను ట్రంప్ కోరడం హాస్యాస్పదమన్నారు. ట్రంప్‌కు అధికార మార్పిడి ప్రక్రియ సజావుగా సాగుతోందని బైడెన్ అన్నారు. గత అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి అనంతరం బైడెన్‌కు పగ్గాలు అప్పగించేందుకు ట్రంప్ ససేమిరా అనడం, అధికార మార్పిడి ప్రక్రియను అడ్డుకునేందుకు 2021 జనవరి 6న కాపిటల్ హిల్ భవనంపై దాడికి తన మద్దతుదారులను ఉసిగొల్పడం తెలిసిందే. దాన్ని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా బైడెన్ అభివర్ణించారు. శ్వేతజాతి ఆధిపత్య భావన అమెరికాకు పొంచి ఉన్న పెను ముప్పుల్లో ఒకటన్నారు. ''ప్రపంచంలోనే అత్యంత బహుళ సాంస్కృతిక దేశం మనది. అదే మన బలం కూడా. కాపిటల్ హిల్‌పై దాడిని మన ప్రజాస్వామ్యం తట్టుకున్నందుకు గర్వపడాలి''అంటూ బైడెన్ ట్వీట్ చేశారు. 2021 తరహా హింసకు తావు లేకుండా ఈసారి అధికార మార్పిడి ప్రక్రియ శాంతియుతంగా సాగుతుందన్నారు. జనవరి 20న ట్రంప్ ప్రమాణ స్వీకారానికి హాజరవుతానని కూడా బైడెన్ చెప్పారు. ''2021లో నా ప్రమాణ స్వీకారానికి ట్రంప్ గైర్హాజరయ్యారు. అయినా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ఇటీవల ఆయన్ను వైట్‌హౌస్‌కు ఆహ్వానించా''అని గుర్తు చేశారు.



ఘనంగా చాన్‌నీ ప్రవేశ్
మహాకుంభ్ మేళా సమీపిస్తున్న నేపథ్యంలో ప్రయాగరాజ్‌లో సోమవారం సాంప్రదాయిక 'చాన్‌నీ ప్రవేశ్' కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. ఇందులో పాల్గొన్న సందర్భంగా శ్రీ తపోనిధి ఆనంద్ అఖాడా పంచాయతీకి చెందిన నాగ సాధువులు ఇలా అలరించారు.

యూనియన్ కార్బైడ్ వ్యర్థాలను 6 వారాల్లోగా తొలగించండి

- మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు
- భద్రతా ప్రమాణాలను అనుసరించాలని స్పష్టీకరణ

భోపాల్: భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారంలోని వ్యర్థాల తొలగింపుపై మధ్యప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు వారాల గడువిచ్చింది. పితంపూర్‌లోని వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో వీటిని భద్రతా ప్రమాణాలకు లోబడి శుద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ విషయమై ఎలాంటి అసత్య వార్తలను వార్తలను ప్రసారం చేయరాదని కూడా ప్రింట్, ఆడియో, విజువల్ మీడియాను ఆదేశించింది. మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల్లో యూనియన్ కార్బైడ్ వ్యర్థాల తరలింపుపై తప్పుడు, నిరాధార వార్తలు ప్రసారం కావడంతో పితంపూర్ వాసులు తీవ్ర నిరసనలకు పూనుకోవడం తెలిసిందే. జనవరి 2వ తేదీన మూతబడిన కార్బైడ్ కర్మాగారంలోని వ్యర్థాలను 12 సీల్డ్ కంటెయినర్లలో భోపాల్‌కు 250 కిలోమీటర్ల దూరంలోని పితంపూర్‌కు తరలించారు. స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ కంటెయినర్లలోని వ్యర్థాలు అలాగే ఉండిపోయాయి. వీటిని ట్రక్కుల నుంచి కిందికి దించేందుకు మూడు రోజుల సమయం పడుతుందని ప్రభుత్వ న్యాయవాది తెలపగా, భద్రతా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు సూచించింది. ముందుగా ఆ వ్యర్థాల్లోని విష రసాయనాలు ఎంత మేరకు ప్రమాదకరమో పరీక్షించి, ఆ నివేదికను బహిరంగ పరుస్తామని, ప్రజల్లో ఉన్న భయాందోళనలను పోగొడతామని తెలిపారు.

దల్లేవాల్‌ను కలిసిన సుప్రీం ప్యానెల్

- వైద్య చికిత్సలను అంగీకరించాలని వినతి
- రైతుల ప్రయోజనాలే మిన్న అంటూ తిరస్కరించిన రైతు నేత

న్యూఢిల్లీ/చండీగఢ్: పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీలో నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను సోమవారం సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ కలుసుకుంది. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత వంటి డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్ మెర్చా(ఎస్‌కేఎం-రాజకీయేతర) అధ్యక్షుడు దల్లేవాల్ 2024 నవంబర్ 26 నుంచి సాగిస్తున్న నిరాహార దీక్ష సోమవారానికి 42వ రోజుకు చేరుకుంది. రైతుల సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు గతేడాది సెప్టెంబర్‌లో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. పంజాబ్ హరియాణా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ నవాబ్ సింగ్ సారథ్యంలోని కమిటీలో రిటైర్డ్ ఐపీఎస్ బీఎస్ సంధు, వ్యవసాయ నిపుణుడు దేవీందర్ శర్మ, ప్రొఫెసర్ రంజిత్ సింగ్ ఘుమన్, డాక్టర్ సుఖ్‌పాల్ సింగ్ ఉన్నారు. రిటైర్డ్ జడ్జి జస్టిస్ నవాబ్ సింగ్ సారథ్యంలో వీరంతా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఖనౌరీకి చేరుకుని, దల్లేవాల్‌ను కలిసి, మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వైద్య సాయాన్ని అంగీకరించాలని దల్లేవాల్‌ను పదేపదే కోరాము. ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షను తెలియజేసేందుకే వచ్చాం. అంతేతప్ప, ఆయన్ను ఆందోళన విరమించాలని కోరడానికి మేం రాలేదు'అంటూ వివరించారు. సుప్రీంకోర్టుకు తాము నివేదిక ఇచ్చే వరకు వైద్య సాయం తీసుకోవాలని కూడా కోరినట్లు చెప్పారు. 'దల్లేవాల్ మాత్రం ముందు రైతుల సమస్యల పరిష్కారం, ఆ తర్వాతే నా ఆరోగ్యం'అని చెప్పారన్నారు. రైతుల ఆందోళనలపై జస్టిస్ నవాబ్ సింగ్ మాట్లాడుతూ.. తమ కమిటీకి రైతుల సమస్యలను పరిష్కరించే అధికారం లేదన్నారు. కేంద్రం మాత్రమే వాటిని పరిష్కరించగలదని చెప్పారు. తమకు అప్పగించిన బాధ్యతలపై సుప్రీంకోర్టుకు దశలవారీగా నివేదిక అందజేస్తామన్నారు.

మోదీతో సత్య నాదెళ్ల భేటీ

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ కంపెనీ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల సోమవారం ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు, విస్తరణకు ప్రయత్నాలు ప్రారంభించినందుకు మోదీ హర్షం వ్యక్తం చేశారు. టెక్, ఇన్నోవేషన్, కృత్రిమ మేధ(ఏఐ) అంశాలపై సత్య నాదెళ్లతో చర్చలు జరిపానన్నారు. నాదెళ్ల కూడా మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 'కృత్రిమ మేధతో ప్రతి భారతీయుడు ప్రయోజనం పొందటానికి, భారత్‌ను ఏఐలో అగ్రగామిగా నిలిపేందుకు, నిరంతరం కలిసి పని చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపేందుకు ఎంతో సంతోషిస్తున్నాం'అని తెలిపారు.

ఆంగ్లంలో అందరికంటే మిన్నగా..

ఇంగ్లిష్ భాష వినియోగంలో భారత్ నంబర్‌వన్
ప్రపంచ సగటులో ముందంజలో ఇండియా

న్యూఢిల్లీ: ఇంగ్లిష్ భాష మాట్లాడటంలో ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లోనే అంగ్లభాష వినియోగం అధికంగా ఉందని పియర్సన్ నివేదికలో వెల్లడైంది. ఇంగ్లిష్ భాష మాట్లాడటంలో ప్రపంచదేశాలు చూపుతున్న ప్రావీణ్యంపై పియర్సన్ సంస్థ రూపొందించిన 'గ్లోబల్ ఇంగ్లిష్ ప్రొఫీషియన్సీ-2024'నివేదికలో ఇలాంటి పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ముఖ్యంలో భారత్, ఫిలిప్పీన్స్, జపాన్, ఈజిప్ట్, కొలంబియా, యూరప్ దేశాల్లో ఇంగ్లిష్ భాష మాట్లాడగల సామర్థ్యంపై నివేదికలో ఎక్కువ వివరాలు ఉన్నాయి. వేర్వేరు దేశాల్లో దాదాపు 7,50,000 మందిలో అంగ్లభాషపై పట్టు, పాండిత్యాన్ని అధ్యయనకారులు పరీక్షించారు. ఈ మేరకు ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని అంచనావేసే వెర్సాంట్ టెస్ట్‌ను చేశారు. ఇందులో ఇంగ్లిష్ భాషానైపుణ్యం విషయంలో ప్రపంచ వ్యాప్త సగటు 57 స్కోర్‌కాగా భారత్‌లో ఇది 52గా నమోదైంది. అయితే దేశాలవారీగా చూస్తే ఇంగ్లిష్‌లో మాట్లాడే సంఖ్య పరంగా చూస్తే ప్రపంచ సగటు 54 స్కోర్‌తో పోలిస్తే భారత స్కోర్ ఏకంగా 57 ఉండటం విశేషం. ఇంగ్లిష్‌లో రాయగల సామర్థ్యానికి సంబంధించిన ప్రపంచ సగటు స్కోర్ 61కాగా భారత స్కోర్ సైతం 61 కావడం ఆశ్చర్యకరం.

రాష్ట్రాలవారీగా ఢిల్లీ టాప్

రాష్ట్రాలవారీగా చూస్తే 63 స్కోర్‌తో ఢిల్లీ అగ్రస్థానంలో, రాజస్తాన్(60), పంజాబ్(58) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ''ప్రస్తుత ఆర్థికమయ ప్రపంచంలో ఇంగ్లిష్ సామర్థ్యం కేవలం ఒక నైపుణ్యంకాదు అదొక చక్కటి ఆస్తిగా మారింది. వ్యాపారవేత్తలు తమ సంస్థలో ఉద్యోగ నియామకాల, సిబ్బందిని మెరుగుపర్చుకునే క్రమంలో వారికి ఈ ఇంగ్లిష్ నైపుణ్య సంబంధ సమాచారం ఎంతో దోహదపడుతోంది. అంచనా తప్పి తక్కువ అర్హత ఉన్న ఉద్యోగిని పొరపాటున నియమించుకోవడం, తద్వారా సంస్థ విశ్వసనీయ దెబ్బతినడం వంటి తప్పులు జరక్కుండా ఇప్పుడు భారతీయ వ్యాపారవేత్తలు మరింత మెరుగ్గా వ్యవహరిస్తున్నారు. డిజిటల్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు, అంతర్జాతీయ వ్యాపార సత్సంబంధాలకు పెంపుకు దోహదపడేలా ఇంగ్లిష్‌లో రాయగలిగేలా సిబ్బంది నియమించుకుంటున్నారు. ఆర్థిక, బ్యాంకింగ్ రంగాల్లో ప్రపంచ సగటు 56 స్కోర్‌ను మించి భారత స్కోర్ 63 ఉండటం ఇందుకు నిదర్శనం ''అని పియర్సన్ ఇంగ్లిస్ లాంగ్వేజ్ లెర్నింగ్ డివిజన్ అధ్యక్షుడు గోవనీ గోవానెల్లీ అన్నారు. భారత్‌లో ఇంగ్లిష్ నైపుణ్యానికి సంబంధించిన మార్కెట్ పెరిగిందని, భవిష్యత్‌లో ఇది మరింత విస్తరించనుందని ఆయన చెప్పారు. అయితే భారత్‌లో ఆరోగ్యసంరక్షణ రంగంలో స్కోర్ మరీ తక్కువగా 45 వద్దే ఆగిపోయింది. టెక్నాలజీ, కన్సల్టింగ్, బీపీఓ సేవలకు సంబంధించిన స్కోర్ చాలా మెరుగ్గా ఉండటం విశేషం.

న్యూజిలాండ్ వీసా నిబంధనల్లో... సడలింపులు

వెల్లింగ్టన్: కార్మికుల కొరత తదితరాల నేపథ్యంలో వీసా నిబంధనలను న్యూజిలాండ్ సరళతరం చేసింది. ఇమిగ్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తూ గణనీయమైన మార్పులు చేసింది. పని అనుభవం, వేతనాలు, వీసా వ్యవధి తదితరాలను మార్చింది. న్యూజిలాండ్‌లో ఉపాధి పొందాలనుకునే కార్మికులకు కనీస అనుభవ అర్హతను మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించింది. దాంతో ఇకపై ఆ దేశంలో ఉపాధి పొందడం మరింత సులభతరం కానుంది. న్యూజిలాండ్‌లో ఉద్యోగాలు చేయాలనుకునే భారతీయులకు ఈ కొత్త నిబంధనలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

వీసాల్లో మార్పు..
సీజనల్ వర్కర్లు న్యూజిలాండ్‌లో ఉండేందుకు రెండు కొత్త మార్గాలను కూడా ప్రవేశపెట్టారు. అనుభవజ్ఞులైన సీజనల్ కార్మికులకు మూడేళ్ల మల్టీ-ఎంట్రీ వీసా, తక్కువ నైపుణ్యం కలిగిన కార్మికులకు ఏడు నెలల సింగిల్-ఎంట్రీ వీసాలు ఇవ్వనున్నారు. గుర్తింపు పొందిన ఎంప్లాయర్ వర్క్ వీసా (ఏఈడబ్ల్యూవీ), స్పెసిఫిక్ పర్పస్ వర్క్ వీసా (ఎస్పీడబ్ల్యూవీ)లకు సగటు వేతన ప్రమాణాలను తొలగించారు. కొత్త నిబంధనల ప్రకారం యజమానులు ఉద్యోగ అవకాశాలను పోస్ట్ చేయాల్సి ఉంటుంది. మార్కెట్ రేటు ప్రకారం జీతాలివ్వాల్సి ఉంటుంది. అలాగే ఆస్ట్రేలియన్ అండ్ న్యూజిలాండ్ స్టాండర్డ్ క్లాసిఫికేషన్ ఆఫ్ ఆక్యుపేషన్స్ (ఏఎన్‌జెడ్ఎస్‌సీఓ) స్కిల్ లెవల్స్ 4 లేదా 5 పరిధిలోకి వచ్చే ఉద్యోగాలకు రెండేళ్ల వీసా వ్యవధిని మూడేళ్లకు పెంచారు. ఇప్పటికే రెండేళ్ల వీసా ఉన్న ఉద్యోగులు ఏడాది పొడిగింపు కోరవచ్చు. వలసదారులు తమ పిల్లలను వెంట తీసుకొచ్చేందుకు కనీస వార్షిక వేతనాన్ని 55,844 డాలర్లకు పెంచారు.

విద్యార్థుల వీసాలో సవరణ
పోస్ట్ స్టడీ వర్క్ వీసా (పీఎస్ డబ్ల్యూవీ)ను కూడా న్యూజిలాండ్ సవరించింది. దీని ప్రకారం విద్యార్థులు అర్హతలను బట్టి అక్కడ మూడేళ్ల పాటు ఉండటానికి, పని చేయడానికి అనుమతిస్తారు. పీజీ డిప్లొమా తర్వాత మాస్టర్స్ పూర్తి చేసిన విద్యార్థులు పోస్ట్ స్టడీ వర్క్ వీసాకు అర్హత కోల్పోకుండా ఉండేందుకూ ఈ నిబంధనలు వీలు కల్పిస్తాయి. గ్రామీక రంగ కంపెనీలకు కార్మికులను తీసుకోవడం మరింత సులభతరం కానుంది. స్టూడెంట్ వీసా తదితరాల నుంచి ఏఈడబ్ల్యూవీకి మారాలనుకునే వలసదారులకు వచ్చే ఏప్రిల్ నుంచి మధ్యంతర పని హక్కులు కూడా ఇస్తారు.

హసీనా అరెస్టుకు మళ్లీ వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) సోమవారం రెండో అరెస్టు వారెంట్ జారీ చేసింది. హసీనాతోపాటు ఆమె సైనిక సలహాదారు, మరో 11 మందికి వారెంట్ జారీ చేసినట్లు ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం తెలిపారు. ఆమెను రప్పించేందుకు అవసరమైతే ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటామన్నారు. ''విచారణను వీలైనంత త్వరగా ముగించాలనుకుంటున్నాం. చట్టాన్ని ఉల్లంఘించడం, హడావుడిగా తీర్పును అమలు చేయడం వంటివి జరగబోవు''అని చెప్పారు. హసీనా హయాంలో 500 మందికి పైగా భద్రతా సిబ్బంది అపహరణకు గురయ్యారని, పలువురిని ఏళ్లుగా రహస్య స్థావరాల్లో నిర్బంధించారని ఆరోపణలున్నాయి. 2023 ఆగస్టు 5న తిరుగుబాటుదారులు తన ప్రభుత్వాన్ని కూలదోయడంతో హసీనా దేశం వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. పలు అభియోగాలపై విచారణ నిమిత్తం ఆమెను అప్పగించాల్సిందిగా బంగ్లా ఇప్పటికే భారత్‌ను కోరింది. దీనికి భారత్ ప్రతిస్పందించలేదు. హసీనాతో పాటు 45 మందికి బంగ్లా ప్రత్యేక కోర్టు 2024 అక్టోబర్‌లో అరెస్టు వారెంట్లు జారీ చేసింది. గత జూలై, ఆగస్టు నెలల్లో విద్యార్థుల తిరుగుబాటును అణచే క్రమంలో పలు నేరాలకు పాల్పడ్డట్టు, నిరసనకారుల మరణానికి కారణమైనట్టు ఆమెపై అభియోగాలు మోపారు.

యూన్‌పై వారెంట్ పొడిగించండి

కోర్టుకు దక్షిణ కొరియా అధికారుల విజ్ఞప్తి

సియోల్: అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్టు వారెంట్ గడువు పొడిగించాల్సిందిగా దర్యాప్తు అధికారులు కోర్టును కోరారు. ఆయనపై వారెంట్ సోమవారంతో ముగిసింది. మార్షల్ లా డిక్రీపై విచారణకు హాజరయ్యేందుకు నిరాకరించడంతో ఆయన అరెస్టుకు వారెంట్ జారీ కావడం తెలిసిందే. ఆదివారమే యూన్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా ఆయన రక్షణ సిబ్బంది అడ్డుకున్నారు. అధ్యక్షుని అరెస్టుకు అనుమతించబోమని ఆయన భద్రతా విభాగం అధిపతి స్పష్టం చేశారు. దాంతో యూన్‌ను అదుపులోకి తీసుకోవడానికి పోలీసుల సాయం కోరినట్టు దర్యాప్తు అధికారులు తెలిపారు. వారెంట్ చట్టవిరుద్ధమని, దీనిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తరఫు న్యాయవాదులు చెబుతున్నారు. యూన్ అభిశంసన విచారణను జనవరి 14న ప్రారంభించాలని రాజ్యాంగ న్యాయస్థానం నిర్ణయించింది. యూన్ హాజరవపోతే ఆయన గైర్హాజరీలో విచారణ కొనసాగనుంది.

ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

సియోల్: ఉత్తర కొరియా సోమవారం ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి సుమారు 1,100 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కొరియా ద్వీపకల్పం, జపాన్ మధ్య సముద్ర జలాల్లో పడిపోయిందని దక్షిణ కొరియా తెలిపింది. 2025 ప్రవేశించాక మొదటిసారిగా, మరికొద్ది రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌కు సమీపం నుంచి క్షిపణిని ప్రయోగించినట్లు దక్షిణ కొరియా సైన్యం తెలిపింది. ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే తాము కనిపెట్టామని పేర్కొంది. ఈ పరిణామం కొరియా ద్వీపకల్పంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రెచ్చగొట్టే చర్యగా అభివర్ణించింది. ఉత్తర కొరియా ప్రయోగించిన క్షిపణి సముద్ర జలాల్లో తమ ఆర్థిక జోన్ వెలుపల పడిందని జపాన్ ధ్రువీకరించింది. ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రకటించింది. ఉత్తరకొరియా అణ్వస్త్ర బెదిరింపులు తదితర అంశాలపై మిత్ర దేశం దక్షిణ కొరియాతో చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సియోల్ చేరుకున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది.

డాక్యుమెంటరీ రూపకల్పనలో మెలానియా

వాషింగ్టన్: అమెరికా కాబోయే ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఒక డాక్యుమెంటరీ రూపకల్పనలో పాలుపంచుకుంటున్నారు. అమెజాన్ ప్రైమ్ వీడియో ప్రాజెక్టుకు ఆమె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. దీన్ని గురించి మరిన్ని వివరాలను తర్వలో వెల్లడిస్తామని అమెజాన్ ప్రైమ్ పేర్కొంది. దీన్ని 2025 ద్వితీయార్ధంలో థియేటర్లలో, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలోనూ విడుదల చేయనున్నట్లు అమెజాన్ తెలిపింది. ఇది చాలా ప్రత్యేకమైన కథాంశంతో రూపొందుతున్నట్టు తెలిపింది. ఈ డాక్యుమెంటరీపై మెలానియా గానీ, ఆమె భర్త డొనాల్డ్ ట్రంప్ గానీ స్పందించలేదు. డిసెంబర్‌లో చిత్రీకరణ మొదలైన ఈ డాక్యుమెంటరీకి మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డట్టు ఆరోపణలు ఎదుర్కొన్న బ్రెట్ రాట్నర్ దర్శకత్వం వహిస్తున్నారు. ట్రంప్ ప్రమాణ స్వీకార నిధికి అమెజాన్ తరఫున మిలియన్ డాలర్ల విరాళాన్ని సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రకటించడం తెలిసిందే. ప్రమాణ స్వీకారాన్ని అమెజాన్ ప్రైమ్‌లో ప్రసారం చేయనున్నట్లు కూడా సంస్థ ప్రకటించింది.

ఐవోఏ, ఏఐఎఫ్ఎఫ్ పిటిషన్ల విచారణ నుంచి తప్పుకున్న సీజేఐ

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐవోఏ), అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఏఐఎఫ్ఎఫ్) ఏర్పాటుపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం తెలిపారు. వీటిలో ఒక కేసును తాను ఢిల్లీ హైకోర్టులో పనిచేసిన సమయంలో విచారించడే ఇందుకు కారణమని పేర్కొన్నారు. వాటిని జస్టిస్ పీఎస్ నరసింహ సారథ్యంలోని ధర్మాసనం విచారిస్తుందని ఆయన తెలిపారు. ఈ కేసుల్ని 2024 మార్చి 19న నాటి సీజేఐ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం విచారించింది.

వాటికన్‌లో తొలిసారిగా మహిళా అధికారి

రోమ్: రోమన్ కేథలిక్కుల మతాధిపతి పోప్ ఫ్రాన్సిస్ వాటికన్‌లోని ప్రధాన విభాగానికి మొట్టమొదటిసారిగా మహిళను నియమించారు. ఇటలీకి చెందిన నన్ సిస్టర్ సిమోనా బ్రంబిల్లా (59)ను అన్ని కేథలిక్ చర్చిల్లో మతాదేశాలను అమలు చేసే ప్రిఫెక్ట్‌గా బాధ్యతలను అప్పగించారు. కాన్సొలెటా మిషనరీస్ రెలీజియస్ ఆర్డర్ సభ్యురాలిగా, రెలీజియస్ ఆర్డర్ విభాగంలో ఆమె రెండో అధికారిగా కొనసాగుతున్నారు. చర్చిలో మహిళలకు మరింతగా నాయకత్వ బాధ్యతలను అప్పగించాలన్న ఫ్రాన్సిస్ ఉద్దేశానికి ఈ నియామకం ప్రధాన అడుగుగా భావిస్తున్నారు. వాటికన్‌లో ఇప్పటి వరకు రెండో స్థాయి అధికారుల బాధ్యతల్లోనే మహిళలున్నారు.

తమిళనాడు అసెంబ్లీలో అనూహ్య పరిణామం
ప్రసంగించకుండానే గవర్నర్ వాకౌట్

చిన్న పిల్లల చేష్టగా అభివర్ణించిన సీఎం స్టాలిన్

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజు సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సంప్రదాయం ప్రకారం గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రభుత్వం అందజేసిన ప్రసంగాన్ని చదవాల్సి ఉంది. అయితే రాజ్యాంగానికి, జాతీయ గీతానికి అవమానం జరిగిందని ఆరోపిస్తూ ఆయన సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు గవర్నర్ రాకతో రాష్ట్ర గీతం మొదలైంది. అది ముగిశాక సభా కార్యకలాపాలు ప్రారంభం కావాల్సిన సమయంలో గవర్నర్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. మరోవైపు సభ్యుల నిరసనలతో గందరగోళం నెలకొంది. అనంతరం ఘటనపై రాజ్‌భవన్ పలు ట్వీట్లు చేసింది. రాజ్యాంగానికి, జాతీయ గీతానికి అసెంబ్లీలో మళ్లీ అవమానం జరిగిందని పేర్కొంది. ''గవర్నర్ ప్రసంగానికి ముందు, చివర్లో జాతీయ గీతాలాపన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో జరిగేదే. కానీ గవర్నర్ అసెంబ్లీలోకి రాగానే తమిళనాడు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. సంప్రదాయాన్ని గుర్తు చేసినా సీఎం, విపక్ష నేతలు, స్పీకర్ పట్టించుకోకపోవడం దారుణం. రాజ్యాంగాన్ని, జాతీయ గీతాన్ని ఇంత బాహాటంగా అగౌరవపరిచినందుకు ఆవేదనతో గవర్నర్ సభ నుంచి వచ్చేశారు'' అని వివరించింది. ఈ పరిణామంపై సభా నేత, సీనియర్ మంత్రి దురై మురుగన్ స్పందించారు. 'గవర్నర్ ప్రసంగానికి ముందు రాష్ట్ర గీతం, చివర్లో జాతీయ గీతం ఆలపించడం సంప్రదాయం. ఇదే విషయాన్ని ఆయనకు గతంలోనూ చెప్పాం. కానీ, మళ్లీ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన సభను వీడారు. దీన్ని బట్టి ఆయన అసలు ఉద్దేశమేంటో తేటతెల్లమవుతోంది'అని వ్యాఖ్యానించారు. గవర్నర్ చర్యను సీఎం స్టాలిన్ చిన్న పిల్లల చేష్టగా అభివర్ణించారు.

'ఆర్థిక ప్రజాస్వామ్యం' దేని ద్వారా సాధ్యమవుతుంది?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు, ఆదేశిక నియమాలు

1. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల విరోధానికి కారణం?
   - ఎ) రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి న్యాయశాఖ ఆరాటం
   - బి) లిఖిత రాజ్యాంగం
   - సి) సాంఘిక, ఆర్థిక అసమానతలు
   - డి) ముందుచూపు ఉన్న నాయకులు లేకపోవడం
2. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేని హక్కు ఏది?
   - ఎ) పని హక్కు
   - బి) ఆశ్రయ హక్కు
   - సి) విద్యాహక్కు
   - డి) ప్రభుత్వ సహాయ హక్కు
3. 'ఆదేశిక సూత్రాల అమలును ఏ ప్రభుత్వమైనా విస్మరిస్తే, వారు ఎన్నికల కాలంలో ప్రజల ముందు తప్పనిసరిగా జవాబుదారీయై నిలవాల్సి ఉంటుంది' అని వ్యాఖ్యానించిందెవరు?
   - ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
   - బి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
   - సి) ఐవర్ జెన్నింగ్స్
   - డి) వల్లభ్ భాయ్ పటేల్
4. మహాత్మాగాంధీ తత్వాన్ని ప్రతిబింబించే ఆదేశిక నియమాలు ఏవి?
   - ఎ) సమాన పనికి సమాన వేతనం
   - బి) ఉచిత న్యాయ సలహా
   - సి) గోవధ నిషేధం
   - డి) చారిత్రక కట్టడాల పరిరక్షణ
5. ప్రాథమిక విధుల కోసం రాజ్యాంగంలో ప్రత్యేక అధ్యాయం ఉండాలని సూచించిన సంఘం?
   - ఎ) సర్కారియా బి) రాజ్‌మన్నార్
   - సి) ఏఆర్‌సీ డి) స్వరణ్ సింగ్
6. ఆదేశిక నియమాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   - ఎ) వీటికి న్యాయ సంరక్షణ లేదు
   - బి) ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలు
   - సి) వీటికి మరో పేరు న్యాయ సంరక్షణ లేని హక్కులు
   - డి) పైవన్నీ
7. ఆదేశిక సూత్రాల అమల్లో ప్రస్తుతం ఉన్న ప్రతిబంధకాలు ఏవి?
   - ఎ) ప్రపంచీకరణ
   - బి) ఆర్థిక సరళీకరణ
   - సి) ప్రైవేటీకరణ
   - డి) పైవన్నీ
8. కింది వాటిలో కొత్తగా చేర్చిన ఆదేశికాలు ఏవి?
   - ఎ) ఉచిత న్యాయ సలహా
   - బి) పర్యావరణ పరిరక్షణ
   - సి) పరిశ్రమ నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం
   - డి) పైవన్నీ
9. 'ప్రకరణ 39(బి, సి) నిర్దేశిక నియమాల అమలు కోసం చేసే చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనప్పటికీ చెల్లుబాటు అవుతాయి' అని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా మార్పు చేశారు?
   - ఎ) 24 బి) 23
   - సి) 42 డి) 44
10. విద్యాసంస్థల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించేందుకు ఏ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు?
    - ఎ) కులం బి) పేదరికం
    - సి) గ్రామీణ వాతావరణం
    - డి) మతం
11. ప్రకరణ 19(1) ప్రకారం నిర్వహించే హిక్లిన్ టెస్ట్ (Hicklin Test) దేనికి సంబంధించింది?
    - ఎ) సభ్యత, నైతికత బి) ప్రాణ నష్టం
    - సి) భారత సమైక్యత డి) ఏదీకాదు
12. ప్రభుత్వ పాలనకు పాటించాల్సిన ముఖ్యమైన అంశాలేవి?
    - ఎ) ప్రాథమిక హక్కులు
    - బి) మానవ హక్కులు
    - సి) శాసన సూత్రాలు
    - డి) ఆదేశిక సూత్రాలు
13. ఆదేశిక సూత్రాల ముఖ్యోద్దేశం ఏమిటి?
    - ఎ) నిరుద్యోగ నిర్మూలన
    - బి) సంక్షేమ రాజ్యస్థాపన
    - సి) పారిశ్రామికీకరణ
    - డి) ఆర్థిక పురోభివృద్ధి
14. గ్రామ పంచాయతీల ఏర్పాటును ఎన్నో ఆర్టికల్ సూచిస్తోంది?
    - ఎ) 40 బి) 41
    - సి) 42 డి) 43
15. 'ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులను పరిమితం చేయరాదు' అని ఏ కేసులో తీర్పు ఇచ్చారు?
    - ఎ) గోలక్‌నాథ్ కేసు
    - బి) కేశవానంద భారతీ కేసు
    - సి) మినర్వా మిల్స్ కేసు
    - డి) ఏదీకాదు
16. కింది వాటిలో ఉమ్మడి పౌరస్మృతిని తెలిపే నిబంధన ఏది?
    - ఎ) 44 బి) 45 సి) 46 డి) 47
17. జతపరచండి.
    1. ఆర్టికల్ 40
    2. ఆర్టికల్ 41
    3. ఆర్టికల్ 42
    4. ఆర్టికల్ 43

    i. కార్మికులకు కనీస వేతనాలు
    ii. పని హక్కు
    iii. గ్రామ పంచాయతీల నిర్వహణ
    iv. పని చేయడానికి తగిన పరిస్థితులు, స్త్రీలకు ప్రసూతి సౌకర్యాల కల్పన
    - ఎ) 1-iii, 2-ii, 3-iv, 4-i
    - బి) 1-i, 2-ii, 3-iv, 4-iii
    - సి) 1-ii, 2-i, 3-iv, 4-iii
    - డి) 1-ii, 2-iii, 3-iv, 4-i
18. ఆదేశిక సూత్రాలు అంటే ఏమిటి?
    - ఎ) ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇచ్చిన ఆదేశాలు
    - బి) రాష్ట్రాలకు కేంద్రం జారీ చేసే ఆదేశాలు
    - సి) కేంద్ర, రాష్ట్ర సంబంధాలను నిర్వహించే సూత్రాలు
    - డి) న్యాయ సాధనలను నిర్వహించే సూత్రాలు
19. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య తేడా ఏమిటి?
    - ఎ) ప్రాథమిక హక్కులు న్యాయ సాధ్యమైనవి, ఆదేశిక సూత్రాలు కావు
    - బి) ఆదేశిక సూత్రాలు న్యాయ సాధ్యమైనవి, ప్రాథమిక హక్కులు కావు
    - సి) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ న్యాయ సాధ్యమైనవి.
    - డి) పైవేవీ కావు
20. 'ఆదేశ సూత్రాలు ఒక వాస్తవమైన మానసిక ప్రవృత్తుల చెత్తకుండీ' అని వ్యాఖ్యానించినవారెవరు?
    - ఎ) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
    - బి) టి.టి. కృష్ణమాచారి
    - సి) కె.ఎం. మున్షీ
    - డి) ఎన్. గోపాలస్వామి అయ్యంగార్
21. 'శాసన వ్యవస్థకు నిర్దేశిక నియమాలు కరదీపం లాంటివి' అని అభిప్రాయపడినవారెవరు?
    - ఎ) ఎం.సి. చాగ్లా
    - బి) ఎం.సి. సెతల్వాడ్
    - సి) కె.టి. షా
    - డి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
22. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని లక్ష్యాల సాధనకు తోడ్పడినవి ఏవి?
    - ఎ) ప్రాథమిక హక్కులు
    - బి) నిర్దేశిక నియమాలు
    - సి) ప్రాథమిక విధులు
    - డి) పైవేవీకాదు
23. కింది వాటిలో సరైంది.
    1. పురుషులకు, మహిళలకు సమాన పని, సమాన వేతనాన్ని ప్రోత్సహించేందుకు రాజ్యాంగంలో ఎలాంటి నిబంధన లేదు
    2. వెనుకబడిన తరగతులను రాజ్యాంగం నిర్వచించలేదు
    - ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
    - సి) 1, 2 సరైనవే డి) ఏదీకాదు
24. రాజ్యాంగాన్ని అనుసరించి సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛను ఏ విషయంలో నియంత్రించవచ్చు?
    - ఎ) ప్రజా భద్రత
    - బి) విదేశాల్లో స్నేహ సంబంధాల నిర్వహణ దృష్ట్యా
    - సి) కోర్టు ధిక్కరణ విషయంలో
    - డి) పైవన్నీ
25. 'ఆర్థిక ప్రజాస్వామ్యం' దేని ద్వారా సాధ్యమవుతుంది?
    - ఎ) ప్రాథమిక హక్కులు
    - బి) ప్రవేశిక
    - సి) రాష్ట్ర విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాలు
    - డి) కేంద్ర జాబితా
26. ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కులపై అధికృతను కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ?
    - ఎ) 25 బి) 42
    - సి) 44 డి) ఎ, బి
27. ప్రపంచీకరణ ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో ప్రభావితమవుతున్న ఆదేశిక సూత్రాల స్వభావం ఏది?
    - ఎ) సంక్షేమ స్వభావం
    - బి) గాంధేయ స్వభావం
    - సి) ఉదార స్వభావం
    - డి) పైవన్నీ
28. కింది వాటిలో ఆదేశికాలకు సంబంధించిన వ్యాఖ్యల్లో సరైన జత ఏది?
    - ఎ) ఆదేశికాలు నూతన పోకడలు - డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
    - బి) శుష్క వాగ్దానాలు - ఐవర్ జెన్నింగ్స్
    - సి) రాజ్యాంగ లక్ష్యాల మేనిఫెస్టో - కె.సి. వేర్
    - డి) పైవన్నీ
29. ఆదేశిక నియమాలు...
    - ఎ) పౌరుల బాధ్యతలను తెలుపుతాయి
    - బి) పౌరుల హక్కులను పరిరక్షిస్తాయి
    - సి) న్యాయ పాలనలో ప్రాతిపదికలు
    - డి) పరిపాలనలో మార్గదర్శకాలు
30. 'సంక్షేమ రాజ్య స్వభావం' అనే భావనను ఏ భాగంలో స్పష్టీకరించారు?
    - ఎ) ప్రవేశిక
    - బి) ప్రాథమిక హక్కులు
    - సి) ఆదేశిక నియమాలు
    - డి) ప్రాథమిక విధులు
31. కింది వాటిలో సరైంది ఏది?
    - ఎ) ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కులకు సంబంధం లేదు
    - బి) ఆదేశిక సూత్రాలు ప్రాథమిక హక్కుల కంటే గొప్పవి
    - సి) ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాల కంటే గొప్పవి
    - డి) పరస్పర పోషకాలు
32. ఆదేశిక నియమాలకు కింద పేర్కొన్న ఏ లక్షణాన్ని ఆపాదించలేము?
    - ఎ) న్యాయ సంరక్షణ
    - బి) వ్యక్తి శ్రేయస్సు
    - సి) స్వామ్యవాద తరహా లక్షణం
    - డి) పైవన్నీ
33. ఆదేశిక నియమాలకు న్యాయ సంరక్షణ కల్పించలేదు. కారణమేంటి?
    - ఎ) అమలు చేయడం సాధ్యం కాకపోవడం
    - బి) అంత ప్రాముఖ్యమైనవి కాకపోవడం
    - సి) ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ ఉండటం
    - డి) పైవన్నీ
34. కింది వాటిలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కొత్త ఆదేశికాలు చేర్చలేదు?
    - ఎ) 24వ సవరణ బి) 42వ సవరణ
    - సి) 97వ సవరణ డి) పైవేవీ కాదు
35. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక నియమాలకు మధ్య వివాదాన్ని ఎలా పేర్కొంటారు?
    - ఎ) శాసనశాఖ -న్యాయశాఖ మధ్య వివాదం
    - బి) కార్యనిర్వాహక శాఖ - న్యాయశాఖ మధ్య వివాదం
    - సి) న్యాయశాఖ - ప్రజల మధ్య వివాదం
    - డి) పైవన్నీ
36. కింది వాటిలో సరికాని జత ఏది?
    - ఎ) ప్రాథమిక హక్కులు - ప్రభుత్వంపై పరిమితులు
    - బి) ఆదేశిక నియమాలు - ప్రభుత్వ బాధ్యతలు
    - సి) ప్రాథమిక విధులు - పౌరుల బాధ్యతలు
    - డి) పైవేవీ కాదు
37. కింది వాటిలో సరైనవి ఏవి?
    1. ఆదేశిక నియమాల అమలు కోసం న్యాయస్థానాల జోక్యాన్ని కోరలేము
    2. వీటికి న్యాయ సంరక్షణ లేదు
    3. ఇవి సవరణలకు అతీతం
    4. ఇప్పటి వరకు ఒక్క ఆదేశిక నియమాన్ని కూడా రాజ్యాంగం నుంచి తొలగించలేదు
    - ఎ) 1, 2, 3, 4 బి) 1, 2, 3
    - సి) 1, 2, 4 డి) 2, 3, 4
38. కింద పేర్కొన్న ఏ ఆదేశిక సూత్రాలను సామ్యవాదేతర అంశాలుగా పరిగణించవచ్చు?
    - ఎ) స్త్రీ, పురుషులకు సమాన జీవన అవసరాలు
    - బి) మానవీయ పని ప్రదేశాలు
    - సి) ఉచిత న్యాయ సలహా
    - డి) యువతను దోపిడీ నుంచి రక్షించడం
39. ప్రాథమిక హక్కులు, ఆదేశిక నియమాల మధ్య ప్రస్తుతం ఎలాంటి సంబంధం ఉంది?
    - ఎ) ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఏ ఆదేశిక నియమం అమలు చేసినప్పటికీ అవి చెల్లుబాటు కావు
    - బి) సమానత్వ హక్కును ఉల్లంఘించేలా ఆదేశిక నియమాలు అమలు చేయరాదు
    - సి) ఆదేశిక నియమాల్లోప్రకరణ 39 (ఎ, బి) అమలు చేస్తూ చేసిన చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనప్పటికీ చెల్లుబాటు అవుతాయి
    - డి) అన్ని విషయాల్లో ప్రాథమిక హక్కులదే పైచేయి అవుతుంది.
40. ఇంతవరకు అమలు కాని ఏకైక ఆదేశిక నియమం?
    - ఎ) ప్రకరణ 44 బి) ప్రకరణ 49
    - సి) ప్రకరణ 43 డి) పైవేవీకాదు

సమాధానాలు

1) సి;	2) బి;	3) బి;	4) సి;
5) డి;	6) డి;	7) డి;	8) డి;
9) ఎ;	10) ఎ;	11) ఎ;	12) డి;
13) బి;	14) ఎ;	15) ఎ;	16) ఎ;
17) ఎ;	18) ఎ;	19) ఎ;	20) బి;
21) బి;	22) బి;	23) డి;	24) డి;
25) సి;	26) బి;	27) ఎ;	28) సి;
29) డి;	30) సి;	31) డి;	32) ఎ;
33) ఎ;	34) డి;	35) ఎ;	36) డి;
37) సి;	38) సి;	39) సి;	40) ఎ.

లేజర్ కిరణాలను ఉపయోగించే పద్ధతిని ఏమంటారు?

ఇంద్రధనస్సు ఎల్లప్పుడూ సూర్యుడికి అభిముఖంగా ఏర్పడుతుంది. ఇందులో ఏడు వర్ణాలు ఉంటాయి. వీటిలో ఒకటైన ఇండిగో రంగును మనం చూడలేం. ఎగురుతున్న విమానంలోని పైలట్‌కు సంపూర్ణంగా గోళాకారంలో ఉన్న ఇంద్రధనస్సు కనిపిస్తుంది. ఒక వ్యక్తి వెనుక భాగం నుంచి వస్తున్న సూర్యకిరణాలు ఎదురుగా ఉన్న నీటి తుంపరలపై 42° కోణంతో పతనమైనప్పుడు కాంతి విశ్లేషణం చెందుతుంది. కాంతి విశ్లేషణం, సంపూర్ణాంతర పరావర్తనం, వక్రీభవన ధర్మాల ఆధారంగా అర్ధగోళాకారంలో ఇంద్రధనస్సు ఏర్పడుతుంది.



లేజర్ కిరణాలు

లేజర్ కిరణాలను ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సూత్రాన్ని 1954లో సీహెచ్ టౌన్స్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించారు. దీని ఆధారంగా 1960లో టైడర్ మెమిన్ అనే శాస్త్రవేత్త తొలిసారిగా లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు. వీటిని ఘన, ద్రవ, వాయు పదార్థాల నుంచి ఉత్పత్తి చేయవచ్చు. రూబీ స్ఫటికాన్ని ఉపయోగించి లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు.

జడవాయువులైన హీలియం, నియాన్‌లను ఉపయోగించి హావిజవాన్ అనే అమెరికా శాస్త్రవేత్త లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు. ఘన పదార్థాలను ఉపయోగించి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల కంటే జడవాయువును ఉపయోగించి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల శక్తి ఎక్కువ.

లక్షణాలు:

సంబద్ధత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల కంపన పరిమితి, తరంగదైర్ఘ్యం సమానంగా ఉంటాయి. ఈ లక్షణాలను సంబద్ధత అంటారు.

దిశానియత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణం అత్యధిక దూరం ఒకే దిశలో ప్రయాణిస్తుంది. ఈ లక్షణాన్నే దిశానియత అంటారు.

ఏకవర్ణీయత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల తరంగదైర్ఘ్యం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండటం వల్ల ఒకే వర్ణాన్ని కలిగి ఉంటాయి. దీన్ని ఏకవర్ణీయత అంటారు.

తీవ్రత: లేజర్ కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

అనువర్తనాలు: లేజర్ కిరణాల శక్తిని పెంచుతూ, తగ్గిస్తూ అనేక అవసరాలకు ఉపయోగిస్తారు. ముఖ్య అనువర్తనాలు..

- భూమి నుంచి గ్రహాలు, ఉపగ్రహాల దూరాన్ని కచ్చితంగా లెక్కించడానికి లేజర్ కిరణాలను ఉపయోగిస్తారు.
- భూమి ఆత్మభ్రమణ వేగాన్ని లెక్కించడానికి ఉపయోగిస్తారు.
- ఈ కిరణాల సహాయంతో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాల కక్ష్య, ఎత్తును తెలుసుకోవచ్చు.
- ఘన పదార్థంలోని అణువుల సంఖ్యను లెక్కించడానికి వినియోగిస్తారు.
- అత్యంత దృఢమైన వజ్రం, ఉక్కు తదితర పదార్థాలను కోయడానికి, వాటికి రంధ్రాలు చేయడానికి లేజర్‌ను వినియోగిస్తారు.
- హైడ్రోజన్ బాంబులను విస్ఫోటం చెందించడానికి ఈ కిరణాలు ఉపయోగిస్తారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించి పుప్పొడి రేణువుల కదలికలను పరిశీలించవచ్చు.
- సాంస్కృతిక కార్యక్రమాల్లో వాడతారు.
- స్పష్టమైన ప్రింటింగ్, జిరాక్స్ కోసం లేజర్ వినియోగిస్తారు.
- లక్ష్యాలను కచ్చితంగా గురిపెట్టడానికి, యుద్ధ రంగంలో శత్రువులను సంహరించడానికి వీటిని వాడతారు.
- వాహనాల వేగాన్ని లెక్కించే స్పీడ్ గన్‌లో లేజర్‌ను ఉపయోగిస్తారు.
- హాలోగ్రఫీ విధానంలో వాడతారు.
- ఆప్టికల్ ఫైబర్ ద్వారా సమాచార ప్రసారం కోసం వినియోగిస్తారు.
- వైద్యరంగంలో ఎండోస్కోపి, లాప్రోస్కోపి విధానంలో వాడతారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించి రెటీనాపై ఏర్పడిన పొరను తొలగించవచ్చు.
- దంతాల చికిత్సలో ఉపయోగిస్తారు.
- మెదడులో ఏర్పడిన కణితులను తొలగించడానికి ఉపయోగిస్తారు.
- గుండె, ఊపిరితిత్తులు, పేగులకు సంబంధించిన వ్యాధులను నయం చేయడానికి వినియోగిస్తారు.
- సీడీ, డీవీడీల్లో సమాచారాన్ని నిల్వ చేసేందుకు లేజర్‌ను ఉపయోగిస్తారు.
- క్షిపణుల్లో మార్గనిర్దేశిత కిరణాలుగా, బార్ కోడ్‌ను ముద్రించడానికి, చదవడానికి లేజర్‌ను ఉపయోగిస్తారు.
- లేజర్ సాయంతో పురాతన కట్టడాలు, విగ్రహాలను శుభ్రపరుస్తారు.
- వాతావరణంలోని వివిధ పొరల మధ్య ఉన్న కాలుష్య గాఢతను లెక్కిస్తారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించే పద్ధతిని Lidar (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) అంటారు.

గమనిక: లేజర్ కిరణాల ధర్మాలను అధ్యయనం చేసి, వాటిని ఉత్పత్తి చేయడానికి భారత అణుశక్తి సంఘం రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏర్పాటు చేసింది. ఇది మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉంది.

వర్ణపటం

- దృశ్య వర్ణపటంలోని వివిధ వర్ణాల తరంగదైర్ఘ్యాన్ని కొలవడానికి వర్ణపట మాపకం (స్పెక్ట్రోమీటర్) ఉపయోగిస్తారు.
- దృశ్య వర్ణపటంలోని ఇండిగో రంగును మానవ కన్ను గుర్తించలేదు. ఊదారంగు వల్ల కంటిలోని రెటీనా దెబ్బతింటుంది. ఈ రెండు రంగులను మినహాయిస్తే మిగతా అయిదు రంగుల్లో (BGYOR) ని పసుపు వర్ణాన్ని 'మాధ్యమిక రంగు' అంటారు.
- వక్రీభవన గుణకం కాంతి తరంగదైర్ఘ్యానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$$\mu \propto \frac{1}{\lambda}$$

కాబట్టి దృశ్య వర్ణపటంలో తక్కువ తరంగదైర్ఘ్యం ఉండే ఊదారంగు వక్రీభవన గుణకం ఎక్కువ. తరంగదైర్ఘ్యం ఎక్కువగా ఉన్న ఎరుపు రంగు వక్రీభవనం తక్కువ.

- గాజు పలక ద్వారా చొచ్చుకెళుతున్న కాంతి కిరణాల వేగం వాటి తరంగదైర్ఘ్యానికి అనులోమానుపాతంలో ఉంటుంది. కాంతి గాజు ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు VIBGYORలోని ఊదారంగు వేగం తక్కువగా, ఎరుపు రంగు వేగం ఎక్కువగా ఉంటుంది. కానీ శూన్యంలో లేదా గాలిలో ఈ ఏడు రంగుల వేగం కాంతి వేగానికి సమానం.
- కాంతి విశ్లేషణంలో ఏర్పడిన వివిధ వర్ణాల విచలనం తరంగదైర్ఘ్యానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి తరంగదైర్ఘ్యం తక్కువగా ఉన్న ఊదారంగు ఎక్కువగా విచలనం చెందుతుంది. రుజుమార్గాన్ని వదిలి వంగి ప్రయాణించడమే విచలనం.
- ఎరుపు రంగుకు తరంగదైర్ఘ్యం ఎక్కువగా, విచలనం తక్కువగా ఉండటం వల్ల ఇది దాదాపు రుజుమార్గంలో ప్రయాణిస్తుంది.కాబట్టి ఎరుపు రంగును ఎక్కువ దూరం నుంచి కూడా స్పష్టంగా చూడవచ్చు. అందువల్ల ప్రమాదాల నివారణ కోసం ఉపయోగించే సంకేతాలను సూచించడానికి ఎరుపు రంగును ఉపయోగిస్తారు.
- క్వాంటం సిద్ధాంతం ప్రకారం $\left(E = \frac{hc}{\lambda}\right)$ తరంగదైర్ఘ్యం తక్కువగా ఉన్న ఊదా రంగు శక్తి ఎక్కువగా, తరంగదైర్ఘ్యం ఎక్కువగా ఉన్న ఎరుపు రంగు శక్తి తక్కువగా ఉంటుంది.
- చీకటి గదిలో ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్ డెవలప్ చేసే సమయంలో కనీస కాంతి కోసం ఎరుపు రంగు బల్బును ఉపయోగిస్తారు.

గమనిక: ఫొటోగ్రఫిక్ ఫిల్మ్‌లను డెవలప్ చేయడానికి హైపో ద్రావణం (సోడియం థియోసల్ఫేట్) ఉపయోగిస్తారు.

- ఆకుపచ్చ రంగు తరంగదైర్ఘ్యం 5500 ‾. ఈ తరంగదైర్ఘ్యం వల్ల ఆకుపచ్చ రంగుకు కొంత శక్తి లభిస్తుంది. అందువల్ల ఈ వర్ణం మన కంటిని చేరినప్పుడు ఒక రకమైన మానసిక ఉల్లాసాన్ని పొందుతాం.

వర్ణాలు – రకాలు:

రంగులు మూడు రకాలు. అవి:
1) ప్రాథమిక రంగులు
2) గౌణ రంగులు
3) సంపూరక రంగులు

ప్రాథమిక రంగులు: కాంతి విశ్లేషణంలో ఏర్పడిన ఏడు రంగుల్లో నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులను ప్రాథమిక వర్ణాలు అంటారు.

గౌణ రంగులు: ప్రాథమిక రంగులు ఒకదానితో మరొకటి సమపాళ్లలో కలిస్తే ఏర్పడిన ఫలిత రంగును గౌణ వర్ణం అంటారు.

- ప్రతి ప్రాథమిక రంగు తన ద్వారా చొచ్చుకొని వెళుతున్న ఇతర ప్రాథమిక రంగులు లేదా గౌణ రంగులను పూర్తిగా శోషణం చేసుకుంటుంది. కాబట్టి మన కంటికి ఎలాంటి కాంతి చేరదు. ఫలితంగా వచ్చే రంగు నల్లగా ఉన్నట్లు కనిపిస్తుంది.

ఉదాహరణలు:

i) తెల్లటి సూర్యకిరణాల సమక్షంలో గులాబీ పుష్పం ఎరుపు రంగులో కనిపిస్తుంది. అదే పుష్పాన్ని ఆకుపచ్చ రంగు గాజు పలక ద్వారా పరిశీలిస్తే నలుపు రంగులో కనిపిస్తుంది.

ii) ఉదయించే, అస్తమించే సూర్యబింబం ఎరుపు రంగులో ఉంటుంది. దీన్ని ఆకుపచ్చ రంగు గాజు పలక ద్వారా చూస్తే నలుపు రంగులో కనిపిస్తుంది.

iii) ఆకుపచ్చ రంగు కళ్లద్దాలు ధరించిన వ్యక్తి ట్రాఫిక్ సిగ్నళ్లను పరిశీలిస్తే.. అవి ఆకుపచ్చ, నలుపు రంగుల్లో ఏకాంతరంగా మారుతున్నట్లు కనిపిస్తాయి.

iv) ఎరుపు రంగు గాజుపలక ద్వారా ఎర్రని లేదా తెల్లని వస్తువులను చూసినప్పుడు అవి ఎరుపు రంగులో కనిపిస్తాయి.

సంపూరక రంగులు: రెండు లేదా అంతకంటే ఎక్కువ రంగులు ఒకదానితో మరొకటి కలవడం వల్ల తెలుపు రంగు ఏర్పడితే వాటిని సంపూరక వర్ణాలు అంటారు.

ప్రాథమిక రంగులు ఒకదానితో మరొకటి సమపాళ్లలో కలిసినప్పుడు తెలుపు రంగు ఏర్పడటం దీనికి ఉదాహరణ.

ఎరుపు + నీలం + ఆకుపచ్చ = తెలుపు

- ప్రతి ప్రాథమిక రంగు దాని వ్యతిరేక గౌణ రంగుతో కలిసినప్పుడు తెలుపు రంగు ఏర్పడుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. పోలరాయిడ్ కళ్లద్దాలు పనిచేయడంలో ఇమిడి ఉన్న ధర్మం?
   - 1) ధ్రువణం 2) వివర్తనం
   - 3) వక్రీభవనం 4) పరిక్షేపణం
2. కిందివాటిలో ఏ ఖగోళ వస్తువుపై కాంతి పరిక్షేపణం జరగదు?
   - 1) అంగారకుడు 2) శని
   - 3) టైటాన్ 4) చంద్రుడు
3. స్పష్టదృష్టి కనిష్ట దూరం విలువ?
   - 1) 25 మీ. 2) 25 సెం.మీ.
   - 3) 23 మి.మీ. 4) 1 మీ.
4. అసమ దృష్టి నివారణకు ఉపయోగించే కటకం ఏది?
   - 1) కుంభాకార 2) పుటాకార
   - 3) స్థూపాకార 4) ఏదీకాదు
5. రేచీకటి నివారణకు ఉపయోగించే కటకం?
   - 1) కుంభాకార 2) స్థూపాకార
   - 3) పుటాకార 4) ఏదీకాదు
6. దర్పణాలు ఏ ధర్మం ఆధారంగా పని చేస్తాయి?
   - 1) రుజువర్తనం 2) పరావర్తనం
   - 3) వక్రీభవనం 4) వివర్తనం

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 3; 5) 4; 6) 2.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆప్టికల్ ఫైబర్ ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది? *(గ్రూప్-2, 2012)*
   - 1) సంపూర్ణ కాంతి శోషణ
   - 2) కాంతి సంపూర్ణాంతర పరావర్తనం
   - 3) వివర్తనం 4) పరావర్తనం
2. ఎరుపు అద్దంలో ఒక పుస్తకం అట్టను చూసినప్పుడు అది ఎర్రగా కనిపిస్తే వాస్తవానికి ఆ పుస్తకం అట్ట రంగు ఏది? *(గ్రూప్-2, 2011)*
   - 1) ఎరుపు 2) తెలుపు
   - 3) ఆకుపచ్చ 4) ఎరుపు లేదా తెలుపు

సమాధానాలు: 1) 2; 2) 4.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం। 7-1-2025

బోలు శబ్దం వచ్చే ద్వారబంధం ఎక్కడ ఉంది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. కట్టె మనది.. కలప మనది.. అడవి మనది... భూమి మనది! అనే నినాదంతో గోండులు, కోయలు, చెంచులను సంఘటితం చేసి పోరుబాటలో నడిపించింది ఎవరు?
   1) గాంగంటం దొర
   2) అల్లూరి సీతారామరాజు
   3) కొమరం భీమ్ 4) అగ్గిరాజు
2. వితంతు పునర్వివాహ సంఘాన్ని మద్రాసులో ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1871 2) 1872
   3) 1873 4) 1874
3. మహారాష్ట్రులు, నిజాం మధ్య 1738లో జరిగిన యుద్ధం ఏది?
   1) బొబ్బిలి యుద్ధం
   2) ఔరంగాబాద్ యుద్ధం
   3) భోపాల్ యుద్ధం
   4) రెండో కర్ణాటక యుద్ధం
4. 1948 ఏప్రిల్‌లో ఏర్పాటైన లాయర్ల నిరసన సమితి అధ్యక్షుడు?
   1) వినాయకరావు విద్యాలంకార్
   2) జమలాపురం కేశవరావు
   3) వి.పి.మీనన్
   4) బొమ్మకంటి సత్యనారాయణ
5. స్వామి రామానందతీర్థ వ్యక్తిగత సత్యాగ్రహాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1941 2) 1940
   3) 1939 4) 1938
6. వందేమాతర ఉద్యమ కాలంలో జి.సుబ్రమణ్య అయ్యర్ సంపాదకత్వంలో వెలువడిన పత్రిక?
   1) దేశమాత 2) స్వదేశీ మిత్రన్
   3) ఆంధ్రపత్రిక 4) స్వరాజ్య
7. గోల్కొండ రాజ్యాన్ని మొగలు సామ్రాజ్యంలో ఔరంగజేబు ఎప్పుడు విలీనం చేశాడు?
   1) 1687 2) 1677
   3) 1697 4) 1667
8. 'యథాపూర్వస్థితి ఒడంబడిక' మీద నిజాం సంతకం చేసిన తర్వాత ఏ ప్రాంతం నుంచి భారత సైన్యాలు ఉపసంహరించుకున్నాయి?
   1) సికింద్రాబాద్ 2) బొల్లారం
   3) తిరుమలగిరి 4) పైవన్నీ
9. పోలీసు చర్య తర్వాత 1948లో నిజాం పాలన ముగిసింది. 'అఖిలాంధ్ర మహాసభ'ను 1949లో ఎవరు నెలకొల్పారు?
   1) అయ్యదేవర కాళేశ్వరరావు
   2) కట్టమంచి రామలింగారెడ్డి
   3) దేవులపల్లి రామానుజరావు
   4) బూర్గుల రామకృష్ణారావు
10. 'ముల్కీ' ఉద్యమం అంటే?
   1) ఆంగ్లేయులకు వ్యతిరేకత
   2) ఉర్దూ అభివృద్ధి
   3) ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యత
   4) రెవెన్యూ సంస్కరణలు
11. 'ఇండియన్ ముసల్మాన్స్' గ్రంథాన్ని రచించిన ఆంగ్లేయుడెవరు?
   1) హంటర్ 2) కర్జన్
   3) లిట్టన్ 4) రిప్పన్
12. 1911లో ఏర్పాటు చేసిన 'మన సంఘం' లక్ష్యం?
   1) దళితుల పిల్లల్లో విద్యావ్యాప్తి
   2) బాల్య వివాహాలను వ్యతిరేకించడం
   3) జోగిని, మురళి, బసివి వ్యవస్థల నిర్మూలన
   4) పైవన్నీ
13. అధికార భాషా సంఘం ఏర్పాటైన సంవత్సరం?
   1) 1965 జనవరి 27
   2) 1966 ఫిబ్రవరి 13
   3) 1966 మార్చి 27
   4) 1967 ఏప్రిల్ 25
14. 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఎవరి నివేదికను ఆమోదించింది?
   1) అశోక్ మెహతా కమిటీ
   2) రాకేష్ మోహన్ కమిటీ
   3) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
   4) స్వరణ్‌సింగ్ కమిటీ
15. శాతవాహనుల కాలంలో బుద్ధుడి జన్మకు సంకేతం?
   1) పద్మం 2) ధర్మచక్రం
   3) స్తూపం 4) బోధివృక్షం
16. ఏ ప్రాంతీయ సంఘాల ఆవిర్భావంతో 1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది?
   1) మద్రాసు మహాజనసభ
   2) ఇండియన్ అసోసియేషన్
   3) బాంబే అసోసియేషన్
   4) పైవన్నీ
17. విద్వాన్ విశ్వం, తరిమెళ్ల నాగిరెడ్డి రాసిన ఏ గ్రంథం సామ్యవాద ప్రచారానికి తోడ్పడింది?
   1) నవ్య సాహిత్యమాల
   2) సాహిత్య దర్శనం
   3) ఆంధ్ర సాహిత్య విమర్శ
   4) సాహిత్యంలో దృక్పథాలు
18. 'కుమార సంభవం' రచయిత?
   1) కొక్కిలి 2) పావులూరి మల్లన్న
   3) అయ్యన మహాదేవి
   4) నన్నెచోడుడు
19. కాకతీయుల కాలంలో తీర్థులంటే?
   1) సేనానులు 2) మంత్రులు
   3) సైనికులు 4) దూతలు
20. భారతదేశంలో మొదటిగా భూమిని దానం చేసిన రాజవంశం ఏది?
   1) కళింగులు 2) పల్లవులు
   3) శాతవాహనులు 4) శకులు
21. 1950 ఫిబ్రవరిలో విశాలాంధ్ర మహాసభ ప్రథమ సమావేశం ఎక్కడ జరిగింది?
   1) కడప 2) వరంగల్
   3) హైదరాబాద్ 4) గుంటూరు
22. మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆస్థానంలోని హిందూ దివాన్ పేరు?
   1) సర్ కిషన్ ప్రసాద్
   2) పింగళి వెంకట్రామిరెడ్డి
   3) సర్ భగవంత్ ప్రసాద్
   4) పండిత్ రామదాస్
23. 1938లో ఉస్మానియా యూనివర్సిటీలో హిందూ విద్యార్థులు ప్రారంభించిన రాజకీయ ఉద్యమం ఏ పేరుతో ప్రసిద్ధి చెందింది?
   1) జాయిన్ ఇండియా మూవ్‌మెంట్
   2) స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం
   3) వందేమాతర ఉద్యమం
   4) ముల్కీ ఉద్యమం
24. తెలంగాణ పరిరక్షణ దినాన్ని ఎప్పుడు పాటించారు?
   1) 1968 జూలై 10 2) 1969 జూన్ 10
   3) 1966 ఆగస్టు 20
   4) 1969 సెప్టెంబర్ 13
25. అస్పృశ్యుల గురించి రాసిన మొదటి నవల 'మాలపల్లి....' 1921 వెలువడింది. దీని రచయిత ఎవరు?
   1) ఉన్నవ లక్ష్మీనారాయణ
   2) దాశరథి 3) ఆదిరాజు వీరభద్రరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
26. గ్రంథాలయ ఉద్యమ నాయకుడు?
   1) కొమర్రాజు లక్ష్మణరావు
   2) అయ్యంకి వెంకట రమణయ్య
   3) నారాయణరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
27. కింది వాటిలో సరైంది?
   1) బాదామి చాళుక్యులు మహారాష్ట్ర ప్రాంతాన్ని పాలించారు
   2) వేములవాడ చాళుక్యులు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించారు
   3) ముదిగొండ చాళుక్యులు మధిర, మానుకోట, వరంగల్ ప్రాంతాల్ని పాలించారు
   4) పైవన్నీ
28. మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌కు 'అసఫ్ జా' బిరుదును ప్రదానం చేసిన మొగల్ చక్రవర్తి?
   1) బహదూర్ షా 2) ఔరంగజేబు
   3) మహమ్మద్ షా 4) షాజహాన్
29. ఆనందభైరవి రాగాన్ని తొలుత ఉపయోగించిన వాగ్గేయకారుడెవరు?
   1) త్యాగరాజు 2) క్షేత్రయ్య
   3) సారంగపాణి 4) రామదాసు
30. తూర్పు దేశాల్లో వర్తకం చేసేందుకు ఆంగ్లేయ వర్తకులకు అనుమతి ఇచ్చిన ఇంగ్లండ్ రాణి?
   1) ఎలిజబెత్-2 2) ఎలిజబెత్-1
   3) విక్టోరియా-1 4) విక్టోరియా-2
31. హరిజనుల సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ప్రజల, ప్రభుత్వ దృష్టికి తేవడానికి భాగ్యరెడ్డి వర్మ నడిపిన వారపత్రిక?
   1) మిర్రర్ 2) హైదరాబాద్
   3) విశాఖ 4) కృష్ణ పత్రిక
32. నాగార్జునుడు ఎవరి సమకాలీనుడు?
   1) యజ్ఞశ్రీ శాతకర్ణి
   2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) రెండో శాతకర్ణి 4) హాలుడు
33. శాతవాహనుల కాలంలో 'కోలిక'లనే వారు?
   1) వ్యవసాయదారులు
   2) నూనె తీసేవారు
   3) నేతపనివారు 4) ధాన్య వర్తకులు
34. 'ఘటిక' అనేది?
   1) దేవాలయం 2) బౌద్ధారామం
   3) విద్యాకేంద్రం 4) నాట్య కళాశాల
35. దంఢోళి అంటే?
   1) ఒక రకమైన కత్తి
   2) ఒక రకమైన బాణం
   3) శత్రువులపై రాళ్లు రువ్వే ఫిరంగి
   4) అశ్విక దళం
36. లుంబినీ వనంలో శిలాశాసనాన్ని ప్రతిష్టించినవారు?
   1) ఆచార్య నాగార్జునుడు
   2) అశోకుడు 3) ఆమ్రపాలి
   4) ఆర్యదేవుడు
37. 'లెంకలు' అంటే?
   1) శత్రురాజులు 2) అంగరక్షకులు
   3) నేతపనివారు 4) విదేశీయులు
38. 1857 తిరుగుబాటులో బ్రిటీష్ వారికి సహాయం చేసి 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు పొందిన నిజాం నవాబు?
   1) నిజాం ఉల్‌ముల్క్ 2) నసీరుద్దౌలా
   3) మహబూబ్ అలీఖాన్
   4) అఫ్జలుద్దౌలా
39. బోలు శబ్దం వచ్చే ద్వారబంధం ఎక్కడ ఉంది?
   1) వేయి స్తంభాల గుడి
   2) రామప్ప దేవాలయం
   3) లేపాక్షి దేవాలయం
   4) భీమేశ్వరాలయం
40. 'అనల్ మాలిక్' అంటే?
   1) నేనే దేవుణ్ని 2) నేనే రాజును
   3) అల్లాయే ప్రభువు
   4) ప్రభువే అల్లా
41. నన్నయ భట్టుకు ఆంధ్ర మహాభారత రచనల్లో తోడ్పడ్డ కవి?
   1) పాల్కురికి సోమనాథుడు
   2) నారాయణ భట్టు
   3) పండితారాధ్యుల మల్లికార్జునుడు
   4) రావిపాటి త్రిపురాంతక కవి
42. అశోకుని శాసన భాగం బయల్పడిన ప్రాంతం?
   1) శాలిహుండం 2) ధరణికోట
   3) కొట్లాం 4) రాజుల మందగిరి
43. తెలంగాణలో ముల్కీ నిబంధనలు ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 1888 2) 1890
   3) 1895 4) 1885
44. జాగిర్దారీ విధానంలో భూములు ఎవరి స్వాధీనంలో ఉండేవి?
   1) ముక్తేదారులు 2) ఇనాందారులు
   3) ఇజారీదారులు 4) పైవారందరూ
45. మిలిటరీ సామాగ్రిని నిజాం ప్రభుత్వం ఏ సంస్థ నుంచి కొనుగోలు చేసింది?
   1) టాటా కంపెనీ
   2) అట్లాస్ ట్రేడింగ్ సంస్థ
   3) మహీంద్ర అండ్ మొహమ్మద్
   4) 2, 3
46. 1958లో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రాంతీయ కమిటీని రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఎప్పుడు రద్దు చేశారు?
   1) 1974 జనవరి 1
   2) 1975 ఫిబ్రవరి 2
   3) 1974 డిసెంబర్ 4
   4) 1973 నవంబర్ 1
47. శాతవాహనుల కాలం నాటి సాంఘిక జీవనాన్ని తెలియజేసే గ్రంథం?
   1) గాథాసప్తశతి 2) కథా సరిత్సాగరం
   3) సుహృల్లేఖ 4) శూన్య సప్తశతి

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 4;
5) 2; 6) 2; 7) 1; 8) 3;
9) 1; 10) 3; 11) 1; 12) 4;
13) 3; 14) 3; 15) 1; 16) 4;
17) 1; 18) 4; 19) 2; 20) 3;
21) 2; 22) 1; 23) 3; 24) 1;
25) 1; 26) 1; 27) 4; 28) 2;
29) 4; 30) 3; 31) 2; 32) 1;
33) 3; 34) 3; 35) 3; 36) 2;
37) 2; 38) 4; 39) 2; 40) 1;
41) 2; 42) 4; 43) 1; 44) 4;
45) 4; 46) 1; 47) 1.

In ancient times magnet was also called as..

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1 - 5): Which of the phrases (1), (2), (3), (4) and (5) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct?

1. The footprints might be done by burglars.
   1) Doing 2) made 3) worked
   4) put 5) post
2. This problem can be solved by control pollution.
   1) controlled 2) controlling
   3) continuous 4) continuing
   5) controls
3. Manohar woke up late. Consequent he missed the train.
   1) Subsequent 2) Concurrent
   3) In addition 4) Consequently
   5) In spite of
4. They thanked to the family for helping them.
   1) thanks 2) thank 3) thank you
   4) thanked 5) thanking
5. Teenagers without guidance can be easily influence.
   1) influences 2) were influenced
   3) was influence
   4) influenced 5) influencing

Directions (Q. 6-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

6. In all (1)/ that excitement. (2)/ I had forgotten (3)/ to take my present for him. (4)/ No error (5)
7. The magic show last night (1)/ was a great success. (2)/ The news was published on the newspaper this morning. (3)/ It was well-written. (4)/ No error (5)
8. The teacher let us paint with our pencils. (1)/ But she did not allow us (2)/ to do exercises in the same way. (3)/ Instead, she wanted us to write with ink. (4)/ No error (5)
9. Last week, an unemployed man killed self (1)/ by jumping down from the roof of a flat. (2)/ He was stupid. (3)/ He must face up to realities. (4)/ No error (5)
10. Feeling bored after a day's work, (1)/ I and my friend decided (2)/ to go for a film (3)/ show at the INOX that night. (4) / No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The court _____ all the three accused setting _____ the earlier order sentencing them to four years in prison.
   1) convicted, ahead
   2) acquitted, aside
   3) charged, above
   4) demanded, forth
   5) ruled, forward
12. Chandrayaan II the _____ project would be another _____ in the history of the country's space ventures.
   1) ambivalent, historical
   2) ambiguous, milestone
   3) ambitious, landmark
   4) ambition, rarity
   5) ambidextrous, feather
13. The bank _____ agricultural growth to be lower due to _____ an uneven rains.
   1) experience, lower
   2) predicts, heavy
   3) expects, deficit
   4) foretell, scarce
   5) outlooks, surplus
14. Foreign _____ look at India as one among _____ markets.
   1) business, many
   2) employees, growing
   3) employers, subsidiary
   4) tourists, sample
   5) investors, emerging
15. Excavations had _____ the _____ significance of the cannons.
   1) exposed, mastery
   2) rejoiced, importance
   3) told, prominent
   4) reformed, pointed
   5) revealed, historical



Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. CO and H_2 are the most common molecules in interstellar gas clouds.
B. Stars from inside relatively dense concentrations of interstellar gas and dust known as molecular clouds.
C. When the density reaches a certain point, stars form.
D. The deep cold also causes the gas to clump to high densities.
E. At these temperatures, gases become molecular meaning that atoms bind together.
F. These regions are extremely cold temperature about 10 to 20K, just above absolute zero.

16. What is the LAST sentence after rearrangement?
   1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) E 4) F 5) C
18. What is the FIRST sentence after rearrangement?
   1) A 2) C 3) B 4) E 5) D
19. What is the FIFTH sentence after rearrangement?
   1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 21-25): Read the following passage carefully and answer the questions given below it.

For many people the first primitive testimonies of magnetite started from Peter Peregrinus in 1269 and it might be true but let me know about the person who has first found that stone that we now call a magnet, the story goes round a shepherd named Magnet and he first of all discovered the magnet when an iron tip of his crook was pulled towards the stone which we now call as a magnet. The magnetic field around our planet earth was measured to be 4.0 Gauss about 4,000 years and it is same even today so it can be said that it is one of the first natural force which man had discovered years ago. Cleopatra who is still remembered as the beautiful women of the world has been reported to wear a magnet on her forehead to avoid the signs of aging. And at that time the magnet was called as Lodestone. Scientists believe that birds are the only creatures that can see the magnetic field of earth and this force helps them in finding their home in the long distance flights. Usually the magnets are made up of iron or steel but we can also make very powerful magnets through special alloys of nickel, copper, cobalt and aluminum. Hammering a magnet results in demagnetization because the molecules inside the magnet gets scattered and thus lose their North and South Pole's alignment. The same phenomenon occurs when a magnet is heated on a flame. The modern medical science has also observed magnets to be quite affective in curing different diseases and thus for the treatment of many major diseases like cancer the affect of magnetism are utilized. Some veterinarians use magnets to retrieve a wire or any other metal body from the stomach of an animal. The earth magnet is also like a long bar of magnet that is located at the center of earth. The study of ocean floor core samples was carried out by some scientists and it was found that the giant vertebrates of our earth like dinosaurs died due to the decline of earth's magnetic field. So these were some interesting facts about magnets that have been found by many scientists after series of researches. The more the researches were carried on magnets and magnetic field the more fields of life started getting benefits from the magnets, till now all the industries including medical to latest technologies are getting benefits from magnets.

21. In ancient times magnet was also called as:
   1) a healing stone
   2) a powerful stone
   3) a miracle stone
   4) a lodestone
   5) mystery stone
22. Demagnetization occurs through
   1) hammering and heating
   2) lose of south pole
   3) loss of north pole
   4) repulsion between the molecules
   5) attraction between the molecules
23. Veterinarian is
   1) using his powers to remove wire
   2) cleans animals
   3) who treats animals
   4) recognize diseases
   5) cures cancer
24. The extinction of dinosaurs happened because
   1) man used his intelligence
   2) survival of the fittest
   3) struggle for existence
   4) decline of earth's magnetic field
   5) series of researches were carried
25. The natural force which man had discovered years ago
   1) was powerful in curing many diseases
   2) was not realized for a longer period of time
   3) still research is needed in this area
   4) enhanced its value over the years
   5) remains the same even after so many years

ANSWERS

1) 2 2) 2 3) 4 4) 4 5) 4
6) 4 7) 3 8) 4 9) 1 10) 2
11) 2 12) 3 13) 3 14) 5 15) 5
16) 1 17) 3 18) 3 19) 3 20) 5
21) 4 22) 1 23) 3 24) 4 25) 5